www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 15-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 301 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి ఉ. 10.14 తదుపరి సప్తమి; నక్షత్రం: అశ్విని ఉ. 9.27 తదుపరి భరణి; వర్జ్యం: శేషం ఉ. 7.10, రా. 6.47-8.20; దుర్ముహూర్తం: ఉ. 10.35-11.21, మ. 3.10-3.56; అమృతఘడియలు: తె. 4.07-5.41; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.46; సూర్యాస్తమయం: 6.14 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మా హృదయాల్ని గెలిచారు

స్వామి నారాయణ్ ఆలయ నిర్మాణంలో గొప్ప పాత్ర మీదే

యూఏఈ అధ్యక్షుడికి మోదీ ప్రశంసలు.. ఆలయం ప్రారంభం

ప్రజల జీవితాల్లో ప్రభుత్వాలు తక్కువ జోక్యం చేసుకోవాలి

అవినీతికి దూరంగా ఉండాలి.. అందరినీ కలుపుకొని పోవాలి

భారత్‌లో ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యం.. మాపై విశ్వాసం పెరిగింది

'ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సదస్సు'లో ప్రధాని నరేంద్ర మోదీ 2

అబుదాబిలోని ఆలయ ప్రారంభంలో మోదీ, యూఏఈ మంత్రి

వేలికి ఇంకు పూసేందుకే!

సచివాలయ సిబ్బందికి ఇలాంటి విధులే అప్పగించాలి

ఎన్నికల్లో ఓపీవోలుగా మాత్రమే ఉపయోగించుకోవాలి

ప్రాధాన్యం లేని పనులు మాత్రమే అప్పగించాలి

వలంటీర్లకు ఎన్నికల విధులు వద్దే వద్దు

పోలింగ్ ఏజెంట్లుగా కూడా కుదరదు: ఈసీ ఆదేశం

జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మీనా మెమో



అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది నిర్వర్తించాల్సిన పాత్రపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఓటర్ల వేలికి ఇంకు పూసే విధులతో పాటు మరికొన్ని ప్రాధాన్యం లేని పనులు (ఓపీవో విధులు) మాత్రమే వీరికి అప్పగించాలని స్పష్టం చేసింది. ముఖ్యమైన ఎన్నికల పనులేవీ వారికి అప్పగించొద్దని ఆదేశించింది. పోలింగ్ రోజున బూత్‌ల్లో జరిగే కీలకమైన కార్యకలాపాల్లో సచివాలయ సిబ్బంది జోక్యం చేసుకోకుండా అడ్డుకట్ట వేసింది. ఎన్నికల విధుల్లోకి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని తీసుకునేందుకు అభ్యంతరం లేదని పేర్కొంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనాకు కేంద్ర ఎన్నికల సంఘం

మిగతా 11వ పేజీలో...

పంపకాలకు వేళాయె!

ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తుల విభజనపై ముందడుగు

19.781 ఎకరాలలో.. ఏపీకి 11.356, తెలంగాణకు 8.245 ఎకరాలు

తెలంగాణ ప్రతిపాదనకు ఏపీ ఓకే.. మొత్తం ఆస్తుల విలువ పదివేల కోట్లు

ఆక్రమణకు గురైన భూమికి మరో చోట భూమి ఇవ్వాలన్న రాష్ట్ర సర్కారు 11



పల్నాడు జిల్లా మల్లాదిలో బుధవారం ఇసుక లోడింగ్

సర్కారు వారి ఇసుక బొక్కుడు నిజం!

'అవినీతి, లంచాలు లేకుండా... పారదర్శకంగా పాలన అందిస్తున్నాం!' అని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పదేపదే చెప్పేవన్నీ డొల్ల మాటలే! అవినీతి పుష్కలం! జనం సొమ్ముతో తన సొంత, రోత పత్రికకు 'లంచం'! పారదర్శకతకు ఇసుక 'రీచ్'లలో పాతర! ఇది.. అక్షరాలా నిజం! అస్మదీయ కంపెనీలకు ఇసుకను కట్టబెట్టేశారు. సొంత మీడియాకు కోట్లు కుమ్మరించేందుకు విచ్చలవిడిగా ప్రకటనలు గుప్పిస్తున్నారు. అందులోనూ... విపక్షాన్ని నిందించడమే! అటు ఇసుక, ఇటు ప్రభుత్వ ప్రకటనల విషయంలో ఒకేరోజు జగన్ వైఖరిని హైకోర్టు తప్పు పట్టింది. అక్రమాలకు కళ్లెం వేయాలని, ప్రకటనల జారీలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అమలు చేయాలని ఆదేశించింది.

అనుమతులు లేకుండా నదీ గర్భాలు తవ్వేశారు

అణువణువూ దోచేశారు

రెండేళ్లపాటు జేపీ వెంచర్స్

నేడు తమ్ముడి పేరిట దందా

తాడేపల్లికి రూ.కోట్ల వాటాలు

కుండబద్దలు కొట్టిన కేంద్రం

'ఆంధ్రజ్యోతి' మాట అక్షరసత్యం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పర్యావరణాన్ని పణంగా పెట్టి నదీ గర్భాల నుంచి ఇసుకను తోడేస్తున్నారని 'ఆంధ్రజ్యోతి' చెప్పిందే అక్షర సత్యమైంది. భారీ యంత్రాలను పెట్టి ఇసుకను తవ్వి పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారని కేంద్రమే నిర్ధారించింది. అధికార పార్టీ నేతలు ఇసుక వ్యాపారం చేస్తూ వేల కోట్లు వెనకేసుకుంటున్నా గనుల శాఖ

మిగతా 2వ పేజీలో...

స్టాక్ పాయింట్ కథలు ఇంకెన్నాళ్లు?

తరగనంత ఇసుకను నిల్వ చేశారా?

కేంద్రమే తప్పులు చెబుతోందా?

ఆ అవసరం అటవీశాఖకు ఏముంది?

ఇసుక అక్రమాలపై తీసుకున్న చర్యలేంటి?

కలెక్టర్లూ.. తక్షణం అక్రమాలు ఆపించండి

ఇసుక అక్రమాలపై హైకోర్టు సీరియస్

క్షేత్రస్థాయిలో రీచ్‌లను పరిశీలించాం

ఇసుక అక్రమ మైనింగ్ నిజమే 2

త్వరలో ఎన్జీటీకి నివేదిక ఇస్తాం: కేంద్రం



అర్హతల్లేని వ్యక్తికి అందలమా?

గనులశాఖ డైరెక్టర్ నియామకంపై హైకోర్టు ప్రశ్న

రాష్ట్ర సర్కారుకు, వెంకటరెడ్డికి నోటీసుల జారీ 12

ప్రచార పిచ్చి

ఈ ఆర్థిక సంవత్సరం 193 కోట్లతో బాకా

మరో 621 కోట్లు కావాలన్న సమాచార శాఖ

జనం సొమ్ముతో జగన్ ప్రచారం

సొంత మీడియాకు కోట్ల రూపాయలు చెల్లింపు

మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రభుత్వ ప్రకటనలు

తెలుగుదేశం హయాంపై దుష్ప్రచారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గతంలో ఎన్నడూ లేనట్టుగా జగన్ ప్రభుత్వం సొంత డబ్బా కొట్టుకునేందుకు వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు పెడుతోంది. జనం సొమ్ముతో జగన్ సొంత, పార్టీ ప్రచారం చేసుకోవడంతో పాటు ప్రకటనల పేరిట ఆయన సొంత మీడియాకు దోచిపెడుతోంది. జగన్ 'బటన్' నొక్కిన ప్రతిసారీ కోట్లు కుమ్మరించి మరీ ఆయన రోత పత్రిక, చానల్‌కు ప్రకటనలు ఇస్తోంది. పనిలో పనిగా ప్రతిపక్ష టీడీపీని విమర్శించేలా ప్రకటనలు జారీ చేస్తోంది. జగన్

మిగతా 2వ పేజీలో...

'సుప్రీం' మార్గదర్శకాలు పాటించండి



ప్రకటనలపై హైకోర్టు స్పష్టీకరణ

ముఖ్యమంత్రి జగన్‌కు నోటీసులు

జగతి పబ్లికేషన్స్, ఇందిరా టెలివిజన్

సీఎస్, ఇతర ప్రభుత్వ అధికారులకూ

ప్రజాధనం ఖర్చు చేసి వైసీపీని ప్రోత్సహించేలా ప్రకటనలు 2

సొమ్మును ఆ పార్టీ నుంచి రాబట్టండి.. సీబీఐ విచారణ వేయండి

వైసీపీ సర్కారు ప్రకటనలపై హైకోర్టులో పిల్ దాఖలు



పంజాబ్-హరియాణా సరిహద్దులోని శంభు వద్ద రెండో రోజూ నిరసన తెలుపుతున్న రైతులు

రైతులపై సోనిక్ అస్త్రం

చెవులు చిల్లులు పడేలా భారీ శబ్దాలు.. ఢిల్లీ సరిహద్దుల్లో ఎల్ఆర్డీఏ వినియోగం 2

డ్రోన్ల ద్వారా బాష్పవాయువు ప్రయోగం.. డ్రోన్లను అడ్డుకునేందుకు పతంగులను ఎగురవేసిన రైతులు

రెండో రోజూ కొనసాగిన రైతుల నిరసన.. ఢిల్లీ శివార్లలో బారికేడ్లతో అడ్డుకున్న పోలీసులు

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాల్సిందేనన్న రైతు సంఘాలు.. చర్చలకు ఆహ్వానించిన కేంద్రం

పలు డిమాండ్లకు ఓకే చెప్పిన కేంద్ర మంత్రులు.. ఎమ్మెస్పీకి వెంటనే చట్టబద్ధత కల్పించలేమని వెల్లడి



వేదికపైనే ఇంటి పట్టా పత్రాలను చించేస్తున్న లబ్ధిదారుడు

టిడ్కో ఇళ్లపై మాయమాటలు!

తాళాలు, పత్రాలు ఇస్తామంటూ నెల్లూరులో సభకు పిలిచి మొండిచేయి

తర్వాత ఇస్తామంటూ దాటవేత.. ఆగ్రహంతో ఇంటి పత్రాల చించివేత 12

పదేళ్ల తర్వాత ఉమ్మడి రాజధానా?

అది మా ప్రభుత్వ విధానం కాదు 11

అనుభవం ఉన్న నేత ఎవరూ అలా మాట్లాడరు

బకాయిలిస్తామన్నా ఉద్యోగుల ఆందోళన: బొత్స

జగన్ బీసీల ద్రోహి

27 సంక్షేమ పథకాలు రద్దుచేశారు: లోకేశ్

బీసీలకు తీవ్ర అన్యాయం చేశారు

సొంత సామాజికవర్గానికి పెద్దపీట

బీసీ, ఎస్సీ ఎమ్మెల్యేలకే బదిలీలు

'స్థానిక' కోటా 10% తగ్గించారు

మేం రాగానే మళ్లీ పెంచుతాం

రద్దయిన స్కీంలు మళ్లీ అమలు: లోకేశ్

3 రాజధానుల పేరుతో దోపిడీ

వైవీ, సాయిరెడ్డి, బొత్సపై ఫైర్

మేసిందంతా కక్కిస్తామని వార్నింగ్

మన్యం, విజయనగరం జిల్లాల్లో 3 చోట్ల శంఖారావ సభలు



పార్వతీపురంలో శంఖారావం సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న లోకేశ్

విజయనగరం/పార్వతీపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయాన్ని జపిస్తున్న జగన్ రాష్ట్రంలోని బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఆరోపించారు. బుధవారం రాత్రి విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గం బాడంగిలో, ఉదయం పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మండలం వెంకంపేట వద్ద, సాయంత్రం సాలూరులో జరిగిన శంఖారావం బహిరంగ సభల్లో

మిగతా 11వ పేజీలో...



(ఫైల్)

చేతిలో చేయి వేసి.. ఒకరినొకరు చూసుకుంటూ..

12

డచ్ మాజీ ప్రధాని డ్రైస్ వాన్ దంపతుల కారుణ్య మరణం


93 ఏళ్ల వయసులో 70 ఏళ్ల ప్రేమకు ముగింపు

నగరంలో అవినీతి 'రాజా'

కోట్లు కొల్లగొడుతున్న ఎమ్మెల్యే

ఆ నియోజకవర్గానికి అధికారికంగా ఒకరు.. అనధికారికంగా మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు! అంతా కుటుంబ పెత్తనం! ఎమ్మెల్యే అవినీతి'రాజా' అయితే.. ఆయన సోదరుడు బ్లేడ్ బ్యాచ్‌లు, చిల్లర గ్యాంగ్‌లకు నాయకుడు. ఇక నియోజకవర్గంలో ఎమ్మెల్యే తల్లి పెత్తనమూ ఎక్కువే. తూర్పుగోదావరి జిల్లా 'నగరం'లో ఏ పని చేయాలన్నా, జరగాలన్నా వారి అనుమతి ఉండాల్సిందే.

ఎమ్మెల్యే కన్నుపడితే నియోజకవర్గంలో కొండలు మాయమవుతాయి. చెరువులు లోయలుగా మారుతాయి. అవినీతి గురించి కథలుకథలుగా చెబుతారు. ఆయన ఏది చెప్పినా అధికారులు వినాల్సిందే. లేకుంటే చెంప దెబ్బలు లేదా బదిలీలు తప్పవు. ఆయన సోదరుడు సెటిల్మెంట్లు చేస్తుంటారు. భూములు బాగా ఆక్రమించినట్టు ఆరోపణలున్నాయి. ఈచోటా నాయకుడు ఎవరినైనా నేరుగా బెదిరిస్తారు. ఇతర నియోజకవర్గాల్లోనూ జోక్యం చేసుకుంటుంటారు.



అమ్మో ఎమ్మెల్యే

కొండలు, చెరువులు తవ్వేసి సొమ్ము

మట్టిని తరలించి రకరకాలుగా దోపిడీ

నాటుసారా, లేఅవుట్లలో మామూళ్లు

మాటవినని అధికారులపై దౌర్జన్యం

పోలీస్ స్టేషన్‌లోనే దళిత యువకుడికి శిరోముండనం

నియోజకవర్గంలో కుటుంబ పెత్తనం

జోరుగా సోదరుడి సెటిల్మెంట్ల దందా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలోని అధికారపార్టీ ప్రజాప్రతినిధులలో సీఎం జగన్‌కు నమ్మిన బంటుల్లో ఆ ఎమ్మెల్యే ఒకరు. రాజకీయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చారు. పోటీ చేసిన తొలిసారే ఎమ్మెల్యే అయ్యారు. ఆయన తండ్రి ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించారు. సదరు నాయకుడు ఓట్లను రాబట్టడంలోనూ, జనాన్ని ఆకట్టుకోవడంలోనూ నేర్పరి. సామాన్య జనానికి పెద్దగా మేలు చేయరు. తనను నమ్మినవాళ్లకు మాత్రమే 'అక్రమం'గా సహకరిస్తారు. తన మాట వినకపోయినా, తాను చెప్పింది చేయకపోయినా

మిగతా 12వ పేజీలో...

కొత్త ఇల్లు ముచ్చట

గతంలో పొరుగు నియోజకవర్గంలో కాపురం ఉండే సదరు ప్రతినిధి ఇటీవల సొంత నియోజకవర్గంలో కొత్త ఇల్లు కట్టుకున్నారు. రోడ్డు పక్కన విలువైన స్థలంలో రూ.కోట్లతో ఓ అందమైన భవంతిని నిర్మించుకున్నారు. అక్కడ రోడ్డు విస్తరణలో కొందరు ముఖ్యుల దుకాణాలు పోకుండా చూడడం కోసం ఆ స్థలాన్ని ఆయనకు ఇచ్చినట్టు సమాచారం.



విశాఖలో అసోసియేషన్ భవన్ వద్ద నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

ఉద్యమ బాట

ఉద్యోగులు, ఉపాధ్యాయుల నిరసన

రాష్ట్రవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో విధులు

జిల్లా, మండల కేంద్రాల్లో ప్రదర్శనలు

కలెక్టరేట్, తహసీల్దార్ ఆఫీసుల్లో వినతులు

ఏపీజేఏసీ ఉద్యమ కార్యాచరణ మొదలు

22 వేల కోట్ల పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్

పీఆర్సీ అమలు, డీఏ, 30% ఐఆర్‌కు కూడా

సమస్యలన్నీ పరిష్కరించాలని నినాదాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఏపీ జేఏసీ పిలుపు మేరకు ఏపీ ఎన్జీవో సంఘాలు, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మిక సంఘాలు ఉద్యమ శంఖారావం పూరించాయి. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యంపై మండిపడ్డాయి. ఏపీజేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణలో తొలిరోజు, బుధవారం ఉదయం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తించారు. సమస్యలు పరిష్కరించాలంటూ భోజన విరామ సమయంలో జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లకు, మండల కేంద్రాల్లో తహసీల్దార్లకు

మిగతా 12వ పేజీలో...

రోబో సర్జరీ.. కేన్సర్ రోగి బలి..!

» శస్త్రచికిత్స సమయంలో ఇతర అవయవాలకు రంధ్రాలు

» రోబో తయారీ సంస్థపై 75వేల డాలర్లకు దావా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: కేన్సర్ చికిత్సలో సర్జికల్ రోబోని నమ్ముకుంటే.. అది శస్త్రచికిత్సతోపాటు శరీరంలోని ఇతర అవయవాలకు రంధ్రాలు చేసింది. దీంతో బాధిత మహిళ శస్త్రచికిత్స పూర్తయిన కొద్ది నెలల్లోనే చనిపోయింది. సర్జికల్ రోబో శరీరంలోని ఇతర అవయవాలకు చేసిన రంధ్రాల కారణంగానే తన భార్య చనిపోయిందంటూ మృతురాలి భర్త కోర్టులో దావా వేశారు. అమెరికాలో జరిగిన ఈ సంఘటన తీవ్ర సంచలనం రేపింది. హార్వే సల్జర్ భార్య శాండ్రా సల్జర్ కొన్నాళ్లుగా పెద్దపేగు కేన్సర్‌తో బాధపడుతూ.. బాప్టిస్ట్ హెల్త్ బోకా రాటన్ రీజినల్ హాస్పటల్‌లో చికిత్స తీసుకుంటున్నారు. వైద్యులు ఆమెకు అనేక చేతులు ఉండి, రిమోట్ కంట్రోల్‌తో పనిచేసే అధునాతన డావిన్సీ రోబోతో సర్జరీ చేయాలని నిర్ణయించారు. 2021 సెప్టెంబరులో ఆమెకు రోబోటిక్ సర్జరీ నిర్వహించారు. ఆ తర్వాత కేన్సర్ నుంచి పూర్తిగా కోలుకోవాల్సిన ఆమె 2022 ఫిబ్రవరిలోనే మరణించింది. ఆపరేషన్ సమయంలో ఇతర అవయవాలకు రోబో చేసిన గాయాల కారణంగానే తన భార్య చనిపోయిందని సల్జర్ ఆరోపించారు. ఈ రోబోకు సాంకేతిక సమస్యలున్నాయని అనేక ఫిర్యాదులు అందినప్పటికీ దాని తయారీ సంస్థ ఇంట్యూటివ్ సర్జికల్స్ వాటిని సరిచేయకుండా కప్పిపుచ్చిందని ఆరోపించారు. రోబో వినియోగంపై ఆ సంస్థ వైద్యులకు తగిన శిక్షణ ఇవ్వలేదన్నారు. వైద్యంలో నిర్లక్ష్యం, డిజైన్ లోపం తదితర అంశాలు తన భార్య మరణానికి కారణమయ్యాయని, దీనికోసం తనకు 75వేల డాలర్లు నష్టపరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆ సంస్థపై సల్జర్ దావా వేశారు.

చికున్ గున్యాను లైట్ తీసుకోవద్దు..!

» వైరస్ దశ ముగిసిన మూడు నెలల వరకూ మరణ ముప్పు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: చికున్ గున్యాను లైట్ తీసుకోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇన్ఫెక్షన్ సోకిన మూడు నెలల వరకు మరణించే ప్రమాదం ఉందని తాజా అధ్యయనంలో గుర్తించారు. ఆ వివరాలను 'ది లాన్సెట్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్' జర్నల్‌లో ప్రచురించారు. చికున్ గున్యా అనేది దోమల ద్వారా మనుషులకు వ్యాపించే వైరల్ వ్యాధి. దీని బారినపడి పూర్తిగా కోలుకున్నప్పటికీ.. చాలామందికి ఇది ప్రాణాంతకం కావొచ్చని అధ్యయనంలో పరిశోధకులు కనుగొన్నారు. సాధారణంగా చికున్ గున్యా తీవ్రత వైరస్ సోకిన తర్వాత 14 రోజులపాటు ఉంటుంది. అయితే.. ఆ దశ ముగిసిన తర్వాత కూడా ఇన్ఫెక్షన్లు పెరుగుతాయని, కొన్ని తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని.. వీటిని నిర్లక్ష్యం చేస్తే మరణానికి దారితీసే ప్రమాదం ఉందని బ్రిటన్‌లోని లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్నీ డా పైక్సావో క్రూజ్ చెప్పారు. పెక్సావో నేతృత్వంలోని పరిశోధకుల బృందం బ్రెజిల్‌లో చికున్ గున్యా బారినపడి కోలుకున్న 1.5 లక్షల కేసులను పరిశీలించింది.

లోకం తీరు



మా హృదయాలు గెల్చుకున్నారు

» స్వామి నారాయణ్ ఆలయ నిర్మాణంలో అందరికన్నా గొప్ప పాత్ర మీదే

» యూఏఈ అధ్యక్షుడికి మోదీ ప్రశంసలు.. ఆలయాన్ని ప్రారంభించిన ప్రధాని

అబుదాబి, దుబాయి, ఫిబ్రవరి 14: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబూదాబిలో రాయితో నిర్మించిన తొలి హిందూ ఆలయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. మత సహనానికి, ప్రపంచ ఐక్యతకు ఈ ఆలయం నిదర్శనంగా నిలుస్తుందన్నారు. మానవాళి చరిత్రలో ఒక నూతన సువర్ణాధ్యాయాన్ని లిఖించిన యూఏఈకి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ జయ్యద్ అల్ నహ్యాన్ ఇక్కడ నివసిస్తున్న భారతీయులేగాక, భారతదేశంలోని 140 కోట్ల మంది ప్రజల హృదయాలను గెల్చుకున్నారని కొనియాడారు. లేత గులాబీ రంగు ధోతి, కుర్తా, కండువా ధరించిన మోదీ ఆలయ ప్రారంభం సందర్భంగా నిర్వహించిన హారతి తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అబుదాబి ఆలయంలో హారతి ఇచ్చిన సమయంలోనే.. స్వామి నారాయణ్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా నిర్మించిన 1200కుపైగా ఆలయాల్లో 'గ్లోబల్ హారతి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశానికి యూఏఈ మంత్రి షేక్ నహ్యాన్, భిన్న మతవిశ్వాసాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. వారిని ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తూ.. భిన్నత్వం తమ ప్రత్యేకత అని, భిన్నత్వంలో విద్వేషాన్ని తాము చూడబోమని.. ఈ ఆలయం కూడా భిన్నత్వానికి ఓ సమున్నత నిదర్శనమని చెప్పారు. ఇక మీదట యూఏఈ అంటే బుర్జ్ ఖలీఫా, ఫ్యూచర్ మ్యూజియం, షేక్ జయ్యద్ మసీదుతోపాటు ఈ ఆలయం కూడా గుర్తుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయోధ్య రామమందిరంలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం గురించి మోదీ ప్రస్తావించారు. ఇది భారత్‌కు మాత్రమే అమృతకాలం కాదని, విశ్వాసానికి, సంస్కృతీ సంప్రదాయాలకు కూడా ఇది అమృత కాలమన్నారు. అంతకుముందు ప్రధాని మోదీ.. 'ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సదస్సు'లో పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వాలు ప్రజల జీవితాల్లో వీలైనంత తక్కువగా జోక్యం చేసుకోవాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. 'ప్రభుత్వం లేదేమో అన్నట్లుగా ప్రజలు భావించే పరిస్థితి రావొద్దు.. అదే సమయంలో వారిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఒత్తిడి కూడా ఉండొద్దు' అని పేర్కొన్నారు. కనిష్ఠ ప్రభుత్వం.. గరిష్ఠ పాలన.. ఇదే కొన్నేళ్లుగా తాను పాటిస్తున్న విధానమని చెప్పారు. అవినీతికి దూరంగా, అందరినీ కలుపుకొనిపోయే విధంగా ప్రభుత్వాలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గత కొన్నేళ్లలో భారత్‌లో ప్రభుత్వంపై ప్రజల నమ్మకం పెరిగిందని, ప్రజల ఆకాంక్షలకు తాము ప్రాధాన్యం ఇవ్వటం వల్లనే ఇది సాధ్యమైందని మోదీ చెప్పారు. ప్రపంచం ఓవైపు ఆధునికతవైపు వెళ్తోంటే, మరోవైపు గత కాలపు సవాళ్లు తీవ్రతరమవుతున్నాయని.. టెక్నాలజీ సానుకూలంగానూ, ప్రతికూలంగానూ తీవ్ర ప్రభావం చూపుతోందని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదం, వాతావరణ మార్పులు సవాళ్లను విసురుతున్నాయని, అంతర్జాతీయ సమాజం ఒక్కతాటిపై లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దుబాయి ప్రధానితో, మడగాస్కర్ అధ్యక్షుడితో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. 'భవిష్యత్తు ప్రభుత్వాలను తీర్చిదిద్దటం' అనే అంశంతో ప్రపంచ ప్రభుత్వాల శిఖరాగ్ర సదస్సు జరిగింది. గల్ఫ్, పశ్చిమాసియా, ఆఫ్రికా, యురేసియా మార్కెట్లకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేయటానికి భారతీయ సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి పారిశ్రామిక రంగానికి అవకాశం కల్పించే భారత్‌మార్ట్‌కు మోదీ యూఏఈ ప్రధానితో కలిసి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

రైతులపై సోనిక్ అస్త్రం

చెవులు చిల్లులు పడేలా భారీ శబ్దాలు.. ఢిల్లీ సరిహద్దుల్లో ఎల్ఆర్డీఏ వినియోగం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ)కి చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఛలో ఢిల్లీకి పిలుపునిచ్చిన పంజాబ్ రైతులపై పోలీసులు 'సోనిక్ ఆయుధాల'ను ప్రయోగించారు. ఒకే దిశలో కర్ణభేరీలు పగిలేలా శబ్దాలను విడుదల చేయడం సోనిక్ ఆయుధాల ప్రత్యేకత. లాంగ్ రేంజ్ అకూస్టిక్ డివైజ్(ఎల్ఆర్ఏడీ)గా పిలిచే సోనిక్ ఆయుధాలను సాధారణంగా సముద్రపు దొంగలకు హెచ్చరికలు జారీ చేయడానికి వినియోగిస్తుంటారు. కొన్ని దేశాల్లో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు వాడుతున్నారు. అమెరికా సైన్యం అమ్ముల పొదిలో 2000 సంవత్సరం నుంచే సోనిక్ ఆయుధాలుండగా.. 2013లో ఢిల్లీ పోలీసులు వీటిని కొనుగోలు చేశారు. నాలుగేళ్ల క్రితం రైతుల ఛలో ఢిల్లీ-1.0లో సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించినా.. ట్రాక్టర్లతో బారికేడ్లను బద్దలు కొట్టుకుంటూ వచ్చిన రైతులు.. ఎర్రకోటపై తమ జెండాను ఎగురవేశారు. మంగళవారం నుంచి ఛలో ఢిల్లీ-2.0 ప్రారంభమైన నేపథ్యంలో.. రైతులను ఢిల్లీ శివార్లలోనే కట్టడి చేయాలనే ఉద్దేశంతో పోలీసులు ఎల్ఆర్ఏడీలను ఉపయోగిస్తున్నారు. సాధారణంగా మన చెవులు 90 డెసిబుల్స్ వరకు శబ్దాలను వినగలవు. శబ్దం తీవ్రత అంతకు మించితే.. కర్ణభేరీ దెబ్బతింటుంది. ఎల్ఆర్ఏడీలు 160 డెసిబుల్స్ వరకు శబ్దాలను విడుదల చేస్తాయి. ఇవి ఒకే దిశలో 5 నుంచి 60 డిగ్రీల వ్యాసార్థంలో శబ్దాలను పంపుతాయి. ఎల్ఆర్డీఏ సామర్థ్యం 2కిలో హెర్ట్జ్‌ల వరకు ఉంటుంది. అంటే.. ఒకే ఫ్రీక్వెన్సీతో 2.4 కిలోమీటర్ల దూరం వరకు భారీ శబ్దాలను పంపగలవు. ఢిల్లీ పోలీసులు సోనిక్ ఆయుధాలను బుధవారం ప్రయోగించినట్లు ఎన్‌డీటీవీ కథనాలను ప్రసారం చేసింది.


రైతులపై బాష్పవాయువును ప్రయోగిస్తున్న పోలీసులు

డ్రోన్లకు పతంగులతో విరుగుడు

ఆందోళన చేస్తున్న రైతులను చెదరగొట్టేందుకు హరియాణా పోలీసులు మంగళవారం డ్రోన్లతో టియర్‌గ్యాస్ ప్రయోగించారు. రబ్బర్ బుల్లెట్లను ఉపయోగించారు. దీంతో పలువురు రైతులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలో టియర్‌గ్యాస్ డ్రోన్లకు విరుగుడుగా రైతులు బుధవారం పతంగులను ఎగురవేశారు. పతంగుల దారాలకు చిక్కుకుపోయే డ్రోన్లు.. కుప్పకూలిపోతాయి. ఇక భాష్పవాయువు ప్రభావాన్ని తగ్గించేలా ఎక్కడికక్కడ నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసుకున్నారు. రైతులు వాటర్ బాటిళ్లు, కాటన్ దుస్తులను తమ దగ్గర పెట్టుకున్నారు. బాష్పవాయువు ప్రయోగం జరిగినప్పుడు కాటన్ దుస్తులను తడిపి.. ముఖానికి కట్టుకోవడం వల్ల దాని దుష్ప్రభావాల నుంచి తప్పించుకోవచ్చని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరోవైపు బుధవారం మధ్యాహ్నం హరియాణా పోలీసులు రబ్బర్ బుల్లెట్లతో జరిపిన కాల్పుల్లో 40 మంది రైతులు గాయపడ్డారు.

శివార్లలో రోడ్ల దిగ్బంధం

ఢిల్లీ శివార్లలో.. ముఖ్యంగా పంజాబ్-హరియాణా సరిహద్దుల్లోని శంభు వద్ద, ఢిల్లీ-హరియాణా సరిహద్దుల్లోని సింఘ్వాలా-ఖనౌరీ రహదారిని రైతులు దిగ్బంధం చేశారు. ఆ ప్రాంతాల్లో సుమారు 200 రైతు సంఘాల ఆధ్వర్యంలో లక్ష మందికిపైగా రైతులు ఢిల్లీ వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. రైతులు ఢిల్లీ వైపు చొచ్చుకెళ్లకుండా ఉండేందుకు హరియాణా పోలీసులు సిమెంట్ దిమ్మెలు, బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. గతంలో రైతులు ట్రాక్టర్లతో బ్యారికేడ్లను తప్పిస్తూ ముందుకు దూసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ట్రాక్టర్లు వస్తే.. వాటి టైర్లు పంక్చర్ అయ్యేలా రోడ్లపై మేకులు, ఇనుప ముళ్ల కంచెలను ఏర్పాటు చేశారు. ముందుకు దూసుకొచ్చే రైతులు రోడ్లపై జారిపడేలా, వాహనాలు అదుపుతప్పేలా ల్యూబ్రికెంట్స్‌ను వేశారు. ఓవైపు రైతుల ఆందోళన, మరోవైపు పోలీసుల దిగ్బంధనాలతో సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

రైతు నేతలతో కేంద్రం చర్చలు

రైతు సంఘాల నేతలు మంగళవారం నుంచే చర్చలకుడిమాండ్ చేస్తుండగా.. కేంద్రం బుధవారం ఉదయం నుంచి ఆ దిశగా చర్యలను ప్రారంభించింది. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అర్జున్ ముండా, పీయూష్ గోయల్ ఉదయం భేటీ అయ్యి.. రైతు నేతల డిమాండ్లు, పోలీసుల చర్యలపై చర్చించారు. మధ్యాహ్నం 2.30 సమయంలో కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, పీయూష్‌గోయల్, నిత్యానంద్ రాయ్.. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చాతో వేర్వేరుగా చర్చలు జరిపారు. రైతు నేతల డిమాండ్లలో కొన్నింటికి కేంద్ర మంత్రులు ఓకే చెప్పినట్లు తెలిసింది. ఎమ్మెస్పీకి చట్టబద్ధతపై ఇప్పటికిప్పుడు చట్టం చేయలేమని, అన్నివర్గాలు, రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుందని వివరించారని సమాచారం. అంతవరకు రైతులు తమ ఆందోళనలను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా, గురువారం సాయంత్రం 5 గంటలకు మూడో విడత చర్చలు జరపనున్నట్లు కేంద్రం ప్రకటించింది.

ఎమ్మెస్పీకి చట్టబద్ధత ఇవ్వాల్సిందే

» రైతు సంఘాల డిమాండ్

కేంద్ర ప్రభుత్వం ఎమ్మెస్పీకి చట్టబద్ధతనిచ్చేదాకా తమ ఆందోళన కొనసాగుతుందని రైతు సంఘాల నాయకులు తేల్చిచెప్పారు. రైతు నేత సర్వణ్‌సింగ్ పంధేర్ మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులు టియర్ గ్యాస్‌ను ప్రయోగించడం వల్ల చాలా మంది రైతులు గాయపడ్డారని, పలువురు అస్వస్థతకు గురయ్యారని పేర్కొన్నారు. కేంద్రం ఇలాంటి చర్యలను నిలువరించి, చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. తాము కేంద్రంతో ఘర్షణకు రాలేదని, న్యాయమైన డిమాండ్ల సాధన కోసమే తమ పోరాటమని వివరించారు. మరో నేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ కూడా ఎమ్మెస్పీనే తమ ప్రధాన డిమాండ్ అని, స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని పేర్కొన్నారు.

మోదీది నియంతృత్వ పోకడ: కాంగ్రెస్

రైతులపై పోలీసుల దాడిని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్రంగా ఖండించారు. మంగళవారం నాటి దాడిలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు గుర్మీత్ సింగ్‌ను ఆయన ఫోన్‌లో పరామర్శించారు. దేశానికి అన్నంపెడుతున్న రైతులపై ప్రధాని మోదీ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ ఎక్స్‌లో మండిపడ్డారు. రైతులకు తాము అండగా ఉంటామని గుర్మీత్‌కు ధైర్యం చెప్పారు. కాగా, ఝార్ఖండ్‌లో బుధవారం నుంచి ప్రారంభం కావాల్సిన రెండో విడత భారత్ జోడో న్యాయ యాత్ర రద్దు అయ్యింది. రైతుల ఛలో ఢిల్లీ ఆందోళనలో పాల్గొనేందుకు రాహుల్ దేశ రాజధానికి వెళ్లడంతో యాత్రను రద్దు చేసినట్టు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, ఎమ్మెస్పీకి చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్ ఇప్పటిది కాదని, 2011లో కూడా గుజరాత్ సీఎంగా మోదీ ఇదే డిమాండ్ చేశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ గుర్తుచేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ మోదీ ఎమ్మెస్పీ గురించి ప్రస్తావించినట్లు చెప్పారు.

'సుప్రీం' మార్గదర్శకాలకు లోబడే

ప్రకటనలు ఇవ్వండి

» సీఎం జగన్‌కు హైకోర్టు నోటీసులు

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా, అధికార వైసీపీని రాజకీయంగా ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ప్రకటనలు ఇస్తోందని పేర్కొంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీచేసే ప్రకటనలు సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు లోబడి ఉండాల్సిందేనని తేల్చి చెప్పింది. వ్యక్తిగత హోదాలో సీఎం జగన్‌కు నోటీసులు జారీ చేసింది. అలాగే సీఎస్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్, కాగ్, వైసీపీ ప్రధాన కార్యదర్శి, జగతి పబ్లికేషన్స్ ఎండీ, ఇందిరా టెలివిజన్ ఎండీ, విశాఖ సీబీఐ ఎస్పీ, కమిటీ ఆన్ కంటెంట్ రెగ్యులేషన్ ఇన్ గవర్నమెంట్ అడ్వర్టైజింగ్ మెంబర్ సెక్రటరీకి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను మార్చి 6కు వాయిదా వేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా వైసీపీని రాజకీయంగా ప్రోత్సహించేలా ప్రభుత్వం 2019 నుంచి కోట్ల రూపాయాల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ప్రకటనలు ఇస్తోందని పేర్కొంటూ బాపట్ల జిల్లా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం గ్రామానికి చెందిన చెన్నుపాటి సింగయ్య పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది అంబటి సుధాకరరావు వాదనలు వినిపించారు. "ప్రభుత్వ ప్రకటనల ద్వారా ప్రతిపక్షాలను విమర్శించడానికి వీల్లేదు. రాజకీయ పార్టీని ప్రోత్సహించేలా ప్రకటనలు ఉండకూడదు. ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలు తటస్థంగా ఉండాలి. 2019 నుంచి ప్రభుత్వం ఇస్తున్న ప్రకటనలు అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. వైసీపీని ప్రోత్సహించి, ప్రతిపక్షాలను తక్కువ చేసేలా ప్రకటనలు ఉంటున్నాయి. ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచేవిధంగా కాకుండా సీఎం జగన్ ప్రతిష్ఠ పెంచేలా ప్రకటనలు ఇస్తున్నారు" అని పేర్కొన్నారు. గత నాలుగున్నరేళ్లుగా వ్యక్తిగత, పార్టీ ప్రతిష్ఠ కోసం రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేశారన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) సి.సుమన్ వాదనలు వినిపిస్తూ.. పిల్ దాఖలు చేయడం వెనుక పిటిషనర్‌కు దురుద్దేశం ఉందన్నారు. కేవలం 2019 తరువాత ఇచ్చిన ప్రకటనల గురించే ప్రస్తావించారని, గత ప్రభుత్వాలలో ఇచ్చిన ప్రకటనల వివరాలను కూడా కోర్టు ముందు ఉంచుతామన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అంగీకరించిన ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

ప్రచార పిచ్చి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇదే వరుస. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఔట్‌డోర్ మీడియా ప్రకటనల కోసం రూ.32.91 కోట్లు, ప్రింట్ మీడియా కోసం రూ.145.9కోట్లు, ఎలక్ట్రానిక్ మీడియా కోసం రూ.20 కోట్లు, ఇతర మార్గాల్లో ప్రకటనల కోసం రూ.2.78కోట్లు.. మొత్తం రూ.201.59 కోట్లు కేటాయించారు. ఇప్పటి వరకు రూ.193.31కోట్లు ఖర్చు చేశారు. ఇందులో చాలావరకు సీఎం సొంత మీడియాకే ప్రకటనల రూపంలో నిధులు వెచ్చించారు. ఇంకా రూ.8 కోట్లు మిగిలున్నాయి. ఈ నేపథ్యంలో జనాల సొమ్ముతోనే వైసీపీ ప్రచారం కొనసాగించాలని భావించిన జగన్ సర్కార్ ప్రకటనల కోసం మరో రూ.621.15కోట్లు కావాలంటూ ప్రతిపాదన చేసింది. ఔట్‌డోర్ మీడియాలో ప్రకటనలకు రూ.100.89 కోట్లు, ప్రింట్ మీడియాలో ప్రకటనలకు రూ.435.74కోట్లు, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు రూ.83.32కోట్లు, ఇతర మార్గాల్లో ప్రకటనలకు రూ.1.2కోట్లు అదనంగా కావాలంటూ ఐఅండ్‌పీఆర్ శాఖ ఆర్థిక శాఖను కోరుతోంది. మరో 2-3 నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. అయినా ప్రకటనల కోసం మరో 621కోట్లు కావాలని కోరుతోందంటే ఏ మేరకు ప్రజాధనం దుర్వినియోగం చేస్తుందో అర్థమవుతుంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే కొన్ని పత్రికలకు, ఎలక్ట్రానిక్ మీడియాకు జగన్ ప్రభుత్వం పూర్తిగా ప్రకటనలు నిలిపివేసింది. సొంత మీడియాకు, వైసీపీకి అనుకూలంగా పనిచేసే చానళ్లు, పత్రికలకే ప్రకటనలు ఇస్తోంది. వాటిలో ప్రభుత్వ విజయాలు, లక్ష్యాలు, సవాళ్ల గురించి కాకుండా గత టీడీపీ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది. ప్రజాధనాన్ని పప్పుబెల్లాల్లా ఖర్చు చేస్తూ సొంత ప్రచారం కోసం జగన్ సర్కారు జారీచేస్తున్న ప్రకటనలకు ఇక బ్రేక్ పడనుంది. ఈ ప్రకటనల వ్యవహారంపై హైకోర్టులో పిల్ దాఖలైంది. దీన్ని విచారించిన న్యాయస్థానం.. ఇకమీదట సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు లోబడి ప్రకటనలు ఇవ్వాలని సర్కారును ఆదేశించింది.

ఇసుక బొక్కుడు నిజం!



(మొదటి పేజీ తరువాయి)

కళ్లండి చూడలేకపోతోందని, అక్రమార్కులకే వంత పాడుతోందని ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు చేసిన ఆందోళనలు తిరుగులేని నిజాలని తేలిపోయింది. ఇసుక వ్యాపారం పూర్తిగా తాడేపల్లి పెద్దల కనుసన్నల్లో కొనసాగుతుండడంతో ఇటు గనులశాఖ, అటు రెవెన్యూ, పోలీసు విభాగాలు చేతులు కట్టుకొని 'జీ హుజూర్' అంటున్నాయన్న విమర్శలకు తిరుగులేని బలం చేకూరింది. ఇసుక తవ్వకాల్లో అక్రమాలు నిజమే అంటూ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ రాష్ట్ర హైకోర్టు ముందు విస్పష్టంగా వెల్లడించింది. ఇసుక దోపిడీ గురించి కేంద్రమే న్యాయస్థానానికి కుండబద్దలు కొట్టి చెప్పడంతో సర్కారు వారి దోపిడీకి ఇంతకు మించిన సాక్ష్యం మరొకటి కావాలా? అని విపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు. పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని కేంద్రం స్పష్టం చేసింది. ఇది జగన్ హయాంలో సాగుతున్న ఇసుక దోపిడీని నిరూపించే తిరుగులేని సాక్ష్యంగా నిలిచింది. అయితే, స్టాక్‌పాయింట్‌లో ఉన్న ఇసుక అమ్మకాలే సాగుతున్నాయని సర్కారు నమ్మబలికే ప్రయత్నం చేసింది. సకల వ్యవస్థలను చేతులుకట్టుకొని నిలబడేలా చేసి ఈసారి ముఖ్యమంత్రి సోదరుడే ఇసుక వ్యాపారం నడుపుతున్నారు. దీంతో గతానికి మించిన ఉల్లంఘనలు జరుగుతున్నాయి. ఎన్నికలు ముగిసేనాటికి వీలైనంత మేరకు యంత్రాలను పెట్టి ఇసుక తోడేసుకోవడం, ఎంతకైనా తెగించేందుకు 'సోదరుడు' సిద్ధమవడం గమనార్హం.

జేపీ వెంచర్స్ పేరుతో...

2021-2023 రెండేళ్ల కాలంలో జేపీ వెంచర్స్ ఇసుక వ్యాపారం చేసిన సంగతి తెలిసిందే. ఈ కాంట్రాక్టు విలువ రూ.1,535 కోట్లు. దీనిలో జేపీ సంస్థ సర్కారుకు చెల్లించింది రూ.671 కోట్లు. మిగిలిన 850 కోట్లు ప్రభుత్వ సంస్థలకు ఇసుక ఇచ్చినట్లుగా లెక్కలు చూపి ఆ మేరకు మినహాయింపు పొందింది. ఇంకా ఆ సంస్థ బకాయిలు అలాగే ఉన్నాయి. ఇక, ఈ సంస్థ కాంట్రాక్టు కొనసాగుతుండగానే 2022లోనే జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ) ఇచ్చిన ఆదేశం మేరకు 110 రీచ్‌ల్లో తవ్వకాలకు సంబంధించిన పర్యావరణ అనుమతులు రద్దయ్యాయి. దీంతో కేవలం 60 రీచ్‌ల్లోనే ఈసీలు పనిచేశాయి. వాటిపై కూడా కేసు పెండింగులో ఉండడంతో అధికార పార్టీ నేతలు ముందుచూపుతో నదీ గర్భాలను యంత్రాలు పెట్టి తోడేశారు. దాదాపు 1.50 కోట్ల టన్నుల ఇసుకను ముందుగానే తవ్వేసి సొంత స్టాక్ యార్డ్‌లకు తరలించేశారు. జేపీ పేరిట మరో 75 లక్షల టన్నుల ఇసుకను అధికారిక స్టాక్‌యార్డ్‌ల్లో చూపించారు. జేపీ కాంట్రాక్టు గడువు గత ఏడాది మే 15తో ముగిసిపోయింది. తర్వాత మరెవ్వరూ ఇసుక తవ్వకాలు చేపట్టడానికి వీల్లేదు. జేపీ కూడా ఆ పనిచేయడానికి వీల్లేదు. ఎందుకంటే 170కిగాను 110 రీచ్‌లపై ఉన్న పర్యావరణ అనుమతులు రద్దయ్యాయి. అయినప్పటికీ జేపీ పేరు వాడుకుని అధికార పార్టీ నేతలు అడ్డగోలు దోపిడీకి పాల్పడ్డారు. స్టాక్‌యార్డ్‌లో జేపీ పేరిట ఉన్న 75 లక్షల టన్నుల ఇసుకతోపాటు, గత ఏడాది డిసెంబరు నాటికి మరో కోటి టన్నుల ఇసుకను తవ్వి అమ్ముకున్నారని పర్యావరణవేత్తలు చెబుతున్నారు.

పేరు జేపీ.. వాటా తాడేపల్లికి!

ఇసుక అమ్మకాల కాంట్రాక్టు జేపీ వెంచర్స్ పేరున ఉన్నా దానిమీద వచ్చే ఆదాయంలో సింహభాగంతాడేపల్లికి చేరిపోయింది. ఉమ్మడి జిల్లాల ఆధారంగా అనధికార కాంట్రాక్టు తీసుకున్న వ్యాపారులు సగటున నెలకు రూ.20-25 కోట్ల చొప్పున తాడేపల్లికి కప్పంకట్టారు. కప్పం కట్టలేనివారు ఆత్మహత్యలు చేసుకున్నారు. కాంట్రాక్టు తీసుకున్నది సొంత పార్టీ నేతైనా సరే తాడేపల్లికి కప్పం కట్టాల్సిందే. ఒక్కరోజు ఆలస్యం అయినా పెనాల్టీలు వసూలు చేసిన సందర్భాలున్నాయని వైసీపీ నేతలే ఆవేదన వ్యక్తం చేశారు. 2021 నుంచి గత ఏడాది డిసెంబరు వరకు రూ.8 వేల కోట్ల మేర ఇసుక వ్యాపారం జరిగిందని అధికారవర్గాల అంచనా. ఇందులో తాడేపల్లికే 4 వేల కోట్లు కప్పం కింద చెల్లించారని వైసీపీ నేతలు బాహాటంగానే చెబుతున్నారు.

సీఎం తమ్ముడిదే అంతా

జగన్ సర్కారు 2023-25 సంవత్సరాలకు ఇసుక టెండర్లు నిర్వహించింది. గతంలో జేపీ సంస్థ పాడిన ధర కంటే ఎక్కువగా రిజర్వ్ ధర ఉండాలి. అయితే ఈసారి సీఎం తమ్ముడు అనిల్ రెడ్డే ఇసుక వ్యాపారం చేయబోతున్నారు, ఆయనే ఇతరులకు సబ్‌కాంట్రాక్టులు ఇవ్వబోతున్నారు. కాబట్టి ధర పెంచి భారం వేయవద్దనుకున్నట్లుగా వ్యవహరించారు. రిజర్వ్ ధరను కేవలం రూ.1529 కోట్లుగా నిర్ణయించారు. అంటే, గతంలో జేపీకి టెండర్ ఇచ్చినప్పుడు ఇసుక రిజర్వ్ ధర 1510 కోట్లు. జేపీ రూ.1535 కోట్లకు దక్కించుకుంది. కానీ ఈసారి రిజర్వ్ ధరనే 1529 కోట్లుగా ఖరారు చేశారు. టెండర్లను గుట్టుగా నిర్వహించారు. ముందుగా నిర్ణయించుకున్నట్లే తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ మేనల్లుడు బోయినపల్లి శ్రీనివాసరావుకు చెందిన ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు 18 జిల్లాలు(ప్యాకేజీ 1-3), రాజస్థాన్‌కు చెందిన జీసీకేసీ సంస్థకు 8 జిల్లాలు(ప్యాకేజీ-2) కట్టబెట్టారు.

తవ్వుకునేది సీఎం తమ్ముడే కదా..

పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలు ప్యాకేజీ-2లో ఉన్నాయి. జీసీకేసీ సంస్థ ఈ టెండర్ దక్కించుకొని ఇసుక తవ్వకాలు చేపట్టింది. జీఎస్టీ నెంబర్ లేకుండానే ఈ సంస్థ ఇసుక రవాణాకోసం రహదారి బిల్లులు ఇస్తోందని జనవరి 1న 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. అప్పటికీ గనుల శాఖ స్పందించలేదు. వాస్తవానికి లోగడ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు జీసీకేసీ, ప్రతిమసంస్థలు ఇసుక తవ్వకాలు చేపట్టడానికి వీల్లేదు. పైగా 170 రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు చేపట్టేలా పర్యావరణ అనుమతులు ఇంకా మంజూరు కాలేదు. ఈసీ సర్టిఫికెట్లు లేకుండా ఇసుకను తవ్వడం చట్టరీత్యా నేరం. అయినప్పటికీ ఆ సంస్థలతో పనులు చేయించారు. సీఎం సోదరుడే తెరవెనుక వ్యాపారం చేస్తున్నారు, అధికారులు అడ్డుకోరు, ఎవరూ అభ్యంతరాలు చెప్పరన్న ధైర్యంతోనే ఈసీలు లేకున్నా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇదే అంశంపై 'ఆంధ్రజ్యోతి' అనేక వార్తలు ప్రచురించినా గనుల శాఖ స్పందించలేదు. తవ్వుకునేది సీఎం తమ్ముడే కదా.. జోక్యం చేసుకోకూడదని ఇటు గనుల శాఖ, అటు రెవెన్యూ విభాగాలు భావించి ఉంటాయి. అందుకే అవి రంగంలోకి దిగి అక్రమాలను అడ్డుకునే సాహసం చేయలేకపోయాయి.

నిర్లజ్జగా దోపిడీ

ఎన్నికలు ముగిసేనాటికి వీలైనంత మేర ఇసుకను దోచుకోవాలని సీఎం సోదరుడు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. ఆయన వద్ద సబ్‌కాంట్రాక్టులు తీసుకున్నవారు కూడా ఇసుక నుంచి పిండుకోవాలనుకుంటున్నారు. జీఎస్టీ నెంబరు లేకుండానే రహదారి బిల్లులు ఇవ్వడం, 20 టన్నులు లోడ్‌చేయాల్సిన చోట 30-35 టన్నులు డంప్ చేయడం వంటివి చేస్తున్నారు. ఈసారి ముందు జాగ్రత్తగా గనుల శాఖకు తెలియనీయకుండా పొలాలు, కొండగుట్టల వద్ద సొంతంగా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసుకున్నారు. ఇలాంటి అక్రమాలను కనిపెట్టేందుకు గనుల శాఖ విజిలెన్స్ విభాగం, సెబ్ పోలీసులు, రెవెన్యూలు ఉన్నా ఏం లాభం? సీఎం సోదరుడి విషయం కావడంతో కన్నెత్తి చూడలేకపోతున్నారు. దీంతో సీఎం సోదరుడి నుంచి సబ్‌కాంట్రాక్టు తీసుకున్న వారు నిర్లజ్జగా ఇసుకను తోడేస్తున్నారు.

స్టాక్ పాయింట్ కథలు ఇంకెన్నాళ్లు?

» ఇసుక అక్రమాలపై చర్యలేవీ: హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలను కప్పిపుచ్చుకునేలా రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాదనపై హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. కొత్తగా తవ్వకాలు జరపడం లేదని, స్టాక్‌పాయింట్లలో ఉన్న ఇసుకను మాత్రమే తరలిస్తున్నామన్న వాదనపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "స్టాక్ పాయింట్ కథలు ఇంకెన్నాళ్లు చెబుతారు? ఎంతకీ తరగనంత ఇసుకను అక్కడ నిల్వ చేశారా?" అని వైసీపీ సర్కారును నిలదీసింది. తక్షణమే అక్రమాలను నిలువరించాలని ఆదేశించింది. కాగా, రాష్ట్రంలో ఇసుక అక్రమాలు నిజమేనని కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ(ఎంవోఈఎఫ్) హైకోర్టుకు నివేదించింది. జీసీకేసీ ప్రాజెక్ట్ అండ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ భారీయంత్రాలతో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నట్లు ఎంవోఈఎఫ్, కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు నిర్ధారించారని వివరించింది. చెన్నై ఎన్జీటీ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఇసుక రీచ్‌లను పరిశీలించి నిర్ధారణకు వచ్చారని తెలిపింది. అక్రమ తవ్వకాల వ్యవహారాన్ని నివేదిక రూపంలో త్వరలో ఎన్జీటీకి అందజేస్తామని, ఈ కోర్టు అనుమతిస్తే న్యాయస్థానం ముందు కూడా ఉంచుతామని ఎంవోఈఎఫ్ తరఫు న్యాయవాది జూపూడి యజ్ఞదత్ ధర్మాసనానికి నివేదించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం అఫిడవిట్ రూపంలో కోర్టు ముందు ఉంచాలని ఆదేశించింది. అలాగే ఎన్జీటీకి ఇవ్వనున్న నివేదికను కూడా అఫిడవిట్‌కు జత చేయాలని ఎంవోఈఎఫ్‌ను ఆదేశించింది. రాష్ట్రంలో అనుసరిస్తున్న ఇసుక విధానం ఏంటి? ఇసుక ధరను ఎలా నిర్ణయిస్తారు? రీచ్‌ల నుంచి ఎలా రవాణా చేస్తున్నారు? తదితర వివరాలను కోర్టు ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాల పరిధిలోని రీచ్‌లలో ఇసుక అక్రమ తవ్వకాలను నిలువరించాలని జిల్లా కలెక్టర్లు, మైనింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్లను ఆదేశించింది. ఇందుకు తీసుకున్న చర్యలను కోర్టు ముందు ఉంచాలని స్పష్టం చేసింది. ఇసుక అక్రమ మైనింగ్ జరగడం లేదని, గతంలో తవ్వి నిల్వ చేసిన ఇసుకను మాత్రమే రవాణా చేస్తున్నామన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనపై అసహనం వ్యక్తం చేసింది. స్టాక్ పాయింట్‌లలో ఎప్పటికీ తరగనంత ఇసుకను నిల్వ చేశారా? ఎంతకాలం అవే మాటలు చెబుతారని నిలదీసింది. తప్పుడు వివరాలు చెప్పాల్సిన అవసరం ఎంవోఈఎఫ్‌కు ఏముందని ప్రశ్నించింది. విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్. రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది.

ఇదీ ప్రజాప్రయోజన వ్యాజ్యం

పల్నాడు జిల్లా, అమరావతి మండలం, ముత్తాయపాలెం గ్రామం పరిధిలో జయప్రకాశ్(జేపీ) వెంచర్స్ సంస్థ ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తోందని జీవీఎస్ఎస్ ప్రసాద్ మరో ఐదుగురు గత ఏడాది ఏప్రిల్‌లో హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది జంపని శ్రీదేవి, అమికస్ క్యూరీ కేఎస్‌మూర్తి, ఎంవోఈఎఫ్ తరఫున న్యాయవాది యజ్ఞదత్, మైనింగ్‌శాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది నవీన్ వాదనలు వినిపించారు.

అధికారులపై చర్యలు తప్పవు

రాష్ట్రంలో అక్రమ మైనింగ్ జరుగుతోందంటూ వరుసగా పిటిషన్లు దాఖలు అవుతున్నాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. అక్రమ మైనింగ్‌ను నిలువరించడంలో విఫలమైతే బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించింది. చిత్తూరు జిల్లా, అనంతపురం పంచాయతీ పరిధిలోని నీవా నదిలో ఇసుక అక్రమతవ్వకాలను నిలువరించాలని రెవెన్యూ, మైనింగ్‌శాఖ అధికారులను ఆదేశించింది. అక్రమ మైనింగ్‌పై సమాచారం అందినా చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. పూర్తి వివరాలతో నివేదికను కోర్టు ముందుంచాలని స్పష్టం చేసింది. జేపీ వెంచర్స్, ప్రతిమ సంస్థలకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను మార్చి 13కి వాయిదా వేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. నీవా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సర్పంచ్ స్వామినాథన్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపించారు.

ఎంపీ అడిగారు... యూనివర్సిటీ ఇచ్చారు

▸▸ మదనపల్లెలో అనిబిసెంట్ వర్సిటీ.. మిథున్‌రెడ్డి వినతితో ఏర్పాటు

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ప్రమాణాల మెరుగుదలకు అధ్యాపకులు, మేధావులు ఎన్ని వినతులు చేసినా పట్టించుకోని ప్రభుత్వం అధికార పార్టీ ఎంపీ అడిగారని ఏకంగా యూనివర్సిటీనే ఇచ్చేసింది. మంత్రి పెద్దిరెడ్డి కుమారుడు, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అడిగారని అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కొత్త యూనివర్సిటీ ఏర్పాటుకు అనుమతులు జారీచేసింది. అక్కడి బీసెంట్ థియోసాఫికల్(బీటీ) కాలేజీని అప్‌గ్రేడ్ చేసి, యూనివర్సిటీగా ఏర్పాటుచేసేందుకు బుధవారం ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దానికి అనిబిసెంట్ యూనివర్సిటీగా నామకరణం చేసింది. బీటీ కాలేజీని అప్‌గ్రేడ్ చేసి యూనివర్సిటీ చేయాలని 2023 మే 2న ఎంపీ ఉన్నత విద్యామండలికి లేఖ రాశారు. ఆ తర్వాత అక్టోబరు 8న ఉన్నత విద్యామండలి దానిపై చర్యలు ప్రారంభించింది. అదే రోజున కళాశాల విద్యాశాఖ కమిషనర్ అందుకు అనుకూలంగా మండలికి ఫైలు పంపారు. ఆ వెంటనే డీపీఆర్ తయారుచేసి ఎంపీ అడిగిన మేరకు యూనివర్సిటీ ఏర్పాటుకు అనుకూలంగా ప్రతిపాదనలు రూపొందించారు. వాటిని పరిశీలించిన ప్రభుత్వం యూనివర్సిటీ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చేసింది.

విశాఖలో 25 పడకల ప్రాంతీయ ఆస్పత్రి నిర్మించాలి

▸▸ ఆర్టీసీ ఎండీకి ఈయూ నేతల లేఖ

విజయవాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు సత్వర వైద్యసేవలు అందించేందుకు ఉత్తరాంధ్ర ప్రాంతం విశాఖలో పాతిక పడకల ఆస్పత్రి నిర్మించాలని ఏపీపీటీడీ ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావుకు లేఖద్వారా విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కడపలో ఉన్న 25 పడకల ఆస్పత్రిని 50 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

చేనేత వస్త్రాలకు ప్రచారం కల్పిస్తాం

▸▸ జీఎస్టీని రద్దు చేయించి ఆదుకుంటాం

▸▸ నాటి సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తాం

▸▸ దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించండి

▸▸ చేనేత మహిళలకు నారా భువనేశ్వరి పిలుపు

▸▸ ఉమ్మడి అనంతలో కొనసాగిన 'నిజం గెలవాలి' యాత్ర



శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం వెంకటాపురం గ్రామం నుంచి పెనుకొండకు వెళుతూ, అమ్మవారిపల్లి వద్ద 44వ నంబరు జాతీయ రహదారి పక్కన కియ పరిశ్రమ వద్ద ఆగి విజయ సంకేతాన్ని చూపిస్తున్న నారా భువనేశ్వరి

పుట్టపర్తి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలకు ప్రచారం కల్పించి చేనేత కార్మికులకు చేయూతనిస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా ఆమె ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ధర్మవరం, రాప్తాడు, పెనుకొండ నియోజకవర్గాల్లో బుధవారం పర్యటించారు. చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ధర్మవరంలో చేనేత మహిళల ఆత్మీయ సమావేశంలో భువనేశ్వరి పాల్గొన్నారు. ధర్మవరం చేనేత వస్త్రాలకు 125 ఏళ్ల చరిత్ర ఉందని, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఈ వస్త్రాలు చేరడం రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. చేనేత రంగానికి ఊతమిచ్చిన ఘనత తన తండ్రి ఎన్టీఆర్‌కు దక్కుతుందన్నారు. చంద్రబాబు పాలనలో చేనేత కార్మికులకు గుర్తింపునిచ్చి, రాయితీలు, సంక్షేమ పథకాలతో ఆదుకున్నామని అన్నారు. చంద్రబాబు హయాంలో వారికి అందిన పథకాలను వైసీపీ ప్రభుత్వం ఆపివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగా చేనేత రంగంపై ఆధారపడిన కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల బలవన్మరణాలకు వైసీపీ ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. ఆత్మహత్య చేసుకున్న కార్మికుల కుంటుంబాలకు టీడీపీ అండగా నిలబడుతుందని అన్నారు. అధికారంలోకి వచ్చాక ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయిస్తామని అన్నారు. కేంద్రం ఒప్పుకోకపోతే ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టాలని కోరారు. అధికారంలోకి రాగానే గతంలో అందించిన సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని, మరిన్ని సంక్షేమ ఫలాలు అందిస్తామని అన్నారు. పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి, కృష్ణా మిగులు జలాలతో రాయలసీమను చంద్రబాబు సస్యశ్యామలం చేశారని అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సాగు, తాగు నీరిచ్చిన ఘనత చంద్రబాబుదే అని అన్నారు. కియ కార్ల తయారీ పరిశ్రమ, టెక్స్‌టైల్, ఫుడ్ పార్క్‌లతో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. ఇక్కడి భూముల విలువలు పెరిగాయని అన్నారు. ఇది చంద్రబాబు మార్కు అని అన్నారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ 'మిషన్ రాయలసీమ' డిక్లరేషన్ ప్రకటించారని, ఉమ్మడి అనంతపురం జిల్లాను ఆటోమొబైల్ హబ్‌గా మారుస్తామని మాట ఇచ్చారని, అధికారంలోకి రాగానే అమలు చేస్తామని అన్నారు. ఇవన్నీ జరగాలంటే రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో వైసీపీ దుర్మార్గపు ప్రభుత్వాన్ని మహిళలు ఓటు ఆయుధంతో గద్దె దించాలని భువనేశ్వరి పిలుపునిచ్చారు.

మేమున్నాం.. అధైర్యపడొద్దు

కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. చంద్రబాబు అరెస్టు సమయంలో మృతిచెందిన వారి కుటుంబాలను బుధవారం పరామర్శించారు. బత్తలపల్లి మండలంలోని సంజీవపురంలో ముళ్లగురి వెంకటరాముడు, చక్కిరయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. కనగానిపల్లి మండలం వేపకుంటలో టీడీపీ కార్యకర్త బెస్త నారాయణ కుటంబాన్ని, రామగిరి మండలం పోలిపల్లిలో కంపల్లి వెంకటరాముడు కుటుంబాన్ని, పెనుకొండలో టీడీపీ కార్యకర్త రహీమ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు.



శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం సంజీవపురంలో చక్రయ్య కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి

ఆటోను ఢీకొన్న కారు.. ముగ్గురు మృతి

ఏల్చూరు (సంతమాగులూరు), ఫిబ్రవరి 14: అద్దంకి-నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ఏల్చూరుకు చెందిన 15మంది వ్యవసాయ కూలీలు గ్రామంలో మిరప కోతలకు వెళ్లి ఇంటికి వస్తుండగా, వారు ప్రయాణిస్తున్న ఆటోను తిరుపతి నుంచి పిడుగురాళ్లకు వెళ్తున్న కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొడుతూ రోడ్డు మార్జిన్‌లో పడింది. ప్రమాదంలో ఆటో డ్రైవరు అల్లాహు (65)అక్కడికక్కడే మృతిచెందగా, కూలీలు గుండుమల్లి వెంకాయమ్మ (55), బొప్పిడి మౌలమ్మ(45) నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. మరో 12మంది కూలీలు నరసరావుపేటలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతున్నారు.



కారు ఢీకొనడంతో బోల్తాపడిన ఆటో

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నిక్షేపంగా ఇంటికి...

ఖతార్‌లో మూడునెలల క్రితం మరణశిక్ష పడిన భారత నౌకాదళ మాజీ అధికారులు అనూహ్యంగా, చడీచప్పుడూ లేకుండా స్వదేశానికి క్షేమంగా తిరిగిరావడం ఆశ్చర్యాన్నీ ఆనందాన్నీ కలిగించే పరిణామం. పెట్టిన కేసులు, అరెస్టులు, శిక్షలు ఇత్యాదివన్నీ ఎంత గోప్యంగా ఉన్నాయో, వారి రాకకూడా అదేవిధంగా జరిగిపోయింది. దోహ్రా టెక్నాలజీస్‌లో ఉద్యోగాలు చేసుకుంటూ, స్థానిక సైనిక సిబ్బందికి శిక్షణనిచ్చే పనిలో ఉన్న వీరు ఇజ్రాయెల్ తరఫున గూఢచర్యం చేస్తున్నారన్న ఆరోపణతో 2022లో అరెస్టుకావడంతో వారు ప్రాణాలతో బయటపడతారా, కనీసం జైలుశిక్షకు పరిమితమైనా అవుతారా? అన్న అనుమానాలు అందరినీ వెంటాడాయి. న్యాయస్థానాల్లో పోరాటాలనుంచి, దౌత్యయత్నాల వరకూ ప్రతీ అడుగూ జాగ్రత్తగా వేస్తూ మృత్యుముఖంలోకి వెళ్ళిన వీరందరినీ నిక్షేపంగా ఒడ్డునపడేసిన మన ప్రభుత్వాన్ని కచ్చితంగా అభినందించాల్సిందే.


గూఢచర్యం ఆరోపణ కనుక వారికి మరణశిక్షపడింది, ఆ తరువాత రెండుదశల న్యాయపోరాటాలతో మరణశిక్ష తప్పి, చివరకు యావజ్జీవం మిగిలింది. అప్పీల్స్ కోర్టు శిక్షను మార్చింది తప్ప, నిర్దోషులని ప్రకటించ లేదు. ఆ తరువాత ఏమైనా న్యాయప్రక్రియలు కొనసాగాయో లేదో తెలియదు కానీ, మరోపక్క వారి విడుదల కోసం సాగిస్తున్న దౌత్యయత్నాలు తీవ్రమైనాయి. బహుశా ఈ కేసు దృష్టితోనే గత ఏడాది అక్కడి భారత రాయబారిని కూడా మన ప్రభుత్వం మార్చివుంటుంది. వీరిని కాపాడుకోవడమే ఏకైక ఎజెండాగా ఏడాదికాలంగా భారత విదేశాంగశాఖ అదే పనిగా కృషిచేస్తుంటే, జాతీయ భద్రతాసలహాదారు తన పరిచయాలను, శక్తియుక్తులను వాడుతూంటే, డిసెంబరులో కాప్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఖతార్ అమీర్‌తో భేటీ అయిన ఘట్టం కూడా సాయపడి ఎట్టకేలకు వీరికి విముక్తి లభించింది. వారు దేశంలో కాలూనిన మర్నాడే ఖతార్‌లో భారత ప్రధాని పర్యటించబోతున్నట్టుగా మన విదేశాంగశాఖ ప్రకటన వెలువడింది. అరబ్ ఎమిరేట్స్ పర్యటన, ఆలయ ఆరంభం మాత్రమే అప్పటివరకూ ప్రధాని కార్యక్రమాల్లో ఉండగా, ఆఖరు నిముషంలో ఖతార్‌ను కూడా చేర్చి, ఆ దేశం ఎమీర్‌కు వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలియచేయాలని మోదీ అనుకొని ఉండవచ్చు.

ఈ వ్యవహారంలో మన విదేశాంగశాఖ కృషి, మోదీ వ్యక్తిగతంగా చేసిన ప్రయత్నాలు విశేషమైనవి. ఖతార్‌తో దశాబ్దాలుగా ఉన్న ఆర్థిక, వ్యాపార బంధం తెలిసిందే. గతంలో మిగతా అరబ్‌దేశాలు దానిని బాయ్‌కాట్ చేసినప్పుడు కూడా భారతదేశం అండగా నిలబడింది. ఎనిమిదిలక్షల మంది భారతీయులు అక్కడ నిర్భయంగా పనిచేసుకుంటూ, స్వదేశానికి పెద్ద ఎత్తున డబ్బు పంపగలుగుతున్నారు. వేలాది భారతీయ కంపెనీలు అక్కడ పనిచేస్తున్నాయి. ఏటా పదహారు బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం సాగుతోంది. అప్పుడప్పుడు కొన్ని పొరపొచ్చాలు వచ్చినా, ఖతార్‌తో సంబంధాలు ఎన్నడూ ఘర్షణ పడాల్సిన స్థాయికి చేరలేదు. ఈ కారణంగానే, ఈ ఎనిమిది అధికారుల విషయంలో అన్యాయం జరిగిందని అనిపించినప్పటికీ అంతర్జాతీయ జోక్యాన్ని భారత్ కోరుకోలేదు, ఖతార్‌మీద మాటలతో విరుచుకుపడలేదు. పశ్చిమాసియాలోని ఈ విశ్వసనీయమైన మిత్రదేశంతో సున్నితంగా వ్యవహరిస్తూ అనుకున్నది అంతిమంగా సాధించింది. ఖతార్‌లోని అన్ని రంగాల్లోనూ భారతీయులు విస్తరించి ఉండటం, ముఖ్యంగా అక్కడి సైనికరంగంలో మనవారు అధికంగా ఉండటం పాకిస్థాన్ సహించలేకపోతున్నదని, మన అధికారులను గూఢచర్యం కేసులో ఇరికించడంలో దాని పాత్ర ఉండవచ్చునని కొందరి అనుమానం.

భారతదేశం దిగుమతిచేసుకొనే ద్రవీకృత సహజవాయువు (ఎల్ఎన్‌జీ)లో నలభైశాతం ఖతార్ నుంచే అందుతున్నది. 1999లో ఉభయదేశాల మధ్యా గ్యాస్ సరఫరాకు సంబంధించి కుదుర్చుకున్న ఒప్పందం 2028తో ముగిసిపోతుంది. ఐదేళ్లముందుగానే ఆ ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవాల్సి ఉండగా, ఆ గడువు కూడా గత ఏడాది డిసెంబరుతో పూర్తయింది. ఈ విషయంలో ఎంతో ముందునుంచే ఖతార్ మనవెంటపడుతోంది. ఎట్టకేలకు, వారంక్రితమే, 2048వరకూ అమలులో ఉండే 78 బిలియన్ డాలర్ల విలువైన అతిపెద్ద గ్యాస్ ఒప్పందం ఉభయదేశాల మధ్యా కుదిరిన నేపథ్యంలో, ఈ ఒప్పందానికీ అధికారుల విడుదలకూ మధ్య ఏమైనా సంబంధం ఉన్నదా? అన్న అనుమానాలు, చర్చలు జరగడం సహజం. తెరవెనుక వ్యవహారాలు తెలియడం కష్టం కానీ, మనవారు క్షేమంగా వెనక్కువచ్చినందుకు మాత్రం సంతోషించాల్సిందే.

అటు ఆ రాముడూ ఇటు ఆత్మారాముడూ

శ్రీరామచంద్రుడి ఆహారంలో ఏ ఏ పదార్థాలుండేవి అన్న చర్చ ఆ మధ్య జరిగింది. అదే విషయం మీద అదేదో సినిమాను ఒక ఓటీటీ వేదిక వెనక్కి తీసుకుంది కూడా. ఆ కాలంలో రాముడు తాను పుట్టిన దేశంలో వంశంలో కులంలో ఏమి ఆహారం తినే ఆనవాయితీ ఉండేదో అదే తిని ఉంటాడు. కావాలంటే, వాల్మీకి రామాయణాన్ని సంస్కృతంలో చదువుకుని లేదా పుల్లెల శ్రీరామచంద్రుడు వంటి విద్వాంసుడి అనువాదాలు చదువుకుని తెలుసుకుంటే సరిపోతుంది. శ్రీరాముడు దేవుని అవతారమే తప్ప తానే దేవుడు కాదు కదా? ధర్మానికి ఏదో గ్లాని కలిగిందని మానవజన్మ ఎత్తి భూలోకం మీదికి వచ్చాడు. మనిషి పుట్టుక ఎత్తినందుకు, ఆహారనిద్రలు కష్టసుఖాలు వివాహసంతానాలు అన్నీ తప్పవు. మనలాగే జీవించి, మనలాగే బాధలూ బాదరబందీలూ అనుభవించాడు కాబట్టి, రాముడు మనసుకు దగ్గరగా అనిపిస్తాడేమో? కించిత్ కష్టానికి కూడా రామా అనుకుంటాం, అపచారం జరిగితే హేరామ్ అంటాం. తెగదెంపులు చేసుకోవాలంటే రాంరాం అనేస్తాం. రాముడెంతగా మన సంస్కృతిలో భాగమయ్యాడంటే, ఎంత రంగనాయకమ్మ అయితే మాత్రం రామరామ అనుకోరా? అని శ్రీరమణ గారు చమత్కరించారు!



> రాముడు ఆలయాల్లోనే కాదు, అందరిలోనూ ఉన్నాడని ఆధ్యాత్మికవాదులే చెబుతుంటారు. చరాచర ప్రకృతిలో, సమస్త జీవరాశిలో దైవం ఉనికిని గుర్తించడమే గొప్ప తాత్వికత అని నమ్ముతారు. మనుగడ పోరాటం చేస్తూనే, దైవాన్ని ధ్యానించుకోవాలని తుకారాం, కబీర్ వంటి వారు బోధించారు. ప్రజలు తమ జీవనపోరాటం చేయవలసిందే, అధిక ధరల మీద, అవినీతి మీద, విద్వేష వాతావరణం మీద, నిరుద్యోగం మీద, ఆర్థిక అంతరాల మీద పోరాడవలసిందే. మరో మార్గం లేదు. తన నామాన్ని జపించుకుంటూ కర్తవ్యాన్ని విస్మరిస్తే రాముడు సంతోషించడని భక్తులకు తెలుసు. గాలిలో దీపం పెట్టి దేవుడా అంటే లాభం లేదని పెద్దలే చెబుతారు. ఆత్మారాముడి ఆకలి తీర్చకపోతే, రాముడి ఆకలి మాత్రం ఎట్లా తీరుతుంది?

ఆకలేసినప్పుడు ఆత్మారాముడు అల్లాడిపోతున్నాడంటాము. అంటే మనలోపల ఉన్నది రాముడేనని అర్థం. ఆయనను పస్తు పెట్టకూడదు కదా? త్యాగరాజులూ రామదాసులు కూడా రాముడిని పాడుకుంటూ అన్నంలో కూడా రాముడిని చూసుకున్నారు కానీ, ఉపవాసాలు ఉండలేదు. తనకు మాలిన ధర్మం ఉండదన్నట్టే, దైవం కూడా ఉండదు. అన్నానికీ రాముడికీ మధ్య పోటీ రాకూడదు! ఆత్మారాముడికీ రాముడికీ పంతం వస్తే, రెండువైపులా రాములే కదా? ఎవరు గెలవాలి?

రాముడిని అడ్డం పెట్టుకుని ఈ ఏడాది ఎన్నికలను అమోఘంగా, అమేయంగా గెలిచేయాలని నరేంద్రమోదీ ఆయన పరివారం అనుకుంటున్నారు. బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కలిగించిన భక్తిపారవశ్యాలు దేశప్రజలలో సజీవంగా ఉన్నాయని, పోలింగ్ దాకా పదిలంగా ఉంటాయని నమ్ముతున్నారు. శతాబ్దాల ఆరాటం ఫలించిన శుభ తరుణం అనీ, కూలిన ఆత్మాభిమాన కేతనం తిరిగి రెపరెపలాడుతోందని చెప్పుకుంటున్న మాటలు రాజకీయ ఎంపికను తిరుగులేకుండా ప్రభావితం చేస్తాయని ఆశిస్తున్నారు. వాళ్లు అనుకోవడమే కాదు, మీడియా కూడా అదే వాస్తవాన్ని మోదీ ఇంటి కోడై కూస్తోంది. జట్టు కట్టలేని బలహీనతతో తమంతట తామే ఓటమిభావనలోకి కుంగిపోతున్న ప్రతిపక్షం కూడా మూడోసారి మోదీ విజయాన్ని ముందస్తుగానే అంగీకరిస్తున్నట్టు కనిపిస్తున్నది. మోదీ బృందానికి ఇప్పుడు కావలసినది కేవల విజయం కాదు, ఘనాతి ఘన విజయం! దేన్నైనా తిరగరాయగల, దేన్నైనా నిర్వచించగల, వెయ్యేళ్ల భవితవ్యాన్ని శాసించగల తిరుగులేని విజయం!

మరి రాముడు అందుకు సహకరిస్తాడా? అంతగా సహకరిస్తాడా? తనకొక ఆలయం నిర్మించినందుకు కొంత ప్రసన్నత కలిగి ఉండవచ్చును కానీ, అంతకు మించిన విచక్షణ ఆ రామచంద్రప్రభువుకు ఉంటుంది కదా? ఎదుటి పక్షంలో రావణాసురుడు నిలబడి సవాల్ విసురుతుంటే, బహుశా, బాలరాముని కరుణాకటాక్షం మోదీ పైనే ప్రసరించే అవకాశం ఉండవచ్చు. కానీ, అవతలి పక్షంలో అశేషప్రజానీకంలోని 'ఆత్మారాముడు' నిలబడితే, శ్రీరాముడికి పెద్ద సంకటమే వచ్చి పడుతుంది. ఇప్పుడటువంటి క్లిష్టపరిస్థితి ఏదో వచ్చిపడుతున్నట్టుంది. అసలుకే మోసం రాకపోయినా, 400 సంఖ్యచుట్టూ పెట్టుకున్న ఆశలకు గండి పడే ప్రమాదం కనిపిస్తోంది.



■ కె. శ్రీనివాస్

సందర్భం

కొంతమంది కేంద్రమంత్రులు ఆ మాట అననే అన్నారు. దేశప్రజలు రామభక్తి తాదాత్మ్యంలో ఓలలాడుతుంటే, వారి దృష్టి మళ్లించడానికి ప్రతిపక్షం ఏవేవో వివాదాలు తెస్తోందని. ఉత్తరం–దక్షిణం తగాదా గురించి ఆ మాట వచ్చింది. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో రాష్ట్రాలు ఇచ్చే పన్ను ఆదాయం, రాష్ట్రాలకు దక్కే కేంద్ర కేటాయింపుల గురించిన ప్రస్తావన వచ్చింది. 'ఇట్లాగైతే కష్టం మరి, దక్షిణాది వాళ్లం ఆలోచించుకోవలసి వస్తుంది' అని కర్ణాటక కు చెందిన ఒక నాయకుడు అన్నాడు. తరువాత, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏకంగా ఢిల్లీలో ధర్నా చేశాడు. ఆయనకు కేరళ నుంచి, తమిళనాడు నుంచి మద్దతు వచ్చింది. ఇండియా కూటమిలోని ముఖ్యమంత్రులందరూ ఢిల్లీకి వెళ్లడమో, మద్దతు చెప్పడమో చేశారు. 400 గమ్యం చేరాలంటే దక్షిణ దిక్కున కూడా కొన్ని విజయాలు కావాలి. ఈ వివాదం వాతావరణాన్ని దారి మళ్లిస్తోందని బీజేపీకి అనిపించింది. అనిపిస్తే, దాన్ని విస్మరించి అప్రధానం చేయాలి కదా, లేదు, ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి దీనికి జవాబు ఇచ్చే క్రమంలో మరింత ప్రాధాన్యం సమకూర్చారు!

ఈ ఉత్తర, దక్షిణ చర్చ ఏదో సాధిస్తుందని కాదు కానీ, రామాలయ వాతావరణంలో కూడా దక్షిణాది ఎడంగా, పెడగా ఉండడమే మోదీ ప్రభుత్వానికి జీర్ణం కావడం లేదు. దేశంలో ఈ వైవిధ్యం ఏమిటి? ఇంకా ప్రశ్నలు మిగిలి ఉండడమేమిటి? కేంద్రాన్ని పట్టుకుని లెక్కలూ పత్రాలూ అడగడమేమిటి? ఈ పరిస్థితి కొనసాగకూడదని ఉన్నది కానీ, 400 లక్ష్యం చేరితే తప్పితే ఇటువంటి 'అరాచకాలు' సరిదిద్దడం కూడా సాధ్యం కాదు మరి!

బడ్జెట్ సమావేశాలు కాగానే, అవసరమైన రాచకార్యాలూ తీసుకోవలసిన కీలకనిర్ణయాలూ తీసుకుని ఎన్నికల షెడ్యూలు ప్రకటించవచ్చుననుకుంటే, ఇప్పుడీ ఢిల్లీ ముట్టడి ముప్పు వచ్చి పడింది. ఈ వారం పదిరోజుల్లో ఎన్నికల తేదీల ప్రకటన వచ్చాక, రాజకీయ ప్రచార కార్యక్రమాల షెడ్యూలు ఒకటి, ఆధ్యాత్మిక కార్యక్రమాల షెడ్యూలు ఒకటి, విడివిడిగా రంగంలోకి దిగుతాయి. శోభాయాత్రల సందడి ఎన్నికల హడావిడికి సమీపంగా ఉంటే బాగుంటుందన్న ఆకాంక్షలూ ఉంటాయి. భక్తి వాతావరణం నుంచి రాజకీయ లాభం పిండుకోవాలని ఆశిస్తుంటే, ఏమిటి ఈ పంజాబ్ హర్యానా రైతులు మద్దతు ధర అంటూ వార్తావరణాన్ని అంతటినీ ఆక్రమిస్తున్నారు?

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చడమే అంటూ మార్కెట్ వాదులు సిద్ధాంతాలు చేస్తున్నారు. ఆ డిమాండ్ ఆమోదించే ప్రసక్తే లేదని కేంద్రప్రభుత్వం తేల్చిచెప్పింది. కానీ, వ్యవసాయోత్పత్తుల ధరలు ఏ ప్రాతిపదికన నిర్ణయించాలో సిఫారసు చేసిన స్వామినాథన్‌కు, మద్దతు ధర కోసం ఉద్యమించి స్వయంగా రైతు నాయకుడైన చరణ్ సింగ్‌కు ఈ ప్రభుత్వమే భారతరత్న ప్రకటించింది! ప్రభుత్వం మీద ఒత్తిడి పెట్టడమెలాగో తెలియడమే కాదు, దీర్ఘకాలం నిర్బంధాన్ని సహించగలిగిన సత్తా కూడా కలిగిన రైతాంగం ఇప్పుడు దేశరాజధానిలో మోహరించింది. వారు ఎంతవరకు విజయం సాధిస్తారో తెలియదు కానీ, ఇప్పుడు మాత్రం మోదీ పరివారం కోరుకున్న ఉద్వేగాల వ్యాప్తిని నిరోధించే ప్రయత్నం చేస్తున్నారు.

పరిస్థితి చేతిలో లేకుండా పోయిందని, జనహృదయాలను ఆవరించడంలో మోదీ విజయవంతమయ్యారని బాధపడడం మానేసి, ప్రతిపక్షాలు ప్రజల వాస్తవ సమస్యలను మళ్లీ రంగం మీదికి తేవడానికి తమవంతు ప్రయత్నం చేయడం మంచిది. మహాబలశాలి అయిన ప్రత్యర్థిని నిలువరించడానికి చిన్నదో పెద్దదో ఏదో చేయలేకపోతే, పిల్లిలో ఎలుక ఐక్యం అయిపోయినట్టు, అధికారప్రవంతిలో కలిసిపోవడం మంచిది. ప్రజల ధ్యాసను తమవైపే నిలుపుకోవడానికి వివిధ పక్షాలు ప్రయత్నించడం

> ప్రభుత్వం మీద ఒత్తిడి పెట్టడమెలాగో తెలియడమే కాదు, దీర్ఘకాలం నిర్బంధాన్ని సహించగలిగిన సత్తా కూడా కలిగిన రైతాంగం ఇప్పుడు దేశ రాజధానిలో మోహరించింది. వారు ఎంతవరకు విజయం సాధిస్తారో తెలియదు కానీ, ఇప్పుడు మాత్రం మోదీ పరివారం కోరుకున్న ఉద్వేగాల వ్యాప్తిని నిరోధించే ప్రయత్నం చేస్తున్నారు.

సహజం. అన్నిరకాల శక్తియుక్తులూ హంగులూ కలిగిన పక్షం, ఆ ప్రయత్నం విజయవంతంగానూ, విస్తృతంగానూ చేయగలదు. అలాగని, ప్రజలు ఎప్పుడూ తమ ఆలోచనల మీద, మనోభావాల మీద అదుపు లేకుండా ఉంటారని అనుకోవడం కూడా పొరపాటు. అతి పెద్ద కృత్రిమ సంరంభం నుంచి కూడా ఆకులు అల్లాడిన సవ్వడి వైపు వారు దృష్టి మళ్లించుకోగలరు. కాకపోతే, అందుకు మానవప్రయత్నం కావాలి. దేవుడిని తమ పార్టీలో చేర్చుకున్నామని గర్విస్తున్నవాళ్లు కూడా, చేసింది మానవప్రయత్నమే.

రాముడు ఆలయాల్లోనే కాదు, అందరిలోనూ ఉన్నాడని ఆధ్యాత్మికవాదులే చెబుతుంటారు. చరాచర ప్రకృతిలో, సమస్త జీవరాశిలో దైవం ఉనికిని గుర్తించడమే గొప్ప తాత్వికత అని నమ్ముతారు. మనుగడ పోరాటం చేస్తూనే, దైవాన్ని ధ్యానించుకోవాలని తుకారాం, కబీర్ వంటి వారు బోధించారు. ప్రజలు తమ జీవనపోరాటం చేయవలసిందే, అధిక ధరల మీద, అవినీతి మీద, విద్వేష వాతావరణం మీద, నిరుద్యోగం మీద, ఆర్థిక అంతరాల మీద పోరాడవలసిందే. మరో మార్గం లేదు. తన నామాన్ని జపించుకుంటూ కర్తవ్యాన్ని విస్మరిస్తే రాముడు సంతోషించడని భక్తులకు తెలుసు. గాలిలో దీపం పెట్టి దేవుడా అంటే లాభం లేదని పెద్దలే చెబుతారు. ఆత్మారాముడి ఆకలి తీర్చకపోతే, రాముడి ఆకలి మాత్రం ఎట్లా తీరుతుంది?

ఎవరి లబ్ధికోసం కులగణనపై దుష్ప్రచారం?

కులం అనేది పాశ్చాత్యుల సృష్టి అనే అభిప్రాయం ఈ మధ్య ప్రచారంలోకి వస్తున్నది. క్రైస్తవ మిషనరీలు, వలస పాలకులు భారతదేశాన్ని కులం అనే పట్టకం ద్వారా చూడాలని ప్రయత్నించారని, అలా దేశంలో కులం ప్రాముఖ్యతను సంతరించుకోవడానికి దోహదం చేశారని ఈ ప్రచారం చేసేవారి వాదన. మరి కులం దేశీయమైనది, స్థానికమైనది కాకపోతే, అది కేవలం పాశ్చాత్య వక్ర బుద్ధిపరుల దిగుమతి మాత్రమే అయితే, మన భక్తి ఉద్యమ కాలంలో తాత్త్విక చింతనాపరులైన బసవేశ్వరుడు, గురు నానక్, యోగి వేమన, సంత్ కబీర్ దాస్, రవి దాస్, ధరం దాస్, సుందర్ దాస్ వంటి వారి బోధనల్లో, చర్యల్లో కులం ఎందుకు కీలక స్థానంలో ఉంది? ఈ చింతనాపరులు ఎవ్వరూ పాశ్చాత్య ప్రభావంలో లేరు. వీరు కుల నిర్మూలనతో మాత్రమే సాధ్యమయ్యే మానవీయ సమాజాన్ని, కులాతీత ఆధ్యాత్మిక జ్ఞానోదయం పొందే జీవనాన్ని గురించిన జ్ఞానాన్ని అందించారు. కులం వీరి ఊహా శక్తి ద్వారానో, లేదా వారిపై గల పాశ్చాత్య వికృత ప్రభావంతోనో ఉత్పన్నమైనదని చెప్పటం పరిహాసాస్పదమే!

అయితే మన సామాజిక, రాజకీయ ఆలోచనల్లోనూ, జీవితంలోనూ బ్రిటీష్ వలస విధానాల ప్రభావం కొంతవరకు ఉంది అన్నది వాస్తవం. ఉదాహరణకు జనాభా గణన వంటి పాలన సాధనాల ద్వారా వలస పాలకులు కులాలకు సంఖ్యాత్మక పరిమాణాన్ని అందించారు. అది లేకున్నట్టయితే కులం అస్పష్టంగా, స్థానికంగా విడగొట్టబడి ఉండేది. ఈ గణనతో కులం కొత్త అవతారాన్ని, గతిశీలతను పొందింది. అంతే కానీ, కులం కుట్రపూరిత పాశ్చాత్య లేదా పాశ్చాత్య దేశాల ఎగుమతి చేయబడినదిగా భావించడం భావ దారిద్ర్యానికి ఒక చిహ్నం. ఇది మనువు ఒక్కడే కులాన్ని సృష్టించాడు అనే కల్పన లాంటిది! కులం ఆధునిక యుగం పూర్వపు దేశీయ చారిత్రక వాస్తవికత నుంచి వలస పాలన కాలం మీదుగా ఆకృతిని, గతిని పొందుతూ వస్తున్నది.



> సమాచారం శక్తిగా మారిన నేటి సమకాలీన సమాజంలో కుల సమాచారంపై కొందరికే నియంత్రణ ఉండడం ప్రమాదం. సమగ్ర అధికారిక కుల గణన దేశ, రాష్ట్రాల విధానాల రూపకల్పనలో పారదర్శకతను నెలకొల్పుతుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా వాస్తవికమైన, ప్రజాస్వామికమైన నిర్ణయాలు తీసుకోవటాన్ని సుసాధ్యం చేస్తుంది.

భారతీయ సమాజం, దాని ఉత్పత్తి వ్యవస్థ నిర్దిష్టతగా కులాన్ని పరిగణించడం కేవలం మార్క్సిస్ట్ పాండిత్యానికే పరిమితం కాదు. కుల వ్యవస్థలోని అంతర్గత మార్పులు, పరిణామాలు, ఉత్పాదక సంబంధ అంశాలను దృష్టిలోకి తెచ్చిన అనుభవపూర్వక వివరణలు, సిద్ధాంత పరంగా విస్తృతమైన, విభిన్నమైన అధునాతన పాండిత్యం ఎన్నో వైపుల నుంచి సమకూరింది. ఈ పాండిత్యం అన్ని రకాల దృక్పథాలలో– పరిణామ వాదం, సంఘర్షణ సిద్ధాంతాలు (conflict studies), నిర్మాణ వాదం (structuralism), కార్యాచరణ వాదం (functionalism), క్రియాత్మక వాదం (phenomenology), గాంధేయ వాదం, లోహియా వాదం, మరీ స్పష్టంగా అంబేడ్కర్ వాదాలలో ఆవరించి ఉన్నందున, దీనిని కేవలం మార్క్సిస్ట్ సిద్ధాంతంలో భాగంగానే ఊహించి ఆ ముద్ర వేయడం అవగాహనా రాహిత్యమే.

కులం భారతీయ సామాజిక చరిత్రలో భాగం అని, ఆర్థిక, విద్య సాంస్కృతిక రంగాల్లో, ముఖ్యంగా రాజకీయాలు, ఇతర రంగాలలో సర్వ వ్యాప్త ఉనికిని, ప్రభావాన్ని కలిగి ఉన్నదని అందరికీ తెలుసు. అలాంటప్పుడు కుల గణన అందించే బహుముఖమైన, విస్తృతమైన, క్రమబద్ధమైన సమాచారం పట్ల ఎందుకంత వ్యతిరేకత? కుల గణన ద్వారా వెల్లడయ్యే సమాచారం, దాని వ్యాప్తి ద్వారా దేశ సమగ్రతకు ముప్పు ఉన్నదనే తప్పుడు వాదనలు ఎందుకు సృష్టిస్తున్నారు?

రాజ్యాంగ నిబంధనలు, రాజకీయాల అవసరాల కారణంగా కొంత మార్పు వచ్చినప్పటికీ, భారతదేశంలో ఇంకా కులం ఒక హక్కుల, అర్హతల నిర్మాణంగా కొనసాగుతూ వస్తున్నది. మన పరిపాలన, రాజకీయ వ్యవస్థలను గమనిస్తే ఇప్పటికీ ఇవి కొన్ని సవర్ణ కులాలతో గాఢంగా అలుముకుని ఉన్నాయి. వ్యాపార రంగంలో కూడా కొన్ని కులాల అధిపత్యమే కొనసాగుతున్నది. ఇక మన విద్యా వ్యవస్థల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. రిజర్వేషన్ల సదుపాయం ఉన్నప్పటికీ మన సంస్థాగత వ్యవస్థ కులతత్వంలో మగ్గుతున్నది. ఈ సంస్థలలో కింది కులాల అణచివేత కొనసాగుతున్నది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు, రాజకీయాలు, నిర్దిష్ట ప్రాంతాలలో ఆధిపత్య వ్యవసాయ కులాల ఆధ్వర్యంలోనే ఉన్నాయి.

మన రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపిక, రాజకీయ ప్రచార వ్యూహాలు అన్నీ కులాల ఆధారంగా చేస్తున్నారనే వాస్తవాన్ని గుర్తించకపోవడం ఆత్మవంచన. స్థానిక, వివరణాత్మక సమాచారం లేకుండా ఇదంతా సాధ్యమా? రాజకీయ, ఆర్థిక లాభాల కోసం అధికారిక వనరుల సాయంతో స్థానికంగా సేకరించబడిన కులాల అనధికారిక సమాచారం ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీల దగ్గర, వివిధ ప్రైవేటు సంస్థల దగ్గర ఉన్నది. ప్రతి ఎన్నికల సందర్భంలోనూ సర్వేల ద్వారా ఇది మళ్ళీ మళ్ళీ నిరూపణ అవుతున్నది. అయినా, కులాల గణాంక సమాచారం ఎవరి దగ్గరా లేదు అనటం కపట నాటకమే! సమగ్ర అధికారిక కుల గణన దేశ, రాష్ట్రాల విధానాల రూపకల్పనలో పారదర్శకతను నెలకొల్పుతుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా వాస్తవికమైన, ప్రజాస్వామికమైన నిర్ణయాలు తీసుకోవటాన్ని సుసాధ్యం చేస్తుంది.

సమాచారం శక్తిగా మారిన నేటి సమకాలీన సమాజంలో కుల సమాచారంపై కొందరికే నియంత్రణ ఉండడం ప్రమాదం. దేశంలో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలకు, అన్యాయాలకు కుల గణన ఒక అడ్డుకట్ట వేయగలదు. కుల గణన అధికార వ్యవస్థ ముందు చట్టబద్ధమైన, హేతుబద్ధమైన, డేటా ఆధారిత సవాళ్లను ఉంచుతుంది.

కుల గణన కుల విభజనకు దారి తీస్తుందని, జాతి సంఘీభావానికి గొడ్డలిపెట్టు అని వస్తున్న ఆరోపణలు నిరాధారమైనవి. ఆచరణలో కుల గణన సమాచారం కుల వ్యవస్థను బలహీనపరచగలదు. కులం పునాదులపై జాతిని నిర్మించలేమన్న బాబా సాహెబ్ అంబేడ్కర్ హెచ్చరికను గుర్తుంచుకోండి. జాతీయ గౌరవం, జాతీయ సమగ్రత కుల నిర్మూలనతోనే సాధ్యం. ఇంత ముఖ్యమైన కుల గణనకు, అది తెరిచే సవాళ్ల వరద గేట్లకు బెదురుతున్నది ఎవరు? ఎందుకు? దీని జవాబు కోసం గొప్ప మేధో మథనం అవసరం లేదు. సమాధానం సుస్పష్టమే!

• శ్రీనివాసులు కర్లి
• చెన్న బసవయ్య మఠపతి
విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం

పేదల వైద్యానికి ఇదేనా ప్రాధాన్యం?

ప్రభుత్వాలు తాము ఎంపిక చేసుకున్న రంగాలకి కాస్త ఎక్కువ ప్రాధాన్యతనిస్తాయి. దానికి తగ్గట్టుగానే బడ్జెట్‌నూ కేటాయిస్తాయి. ఉదాహరణకు గత ప్రభుత్వం, రాష్ట్రంలో జల సంరక్షణ, గ్రామీణ పారిశుద్ధ్యం వంటి అంశాలను తీసుకొని వాటిపై ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు రూపొందించింది. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించింది. ఏ ప్రభుత్వాలు ఏయే రంగాలని ప్రాధాన్యతాంశాలుగా తీసుకున్నా... విద్య, ఆరోగ్యం వంటివి ఏ ప్రభుత్వానికైనా నిత్య ప్రాధాన్యతాంశాలుగా ఉండాల్సిందే. ఇప్పుడున్న ప్రభుత్వం మాత్రం అన్నిటికంటే బటన్ నొక్కి సంక్షేమ కార్యక్రమాల పేరిట కోట్లాది రూపాయల పంపిణీకి మొదటి ప్రాధాన్యత నిస్తోంది. ఇక రెండో ప్రాధాన్యతాంశంగా సచివాలయాల స్థాయిలో నిర్మించాల్సిన భవనాలు కనిపిస్తున్నాయి. అయితే, అందరికీ అవసరమైన ఆరోగ్య రంగం పట్ల నిర్లక్ష్యం వహిస్తోంది.



ముఖ్యంగా పేదల ఆరోగ్యానికి అండగా ఉంటున్న ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రాధాన్యతాంశంగా తీసుకోకపోవడంతో రాష్ట్రంలోని పేదలు, సామాన్య రోగులు వైద్యం కోసం ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించింది. పేదల ఆరోగ్యానికి పెద్ద దిక్కుగా ఉన్న ప్రభుత్వాసుపత్రులు సౌకర్యాలు, తగినంత మంది వైద్యులు, సిబ్బంది లేక ఇప్పటికే మంచాన పడిపోగా, ఇక కార్పొరేట్ ఆసుపత్రుల్లో పేదలకు అందుతున్న ఆరోగ్యశ్రీ కూడా సకాలంలో నిధులు ఇవ్వని ప్రభుత్వ వైఖరి కారణంగా అంపశయ్యకి చేరిపోయింది.

ఆసరా, చేయూత, సున్నా వడ్డీ, పెన్షన్ కానుక, సంపూర్ణ పోషణ, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, అమ్మ ఒడి, విద్యా కానుక, నవశకం, లా నేస్తం, మత్స్యకార భరోసా, నేతన్న నేస్తం, వాహన మిత్ర, రైతు భరోసా, నవోదయం, పెళ్లి కానుక వంటి రకరకాల పేర్లతో లక్షల కోట్లు ముఖ్యమంత్రి పంచి పెడుతున్నారు. కానీ కేవలం 1200 కోట్ల పెండింగ్ కారణంగా, పేదల ఆరోగ్యం కోసం ఆయన తండ్రి హయాంలో ప్రారంభమైన ఆరోగ్యశ్రీని నిర్లక్ష్యం చేయడం సమర్థనీయం కాదు. ఈ పెండింగ్‌ల కారణంగా 3000 రోగాలకు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో పేదలకు అందాల్సిన చికిత్సలు అందడం లేదు. చికిత్సల కంటే ముందు జరగాల్సిన కేస్ షీట్ల పరిశీలనకు సైతం నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సరిపడా వైద్యులు లేరు. నవంబరు నుంచి 57,479 ఆప్తాల్మాలజీ, 3,029 కార్డియాలజీ, కార్డియోథొరాసిస్ కేస్ షీట్లు పరిశీలన స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి. ఇందుకు సుమారు 60 మంది నిపుణులైన వైద్యులు అవసరం కాగా, కేవలం 31 మంది మాత్రమే ఉన్నట్టు తెలుస్తోంది. ఒకవైపు వైద్యనిపుణుల కొరత, మరోవైపు నిధుల విడుదల చేయకపోవడం ఆసుపత్రుల యాజమాన్యాలకు తల నొప్పిగా మారింది. ఈ పరిస్థితుల్లో పేదల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని రాష్ట్ర ప్రజలు ఏ విధంగా అర్థం చేసుకోవాలి.

ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల విమర్శల పట్ల అనుచితంగా ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వం, ఇతరుల సలహాలు పెడచెవిన పెడుతున్నా, కనీసం ఆత్మ విమర్శకైనా సిద్ధం కావాలి. ఆరోగ్యశ్రీ నిబంధనల ప్రకారం శస్త్రచికిత్స జరిగిన 60 రోజుల్లో సంబంధిత క్లెయిములు ఆసుపత్రులకు చెల్లించాలి. అయితే నెలలు గడుస్తున్నా చెల్లింపులు చేయడం లేదు. బకాయిలు పేరుకు పోవడం వల్ల ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద రోగుల్ని చేర్చుకోవడం లేదు. ఏ నాయకుడో ఫోన్ చేస్తే, కనీసం సగం మొత్తం చెల్లిస్తేనే దవాఖాన గేట్లు తెరుస్తున్నారు. శస్త్రచికిత్సలకయ్యే మొత్తంలో సగం కూడా చెల్లించలేని సామాన్యుల పరిస్థితి ఆ సమయంలో దారుణంగా ఉంటోంది.

బకాయిలు, వైద్యనిపుణుల మాట అటుంచితే, ప్యాకేజీల మొత్తాలు చాలవని నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు ఎప్పటినుంచో గోల పెడుతున్నాయి. ఆయుష్మాన్ భారత్ కింద దేశవ్యాప్తంగా చెల్లిస్తున్న ప్యాకేజీలతో పోలిస్తే, మన రాష్ట్రంలో చెల్లిస్తున్న మొత్తాలు తక్కువగా ఉంటున్నాయని యాజమాన్యాలు అంటున్నాయి. ఇప్పటివరకూ కార్పొరేట్ ఆసుపత్రులకు చెల్లించాల్సిన దాదాపు వెయ్యి కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో, నెట్‌వర్క్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ పేరు చెప్పగానే రోగుల్ని చేర్చుకోడానికి ముందుకు రావడం లేదు. ఇకపోతే, బకాయిలు చెల్లించక, మరోవైపు ప్యాకేజీల మొత్తం పెంచాలన్న నెట్‌వర్క్ ఆసుపత్రుల డిమాండ్లను పట్టించుకోని ప్రభుత్వం, ఎవరూ అడక్కపోయినా ఆరోగ్యశ్రీ పరిమితిని 25 లక్షలకు పెంచడం కొసమెరుపు.

○ డొంకాడ గోపాల్



తెలుగు ఠీవి... మన పీవీ..!

తెలుగువాడు తెలివైనవాడు
పాములపర్తి పరిపాలనా దీప్తి
తెలుగు తేజమున్న నిలువెత్తున్న ధ్వజం
పలు భాషలను పలికే బహుముఖ మేధావి
నరసింహారావు పీవీ తెలుగువారి రాచ ఠీవి
దేశవిదేశాలలో వెదజల్లిన విఖ్యాతి నెత్తావి
నాడు తెలుగు ముత్యం.. నేడు భారత రత్నం..!

కాంగ్రెస్ పార్టీకి కారణ జన్ముడు
ఇందిరమ్మకు వీర విధేయుడు
కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీని
పటిష్టంగా నిలిపిన అపర చాణక్యుడు..!

ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రియై
భూసంస్కరణలు చేసిన అభ్యుదయవాది
కేంద్ర మంత్రిగా కీలక పదవులు చేసి
స్వదేశీ వ్యవహారాలను చక్కదిద్దిన దార్శనికుడు..!

కోరి వలచిన దేశ ప్రధాని పదవిని చేపట్టి
ఆర్థిక సంస్కరణలు అమలు చేసిన కౌటిల్యుడు

ఎన్డీయే పాలకులు కుదువపెట్టిన బంగారాన్ని
తెలివిగా విడిపించి తెచ్చిన బుద్ధిమంతుడు
సంకీర్ణ ప్రభుత్వాన్ని సంపూర్ణ కాలం నడిపి
తెలుగువాడి సత్తాను ఎలుగెత్తి చాటిన
రాజనీతిజ్ఞుడు
దేశంలో ఎన్నో మణిరత్నాలు పడి వున్నా పీవీకీ
భారత రత్నం ఇవ్వటం
తెలుగువారందరికీ గర్వ కారణం!

– జి.సూర్యనారాయణ

సోరెన్‌కో న్యాయం, జగన్‌కో న్యాయమా?

చట్టం ముందు అందరూ సమానమే. కానీ చట్టం కొందరికి చుట్టంగా మారి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తోంది. జగన్‌రెడ్డి కేసులతో పోలిస్తే హేమంత్ సోరెన్ కేసులు చాలా చిన్నవి. ఆ కేసుల్లో సరైన ఆధారాలు కూడా లేవు. జగన్‌రెడ్డి కేసుల్లో చాలా ఆధారాలు ఉన్నాయి. భూకుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో నిందితుడు కావడంతో సోరెన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది. హేమంత్ సోరెన్‌కు ఒక న్యాయం, జగన్‌రెడ్డికి ఒక న్యాయమా? ఎంతటివారైనా అవినీతికి పాల్పడినప్పుడు అరెస్ట్ చేసి తీరాల్సిందే. సోరెన్‌పై కేవలం ఎనిమిది ఎకరాలు కబ్జా చేశారనే ఆరోపణలున్నాయి. జగన్‌రెడ్డి వేలాది ఎకరాలు దోచుకున్నారు. ఇద్దరికీ పోలిక ఎక్కడ? కానీ జగన్‌రెడ్డిని మాత్రం సీబీఐ, కేంద్ర ప్రభుత్వం వెనకేసుకొస్తున్నాయి. న్యాయస్థానాల్లో జరుగుతున్న జాప్యాన్ని చూసి న్యాయనిపుణులు ఆశ్చర్యపోతున్నారు.



> సోరెన్, జగన్ ఇద్దరూ ముఖ్యమంత్రులే. సోరెన్‌కు లేని వెసులుబాట్లు జగన్‌కు ఎందుకు ఇస్తున్నారు? సోరెన్ అవినీతి కనిపించినప్పుడు... జగన్ అవినీతి, అక్రమాలు ఎందుకు కనిపించడం లేదో సీబీఐ, ఈడీ సమాధానం చెప్పాలి. 10 ఏళ్లకు పైగా బెయిల్‌పై ఉండి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చరిత్రకెక్కారు. ఇంతటి ఘనకీర్తి ఉన్న వ్యక్తి కేసులు 3041 సార్లు వాయిదాపడటం ఏమిటని న్యాయనిపుణులు విస్తుపోతున్నారు.

అవినీతిపరులు ఎంతటి శక్తివంతులైనప్పటికీ సీబీఐ అధికారులు ఏ మాత్రం ఆలోచించకుండా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్రమోదీ గత ఏడాది సీబీఐ డైమండ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఉద్బోధించారు. కానీ ఆచరణ మాత్రం అందుకు భిన్నంగా ఉంది. సీబీఐ కేసుల్లో విచారణ జరుగుతున్న తీరు ఆ సంస్థపై ప్రజల్లో అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో మనీష్ సిసోడియా, మనీలాండరింగ్ కేసుల్లో సోరెన్‌లపై ఈడీ, సీబీఐ చాలా వేగంగా స్పందించి వెంటనే అరెస్ట్ చేసి విచారణ చేపట్టాయి.

వైఎస్ 2004లో ముఖ్యమంత్రి కాకముందు జగన్‌రెడ్డి ప్రకటించిన ఆస్తులు రూ.2.12 కోట్లు. 2009 నాటి ఎన్నికల అఫిడవిట్‌లో అవి రూ.77.40 కోట్లకు చేరాయి. ఐదేళ్లలో ఇన్ని ఆస్తులు ఏ విధంగా పెరిగాయి? అక్రమాస్తుల కేసుల్లో సీబీఐ 11, ఈడీ 6 ఛార్జిషీట్లు దాఖలు చేసింది. రూ.43వేల కోట్లు అవినీతి జరిగిందని సీబీఐ నిర్ధారించింది. ఇందుకు సంబంధించిన అన్ని ఆధారాలు సేకరించింది. 2012లో జగన్‌రెడ్డిని ఏ1గా, విజయసాయిరెడ్డిని ఏ2గా సీబీఐ తొలి ఛార్జిషీట్ దాఖలు చేసింది. వీటి ఆధారంగా 2016లో ఈడీ కూడా ఛార్జిషీట్ దాఖలు చేసింది. న్యాయస్థానాలు, సీబీఐ సైతం ఇంత తక్కువ వ్యవధిలో ఇన్నివేల కోట్లు ఎలా సంపాదించారని ఆశ్చర్యం వ్యక్తం చేశాయి. ఇంతటి తీవ్రమైన ఆర్థిక నేరాల్లో ఆధారాలు ఉన్నా, దశాబ్ద కాలం దాటినా న్యాయస్థానాల్లో ఎందుకు విచారణకు నోచుకోవడం లేదు? దేశంలో ఎవరికీ లేని విధంగా ఆయనకు మాత్రమే ఎందుకీ ఈ వెసులుబాటు కల్పించారు? గతంలో ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా జగన్‌రెడ్డి కోర్టుకు హాజరయ్యేవారు. దానికి కూడా మినహాయింపు వచ్చింది.

దేశంలోనే అతిపెద్ద అవినీతి కేసులను వాయిదాలపై వాయిదా వేస్తూ సాగదీస్తున్నారు. కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరిస్తూ సాకులు చెబుతూ తప్పించుకు తిరుగుతున్నా సీబీఐ, న్యాయస్థానాలు చోద్యం చూస్తున్నాయి. ప్రజాప్రతినిధుల కేసులో దర్యాప్తు జరుగుతున్న తీరును సుప్రీంకోర్టు గత ఏడాది తప్పుబట్టింది. ఆ కేసులను సత్వరమే విచారణ చేపట్టాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను జారీచేసి రెండేళ్లు దాటింది. కానీ ఇంతవరకు విచారణ చేపట్టలేదు. జగన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రసన్నం చేసుకుంటూ తప్పించుకు తిరుగుతున్నాడనే అనుమానాలు బలంగా ప్రజల్లో వినిపిస్తున్నాయి. నిర్మలా సీతారామన్ కూడా నరేంద్రమోదీకి జగన్‌రెడ్డి అంటే పుత్రవాత్సల్యం ఉందని చెప్పడం ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. సోరెన్ జార్ఖండ్‌కు ముఖ్యమంత్రి. జగన్ ఏపీకి ముఖ్యమంత్రి. సోరెన్‌కు లేని వెసులుబాట్లు ఇంత పెద్ద ఆర్థిక నేరస్థుడికి ఎందుకు ఇస్తున్నారు? ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ఏడాదికి పైగా జైలులోనే మగ్గుతున్నారు. జగన్‌రెడ్డి కనీసం కోర్టుకు కూడా హాజరుకావడం లేదు. ఆనాటి బీహార్ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్, హర్యానా ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ చౌతాలా, ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత, జార్ఖండ్ ముఖ్యమంత్రి మధుకోడా, యడ్యూరప్పలను అరెస్ట్ చేశారు. వారికి లేని మినహాయింపులు జగన్‌రెడ్డికి ఎందుకు?

10 ఏళ్లకు పైగా బెయిల్‌పై ఉండి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి చరిత్రకెక్కారు. ఇంతటి ఘనకీర్తి ఉన్న వ్యక్తి కేసులు 3041 సార్లు వాయిదా పడటం ఏమిటని న్యాయనిపుణులు విస్తుపోతున్నారు. ఈడీ, సీబీఐ జగన్ వైపు కన్నెత్తి చూడటానికి కూడా భయపడుతున్నాయి. సోరెన్ అవినీతి కనిపించినప్పుడు... జగన్ అవినీతి, అక్రమాలు ఎందుకు కనిపించడంలేదో సీబీఐ, ఈడీ సమాధానం చెప్పాలి. రాజకీయ, ఆర్థిక నేరస్థుల కబంధహస్తాల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి. కేసుల విచారణలో జాప్యం లేకుండా నిష్పక్షపాతంగా సీబీఐ దర్యాప్తు జరపాలి. ఎలాంటి ఒత్తిడులకు లొంగకుండా తమ స్వయంప్రతిపత్తిని నిలుపుకోవాలి. విచారణలో జాప్యం జరిగితే కేసులు నీరుగారే ప్రమాదం ఉంది. సాక్ష్యాలు తారుమారవుతాయి. తన అధికారాన్ని, సంపదను అడ్డుపెట్టుకుని ఇప్పుడు తప్పించుకున్నా, రేపు ప్రజాకోర్టులో దోషిగా నిలబెట్టి శిక్షించడానికి ప్రజలు సిద్ధమవుతున్నారు.

■ మన్నవ సుబ్బారావు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

గురువారం 15 ఫిబ్రవరి 2024



ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమ బాట పట్టారు. ఇచ్చిన హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వంపై పోరు విల్లు ఎక్కుపెట్టారు. ఏపీజేఏసీ పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల ఉద్యోగులు తొలిరోజు బుధవారం వేర్వేరు రూపాల్లో నిరసన తెలిపారు. ఏపీజేఏసీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ నేతృత్వంలో ఉద్యోగులు కలెక్టరేట్‌లో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. కొన్నిచోట్ల నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కొందరు భోజన విరామ సమయంలో నిరసన తెలపగా మరికొందరు కార్యాలయ ఉద్యోగులు బయటకు వచ్చి ధర్నా నిర్వహించారు. ట్రెజరీ ఉద్యోగులు ఉద్యమ శంఖారావం పోస్టర్లు ప్రదర్శించారు.

మేమూ 'సిద్ధం'!

- ప్రభుత్వంపై ఉద్యోగుల గర్జన
- సమస్యలు పరిష్కరించకపోతే తడాఖా చూపిస్తామని హెచ్చరిక
- తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు
- నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు
- కలెక్టరేట్‌లో ఉద్యోగుల వినతిపత్రం సమర్పణ

- 6లో..



కార్యాలయంలో అమర్చిన సీసీ కెమెరా

అధికారం చేతిలో ఉంది. అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఏదడిగినా కాదనకుండా చేసిపెట్టే స్థానిక ఎమ్మెల్యే బలం ఉంది. ఇంకేం కావాలి. ఏం చేసినా ఎదురే లేదు. అనుకున్నదే తడవుగా రూ.కోట్లలో ఆదాయం వచ్చే గుడివాడ వ్యవసాయ మార్కెట్ యార్డుపై అక్కడి చైర్‌పర్సన్ భర్త కన్నేశాడు. కార్యాలయాన్ని పరోక్షంగా తన ఆధీనంలోకి తీసుకున్నాడు. వచ్చేపోయేవారి వివరాల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నాడు. మార్కెట్ యార్డు పరిధిలో చెక్‌పోస్టులు పెట్టి భారీగా ఆదాయం పొందుతున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి.

కోట్ల ఆదాయంపై కన్ను!

గుడివాడ మార్కెట్ యార్డులో చైర్‌పర్సన్ భర్త పెత్తనం

చెక్‌పోస్టుల్లో తనిఖీలు ఆయనే

- సిబ్బందిపైనా అజమాయిషీ ఆయనదే
- సీసీ కెమెరాలూ అతని ఫోనుకే అనుసంధానం
- కొడాలి నాని ముఖ్య అనుచరుడు.. కేసినో నిర్వహణలో ప్రధాన సూత్రధారి
- దీంతో ఆయనకు ఎదురుచెప్పే వారే లేరు
- మాట వినడం లేదని కార్యదర్శిని సాగనంపేస్తున్నారు
- మార్కెట్ యార్డు ఆదాయం నెలకు రూ.6 కోట్లు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) గుడివాడ వ్యవసాయ మార్కెట్ యార్డుకు నెలకు సుమారు రూ.6 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ఈ ఆదాయంపై వైసీపీ నాయకులు కన్నేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే నందివాడకు చెందిన ఎం.సునీతను చైర్‌పర్సన్‌గా నియమించారు. పేరుకు ఆమె పదవిలో ఉన్నా పెత్తనం అంతా స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని అంతరంగికుడైన వ్యక్తే సాగించేవారు. సుమారు రెండేళ్లపాటు పదవిలో ఉన్న సునీతను ఆ తర్వాత పక్కన పెట్టేశారు. 2 ఏళ్లపాటు చైర్‌పర్సన్ నియామకం చేయకుండా నాని అంతరంగికుడే చక్రం తిప్పుతూ వచ్చారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ దళిత సామాజికవర్గాన్ని ప్రసన్నం చేసుకునేందుకు కొడాలి నాని అనుచరుడైన మట్టా జాన్ విక్టర్ సతీమణి నాగమణిని 4 నెలల క్రితం చైర్‌పర్సన్‌గా నియమించారు. జాన్ విక్టర్‌ది గుడివాడ మండలం లింగవరం. గుడివాడ రూరల్ వైసీపీ కన్వీనర్‌గా కూడా పనిచేస్తున్నారు. గుడివాడలో 2022 సంక్రాంతికి ఎమ్మెల్యే నాని ఆధ్వర్యంలో కేసినో నిర్వహణలో జాన్ విక్టర్ ప్రధాన పాత్ర పోషించారు. కేసినోలో వేసిన చిందులతోనే జాన్ విక్టర్ పేరు తొలిసారి వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత టీడీపీ నిజనిర్ధారణ కమిటీపై దాడి ఘటనలోనూ విక్టర్ కీలకంగా వ్యవహరించారు. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా దళితులను ఆకట్టుకోవడంతోపాటు విక్టర్ సేవలకు ఉపకారంగా ఆయన సతీమణికి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ పదవి దక్కిందని చెబుతారు.

పదవి సతిది.. పెత్తనం పతిది!



కార్యాలయంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న జాన్ విక్టర్

జాన్ విక్టర్ సతీమణికి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ పదవి లభించిన నాటి నుంచి మార్కెట్ యార్డుపై పట్టు బిగించారు. యార్డు కార్యాలయంలో ప్రభుత్వ ఖర్చుతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని తన ఫోనుకు అనుసంధానించుకున్నారు. కార్యాలయానికి ఎవరు వస్తున్నారు? ఏం చేస్తున్నారు? అనే విషయాలను నిరంతరం ఫోను ద్వారా పర్యవేక్షిస్తుంటారు. గుడివాడ మార్కెట్ యార్డు పరిధిలో 5 చెక్‌పోస్టులు ఉన్నాయి. గుడివాడ వ్యవసాయపరంగా, పాడిపంటల పరంగా సంపన్నమైనది కావడంతో నెలకు సుమారు రూ.6 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. మరో రూ.కోటి పైచిలుకు ఆదాయం ప్రతినెలా వైసీపీ నేతల ఖాతాల్లోకి పోతోందన్న ఆరోపణలు ఉన్నాయి. సిబ్బందిని తన గుప్పిట్లో పెట్టుకునేందుకు చెక్‌పోస్టుల్లో చైర్‌పర్సన్ భర్త తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆయనకు తనిఖీలు నిర్వహించేందుకు ఎలాంటి అధికారం లేకపోయినా ఈ తనిఖీలు నిర్వహించడంపై సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెక్రటరీ తాను చెప్పినట్టు వినడం లేదని తమ ఆదాయానికి అడ్డం పడుతున్నారన్న ఉద్దేశంతో ఆయన్ను డిప్యుటేషన్‌పై పంపేందుకు ఆగమేఘాలపై ఫైలు సిద్ధం చేశారు. నేడో రేపో సెక్రటరీని సాగనంపనున్నారు. గుడ్లవల్లేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీని గుడివాడకు ఇన్‌చార్జిగా నియమించనున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం వచ్చే వ్యవసాయ మార్కెట్ యార్డులపైనా వైసీపీ నేతలు గద్దల్లా వాలిపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా..!

- నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు
- ఇప్పటికే గోతుల్లో మునిగి నలుగురి మృతి

- 6లో..

ఇబ్రహీంపట్నం కాదు.. బూడిదపట్నం..!

కాలుష్యం కోరల్లో పట్టణ ప్రజలు విలవిల

- నేడు ఇబ్రహీంపట్నంలో ప్రజాపోరు బాట
- రాజకీయాలకు అతీతంగా గళమెత్తనున్న జనం

అధికార పార్టీకి చెందిన నేతల అక్రమార్జన ఇబ్రహీంపట్నాన్ని బూడిదపట్నంగా మార్చేసింది. అడ్డగోలుగా తరలిస్తున్న బూడిద ప్రజల జీవనాన్ని దుర్భరం చేసింది. మంత్రిస్థాయిలో ఉన్న వారే అడ్డగోలుగా బూడిదను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ నాయకులకు బూడిద బంగారమై కాసుల వర్షం కురిపిస్తుంటే సామాన్యుల ప్రాణాలు గాలిలో దీపాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో బూడిద అక్రమరవాణాపై స్థానికులు ఏకమవుతున్నారు. కాసులు అధికార పార్టీ నాయకులకు.. కాలుష్యం మాకా.. అని గొంతెత్తి నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు. కొండపల్లి - ఇబ్రహీంపట్నంకు చెందిన స్థానికులు.. యువత ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నంలోని ముత్తవరపు కల్యాణ మండపంలో ప్రజాపోరుబాట పేరుతో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారు.



ఇబ్రహీంపట్నం - ఛత్తీస్‌ఘఢ్ ఎన్‌హెచ్‌లో ఆగి ఉన్న టిప్పర్ నుంచి కారుతున్న బూడిద

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/ఇబ్రహీంపట్నం) : ఇబ్రహీంపట్నంలోని ఎన్టీటీపీఎస్ (నార్ల తాతారావు థర్మల్ విద్యుత్తు కేంద్రం)కు చెందిన బూడిద అధికార వైసీపీ నేతల పాలిటి కల్పవృక్షంగా మారింది. ఉచితంగా వచ్చే బూడిద ద్వారా గతంలో కొన్ని వందల మంది స్థానికులు ఉపాధి పొందేవారు. క్రమపద్ధతిలో బూడిద రవాణా చేసుకునేవారు. ఇప్పుడు వారందరి పొట్టకొట్టి అధికార పార్టీ నేతలు రాత్రి పగలు బూడిద రవాణా చేస్తూ సామాన్యులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌లో అన్ని యూనిట్లూ పనిచేస్తే రోజుకు 30 వేల టన్నుల బొగ్గు అవసరం ఉంటుంది. బొగ్గు మండించిన తర్వాత వెలువడే బూడిదను ఫ్లైయాష్, పాండ్ యాష్ అని రెండు రకాలుగా పేర్కొంటారు. బూడిద చెరువులోకి పంపిన పాండ్ యాష్ బూడిదను ఉచితంగానే తీసుకెళ్లే అవకాశం ఎన్టీటీపీఎస్ కల్పించింది. పొడిగా ఉండే ఫ్లైయాష్‌ను మాత్రం టన్ను రూ.300 చొప్పున విక్రయిస్తుంది. దీన్ని సిమెంటు తయారీలో వాడుతారు. తడి బూడిదను ఇటుకల తయారీలో వాడుతారు. బూడిద చెరువులో లభ్యమయ్యే తడి బూడిదను రవాణా చేస్తూ కొన్ని వందల మంది స్థానికులు జీవనోపాధి పొందుతుండేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వీరి పొట్టకొట్టి నాయకులే బూడిద దోపిడీకి శ్రీకారం చుట్టారు. రాత్రి పగలు తేడా లేకుండా బూడిదను తరలించడంతో స్థానికుల జీవనం నరకప్రాయంగా మారింది. కాలుష్య రక్కసి ప్రజల ప్రాణాలను హరి అనిపించే స్థాయికి చేరుకుంది. ఎన్టీటీపీఎస్‌కు చెందిన బూడిద చెరువు నుంచి రోజుకు వందల టిప్పర్లు పెద్ద ఎత్తున్న బూడిద రవాణా చేస్తుంటాయి. రవాణా సమయంలో వాహన యజమానులు, డ్రైవర్లు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వాటిని నుంచి బూడిద టిప్పర్లు ప్రయాణం చేసినంత దూరం నీళ్లతో పాటు కారిపోతుంది. అలా కారిని బూడిద ఎండిపోయిన తర్వాత ఇతర వాహనాల రాకపోకలకు ఎగసి రహదారి సమీపంలో ఉన్న ఇళ్లలోకి వెళ్లి పోతోంది. టిప్పర్ల నుంచి కారే బూడిద గుట్టల వల్ల ఇటీవల పలు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. పలువురు గాయాల పాలయ్యారు. ఇబ్రహీంపట్నం, కొండపల్లి, మూలపాడు, కేతనకొండ ఇతర ప్రాంతాల్లోని హోటల్స్‌లో తిను బండరాలపై కూడా బూడిద ప్రత్యక్షం కావడంతో నిర్వాహకులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక ఇళ్లలో తాగే నీటిపై, తినే తిండిపై, పీల్చే గాలిపై బూడిద కాలుష్యం అధికంగా ఉంటోంది. జిల్లా ఉన్నతాధికారులు, ఎన్టీటీపీఎస్ యాజమాన్యం, అధికారులు స్పందించి బూడిద కాలుష్యంపై చర్యలు చేపట్టాలని, సమయపాలన లేకుండా అక్రమంగా సాగుతున్న బూడిద రవాణాను అరికట్టాలని స్థానికులు పలుమార్లు మొర పెట్టుకునా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో వారి మొర అరణ్యరోదన అయింది. ఈ పరిస్థితుల్లో బూడిద రవాణాపై పోరాటానికి స్థానికులు శ్రీకారం చుట్టారు. ఈ పోరాటంతోనైనా అధికారులు కళ్లు తెరుస్తారో లేదో చూడాల్సి ఉంది.



టిపర్ల నుంచి రహదారి వెంట కారిన బూడిద గుట్టలు

వాడుకుంది ఒకరు.. వడ్డింపు మరొకరికి..!




ట్రూ అప్ బకాయిల కోసం విద్యుత్ శాఖ కొత్త ఎత్తులు

- 2014-19 మధ్య బకాయిలను పైకి తీసిన అధికారులు
- ఇళ్లను అమ్ముకుని వెళ్లిపోయిన యజమానులు
- ఇంటి నంబర్ ఒకటే కాబట్టి ప్రస్తుతం ఉన్న వాళ్లే చెల్లించాలని ఒత్తిడి
- సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావిస్తున్న సిబ్బంది

బంగారయ్య ప్రసాదంపాడు నివాసి. 5-22 ఇంటి నంబర్‌లో ఉండేవాడు. మూడేళ్ల క్రితం తన ఇంటిని ఎస్.మురళీకృష్ణకు విక్రయించాడు. మురళీకృష్ణ రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాత ఆ ఇంటికి ఉన్న విద్యుత్ సర్వీసును ఆ శాఖకు ఇచ్చేశాడు. తర్వాత తన పేరు మురళీకృష్ణ సర్వీసులను తీసుకున్నాడు. బంగారయ్య వినియోగించుకున్న విద్యుత్‌కు సంబంధించిన ట్రూఅప్ చార్జీ రూ.1500 చెల్లించాలని, ప్రస్తుతం ఉన్న సర్వీసుల్లో ఏదోఒకదానికి ఆ బకాయిని జత చేస్తామని, లేకపోతే ఒక సర్వీసును తొలగిస్తామని లైన్‌మన్ చెప్పడంతో మురళీకృష్ణ కుటుంబ సభ్యులు షాక్ తిన్నారు. ప్రసాదంపాడులో తాజాగా జరిగిన ఘటన ఇది

ఆదాయం కోసం ప్రభుత్వం అవకాశం అన్ని దారులను తొక్కుతోంది. బకాయి అన్న పదానికి కొత్త భాష్యాలు చెబుతోంది. విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్‌ల పేరుతో అదనపు భారాన్ని మోపుతోంది. ఇందుకోసం విద్యుత్ సంస్థలు ఇప్పుడు సరికొత్త పల్లవిని అందుకుంటున్నాయి. అధికారులు ఎవరో వినియోగించుకుంటున్న విద్యుత్‌కు ట్రూ అప్‌లను ప్రస్తుతం నివాసం ఉంటున్న వినియోగదారులపై రుద్దుతున్నారు. వారు ఉపయోగించుకున్న విద్యుత్‌కు సంబంధించిన ట్రూ అప్ చార్జీలను చెల్లించాలని ప్రస్తుతం ఉన్న వినియోగదారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. లేనిపక్షంలో ప్రస్తుతం ఉన్న సర్వీసుల నుంచి ఒకదాన్ని తొలగిస్తామని బెదిరింపులకు దిగుతు న్నారు. విజయవాడ నగరంలో ప్రస్తుతం విద్యుత్ శాఖ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే తాము ట్రూ అప్ చార్జీలు చెల్లిస్తున్నామని, ఇంతకుముందున్న వారి ట్రూఅప్ చార్జీలను తామెందుకు చెల్లించాలని ప్రశ్నిస్తున్నారు.



ఇదీ ఉమ్మడి జిల్లా కనెక్షన్ల లెక్క	
ఎల్‌టీ - 1 (గృహ)	14,98,644
ఎల్‌టీ - 2 (వాణిజ్యం)	1,19,874
ఎల్‌టీ - 3 (పరిశ్రమలు)	7,198
ఎల్‌టీ - 4 (కుటీర పరిశ్రమలు)	27,786
ఎల్‌టీ - 5 (ఆక్వా)	3000
హెచ్‌టీ	1522

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ట్రూఅప్ చార్జీల రూపంలో వినియోగదారుల నుంచి ఉమ్మడి కృష్ణాలో విద్యుత్ శాఖ మొత్తం రూ.782 కోట్లు వసూలు చేసింది. 2022 ఆగస్టు నుంచి వసూలు చేసిన ట్రూఅప్ చార్జీలు రూ.196కోట్లు ఉండగా, 2023 ఏప్రిల్ నుంచి ఎఫ్‌పీపీసీఏ - 1 (ఫ్యూయల్ పర్చేజ్ చార్జి ఎరియర్స్) కింద రూ.471 కోట్లు వసూలు చేసింది. ఎఫ్‌పీపీసీఏ - 2 కింద రూ.115 కోట్లు వసూలు చేసింది. 2014-15 నుంచి 2018-19 కాలంలో పంపిణీ సంస్థలకు నష్టాలు వచ్చాయని ఈ ట్రూ అప్ చార్జీలను తెర మీదకు తీసుకువచ్చారు. ప్రతి యూనిట్‌కూ 22 పైసలు చొప్పున లెక్కించి బిల్లులో వడ్డిస్తున్నారు. 2022 ఆగస్టు నుంచి మొత్తం 36 నెలలపాటు ఈ చార్జీలను వసూలు చేయాలని నిర్ణయించారు. 2021-22లో వచ్చిన నష్టాలను పూడ్చుకోవడానికి విద్యుత్ సంస్థలు ఎఫ్‌పీపీసీఏ పేరుతో భారం వేయడం మొదలుపెట్టాయి. 2021-22లో ఏ నెలలో వాడిన యూనిట్లను 2023-24లో అదే నెల బిల్లులో సర్దుబాటు చేస్తున్నారు. యూనిట్‌కు 20 పైసలు నుంచి 66 పైసల వరకు నియోగదారులకు వడ్డించారు. మొదటి మూడు నెలల్లో యూనిట్‌కు 20 పైసలు, రెండో త్రైమాసికంలో యూనిట్‌కు 63 పైసలు, మూడో త్రైమాసికంలో 63 పైసలు, చివరి త్రైమాసికంలో యూనిట్‌పై 66 పైసలు చొప్పున లెక్కించి ట్రూ అప్ విధిస్తున్నారు.

- ఇల్లు కొన్న వారికే మోత

ట్రూ అప్ చార్జీలు 2014-15 నుంచి 2018-19 మధ్యకాలంలో వినియోగించుకున్న విద్యుత్‌కు వసూలు చేయడంతో ఆ సమయంలో ఇళ్లను విక్రయించుకున్న వారి బకాయిలను కొనుగోలు చేసిన వారి నుంచి వసూలు చేయాలని భావిస్తున్నారు.



ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ పునరుద్ధరణ ప్రారంభం

తొలిరోజు పంచాహ్నిక పూజలు

- 6లో..



జగన్‌కు విజన్ లేదు

మళ్లీ గెలిస్తే అభివృద్ధి ఉండదు

- గ్రూపులను ప్రోత్సహించవద్దు.. కలిసి నడుద్దాం
- నూజివీడులో గెలుస్తానని ఇక్కడకు పంపారు
- ముద్దరబోయినను కలుస్తా : ఎమ్మెల్యే పార్థసారథి

- 6లో..



మల్లేశ్వరాలయ పునరుద్ధరణకు పవిత్ర జలాలు తెస్తున్న అర్చక బృందం

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ పునరుద్ధరణ కార్యక్రమాలు

- పూజల్లో పాల్గొని దీక్ష స్వీకరించిన మంత్రి కొట్టు సత్యనారాయణ



వన్‌టౌన్, ఫిబ్రవరి 14 : ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ పునరుద్ధరణకు సంబంధించి ఐదురోజుల (పంచాహ్నిక) దీక్షాకార్యక్రమాలలో తొలిరోజు బుధవారం వేదోక్త శాస్త్రోక్త విధానంలో క్రతువు ప్రారంభమైంది. దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం కార్యక్రమాలలో పాల్గొని పూజలు నిర్వహించారు, ఐదు రోజుల దీక్ష స్వీకరించారు. పండితుల వేద ఘోష, మంగళవాయిద్యాలు, భక్తుల శివనామస్మరణ మధ్య పూజలు, హోమాలు ప్రారంభమయ్యాయి. పవిత్ర జలాలను యాగశాలలో, ఆలయంలో ప్రోక్షించారు. సాయంత్రం యాగశాల శుద్ధి అనంతరం హోమాలు, అర్చనలకు శ్రీకారంచుట్టారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో కోటేశ్వర రావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, దేవస్థాన వైదిక కమిటీ సభ్యులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వెయ్యేళ్ల తర్వాత పునరుద్ధరణ..

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయాన్ని వేయి సంవత్సరాలకు పునరుద్ధరిస్తున్నట్టు దేవదాయశాఖమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, 11వ శతాబ్దంలో ఆలయం నిర్మించిన తరువాత మరల తొలిసారిగా పునరుద్ధరణ జరుగుతోందన్నారు. 18వ తేదీ 11.45 గంటలకు కుంభాభిషేకం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, బాలాలయంలోని మూలవిరాట్టుకు కళాపకర్షణ చేస్తారన్నారు. నాటి రాతి స్తంభాల మాదిరే పునరుద్ధరణలో కూడా నిర్మాణం చేశారన్నారు. ఇక నుంచి దుర్గమ్మ భక్తులు మల్లేశ్వరుని కూడా దర్శించుకోవచ్చునన్నారు. మల్లేశ్వరాలయ పునరుద్ధరణకు ఐదురోజుల కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు ఆలయ ముఖ్య అర్చకుడు శంకరశాండిల్య తెలిపారు. అర్జునుడు ఇక్కడ మల్లేశ్వరలింగాన్ని ప్రతిష్ఠించినట్టు చరిత్ర ఉందని, ద్వాపరయుగం నుంచి ఇక్కడ పూజలు జరుగుతున్నట్టు పురాణాలలో ఉందన్నారు. మల్లేశ్వరాలయ పునరుద్ధరణకు నగరానికి చెందిన సంగా నరసింహరావు ధ్వజస్తంభ స్వర్ణ శిఖరం ఏర్పాటుకు విరాళమిచ్చారు. ఆయనకు బుధవారం వేదపండితులు సాదర స్వాగతం పలికారు.

వీణాపాణి సరస్వతికి వీణావాదనారాధన..

వీణాపాణి సరస్వతికి వీణావాదనతో కళాకారులు ఆరాధించారు. సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితికి చెందిన కళాకారులు ఫణిశిరీష, శంకరి, చరణ్, సాత్విక, కృష్ణవేణి, సాహితి, ప్రణవి, జయశ్రీ, శివప్రియ, లిఖితలు వీణలతో ప్రతిభను చాటారు. వసంత పంచమినాడు బుధవారం దుర్గమ్మ సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో విద్యార్థులు, భక్తులు దర్శించుకున్నారు. విద్యార్థులకు కంకణాలు, పెన్నులు, అమ్మవారి ఫొటో కానుకగా ఇచ్చారు.

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి దంపతులు



దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయమర్యాదలతో అధికారులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

అన్నవితరణకు రూ 10 లక్షలు విరాళం

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అన్నవితరణకు విజయవాడకు చెందిన కె.రత్నాకర్ రావు, లక్ష్మి, కుటుంబసభ్యులు బుధవారం రూ. 10 లక్షలు చెక్కు రూపంలో మంత్రి కొట్టు సత్యనారాయణ ద్వారా అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం దాతకు శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు.



శేష వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

వైభవంగా సుబ్బారాయుడి గ్రామోత్సవం

మోపిదేవి, ఫిబ్రవరి 14 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, నిత్య హోమం వంటి పూజా కార్యక్రమాలు అర్చక బృందం శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం స్వామివారిని శేషవాహనంపై ఆశీనులు గావించగా ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. డప్పువాయిద్యాల నడుమ శేషవాహనంపై స్వామివారు పురవీధుల్లో ఊరేగుతుండగా, గ్రామస్థులు పసుపు, కుంకుమ, టెంకాయలు సమర్పించుకున్నారు. ఆలయ ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. గ్రామానికి చెందిన మహిళా భక్త బృందం ప్రదర్శించిన మురళీ కోలాటం భక్తులను ఆకట్టుకుంది.



తోట్లవల్లూరు ఘాట్ దగ్గర ఎక్స్‌కవేటర్‌తో ఇసుక తీయటంతో ఏర్పడిన పెద్దగొయ్యి, నలుగురి మృతితో రేవువద్ద పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ప్రాణాలు పోతున్నా పట్టదా..!

- నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు
- ఇప్పటికే గోతుల్లో మునిగి నలుగురు మృతి

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 14 : తోట్లవల్లూరు గ్రామ సచివాలయం మెరక కోసం బుధవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపట్టడం విమర్శలకు దారితీసింది. ఎక్స్‌కవేటర్‌తో రెండు ట్రాక్టర్ల ద్వారా సుమారు వంద ట్రక్కుల ఇసుకను పుష్కరఘాట్‌కు పది మీటర్ల దూరంలో తవ్వటంతో పెద్దగొయ్యి ఏర్పడింది. గ్రామం వరకు ఎడ్లబండ్లతో ఇసుక తోలుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ యంత్రంతో నిబంధనలను ఉల్లంఘించి ఎలా ఇసుక తవ్వుతారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఘాట్ ఎదుట, లంక పొలాలకు ప్రజలు వెళ్లే రహదారి వద్ద గోతులు పెడితే ప్రమాదాలకు ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీస్తున్నారు. నదికి వరద వచ్చినపుడు పడవలో ప్రయాణం చేయాల్సి వస్తుందని, వరద తగ్గితే కాలినడకన వెళ్లేటప్పుడు ఈ గోతులే ప్రాణాలను తీస్తాయని, ఇదే రేవులో రెండేళ్లలో నలుగురు మృతిచెందడంతో ఘాట్ వద్ద పోలీస్‌శాఖ హెచ్చరిక బోర్డు సైతం ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అదే ప్రాంతంలో తిరిగి గోతులు గోతులు తవ్వటం శోచనీయమన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి పుష్పనాధంను వివరణ కోరగా సర్పంచ్, అధికారుల అనుమతితోనే ఇసుక తీయిస్తున్నారని, సచివాలయం ఎదుట మెరక చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.



పంచాయతీ రాజ్ ఇఎన్‌సీ విభాగం ఉద్యోగులు



నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేస్తున్న పెన్షనర్లు

మేమూ సిద్ధం!

మీరు సిద్ధం అయితే.. మేమూ సిద్ధమే.. అంటూ ప్రభుత్వం తీరుపై ఉద్యోగులు గర్జించారు. ఎన్నికల ముందు.. ఉద్యోగులు ప్రభుత్వానికి హెచ్చరికలు పంపారు. హామీల వాయిదాలతో ఐదేళ్లు ఉద్యోగులను అంతులేని ఆవేదనకు గురిచేశారని, ఇప్పుడు మాకు సమయం వచ్చిందని తడాఖా చూపిస్తామంటూ గర్జించారు.

- సమస్యలు పరిష్కరించకపోతే.. తడాఖా చూపిస్తాం
- ఉద్యోగుల ఉద్యమ శంఖారావం
- నల్లబ్యాడ్జీలతో విధులు.. హోరెత్తిన ధర్నాలు
- హామీల వాయిదాలతో ఐదేళ్లు నెట్టుకొచ్చారు
- 27న చలో విజయవాడకు సమాయత్తం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఉద్యోగుల వినతిపత్రం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఏపీజేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యోగులు ఉద్యమ శంఖారావం పూరించారు. తొలిరోజే ఊహించని ప్రతిఘటనను ఉద్యోగులు చూపారు. ఏపీఎన్జీవోలు, రవాణా శాఖ, ఉపాధ్యాయులు, పంచాయతీ రాజ్, ఏపీజీఎల్ఐ, దంత వైద్యులు, జలవనరుల శాఖ, కమర్షియల్ ట్యాక్సెస్, సహకార, వ్యవసాయ శాఖ, ట్రెజరీ, ఆర్‌అండ్‌బీ ఉద్యోగులకు తోడు పెన్షనర్లు కూడా ఉద్యమ కదనరంగంలోకి వచ్చారు. ఏపీజేఏసీ ఎన్టీఆర్ జిల్లా నాయకత్వం కలెక్టరేట్‌లో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించింది. తొలిరోజు నల్ల బ్యాడ్జీల ధారణ, వినతిపత్రాలకే పిలుపునిచ్చినా ఉద్యోగులు ఉధృతస్థాయిలో ధర్నాలు చేపట్టారు.

ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఉద్యమం

- ఎ.విద్యాసాగర్, ఏపీజేఏసీ ఎన్టీఆర్ జిల్లా

ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావలసిన ఆర్థిక ప్రయోజనాలు సాధించే వరకు ఆందోళన కొనసాగుతుంది.. డిమాండ్ల సాధన కోసం పోరాటాన్ని తీవ్ర స్థాయికి తీసుకు వెళ్లేందుకు ఉద్యోగులంతా సంఘటితమౌతున్నారు.. అని విద్యాసాగర్ పేర్కొన్నారు. ఏపీజేఏసీ ఇచ్చిన ఉద్యమ శంఖారావం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఉద్యోగులు నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఉద్యోగుల ఉద్యమాన్ని చల్లార్చేందుకు ప్రతిసారీ చర్చల పేరుతో పిలవటం, హామీలు గుప్పించటం, వాటిని నెరవేర్చకుండా వాయిదాల మీద వాయిదాలు వేస్తూ మైండ్ గేమ్ ఆడుతోందన్నారు. పాత వాయిదాల పరిస్థితి గురించి స్పష్టత ఇవ్వకుండా కొత్తగా వాయిదాలు వేయటం చూస్తుంటే ఉద్యోగుల సమస్యల విషయంలో ఈ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమౌతుందన్నారు. ఇలాంటి హామీల వల్ల ఉద్యోగులకు ఒరిగేదేమీ ఉండదన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో నాగలక్ష్మికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ కార్యదర్శి ఎండీ ఇక్బాల్, రాష్ట్ర జేఏసీ నాయకులు, ఎస్టీయూ నాయకులు కిషోర్, శ్రీనివాస రావు, పబ్లిక్ సెక్టార్ నాయకులు సాంబశివరావు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు సాయిరాం. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నేతలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఆర్ అండ్ బీ శాఖ ఉద్యోగులు



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న విద్యాసాగర్

సహనాన్ని పరీక్షించవద్దు

- రవాణా శాఖ ఉద్యోగులు

ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దని, తక్షణమే తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని రవాణాశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.రాజబాబు డిమాండ్ చేశారు. ఏపీజేఏసీ పిలుపు మేరకు స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. రాజబాబు మాట్లాడుతూ, ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించకపోతే మరో చలో విజయవాడ తప్పదని హెచ్చరించారు. ఉద్యోగుల సంఘం నేత శ్రీరామ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటికే అనేకమార్లు చర్చలు జరిపామన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉందన్నారు. ఉద్యోగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రవాణా శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో..



మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద ఏపీ ఎన్జీవో కృష్ణాజిల్లా నేతలు

కృష్ణా జిల్లాలో ఉద్యోగుల ఉద్యమబాట..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కలెక్టరేట్‌లోని ఆర్డీవో కార్యాలయంలో కృష్ణా ఎన్జీవో జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. మొవ్వ, చల్లపల్లి, ఉయ్యూరు జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.

ఉద్యోగులు సంతోషంగా లేరు

మచిలీపట్నం కలెక్టరేట్‌లోని ఆర్డీవో కార్యాలయంలో ఏపీ ఎన్జీవో జేఏసీ కృష్ణాజిల్లా విభాగం నాయకులు, ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అన్ని విభాగాల ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏపీ జేఏసీ తూర్పు కృష్ణా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎవ్వరూ సంతోషంగా లేరని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ ప్రయోజనాలను కాపాడుకోవడమే కష్టతరంగా మారిందన్నారు.

దశలవారీగా ఉద్యమం

ఏపీఎన్జీవో జేఏసీ పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన షెడ్యూలును జిల్లాఎన్జీవో జేఏసీ నాయకులు ప్రకటించారు. ఈనెల 15, 16తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారు. తాలూకా, జిల్లా కేంద్రాల్లో, పాఠశాలల్లో భోజన విరామ సమయంలో ప్రదర్శనలు నిర్వహిస్తారు. 17వతేదీన అన్నిప్రాంతాల్లో ధర్నాలు, ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించారు. 20వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా, ర్యాలీ చేయాలని నిర్ణయించారు. 21వ తేదీనుంచి 24వతేదీవరకు జిల్లాల పర్యటనలు, 27వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తారు.

జగన్‌కు విజన్ లేదు.. మళ్లీ గెలిస్తే అభివృద్ధి ఉండదు

- గ్రూపులు వద్దు.. కలిసి నడుద్దాం
- నూజివీడులో గెలుస్తానని పంపారు
- ముద్దరబోయినను కలుస్తా
- ఎమ్మెల్యే పార్థసారథి వెల్లడి

నూజివీడు, ఫిబ్రవరి 14 : 'జగన్ సర్కార్‌కు అభివృద్ధిపై ఎటువంటి విజన్ లేదు. మళ్లీ ఇదే కొనసాగితే రాష్ట్రానికి అభివృద్ధి అనేదే ఉండదు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో తాను పెనమలూరుకు వంతెన కోసం శంకుస్థాపన చేస్తే అనంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వం 80 శాతం పనులు పూర్తిచేసింది. మిగిలిన 20 శాతం పనులకు జగన్ సర్కార్ ఒక్క రూపాయి విడుదల చేయలేదు. దీనిపై సీఎంను అడిగి విసిగిపోయా.. సొంత డబ్బు కోటిన్నర వెచ్చించి వంతెనను పూర్తి చేయించా. ఫలితంగా విజయవాడ ట్రాఫిక్ కష్టాలు తీరాయి' అని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు టీడీపీ అభ్యర్థిగా ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ఆయన తొలిసారి బత్తులవారిగూడెంలో టీడీపీ నేత మునునూరు రాజా నివాసగృహం వద్ద పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'గ్రూపులను ప్రోత్సహించే సంస్కృతి వద్దు.. నాయకుల పనితీరును ప్రజలు గమనిస్తున్నారు.. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్ని గ్రూపులున్నా సమస్యలపై కలిసి పరిష్కరించుకుని, ఏకతాటిపైకి వచ్చి టీడీపీని అధికారంలోకి తీసుకువద్దాం. రెండు పర్యాయాలు ఇక్కడి నుంచి పోటీ చేసిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కృషి మరువలేనిది. ఆయనను తప్పించి నాకు టిక్కెట్ ఇవ్వాలని చంద్రబాబును కోరలేదు. టీడీపీలోకి వస్తానని చెప్పినప్పుడు పెనమలూరు నుంచే నాకు టిక్కెట్ ఇస్తారని ఆశించా.. చంద్రబాబు, సర్వే చేయించామని నూజివీడులో గెలుస్తావని చెప్పారన్నారు. అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు కూడా నూజివీడు వెళ్లి పనిచేసుకోవాలన్నారు. కానీ, 40 రోజులపాటు పెనమలూరు సీటు కోసమే వేచి చూశానన్నారు. పెనమలూరుతో నా కుటుంబానికి 50 ఏళ్ల అనుబంధం. వారిని వదిలి రావాలంటే ఎంతో మానసిక ఇబ్బందిని ఎదుర్కొంటున్నా' అని పార్థసారథి చెప్పారు. ముద్దరబోయినను కలిసి రావడానికి ఆయన ఇంటికి వెళ్లి వచ్చాను. ఆయన అందుబాటులో లేరు. మళ్లీ కలిసేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. సమావేశంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు జగ్గవరపు వెంకటరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మునునూరు రాజా, యనమదల సత్యనారాయణ, బత్తులవారి గూడెం, మునునూరు లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆగిరిపల్లిలో ముఖ్య నేతలను కలిసి సహకరించాలని కోరినట్టు చెప్పారు.



రాష్ట్రంలో విలువల్లేని పాలన : మండలి

అవనిగడ్డ, ఫిబ్రవరి 14 : రాష్ట్రంలో పాలనా వ్యవస్థ పూర్తిగా విలువలు కోల్పోయిందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఎద్దేవా చేశారు. బుధవారం అవనిగడ్డ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద తెలుగుయువత ఆధ్వర్యంలో 'ఆడుగుదాం ఆంధ్ర' కార్యక్రమ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందని, సహజ వనరులను యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారని మండలి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు దండమూడి చౌదరి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు మండలి వెంకట్రామ్, రావి రత్నగిరి తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ అభివృద్ధికి తొలిమెట్టు : వెనిగండ్ల



ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వెనిగండ్ల, రావి

గుడివాడ : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అనుసంధానంగా కార్యాలయంలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి కుల, మత, వర్గ, పార్టీలకతీతంగా కార్యాలయంలో ప్రతి ఒక్కరికి సహాయం అందిస్తామని, దీనికోసం ప్రజాదర్బార్‌గా నామకరణం చేయడం జరిగిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం ఏలూరురోడ్డులో నియోజకవర్గ పార్టీ, ఎన్నికల కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల మాట్లాడుతూ, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి మాట్లాడుతూ, దుర్మార్గుడైన నానిని సాగనంపేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ, 20ఏళ్లుగా నాని ప్రజలనుంచి తప్పించుకుని తిరుగుతున్నాడని, అధికారంలో లేకపోయిన ప్రజాదర్బార్ ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేయాలన్న రాము నిర్ణయం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



పెదపారుపూడి, ఫిబ్రవరి 14 : రాష్ట్రం నుంచి జగన్మోహన్‌రెడ్డి పారిపోయేలా ప్రజలందరూ ఓటుతో బుద్ధి చెప్పాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ వర్ల కుమార్‌రాజా అన్నారు. మహేశ్వరపురం గ్రామంలో కుమార్ రాజా నాయకత్వాన్ని బలపరుస్తూ బుధవారం 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారందరికీ కుమార్ రాజా టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అప్పుల మయం చేసి ఆర్థికంగా సంక్షోభంలోకి నెట్టిన జగన్మోహన్‌రెడ్డిని సాగనంపేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉండాలన్నారు. మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, జిల్లా టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తెలుగుయువత నేతలు పాల్గొన్నారు.

16న మెగా జాబ్‌మేళా

వన్‌టౌన్, ఫిబ్రవరి 14 : కేశినేని ఫౌండేషన్ అధినేత, టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో టీఎన్ఎస్ఎఫ్ సహకారంతో ఈనెల 16వ తేదీన జరిగే మెగాజాబ్ మేళాను సద్వినియోగపరుచుకోవాలని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు ఆర్.మాధవ నిరుద్యోగులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం జాబ్ మేళా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 45 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయని తెలిపారు. తెలుగుయువత కార్యదర్శి కాలేషావలి, రాజశేఖర రెడ్డి, కాటంరాజు, వేణు, బుడ్డి, దిలీష్, నాగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు

వన్‌టౌన్ : విజయవాడలోని వన్‌స్టాప్ సెంటర్‌లో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, సాధికారత అధికారిణి జి.ఉమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్‌లో సెంటర్ అడ్మినిస్ట్రేటర్-1 పోస్టు, కేసు వర్కర్లు-2 పోస్టులు, సైకో సోషల్ కన్వీనర్-1 పోస్టు, పూర్తిస్థాయి కంప్యూటర్ ఆఫీస్ అసిస్టెంట్-1 పోస్టు, మల్టీపర్పస్ స్టాఫ్, కుక్-3 పోస్టులు, సెక్యూరిటీ గార్డు, నైట్ గార్డు-3 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 18 నుంచి 42 సంవత్సరాల వయస్సు గల స్థానిక మహిళా అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ మహిళలకు ఐదు సంవత్సరాలు, దివ్యాంగులకు పది సంవత్సరాల వరకు గరిష్ఠ వయస్సు సడలింపు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ఈ పోస్టులకు ప్రకటన ఇచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో దరఖాస్తులు రానందున ఈ నెల 19 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువును పెంచినట్టు తెలిపారు. నిబంధనల ప్రకారం దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి కానూరులోని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి కార్యాలయంలో స్వయంగా అందజేయాలన్నారు.



మెరైన్, పోలీసు అధికారులతో సమావేశమైన రాజాబాబు

తీరంలో గస్తీ ముమ్మరం

- కృష్ణా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తీరప్రాంతం వెంబడి గస్తీని ముమ్మరం చేసి బీచ్‌ల వద్ద రక్షణ చర్యలను పటిష్టవంతం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్టు కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. కలెక్టర్ చాంబరులో బుధవారం తీరప్రాంత భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తీరప్రాంతంలోని మెరైన్ స్టేషన్లలో కనీస వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. గిలకలదిండి, ఒర్లగొందితిప్ప, పాలకాయతిప్ప మెరైన్ పోలీస్‌స్టేషన్‌లలో సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, వాచ్‌టవర్లను ఏర్పాటు చేస్తామన్నారు. సెలవురోజుల్లో బీచ్‌లకు వచ్చే సందర్శకుల రక్షణ కోసం గజఈతగాళ్లను నియమించాలని ఆయన అధికారులకు సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, తీరప్రాంతం వెంబడి గస్తీని ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో ప్రివెంటివ్ కమిషనరేట్ జాయింట్ కమిషనర్ కె.మురళీధర్, ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు, మెరైన్ ఏఎస్పీ జీబీఆర్ మధుసూదనరావు, మత్స్యశాఖ డీడీ పి.చంద్రశేఖర్, కలెక్టరేట్ ఏవో దుర్గాకిషోర్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అమరావతి బోటింగ్ క్లబ్ వార్షికోత్సవం

విజయవాడ స్పోర్ట్సు: భవానీ ఐలాండ్ మెయిన్ బ్రాంచ్‌లో ఏబీసీ-అమరావతి బోటింగ్ క్లబ్ 7వ వార్షికోత్సవం సంస్థ సీఈవో డాక్టర్ తరుణ్ కాకాని ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. కాకాని కేక్ కట్ చేసి ఉద్యోగులకు అందజేసి, అనంతరం కంపెనీ క్యాలెండర్లను ఆవిష్కరించారు. 2017లో తన భార్య పవిత్రా కొండ్రెడ్డి, తాను కలిసి ఈ క్లబ్‌ను స్థాపించామని, పర్యాటకులకు బోటింగ్ క్లబ్ ద్వారా భద్రతా ప్రమాణాలను నిర్వహిస్తున్నామని, ఇది తమకెంతో ఆనందాన్నిచ్చిందన్నారు.

గొడ్డలి దాడిలో గాయపడిన వివాహిత మృతి

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 14 : కోరిక తీర్చలేదని గొడ్డలితో దాడి చేసిన ఘటనలో వివాహిత బుధవారం విజయవాడలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు జగ్గయ్యపేట సీఐ జానకీరాం తెలిపారు. పట్టణంలో శివాలయం వీధిలో మిల్క్ పార్లల్ నిర్వహిస్తున్న వివాహిత గిద్ద సత్యశ్రీ (35)పై ఇంటికి వెళుతుండగా ఈ నెల 7న బుధవారం రాత్రి బైక్‌పై వచ్చిన ఆగంతకుడు హత్యాయత్నం చేయటం సంచలనం కలిగించింది. పోలీసు విచారణలో వత్సవాయి మండలం చిట్యేలకు చెందిన ఎలక్ట్రీషియన్ సైదాను మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. బుధవారం విజయవాడలో చికిత్స పొందుతూ సత్యశ్రీ మృతి చెందటంతో కేసును హత్యగా మార్పుచేసినట్టు సీఐ తెలిపారు. వివాహిత మృతదేహానికి విజయవాడ జీజీహెచ్‌లో పోస్టుమార్టమ్ నిర్వహించి బంధువులకు అప్పగించినట్టు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	143, 152, 163
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284
నెక్ కోడిగుడ్డు ధర	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.36	

గద్దెను మళ్లీ గెలిపించుకోవాలి: గురుప్రసాద్

మాచవరం, ఫిబ్రవరి 14 : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో గద్దె రామ్మోహన్ ముందు వరుసలో ఉంటారని, అలాంటి ప్రజా నాయకుడిని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత నియోజకవర్గ ప్రజలపై ఉందని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గుమ్మడి గురుప్రసాద్ అన్నారు. 6వ డివిజన్‌లో బుధవారం వైద్య ఖర్చుల నిమిత్తం మొకర నాగరాజుకు రూ. 20 వేలు, మొకర ద్రాక్షాయనికి రూ. 25వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పడాల గంగాధర్, మోహనరావు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న గురుప్రసాద్

వీరజవాన్ల త్యాగాలు మరువలేనివి

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 14: సైనికులు ప్రజల్ని, దేశ గౌరవాన్ని కాపాడడం కోసం చివరి శ్వాస వరకూ పోరాడతారిని వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపైన ఉందని మాజీ సైనికులు, వీహెచ్‌పీ నాయకులు ఉద్ఘాటించారు.

కాశ్మీర్ పుల్వామాలో పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడులకు బలైపోయిన వీర జవాన్లును స్మరించుకుంటూ బుధవారం సత్యనారాయణపురం వీహెచ్‌పీ కార్యాలయం వద్ద నుంచి బీఆర్టీఎస్ రోడ్డు శారదాకాలేజి జంక్షన్ వరకూ పాదయాత్ర నిర్వహించారు. జంక్షన్ వద్ద మాజీ సైనికులు, వీహెచ్‌పీ నాయకులు వీరజవాన్లకు నివాళులు అర్పించారు. మాజీ సైనికులు సుబేదార్ మేజర్ వి. ప్రభాకరరావు, సుబేదార్ కె.కె. నరసింహారావు, హవల్దార్ ఎంహెచ్ రామానుజ గుప్త, ఎండీ డౌల, వీహెచ్‌పీ ఆంధ్రప్రదేశ్ సంఘటనా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, వీహెచ్‌పీ మహానగర్ అధ్యక్షుడు సానా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వైఎస్ఎస్ ప్రసాద్, కార్యదర్శి కె.రామకృష్ణ, శారదా కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.


వీర జవాన్లకు నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు, వీహెచ్‌పీ నాయకులు

మత్తు పదార్థాల నిర్మూలనలో భాగస్వాములుకండి

జమాఅత్ ఇస్లామి హింద్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఫాతిమా కౌసర్

రాణిగారితోట, ఫిబ్రవరి 14: మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జమాఅత్ ఇస్లామి హింద్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఫాతిమా కౌసర్ అన్నారు. కృష్ణలంకలోని కౌసర్ మసీదు వద్ద బుధ వారం జమాఅత్ ఇస్లామి హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం, ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మత్తు పదార్థాల వినియోగం పెరిగిపోతుందని, ఆ మహమ్మారిని నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ పోరాడాలని, వాటి వాడకం వలన సంభవించే దుష్ఫలితాలను వివరించి యువతను వాటి నుంచి దూరంగా ఉండేలా చూడాలన్నారు. సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి జాహెదా బేగం, తూర్పు మహిళా అధ్యక్షురాలు షహెనాజా సుల్తానా, నగీనా, అఖ్తర్, తాహెరా, ఖాలిదా, సాదిఖా, రుక్సానా పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న జమాఅత్ ఇస్లామి హింద్ మహిళా సభ్యులు

ఘనంగా వసంతోత్సవం...
సామూహిక అక్షరాభ్యాసాలు

● ఆలయాలు, పాఠశాలల్లో పుస్తకాలు, పెన్నులు, పలకల పంపిణీ

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 14: మాఘ శుద్ధ పంచమిని పురస్కరించుకుని బుధవారం నగరంలోని పలు ఆలయాల్లో వసంతోత్సవం ఘనంగా జరుపుకున్నారు. వసంత పంచమినాడే సరస్వతీ జయంతి కావడంతో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న వసంత పంచమి సందర్భంగా పలు దేవాలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. లెనిన్ సెంటర్‌లోని ఓంశ్రీ షిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి అమ్మవారి మందిరంలో సరస్వతీదేవి పాదాల వద్ద భక్తులు పుస్తకాలు, కలాలు అమ్మవారి దగ్గర పెట్టి అమ్మవారిని ఆరాధించారు. సరస్వతీ రూపంలో నాగమానసాదేవి అమ్మవారికి పలు రకాల పూలతో మహిళలు పూజలు నిర్వహించారు. పిల్లలకు అమ్మవారి దగ్గర అక్షరాభ్యాసం చేయించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి పర్యవేక్షణలో చిన్నారులు, తల్లిదండ్రులకు పుస్తకాలు, పెన్నులు, స్టేషనరీ పంపిణీ జరిగింది. సరస్వతీదేవికి ప్రత్యేక ఆరాధనలు, పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో ...

మొగల్రాజపురం: మొగల్రాజపురం లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో ప్రిన్సిపాల్ సుధా ప్రవీణ ముక్తేవి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో సరస్వతీ పూజతో అక్షరాభ్యాస కార్యక్రమం ప్రారంభించారు. పాఠశాల డైరెక్టర్ ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఫణి ప్రసాద్ ముక్తేవి పాల్గొన్నారు. చిన్నారులకు పుస్తకాలు, పలకలను బహూకరించారు.

శ్రీ విద్యాంజలి హైస్కూల్‌లో ..

పాతరాజరాజేశ్వరి పేట : 55వ డివిజన్ వించిపేట, నైజాంగేటు సెంటర్‌లో ఉన్న శ్రీ విద్యాంజలి హైస్కూల్‌లో అక్షరాభ్యాస మహోత్సవం హైస్కూల్ ప్రిన్సిపాల్ పుప్పాల శ్రీనివాసరావు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొని దాదాపు 65 మంది చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. క్యూట్ కిడ్స్ పారడైజ్ ప్లే స్కూల్‌ను కేబీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు ప్రారంభించారు. పలువురు పార్టీ నాయకులు ఎంఎస్ బేగ్, షేక్ ఆసిఫ్, పోతిన వెంకట మహేశ్, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, ఎంఏ ఖదీర్, ఎ.అప్పారావు, గాదె ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో


నాగమానసాదేవి అమ్మవారి మందిరంలో


లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో


చైతన్య పాఠశాలలో


కాళీమాత ఆలయంలో

వన్‌టౌన్: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో ఎల్‌కేజీ చిన్నారులకు పలకలు, బిస్కెట్లు, పళ్లరసాలను పంచారు. పాఠశాల ప్రిన్సిపాల్ కే.సునీత, ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ రాజేష్‌బాబు, సెకండరీ డీన్ నరేష్, ప్రైమరీ ఇన్‌చార్జి లక్ష్మీదుర్గ, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి మీనాక్షి పాల్గొన్నారు.

కాళీమాత ఆలయంలో ..

కృష్ణలంక: పండిట్ నెహ్రూ బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. 650 మంది అక్షరాభ్యాసాలు, దేవస్థానం తరపున 100 మంది భక్తులకు ఉచితంగా అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. దేవస్థానం భక్తులకు పలక, బలపం, పెన్ను, పుస్తకం వంటి స్టేషనరీ అందజేశారు. చిన్నారులకు పాలు, సేమియా పాయసం, భక్తులకు పులిహోర, చక్రపొంగలి ప్రసాదంగా అందజేశారు.

హుండీ లెక్కింపు

గవర్నర్‌పేట: చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంకు చెందిన హుండీలను బుధవారం ఆలయ ఈవో నూతక్కి వెంకట సాంబశివ రావు పర్యవేక్షణలో లెక్కించారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు, రెవెన్యూ, పోలీసు విభాగాలకు చెందిన అధికారులు, హిందూ సేవాదళ సభ్యులు, పెద్దలు, భక్తులు హాజరయ్యారు. 105 రోజులకు రూ. 5,40,437, రెండు అమెరికా డాలర్లు ఆదాయంగా లభించినట్లు ఈవో తెలిపారు. వెండి, బంగారం రాలేదన్నారు.

క్రికెటర్ విష్ణువర్ధినికి అభినందన

విజయవాడ స్పోర్ట్స్, ఫిబ్రవరి 14 : ఆడుదాం ఆంధ్రాలో మహిళా క్రికెట్‌లో ఎన్టీఆర్ జిల్లాకు చాంపియన్‌షిప్‌ను సాధించడంలో కీలకపాత్ర పోషించిన నలంద డిగ్రీ కళాశాలలో బీకామ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కేవైఎం. విష్ణువర్ధినిని కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ, విద్యాసంస్థల చైర్మన్ అట్లూరి విజయబాబు, పీడీ ఎన్.వెంకటేశ్వరరావులు అభినం దించారు. ఆడుదాం ఆంధ్రా క్రికెట్‌లో ఐదు మ్యాచ్‌ల్లో నిలకడైన ఆటతీరుతో విష్ణువర్ధినితో పాటు ఎం.పూజిత సత్తా చాటారన్నారు. విష్ణువర్ధిని చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) టాలెంటెడ్ ప్లేయర్స్ జాబితాలో చోటు దక్కించుకోవడం హర్షణీయమన్నారు.


విష్ణువర్ధినిని అభినందిస్తున్న అనురాధ

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

భవానీపురం, ఫిబ్రవరి 14 : గుంటూరులో కలుషిత నీరు తాగి మృతి చెందిన ఎం.పద్మ అనే గిరిజన మహిళ కుటుంబానికి ఊర్మిళానగర్‌కు చెందిన ఏపీ ట్రైకార్ ఆర్థిక సంస్థ డైరెక్టర్ మద్దెల రామకృష్ణ బుధవారం రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అధికారులతో మాట్లాడి రూ.5లక్షల నష్టపరిహారం అందించడానికి కూడా ఆయన కృషి చేశారని పలువురు అభినందించారు.

యువగళం పథకంతో యువతకు భవిష్యత్తు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 14 : యువనేత నారా లోకేశ్ రాష్ట్రంలో యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యువగళం పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు బొండా సిద్ధార్థ, బొండా రవితేజలు తెలిపారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువగళం పథకం ద్వారా రాష్ట్రంలో 20 లక్షల మంది యువతకు ఉపాధి, నిరుద్యోగులకు యువగళం నిధి ద్వారా నెలకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి అందజేయనున్నట్లు తెలిపారు. టీఎన్ఎస్ఎఫ్ నేతలు గరిమెళ్ల సాయి, చరణ్‌సాయి పాల్గొన్నారు.


కార్యక్రమంలో బొండా రవితేజ, సిద్ధార్థ

నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తి బొండా ఉమా

అధికారంలో ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తి బొండా ఉమామహేశ్వరరావు అని టీడీపీ 63వ డివిజన్ కార్పొరేటర్ పైడి తులసి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు లబ్బా దుర్గలు అన్నారు. బొండా ఉమాపై వెలంపల్లి శ్రీనివాసరావు అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దొంగతనాలకు కేరాఫ్ అడ్రస్ వెలంపల్లి అని, మంత్రి పదవిలో ఉండగా అమ్మవారి గుడిలో వెండి సింహాలు కొట్టేసిన ఘనత వెలంపల్లికే దక్కుతుందని విమర్శించారు. నియోజకవర్గంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత బొండా ఉమాకే దక్కుతుందని ఇప్పటికైనా వెలంపల్లి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని పేర్కొన్నారు. బెజ్జం జైపాల్, కోలా శ్రీను, బత్తుల కొండ తదితరులు పాల్గొన్నారు.

కర్నాటి హైస్కూల్‌లో డీఎస్ఈవో ఆకస్మిక తనిఖీ

వన్‌టౌన్, ఫిబ్రవరి 14: సూర్యారావుపేటలోని కర్నాటి రామ్‌మోహన్‌రావు హైస్కూల్‌లో బుధవారం పాఠశాల విద్యాధికారి (డీఎస్ఈవో) యు.వి సుబ్బారావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. త్వరలో పదవ తరగతి పరీక్షలు జరగనున్నందున విద్యార్థులు ఏ మేరకు సన్నద్ధం అవుతున్నారో అన్నదానిపై ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఆయా సబ్జెక్టులపై ఎంతమేరకు పట్టు ఉందో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మార్కులు సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలలో అధునాతన మౌలిక వసతులు కల్పించాలని, నాణ్యమైన విద్యను అందించాలని, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 8, 9 తరగతుల విద్యార్థుల బైజూస్ కంటెంట్ ట్యాబ్‌ల వినియోగాన్ని ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూశారు. మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించి ఆదేశాలు జారీ చేశారు.


మధ్యాహ్న భోజనం చేస్తున్న డీఎస్ఈవో సుబ్బారావు

కలెక్టరేట్‌లో సమావేశ మందిరం నిర్మాణానికి శంకుస్థాపన

వన్‌టౌన్, ఫిబ్రవరి 14: జిల్లా కలెక్టరేట్‌లో ఎంపీ నిధుల నుంచి వెచ్చించిన రూ.30లక్షలతో సమావేశ మందిరం, రికార్డు రూమ్‌ల నిర్మాణానికి బుధవారం ఎంపీ కేశినేని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకుముందు రూ.8లక్షల ఎంపీ నిధులతో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభిం చామని తెలిపారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లా డుతూ ఎంపీ నిధులతో కలెక్టరేట్‌లో పలు అభి వృద్ధి పనులు చేపట్టినట్లు ఇందుకు ఎంపీకి ధన్య వాదాలు తెలుపుతున్నా మన్నారు. డీఆర్‌వో వి.శ్రీని వాసరావు, పంచాయతీ రాజ్ ఎస్ఈ ఏ.వెంకటేశ్వ రరావు, సీపీవో వై.శ్రీలత, డీపీఆర్‌వో ఎస్.వి మోహనరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, పంచాయతీరాజ్ ఈఈ శివరామకృష్ణ పాల్గొన్నారు.

గుణదల తిరునాళ్లకు వెళ్లి భర్త తిరిగి రాలేదని ఫిర్యాదు

విద్యాధరపురం, ఫిబ్రవరి 14: గుణదల మేరిమాత తిరునాళ్లకు వెళ్లిన భర్త తిరిగి రాలేదని భార్య బుధవారం భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. విద్యాధరపురం శివాలయం సెంటర్ ప్రాంతానికి చెందిన దారపు లక్ష్మి భర్త దుర్గారావు 23 ఏళ్లుగా పవన్‌ట్రేడింగ్ కంపెనీలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈనెల 11న గుణదల తిరునాళ్లకు వెళతానని సంచిలో జత బట్టలు పెట్టుకుని వెళ్లాడు. లక్ష్మీ వేడుకకు వెళ్లి వచ్చింది, ఆరోజు రాత్రి11 గంటలకు భర్తకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. మరునాడు ఉదయం చూడగా అతని ఫోన్ ఇంట్లో బీరువాపైన ఉంది. దాని నుంచి అలారం మోగడంతో లక్ష్మి భర్త ఫోన్‌ను గమనించింది. దుర్గారావు పనిచేస్తున్న సంస్థ యజమాని ఇంటికి వచ్చి క్యాంప్ బ్యాగ్ చెక్ చేశాడు. బంధువుల నివాసాలు, ఇతరత్రా వెతికినా అతని జాడ కనిపించలేదు. దీంతో లక్ష్మి తన భర్త ఆచూకీ కోసం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం: పోతిన

వన్‌టౌన్, ఫిబ్రవరి 14: టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముఠా కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్ తెలిపారు. బుధవారం వస్త్రలత క్లాత్ ముఠా వర్కర్స్ యూనియన్ సభ్యులతో సమావేశమయ్యారు. యూనియన్ అధ్యక్షుడు చీపుళ్ల సత్యనారాయణ ద్వారా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం బావుండాలన్న, ప్రజలు బావుండాలన్న జనసేన-టీడీపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తమ్మిన హేమంత్, పిళ్లా శ్రీనివాస్, శిగనంశెట్టి రాముగుప్తా, పొట్నూరు శ్రీనివాసరావు, హనుమాన్, బేతాళ రవికుమార్, రమేష్, శ్రీను, శంకర్, జగదీష్, పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ పర్యటనను అడ్డుకోవడం దుర్మార్గం


వపన్‌కల్యాణ్ గోదావరి జిల్లాల పర్యటనను అడ్డుకోవడం దుర్మార్గమని పోతిన మహేశ్ తన కార్యాలయం నుంచి బుధవారం విడుదల చేసిన ఒక వీడియో ద్వారా విమర్శించారు. గతంలో లేని ఇబ్బందులు పవన్‌కల్యాణ్ పర్యటనలోనే ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు లేని ఇబ్బంది స్థానిక రెవెన్యూ అధికారులకు ఎందుకు వచ్చిందన్నారు. ఈ రాష్ట్రానికి పట్టిన దరిద్రం జగన్ అని, ఆయనను వదిలించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.



చిరు విరామం

సినిమా షూటింగ్స్‌కు చిరంజీవి చిన్న బ్రేక్ ఇచ్చారు. శ్రీమతి సురేఖతో కలసి అమెరికా విహార యాత్రకు వెళ్లారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'సురేఖతో కలసి అమెరికా విహార యాత్రకు వెళ్తున్నాను. తిరిగిరాగానే 'విశ్వంభర' చిత్రీకరణలో పాల్గొంటాను. అందరికీ ప్రేమికుల దినోత్సవ శుభాకాంక్షలు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. 'విశ్వంభర' చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది. 'బింబిసార' ఫేం వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. త్రిష కథానాయిక. భారీ సెట్స్‌లో ఇటీవలే కీలక ఘట్టాలను తెరకెక్కించారు. చిరంజీవి తిరిగిరాగానే మరో షెడ్యూల్ ప్రారంభించేందుకు యూనిట్ సిద్ధమవుతోంది. 'విశ్వంభర'కు కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

టైటిల్ ట్రాక్‌తో హరోం హర



సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. మాళవిక శర్మ కథానాయిక. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి నాయుడు నిర్మించారు. సుధీర్ బాబు సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఈ చిత్రం నుంచి 'హరోం హర' అంటూ సాగే టైటిల్ ట్రాక్‌ను యూనిట్ బుధవారం విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ ప్రారంభించింది. కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించగా, చైతన్ భరద్వాజ్ స్వరాలు సమకూర్చారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. 1980ల్లో చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోందని యూనిట్ తెలిపింది. సునీల్ కీలకపాత్ర పోషిస్తున్నారు.

భామతో బచ్చన్



రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునాహోగా' అనేది ట్యాగ్‌లైన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి రవితేజ, భాగ్యశ్రీ బోర్సే రొమాంటిక్ స్టిల్‌ను మేకర్స్ విడుదల చేశారు. సినిమాకు సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయని చిత్రబృందం తెలిపింది. ఇటీవలే కారంపూడిలో ఓ షెడ్యూల్‌ను యూనిట్ పూర్తి చేసింది. ఈ చిత్రానికి మిక్కీజే మేయర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: అయనంక బోస్.

పుల్వామా అమరవీరులకు నివాళులు



వరుణ్‌తేజ్ తొలిసారిగా బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి నటించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్' మార్చి ఒకటిన తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. మానుషి చిల్లర్ ఇందులో రాడార్ ఆఫీసర్‌గా, రుహానా శర్మ మరో కీలక పాత్రలో నటించారు. శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వం వహించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారిపై భారత భద్రతా సిబ్బందిని తీసుకువెళుతున్న వాహనాల కాన్వాయ్‌పై జరిగిన ఉగ్ర దాడిలో నలభై మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. పుల్వామా స్మారక ప్రదేశాన్ని హీరో వరుణ్‌తేజ్, మానుషి సహా 'ఆపరేషన్ వాలెంటైన్' టీమ్ సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. వైమానిక దళ ధైర్య సాహసాలు, త్యాగాల స్ఫూర్తితో వాస్తవ సంఘటనల ప్రేరణతో రూపొందిన ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్, రినైసన్స్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి.

వేసవిలో శశివదనే

రక్షిత్ అట్లూరి, కోమలి జంటగా నటించిన గ్రామీణ ప్రేమ కథా చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో అహితేజ్ బెల్లంకొండ నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో ప్రేమికులుగా రక్షిత్, కోమలి జంట ఆకట్టుకుంది. 'మనసులో పుట్టే ప్రేమ మచ్చలేనిదైతే ఆ ప్రేమకు మరణం కూడా మనతోనే' అనే డైలాగ్ ఆ పోస్టర్‌కు ప్రత్యేకాకర్షణగా నిలిచింది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్. సినిమాటోగ్రఫీ: శ్రీ సాయికుమార్ దారా



వినోదం.. అంతకుమించి

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'టిల్లు స్క్వేర్' విడుదల కోసం తుది మెరుగులు దిద్దుకుంటోంది. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తున్నారు. మల్లిక్ రామ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని శ్రీరాములు థియేటర్‌లో 'టిల్లు స్క్వేర్' ట్రైలర్‌ను విడుదల చేశారు. మొదటి భాగంలో రాధికతో ప్రేమ కారణంగా ఇబ్బందులు తెచ్చుకున్న టిల్లు ఇప్పుడు మరోసారి అదే తరహాలో సమస్యల సమూహంలో చిక్కుకున్నట్లు ట్రైలర్‌లో చూపించారు. అనుపమ లుక్స్‌తో పాటు ఆమె బాడీ లాంగ్వేజ్, సిద్ధుతో ఆమె కెమిస్ట్రీ ఈ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచాయి. కథకు సంబంధించిన అంశాలను ఎక్కువగా వెల్లడించకుండా .. ఏం జరిగిందో తెలుసుకోవాలనే ఆసక్తి కలిగించేలా ట్రైలర్‌ను రూపొందించారు. ప్రేక్షకుల అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా మొదటి భాగాన్ని మించి సీక్వెల్ ఉంటుందనే నమ్మకాన్ని ట్రైలర్‌తో కలిగించారు దర్శకుడు మల్లిక్ రామ్. రామ్ మిరియాల పాటలకు స్వరాలు అందించగా, సంగీత దర్శకుడు తమన్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు.



తండ్రీ కొడుకుల కథ



నటుడు ధన్‌రాజ్ దర్శకత్వంలో సముద్రఖని ముఖ్యపాత్రలో నటిస్తున్న ద్విభాషా చిత్రం 'రామం రాఘవం'. తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో తెరకెక్కుతోంది. ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో పృథ్వీ నిర్మిస్తున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా 'రామం రాఘవం' చిత్రం గ్లింప్స్‌ను హీరో రామ్ పోతినేని, దర్శకుడు హరీష్ శంకర్ విడుదల చేశారు. ఈ చిత్రంలో శ్రీనివాసరెడ్డి, చిత్రం శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్నారు. శివ ప్రసాద్ యానాల కథను సమకూర్చగా, అరుణ్ చిలువేరు సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: మార్తాండ్ కే వెంకటేశ్


8 వసంతాల ప్రేమ





'మధురం' ఫేం ఫణీంద్ర నర్సెట్టి దర్శకుడిగా ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కొత్త చిత్రం ప్రకటించింది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా టైటిల్‌ను ప్రకటించారు. ఎనిమిది సంవత్సరాలలో ఓ అందమైన యువతి జీవితంలో జరిగిన సంఘటనల సమాహారంగా ఈ చిత్రం తెరకెక్కుతోందని నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ తెలిపారు. దీనికి '8 వసంతాలు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాతలు చెప్పారు.

భామా కలాపం 2లో అన్నీ డబుల్ ఉంటాయి



ప్రియమణి ప్రధాన పాత్ర పోషించిన 'భామా కలాపం 2' వెబ్ సిరీస్ ఈ నెల 16 నుంచి ఆహాలో స్ట్రీమింగ్ కానుంది. సీరత్ కపూర్, శరణ్య, రఘు ముఖర్జీ, బ్రహ్మాజీ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. అభిమన్యు తడిమేటి దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌ను బాపినీడు, సుధీర ఈదర నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన ప్రెస్‌మీట్‌లో ప్రియమణి మాట్లాడుతూ 'ఇందులో అన్నీ డబుల్ ఉంటాయి. థ్రిల్స్, ట్విస్టులతో పాటు కాస్త డేంజర్ కూడా ఉంది. ప్రతి పాత్రకూ ప్రాధాన్యం ఉంది. మహిళ తలుచుకుంటే ఏదైనా చేయగలదు అని చెబుతున్నాం' అన్నారు. మొదటి పార్ట్ చూసి రెండో పార్ట్ చూస్తే ఇంకా ఎక్కువగా కనెక్ట్ అవుతారని దర్శకుడు అభిమన్యు చెప్పారు. ఇందులో తనకు జుబేదా పాత్ర ఇచ్చిన దర్శకుడికి సీరత్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సిరీస్ కోసం ఎంతో కష్టపడ్డామని మరో నటి శరణ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆహా బిజినెస్ హెడ్ వాసు, ఎడిటర్ విప్లవ్ కూడా పాల్గొన్నారు.

రాజకీయ చిత్రం కాదు.. ప్రజల సినిమా

'ఈ సినిమాను మొదట 'అమరావతి టైమ్స్' పేరుతో తీశాం. కానీ సెన్సార్‌కు వెళ్లినప్పుడు ఫిక్షనల్ స్టోరీ అయితేనే సెన్సార్ చేస్తామని అధికారులు చెప్పారు. వారు చెప్పిన ప్రకారం మార్పులు చేసి, టైటిల్‌ను కూడా 'రాజధాని ఫైల్స్' అని మార్చాం. దీని వల్ల అదనంగా ఖర్చు అయి, బడ్జెట్ కూడా పెరిగింది' అని చెప్పారు దర్శకుడు భాను. ఆయన రూపొందించిన 'రాజధాని ఫైల్స్' చిత్రం గురువారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు.

- 'ఇది రాజకీయ చిత్రం కాదు.. ప్రజల సినిమా. ప్రజల ఆవేదనను చూపించే ప్రయత్నం చేశాం. ప్రజలు ఒక ప్రభుత్వాన్ని నమ్మి తమ భూములు ఇచ్చారు. మరో ప్రభుత్వం వచ్చి వారిపై ఆంక్షలు విధిస్తూ ఇబ్బంది పెడుతోంది. ప్రజలు నవ్వింది ప్రభుత్వాన్ని కానీ పార్టీలను కాదు. ఈ అంశాన్నే సినిమాలో చూపించాం. రైతులు పడిన ఇబ్బందులు, మానసిక సంఘర్షణ, వారిని ఇబ్బంది పెట్టే వ్యక్తులు, న్యాయం కోసం రైతులు చేసే పోరాటం.. ఇవే సినిమాలో అంశాలు' అని స్పష్టం చేశారు భాను.
- చిత్రీకరణ సమయంలో ప్రభుత్వ పరంగా ఎటువంటి



దర్శకుడు భాను

ఒత్తిళ్లు రాలేదని చెబుతూ 'అమరావతికి వెళ్లి అక్కడి బాధిత రైతులతో ఈ సినిమా చేశాం. వాస్తవ సంఘటన ఆధారంగా సినిమా తీస్తున్నప్పుడు ఆ సంఘటనను ఎదుర్కొన్న వారే అందులో నటించడం చాలా అరుదు. మా సినిమాలో బాధితులే తమ పాత్రలను పోషించారు' అని ఆయన తెలిపారు.

- ఈ కథను ఎన్నుకోవడానికి గల కారణాన్ని వివరిస్తూ 'నిర్మాత రవిశంకర్‌గారు ఇలాంటి అంశంతో సినిమా చేయాలని అడిగినప్పుడు మొదట భయపడ్డాను. రిస్క్ తీసుకోవడానికి నిర్మాతే సిద్ధంగా ఉన్నప్పుడు వెనకడుగు వేయడం ఎందుకని అంగీకరించాను. అమరావతి రైతులను కలిశాను. వారు పడిన ఇబ్బందుల్ని వింటుంటే కళ్లలో నీళ్లు తిరిగాయి. వారు పడిన మానసిక క్షోభను చిత్రంలో చూపించాం. తొలి కాపీ చూసిన తర్వాత జీవితానికి ఇది ఒక్కటి చాలు అనిపించింది. ప్రజలందరికీ నచ్చే సినిమా అవుతుంది' అన్నారు.
- సినిమాలో రైతు ప్రతినిధిగా వినోద్‌కుమార్, రైతు భార్యగా వాణీ విశ్వనాథ్ నటించారనీ, మణిశర్మ అద్భుతమైన సంగీతాన్ని అందించారనీ దర్శకుడు భాను తెలిపారు.

అమ్మాయిలు ఇచ్చే షాక్.. అదే మెడిసిన్!



ఒక తెలుగు యువతి హీరోయిన్‌గా నటించడం, ఆ సినిమాకు ఆమె కథకురాలు, నిర్మాత కావడం అరుదు. 'డియర్ ఉమ' చిత్రంతో సుమయ రెడ్డి ఇలా తన బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శిస్తున్నారు. పృథ్వీ అంబర్ ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నారు. సాయి రాజేశ్ మహాదేవ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'డియర్ ఉమ' చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఇదొక ప్రేమ కావ్యం అని టీజర్ చూశాక అనిపించింది. ప్రేమ ఇచ్చే సంతోషాన్ని, బాధను అద్భుతంగా మలిచిన భావన కలుగుతుంది. 'నా క్షణాల్లో జీవం నీ కళ్లు.. నా నరాల్లో ప్రవాహం నీ చూపు', 'ప్రేమ అనేది ఓ అనిర్వచనీయమైన నిర్వచనం', 'అబ్బాయిల ప్రేమలో స్వార్థం ఉండదు.. అమ్మాయిల స్వార్థంలోనే ప్రేమ ఉంటుంది. అమ్మాయిలు ఇచ్చే షాకులకు అబ్బాయిలకు ఇదే సరైన మెడిసిన్..వంటి డైలాగులు సినిమాలో డెప్త్‌ను చాటాయి. అందమైన ప్రేమ కథాచిత్రంగా రూపుదిద్దుకున్న 'డియర్ ఉమ' షూటింగ్ పూర్తయిందనీ, త్వరలో విడుదల చేస్తామనీ దర్శకనిర్మాతలు చెప్పారు.

కాలం రాసిన ఆరు కథలు



సాగర్, వికాస్, అభిలాష్, రోహిత్, రవితేజ, హరి, శ్రుతి శంకర్, నిహారికా చౌదరి, ఉమ, హస్విక, పల్లవి రేష్మ ముఖ్య పాత్రలు పోషించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఎం.ఎస్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను బుధవారం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీధర్ విడుదల చేశారు. ఫ్యామిలీ, లవ్, సస్పెన్స్ జానర్‌లో ఈ చిత్రం రూపొందడం విశేషం. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరి జీవితంలోనూ కాలం కొన్ని కథలు రాస్తుంది. మనం ఏదో అవుదామని వస్తే మరేదో అవుతాం. దానిని బట్టే జర్నీ ఉంటుంది. దర్శకుడు సాగర్ ఈ చిత్రానికి మంచి టైటిల్ ఎన్నుకోవడంలోనే సగం విజయం సాధించారు. పలు కథలను కలిపి సినిమా తీయడం అభినందనీయం' అన్నారు. 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించిన ఈ ప్రేమకథలో అన్ని రకాల ఎమోషన్స్ ఉన్నాయి. మొత్తం కలసి ఆరు కథలు ఇందులో ఉంటాయి. సహజత్వానికి దగ్గరగా ఉంటుందని కొత్త తారలతో తీశాం. మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరిగింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా పూర్తయింది. అందరినీ అలరించే సినిమా అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు.

కౌన్సెలింగ్

వాటిని వాడితే?

లైంగిక ఆరోగ్యం, చికిత్సల పట్ల అవగాహన పెంచాలనే ఉద్దేశంతో రూపొందిన ఒక తాజా వాణిజ్య ప్రకటన దేశవ్యాప్తంగా సంచలనాన్ని సృష్టిస్తోంది. ప్రముఖ బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్, అశ్లీల నటుడు జానీ సిన్స్‌లతో ఒక సీరియస్ విషయాన్ని హాస్యచతురతతో వివరించడానికి చేసిన ఈ ప్రయత్నం విశ్రమ స్పందనలకు అందుకుంటోంది. అయితే ఇంతకూ ఈ వాణిజ్య ప్రకటన ద్వారా ప్రచారం కల్పిస్తున్న లైంగిక ఉత్పత్తుల ప్రామాణికత ఎంత? వీటిని ఎవరు, ఎలా, ఎప్పుడు, ఎందుకు వాడుకోవచ్చు? పురుష లైంగిక సమస్యలకు ఈ ఉత్పత్తులతో శాశ్వత పరిష్కారం దక్కుతుందా? వైద్య నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం!



లైంగిక విషయాలు, సమస్యలు, లోపాల గురించి బహిరంగంగా చర్చించడానికీ, ఇతరులతో పంచుకోడానికీ అందరూ సుముఖంగా ఉండరు. అందుకు బిడియం కొంత కారణమైతే, ఇతరులు చిన్నచూపు చూస్తారేమోననే భయం మరొక కారణం. అలాగే చిన్నాచితకా లైంగిక సమస్యలను ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో ఎదుర్కోవడం అత్యంత సహజం. అలాంటప్పుడు జ్వరం మాత్రల్లా, ఇలాంటి మందులు కూడా తేలికగా అందుబాటులో ఉంటే వాటిని వాడుకోవచ్చు కదా? అని అనిభావించేవాళ్లు ఎక్కువ! ఈ కోవకు చెందిన వాళ్ల కోసం కొన్ని కంపెనీలు పలు రకాల లైంగిక ఉత్పత్తులను మార్కెట్లోకి తెస్తున్నాయి. తాజాగా సంచలనం సృష్టిస్తున్న వాణిజ్య ప్రకటన కూడా లైంగిక ఉత్పత్తులకు సంబంధించినదే! ఇలాంటి మందులతో ప్రయోజనాలూ ఉన్నాయి, అంతే సమానంగా దుష్ప్రయోజనాలూ ఉన్నాయి.

ఎవరు - ఎంత కాలం?

ఈ ఉత్పత్తుల్లో ఔషధ మోతాదులు తక్కువ. పైగా ఈ కంపెనీల ఉత్పత్తులన్నీ పురుష హార్మోన్లను పెంచే వృక్షసంబంధ ఉత్పత్తులే అయి ఉంటాయి. ఇతరత్రా దుష్ప్రభావాలు తలెత్తి న్యాయపరమైన ఇబ్బందుల్లో చిక్కుకోకుండా ఉండడం కోసం కంపెనీలు తీసుకునే ముందు జాగ్రత్తలివి. కాబట్టి ఎటువంటి డయాగ్నొసిస్ అవసరం లేకుండా, స్వల్ప లైంగిక సమస్యలను ఎదుర్కొనే వాళ్లు మాత్రమే ఈ ఉత్పత్తులను వాడుకోడానికి అర్హులు. అలాగే డెపెండెన్సీకి గురి కాకుండా ఉండడం కోసం ఈ ఉత్పత్తులను అదే పనిగా వాడుకోకుండా రెండు నెలలకు పరిమితం చేయాలి. కొందర్లో ఈ మందులు వాడినా అంతగా ప్రభావం కనిపించకపోవచ్చు. అలాంటప్పుడు మానసికంగా కుంగిపోకుండా ఆండ్రాలజిస్టులను కలిసి తగు మోతాదుతో కూడిన మందులను వాడుకోవాలి. లైంగిక సామర్థ్యాన్ని పెంచే ఉత్పత్తులు తాత్కాలిక ఫలితాన్ని మాత్రమే అందించగలుగుతాయి తప్ప, అంతర్లీన కారణాన్ని సరిదిద్ది సమస్యను శాశ్వతంగా నయం చేయలేవనే విషయాన్ని అందరూ తెలుసుకోవాలి.

సురక్షితమైనవే.. అయినా

ఈ ఉత్పత్తులను సదరు వెబ్‌సైట్ ద్వారా కొనుగోలు చేసేటప్పుడు, ఉచిత వైద్యుల కన్సల్టేషన్ అనే ఒక క్లాజ్ స్పష్టంగా పేర్కొని ఉంటుంది. కంపెనీ ప్యానల్‌లో ఒకరిద్దరు ఎమ్‌బిబిఎస్ వైద్యులు ఉండి, ఉత్పత్తులను ఆర్డర్ చేసిన కొనుగోలుదారులను వాళ్ల ఫోన్‌లో సంప్రతించి, సమస్య గురించి తెలుసుకుని తగిన ఉత్పత్తులను సూచించడం జరుగుతూ ఉంటుంది. ఈ ఉత్పత్తుల్లో ఆండ్రాలజిస్టులు శీఘ్రస్కలనాలకు సూచించే డెపాక్సిటీన్, టెడలాఫిల్ లాంటి ఔషధాలే ఉంటూ ఉంటాయి. వీటితో పాటు సహజసిద్ధంగా పురుష హార్మోన్ టెస్టోస్టెరాన్‌ను పెంచే మూలికా మందులు, న్యూట్రాస్యూటికల్స్ కూడా ఉంటూ ఉంటాయి. అమేజాన్‌లో కొనుగోలు చేసుకుని వాడుకుంటున్న అశ్వగంధ, శిలాజిత్తు మాదిరిగానే వీటిని కొనుగోలు చేసి వాడుకోవడం ప్రమాదకరం కాదు. లైంగిక ఆరోగ్యం పట్ల అవగాహన ఏర్పడడానికీ ఇలాంటి ప్రకటనలు తోడ్పడితే, లైంగిక సామర్థ్యం తగ్గినా వైద్యులను కలవడానికి ఇష్టపడని పురుషులకు ఇలాంటి ఉత్పత్తులు ఎంతో కొంత ఉపయోగపడతాయి అనడంలో ఎలాంటి అనుమానం లేదు. వైద్యులను కలవడానికి వెనకాడే పురుషులు వీటిని వాడుకుని కొంత ఫలితాన్ని పొందే ప్రయత్నం చేయడంలో తప్పు లేదు. అయితే ఇక్కడొక తిరకాసు ఉంది.

తప్పుదారి పట్టించవచ్చు

పురుష లైంగిక సమస్యలకు మూలకారణాలను కనిపెట్టకుండా ఇలాంటి ఉత్పత్తులను వాడుకుంటూ పోవడం ఎంతవరకూ సమంజసం? ఉదాహరణకు స్తంభన సమస్యకు ఎన్నో కారణాలుంటాయి. అలాంటి ఒక వ్యక్తి ఎదుర్కొంటున్న స్తంభన సమస్యకు రక్తనాళాలు ఇరుకుగా మారడం కారణమైతే, ఇలాంటి మందులు వాడుకోవడం వల్ల ఆ సమస్యను ప్రారంభంలో సమర్థంగా, శాశ్వతంగా సరిదిద్దే అవకాశాన్ని కోల్పోవడంతో పాటు, దీర్ఘకాలంలో ఆ సమస్య మరింత తీవ్రమై చికిత్సతో సరిదిద్దలేని స్థితికి చేరుకునే ప్రమాదం ఉంటుంది. ఇలా కొందర్లో అంతర్లీన సమస్యను ఆలస్యంగా గుర్తించడం వల్ల, అది చికిత్సకు లొంగక, పరిస్థితి పూర్తిగా చేయి దాటిపోవచ్చు. ఇదొక కోణం. అలాగే ఈ మందులతో కొంత మేరకు సామర్థ్యం పెరగడంతో, మందులు వాడకుండా ఉండలేని డిపెండెన్సీ సమస్య కూడా కొందర్లో తలెత్తే ప్రమాదం ఉంటుంది. టెస్టోస్టెరాన్ హార్మోన్ మోతాదు తగ్గడం మూలంగా సమస్య తలెత్తిన కొందర్లో ఈ ఉత్పత్తులను అదే పనిగా వాడుకోవడం వల్ల హార్మోన్ మోతాదు విపరీతంగా పెరిగి వీర్య ఉత్పత్తి తాత్కాలికంగా తగ్గిపోవచ్చు. స్పర్శను పోగొట్టి, మొద్దుబారేలా చేసే అనస్థీషియాను పోలిన లిడోకైన్ స్ప్రేలు కూడా ఈ ఉత్పత్తుల్లో ఉంటున్నాయి. ఈ స్ప్రేతో దుష్ప్రభావాలు లేకపోయినా పిల్లల కోసం ప్రయత్నిస్తున్న వాళ్లు వీటిని వాడిన అరగంట తర్వాత, శుభ్రం చేసుకుని, పిల్లల కోసం ప్రయత్నించాలి. లేదంటే గర్భధారణ సమస్యలు తలెత్తవచ్చు.

డాక్టర్ రాహుల్ రెడ్డి, ఆండ్రాలజిస్ట్,
ఆండ్రోకేర్ ఆండ్రాలజీ ఇన్‌స్టిట్యూట్,
హైదరాబాద్.

అతిలోక సుందరి శ్రీదేవి... బడా నిర్మాత బోనీ కపూర్‌ల కూతురుగా... బాలీవుడ్ ఎంట్రీకి ముందు **జాన్వీ కపూర్**పై భారీ అంచనాలు ఉన్నాయి. వాటిని అందుకోవడం అంత సులువు కాదని తెలిసినా... ఆమె అభినయంపై ఎక్కుపెట్టిన విమర్శనాస్త్రాలు లెక్కకు మించాయి. 'కానీ వాటిని తట్టుకొని... మానసికంగా దృఢంగా నిలబడగలిగానంటే అందుకు క్రమం తప్పని వ్యాయామం, యోగా, ఆహార నియమాలే కారణం' అంటుంది జాన్వీ.

అభిమానుల ధడక్



ఆరేళ్ల కిందట 'ధడక్'తో బాలీవుడ్‌లోకి ఘనంగా ఎంట్రీ ఇచ్చింది జాన్వీ కపూర్. ఆ కమర్షియల్ హిట్‌తో కుర్రకారు 'హార్ట్‌బీట్' అయింది ఈ బ్యూటీ. తరువాత అవకాశాలు క్యూ కట్టినా... అభినయానికి ఆస్కారంగల పాత్రలనే ఎంచుకొంటూ ముందుకు సాగుతోంది. ముఖ్యంగా కథానాయిక చుట్టూ తిరిగే కథలకే ప్రాధాన్యం ఇస్తోంది. 'అలాంటి చిత్రాల్లో నటిస్తుంటే మహిళా సాధికారత సాధించిన అనుభూతి కలుగుతుంది. వైవిధ్యమైన, ప్రయోగాత్మక పాత్రలు పోషించడం ద్వారా నటనకు సంబంధించి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చు. అన్నిటికీ మించి ప్రేక్షకులకు విభిన్న కథలు అందించడంలో ఉండే అనుభూతి వెలకట్టలేనిది' అంటున్న జాన్వీ ఇప్పటికి ఎనిమిది చిత్రాల్లో నటించింది. మంచి నటిగానూ గుర్తింపు తెచ్చుకుంది. 'గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్'లో అద్భుత అభినయానికి ఉత్తమ నటిగా 'ఫిలిమ్‌ఫేర్ అవార్డు' దక్కించుకుంది. ప్రస్తుతం తెలుగులో జూనియర్ ఎన్టీఆర్‌తో కలిసి 'దేవర'లో నటిస్తోంది. తెలుగులో ఆమెకు ఇదే తొలి చిత్రం.

'నటిని కావాలని అనుకోని రోజు నాకు గుర్తు లేదు' అంటున్న జాన్వీ కుటుంబం దశాబ్దాలుగా సినీ పరిశ్రమతో మమేకమైపోయింది. తల్లిదండ్రులతో పాటు అనిల్ కపూర్, సంజయ్ కపూర్, సోనమ్ కపూర్, అర్జున్ కపూర్... ఇలా జాన్వీ కుటుంబంలో అందరూ బాలీవుడ్‌లో ప్రముఖులే. ముంబయి 'ఎకోల్ మొండియల్ వరల్డ్ స్కూల్'లో చదివిన ఆమె... నటనే తన కెరీర్ అని చిన్నప్పుడే నిర్ణయించుకుంది. అమెరికా కాలిఫోర్నియాలోని 'లీ స్ట్రాస్‌బెర్గ్ థియేటర్ అండ్ ఫిలిమ్ ఇనిస్టిట్యూట్'లో యాక్టింగ్ కోర్సు పూర్తి చేసింది. తిరిగి వచ్చాక నటనతో పాటు క్యాట్‌వాక్‌లతో అదరగొట్టింది. ర్యాంప్‌పై నడుస్తూ... సరికొత్త ట్రెండ్స్‌ను పరిచయం చేస్తూ... నవతరం 'ఫ్యాషన్ ఐకాన్'గానూ పేరు తెచ్చుకుంది. పలు అవార్డులు గెలుచుకుంది.

ప్రతికూలతలు పక్కనపెట్టి...

అందరు సినీ వారసుల్లానే జాన్వీ కపూర్‌కు కూడా ఆరంభంలో విమర్శలు, ఎత్తిపొడుపులు ఎదుర్కోక తప్పలేదు. మొదటి చిత్రానికే ఆమె తల్లి శ్రీదేవితో పోల్చి 'ప్రతిభ లేకపోయినా తెరమీదకు వచ్చింది' అనేలా సామాజిక మాధ్యమాల్లో ఎన్నో రకాల వ్యాఖ్యలు, విమర్శలు. 'ఆరంభంలో అలాంటి వ్యాఖ్యలు చూసి చాలా బాధపడేదాన్ని. వాటి గురించే ఆలోచించేదాన్ని. కానీ ఇప్పుడు... అసలు అలాంటి నెగెటివ్ కామెంట్స్‌ను పట్టించుకోవడమే మానేశాను. పాజిటివ్ కామెంట్స్ మాత్రమే తీసుకొంటున్నాను. దానివల్ల నా మనసు ఎంతో ప్రశాంతంగా ఉంటోంది. మనం ఏం చేసినా కొంత మంది వేలెత్తి చూపిస్తుంటారు. అది వారి నైజం. అర్థవంతమైన విమర్శలను స్వీకరించడానికి నేను ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాను. వాటి నుంచి నేర్చుకోవడానికి ప్రయత్నిస్తాను. ప్రతి దాంట్లో రంధ్రాన్వేషణ చేసే వారి గురించి ఆలోచించడం ఎప్పుడో మానేశాను'... అంటూ ఓ సందర్భంలో చెప్పుకొచ్చింది జాన్వీ.

సహజ సౌందర్యం...

'సినీ తారలనగానే ఎప్పుడూ అపురూపంగా కనిపించాలనే అభిప్రాయం ఉంది. దానివల్ల ఎక్కడికి వెళ్లాలన్నా ముస్తాబు అవ్వక తప్పని పరిస్థితి. నాకు అలాంటివి నచ్చవు. జనంలో అయినా... సన్నిహితుల మధ్యనైనా... ఎలాంటి పైపూతలు లేకుండా నేను నేనుగా, సహజంగా ఉండాలనుకొంటాను. ఎవరేమనుకొంటారో అనేది అసలు పట్టించుకోను' అంటున్న జాన్వీ... నటనతో పాటు ఫిట్‌నె‌స్‌కు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఎందుకంటే అదే తనను నిత్యనూతనంగా ఉంచడంలో దోహదపడుతోందని అంటోంది.

వర్కవుట్ ఇలా...

కాలేజీ రోజుల్లో ఫిట్‌గా ఉండడం అంటే సన్నగా కనిపించడమనే భావన ఉండేది జాన్వీకి. 'తరువాత అర్థమైంది... మనిషి దృఢంగా ఉండడం అంటే రోజూ వ్యాయామం చేయడం, బలవర్థకమైన ఆహారం తినడం, ఆరోగ్యంగా ఉండడం అని. నా ఫిట్‌నెస్ జర్నీ చిన్న చిన్న వ్యాయామాలు, సమతుల ఆహారంతో మొదలైంది. పంచదార, జంక్ ఫుడ్ పూర్తిగా ఆపేయాల్సి వచ్చింది. క్రమంగా వర్కవుట్ పెంచుకొంటూ పోయాను. అప్పట్లో కష్టమనిపించినా... ఇప్పుడు అలవాటైపోయింది. నాకు అలియా భట్‌ను చూస్తుంటే ఎంతో ప్రేరణగా అనిపిస్తుంది. పాత్రల ఎంపిక, వాటి కోసం ఆమె పడే తపన నిజంగా అభినందనీయం. ఇక ఫిట్‌నెస్‌లో స్ఫూర్తి మా చాచా అనిల్ కపూర్. 66 ఏళ్ల వయసులో కూడా యువకుడిలా కనిపించడం ఆయనకే సాధ్యం'... ఇదీ జాన్వీ మాట. ఒకప్పుడు బొద్దుగా ఉన్న ఈ ముద్దుగుమ్మ కఠోరంగా శ్రమించి నాజూకు బొమ్మగా తయారైంది.

వర్కవుట్ ఇలా...

జాన్వీ కపూర్ రోజువారీ వ్యాయామాల్లో కార్డియో, స్ట్రెంత్ ట్రైనింగ్, యోగా ఉంటాయి.

- ఉదయం ముందుగా రన్నింగ్, సైక్లింగ్ లేదంటే డ్యాన్స్‌తో కూడా 45 నిమిషాల కార్డియో సెషన్. దీనివల్ల అదనపు కేలరీలు కరుగుతాయి.
- స్క్వాట్స్, పుషప్స్, లంగెస్, వెయిట్ లిఫ్టింగ్ తదితర వ్యాయామాలు. వీటివల్ల శరీర సామర్థ్యం పెరుగుతుంది.
- తరువాత యోగా సెషన్. దీంతో శరీరం ఫ్లెక్సిబుల్‌గా తయారవుతుంది.
- కాసేపు ధ్యానం. ఇది ఒత్తిడులను దూరం చేస్తుంది. మానసిక ప్రశాంతతను, ఏకాగ్రతను ఇస్తుంది.

ఇదీ మెనూ...

ఆరోగ్యకరమైన, పోషక విలువలు, పిండి పదార్థాలుగల సమతుల ఆహారం జాన్వీ మెనూలో ఉంటుంది.

- ఉదయం లేవగానే నిమ్మరసం, తేనె కలిపిన గ్లాసుడు గోరువెచ్చటి నీరు.
- బ్రేక్‌ఫాస్ట్‌లో గుడ్లు, బ్రెడ్ టోస్ట్, గ్రీన్ టీ
- మధ్యాహ్న భోజనంలో గ్రిల్డ్ చికెన్ లేదా వెజిటబుల్స్, బ్రౌన్ రైస్‌తో ఫిష్.
- సాయంత్రం స్నాక్స్‌గా ఫ్రూట్ స్మూతీ, బాదం, పిస్తా, జీడిపప్పు.
- డిన్నర్‌కు సూప్, గ్రిల్డ్ ఫిష్ లేదా చికెన్, సలాడ్.

అంతేకాదు... శరీరం డీహైడ్రేట్ కాకుండా తరచూ మంచినీళ్లు తాగుతుంది. ప్రాసెస్డ్ ఫుడ్స్, సుగర్ డ్రింక్స్‌కు దూరంగా ఉంటుంది. సాధ్యమైనంతవరకు ఇంటి వంటకే ప్రాధాన్యం ఇస్తుంది.

బరువు తగ్గటానికి కృతి పాఠాలు!

బరువు ఎవరికైనా శారీరకంగానే కాదు.. మానసికంగా కూడా బరువే! అయితే దాన్ని అధిగమించినప్పుడే తాము అనుకున్న లక్ష్యాలను చేరుకోగలుగుతారు. అలాంటి వ్యక్తే ఫరీదాబాద్‌కు చెందిన కృతి గుప్తా. 27 ఏళ్ల వయస్సున్న కృతి వృత్తిపరంగా ఒక లాయర్. అయితే ఆమెకు బరువు ఒక శాపంగా మారింది. దీని నుంచి బయటపడటానికి ఆమె కొన్ని మార్గాలన్వేషించింది.. పది నెలల్లో 40 కేజీల బరువు తగ్గింది. ఈ క్రమంలో ఆమె నేర్చుకున్న పాఠాలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అయ్యాయి. ఆ పాఠాలేమిటో మనం తెలుసుకుందాం.



బాడీ పాజిటివిటీ

మనం ఎలాంటి షేప్‌లో ఉన్నా- అందంగా, ఆరోగ్యంగా ఉన్నామనుకుంటాం. ఆరోగ్యంగా ఉన్నామనే భావనను బలోపేతం చేసుకుంటూ జీవితంలో ముందుకు వెళ్లిపోతాం. దీని వల్ల కలిగే దుష్పరిణామాలను గాలికి వదిలేస్తాం. కొన్ని సార్లు మార్పు కోసం ప్రయత్నాలు మొదలుపెట్టినా- కొద్దిగా కష్టం అనిపించినా వదిలేస్తాం. అలా కాకుండా ఒకో అడుగు వేసుకుంటూ ముందుకు వెళ్లినప్పుడు లక్ష్యం చేరుకుంటాం. ఉదాహరణకు కృతికి నడక మొదలుపెట్టిన మొదట్లో విపరీతమైన ఆయాసం వచ్చేది. "ఆ సమయంలో నేను ఆగలేదు. ప్రతి రోజు నడుస్తూనే ఉండేదాన్ని. దీని వల్ల క్రమంగా వేగం పెరిగింది. ఆయాసం తగ్గింది. అంతే కాదు.. ఫిట్‌గా ఉండటం తెలిసిన తర్వాత- గతంలో నేనెంత అన్‌ఫిట్‌గా ఉన్నానో అర్థమయింది" అంటారు కృతి.

సరైన అవగాహన

చాలా సందర్భాలలో ఏదైనా పని ప్రారంభించే ముందు- ఆ పని గురించి సరైన అవగాహన ఉండదు. దీని వల్ల ఆ పని సగంలోనే ఆగిపోతుంది. కానీ కృతి తాను చేరుకోవాలనుకొన్న లక్ష్యం గురించి.. దానికి ఏ మార్గంలో ప్రయాణించాలనే విషయం గురించి స్పష్టమైన అవగాహన ఏర్పరుచుకుంది. ఈ క్రమంలో కొన్ని తప్పులు చేసింది. కానీ వాటిని సరిదిద్దుకుంది. దీని వల్ల ఒకప్పుడు వంద మీటర్లు కూడా నడవలేని కృతి ప్రస్తుతం 21 కిలోమీటర్ల మారథాన్‌లో పాల్గొంటోంది.

ఏ ఇద్దరూ ఒకటి కాదు..

ప్రతి వ్యక్తి శరీరం తీరు.. దాని అవసరాలు భిన్నంగా ఉంటాయి. బరువు తగ్గాలంటే- మన శరీరానికి తగిన ఆహారం తీసుకోవాలి. తగిన వ్యాయామం చేయాలి. ఇవి జరగనంత కాలం లక్ష్యం చేరుకోలేం. కృతి ఈ విషయాన్ని ముందే గ్రహించింది. ముందు తన శరీరం పనితీరుపై అవగాహన ఏర్పరుచుకుంది. దానికి తగిన రీతిలో ఆహారాన్ని తీసుకుంది. ఫిట్‌గా అయింది.

కొందరికి అజీర్తి ఎప్పుడూ ఉంటుంది. దీని వల్ల వారు అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఉంటారు. అలాంటి వారు ఈ క్రింది ఆహార పదార్థాలు తింటే మంచిదని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు. అవేమిటో చూద్దాం..

అజీర్తికి ఆయుర్వేదం చిట్కాలు!

1

బాదంపప్పు

ఆయుర్వేద శాస్త్ర ప్రకారం బాదంపప్పులకు కొన్ని ప్రత్యేకతలున్నాయి. వీటిలో అజీర్తిని తగ్గించే గుణం ఒకటి. కేవలం అజీర్తి తగ్గించటమే కాకుండా నాడీ వ్యవస్థను ఉత్తేజపరచటంలో బాదంపప్పు ప్రముఖ పాత్ర వహిస్తుంది. అందువల్లే ప్రతి రోజు ఉదయం నానబెట్టిన బాదం పప్పులను తినమని ఆయుర్వేద వైద్యులు సలహా ఇస్తూ ఉంటారు.

2

తగినంత నూనె

ఆహారంలో తగినంత నూనె, కొవ్వులు లేకపోతే అజీర్తి చేసే అవకాశముంది. అందువల్ల ఆహారంలో నూనెలను తప్పనిసరిగా ఒక భాగం చేయాలి. నువ్వుల నూనె, నెయ్యి, ఆలీవ్ నూనెలను తగిన మోతాదుల్లో తీసుకుంటే అజీర్తి సమస్య దూరం అవుతుంది. చాలా ప్రాంతాల్లో అజీర్తి సమస్య నివారణకు ఆముదాన్ని వాడతారు.

3

పళ్లు

బాగా ముగ్గిన అరటిపళ్లు, యాపిల్స్ బొప్పాయి వంటి వాటి వల్ల అజీర్తి దూరం అవుతుంది. సాధారణంగా పళ్లను ఆహారాన్ని తినే ఒక గంట ముందు కానీ తిన్న ఒక గంట తర్వాత కానీ తీసుకోవాలి.

ఇంటింటి చిట్కాలు

ఆయుర్వేద శాస్త్ర ప్రకారం వాతదోషం వల్ల అజీర్తి కలుగుతుంది. ప్రతి ఇంట్లో ఉపయోగించే వెల్లుల్లి, ఉప్పుల వల్ల అజీర్తి చాలా వరకు తగ్గుతుంది. ఇంగువ వల్ల కూడా అనేక ప్రయోజనాలు ఉంటాయి.



పర్మనెంట్ బ్యూటీ

ముఖంలోని కొన్ని లోపాలను మేకప్‌తో తాత్కాలికంగా దాచుకోవచ్చు. అవే లోపాలను మేకప్‌తో పని లేకుండా దీర్ఘకాలం పాటు దాచగలిగే చికిత్స 'పర్మనెంట్ మేకప్'. ఈ మేకప్ మతలబులు ఇవే!

అందమైన కనుబొమల కోసం...

కనుబొమలకు ఆకర్షణీయమైన ఆకృతిని అందించడంతో పాటు, ఒత్తుగా కనిపించేలా చేయడం కోసం ఉద్దేశించిన బ్రోషేపింగ్ ఇది. కొందరి కనుబొమలు పలుచగా ఉంటాయి. ఇంకొందరికి ఆకృతి లేకుండా ఉంటాయి. ఇలాంటి వాళ్ల కనుబొమలను మైక్రో పిగ్మెంటేషన్ సహాయంతో అందంగా తీర్చిదిద్దుకోవచ్చు. కనుబొమల్లో టాటూ ఇంకుతో వెంట్రుకల రూపంలో స్ట్రోక్స్ ఇవ్వడం ద్వారా సహజసిద్ధ వెంట్రుకలను తలపించేలా చేయవచ్చు.

పెదవులను తీర్చిదిద్దడం కోసం...

పింక్ లిప్స్ కోరుకునేవాళ్లు, నల్లని పెదవులున్నవాళ్లు, సగం తెలుపు రంగు పెదవులు కలిగి ఉన్నవాళ్లు పర్మనెంట్ లిప్‌స్టిక్‌ను ఎంచుకోవచ్చు. దీన్లో రంగులను ఎంచుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే రంగు వేసిన తర్వాత తొలగించుకోవడం కష్టం కాబట్టి ఒకటికి రెండు సార్లు ఆలోచించి, రంగును ఎంచుకోవాలి. ఈ రంగు కూడా రెండు నుంచి మూడేళ్లకు వెలిసిపోతుంది. కాబట్టి మళ్లీ టచప్స్ అవసరమవుతాయి. రంగు ఇంక్‌ను ఇంజెక్ట్ చేయడం కోసం పెదవుల మీద ఎక్కువసార్లు గుచ్చడం జరుగుతుంది. కాబట్టి చికిత్స తర్వాత పెదవులు వాచే అవకాశాలుంటాయి. ఈ వాపు వారంలో తగ్గిపోతుంది. రెండు నుంచి మూడు వారాల తర్వాత అవసరమైతే రెండోసారి టచప్ కూడా చేయవలసి ఉంటుంది. ఈ చికిత్సతో లిప్ కలర్‌తో పాటు లిప్ లైన్ కూడా మెరుగు చేసుకోవచ్చు.

కనురెప్పలకు ఐ లైనర్...



పర్మనెంట్ ఐలైనర్ కూడా వేయించుకోవచ్చు. ఇందు కోసం నలుపు పిగ్మెంట్‌నే ఉపయోగిస్తూ ఉంటారు. అయితే ఈ చికిత్స ఎంతో సున్నితమైన కంటికి దగ్గరగా సాగుతుంది. కాబట్టి అనుభవజ్ఞులైన వైద్యులను ఎంచుకోవాలి. ఐ లైన్ పొడవు, వెడల్పులను కూడా ముందుగానే కచ్చితంగా అంచనా వేసి, పర్మనెంట్ ఐలైనర్ వేయించుకోవాలి.

స్కాల్ప్ మైక్రో పిగ్మెంటేషన్

కొందరికి నుదుటి దగ్గర హెయిర్ లైన్ తరిగిపోతూ ఉంటుంది. వెంట్రుకలు ఒత్తుగా తలపించేలా చేసే పౌడర్లు, స్ప్రేలు అందుబాటులో ఉన్నప్పటికీ పర్మనెంట్ మేకప్‌తో ఎక్కువ కాలం పాటు ఆ ప్రభావాన్ని పొందే వీలుంటుంది. నుదుటి దగ్గరి వెంట్రుకలు పలుచబడినప్పుడు పర్మనెంట్ మేకప్‌లో భాగంగా వెంట్రుకలను తలపించేలా ఆ ప్రదేశాన్ని రంగుతో నింపుకోవచ్చు.

కొరియన్ బిబి గ్లో

ఇది బ్లెమిష్ బామ్. మచ్చలను చర్మంలో కలిసిపోయేలా చేసి, మెరుపును తెచ్చిపెట్టే చికిత్స. ఈ చికిత్సలో చర్మపు రంగుకు దగ్గరగా ఉండే పిగ్మెంటును ఉపయోగిస్తారు కాబట్టి ఫలితం సంతృప్తికరంగా ఉంటుంది. ఈ చికిత్సలో బిబి క్రీమ్‌ను అప్లై చేసి, డెర్మా పెన్ ద్వారా ఆ క్రీమ్‌ను చర్మం పైపొరల్లోకి చొప్పించడం జరుగుతుంది. ఈ చికిత్స ఫలితం ఏళ్ల తరబడి ఉండదు. కొన్ని వారాలు, నెలల్లోనే మెరుపు తగ్గడం మొదలుపెడుతుంది. కానీ ఈ చికిత్సకు సంబంధించిన దీర్ఘకాల ప్రభావాలు, దుష్ప్రభావాల గురించిన శాస్త్రీయ ఆధారాలు ఇంకా అందుబాటులో లేవు. కాబట్టి ఈ చికిత్సను ఆశ్రయించేవారు ఆచితూచి అడుగులేయడం ఉత్తమం. ఈ చికిత్సలో భాగంగా పిగ్మెంట్‌ను చర్మం అడుగుకి ఇంజెక్ట్ చేయడం జరుగుతుంది.

వీళ్లు అప్రమత్తం

కొంతమందికి కిలాయిడ్ టెండెన్సీ, స్కారింగ్ టెండెన్సీ ఉంటుంది. ఇలాంటి వాళ్లకు ఆ ప్రదేశంలో కండ పెరగడం లేదా మచ్చ ఏర్పడడం జరుగుతుంది. కాబట్టి ఈ కోవకు చెందిన వాళ్లు పర్మనెంట్ మేకప్‌కు దూరంగా ఉండాలి. గాయం మానడంలో సమస్యలను ఎదుర్కొనేవాళ్లు కూడా అప్రమత్తంగా ఉండాలి. కొందరికి కనెక్టివ్ టిష్యూ డిజార్డర్లు ఉంటాయి. వాళ్లకు రియాక్షన్లు తలెత్తే అవకాశాలు ఎక్కువ. అలాగే సున్నిత చర్మం కలిగిన వాళ్లు, అలర్జీ తత్వం కలిగిన వాళ్లు కూడా దీనికి దూరంగా ఉండడమే ఉత్తమం.



డాక్టర్ స్వప్నప్రియ,
డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్ క్లినిక్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.

దుష్ప్రభావాలు లేకుండా...

పర్మనెంట్ మేకప్‌తో దుష్ప్రభావాలు లేకుండా ఉండాలంటే అనుభవజ్ఞులైన డెర్మటాలజిస్ట్‌తో చేయించుకోవాలి. నాణ్యమైన ఇంకు వాడకపోయినా, చికిత్సలో ఉపయోగించే నీడిల్స్ అశుభ్రంగా ఉన్నా ఇన్‌ఫెక్షన్లకు, రియాక్షన్లకూ ఆస్కారం ఉంటుంది. ఇంకు నాణ్యత తక్కువగా ఉంటే, అది తక్కువ కాలంలోనే వెలిసిపోయే అవకాశాలు కూడా ఉంటాయి. అలాగే పిగ్మెంట్ రంగు కచ్చితంగా చర్మానికి నప్పినప్పుడే ఆకర్షణీయంగా కనిపిస్తాం. కాబట్టి ఈ విషయంలో కూడా పొరపాట్లు జరగకుండా చూసుకోవాలి.

కృత్రిమ మేధతో కొలువులకు ఢోకా లేదు



టెక్ మహీంద్రా మాజీ సీఈఓ సీపీ గుర్నానీకి జీవితకాల సాఫల్య పురస్కారం అందజేస్తున్న హైసియా ప్రెసిడెంట్ మనీషా సాబు, చిత్రంలో జయేశ్ రంజన్, రాజన్న తదితరులు

2026 నాటికి 10 లక్షల ఉద్యోగాలు

» టీసీఎస్ ప్రెసిడెంట్ వీ రాజన్న

హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ)తో ఉద్యోగాలు పోతాయన్న భయాలను టీసీఎస్ (టెక్నాలజీ, సర్వీసెస్ అండ్ సాఫ్ట్‌వేర్) ప్రెసిడెంట్ వీ.రాజన్న తోసిపుచ్చారు. వచ్చే రెండేళ్లలో ఈ రంగంలో 10 లక్షల కొత్త కొలువులు ఏర్పడతాయన్నారు. అయితే ఇందుకోసం అభ్యర్థులు, ఉద్యోగులు కొత్త నైపుణ్యాలు అలవర్చుకోవాల్సి ఉంటుందన్నారు. బుధవారం నాడిక్కడ హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) నిర్వహించిన 'ఏఐ:సెలబ్రేటింగ్ ది ఫ్యూచర్' సదస్సులో ఆయన ఈ విషయం చెప్పారు. వచ్చే కొద్ది సంవత్సరాల్లో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఏఐ ఆధారిత పరిశ్రమల వాటా 39.4 శాతానికి చేరుతుందని కూడా రాజన్న చెప్పారు.

ఏఐ ఓ అవకాశం: గుర్నానీ

ఈ సదస్సులో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అందుకున్న టెక్ మహీంద్రా మాజీ సీఈఓ, ఎండీ సీపీ గుర్నానీ మాట్లాడుతూ.. 'ఏఐ ఒక అవకాశం' అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరేసరికి, ఏఐ ఆధారిత పరిశ్రమల వాటా 50,000 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుంటుందన్న మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటనను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

వృద్ధికి అపార అవకాశాలు

మన దేశంలో ఏఐ ఆధారిత పరిశ్రమల వృద్ధికి ఢోకా లేదని సదస్సులో పాల్గొన్న సైయెంట్ సీఈఓ కార్తీక్ నటరాజన్ అన్నారు. గత ఏడాది చివరి నాటికి మన దేశంలో ఏఐ ఆధారిత పరిశ్రమల వాటా 15,000 కోట్ల డాలర్లకు చేరిందన్నారు. 2023-2030 మధ్య కాలంలో ఏఐ ఆధారిత పరిశ్రమల సగటు వార్షిక వృద్ధి రేటు 36.8 శాతం వరకు ఉంటుందని తెలిపారు. ఏఐతో నవకల్పనలు, ఆర్థిక అవకాశాలు అపారంగా పెరుగుతాయని నటరాజన్ తెలిపారు. ఈ సదస్సులో హైసియా ప్రెసిడెంట్ మనీషా సాబు, ఎస్‌టీపీఐ హైదరాబాద్ డైరెక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ రియల్టీ మార్కెట్లోకి గోద్రెజ్ ప్రాపర్టీస్

రూ.350 కోట్లతో 12.5 ఎకరాల కొనుగోలు

» ప్రీమియం, లగ్జరీ నివాస గృహ ప్రాజెక్ట్ అభివృద్ధి



న్యూఢిల్లీ: ప్రముఖ రియల్టీ కంపెనీ గోద్రెజ్ ప్రాపర్టీస్ లిమిటెడ్.. హైదరాబాద్ రియల్టీ మార్కెట్లోకి ప్రవేశిస్తోంది. ఇందుకోసం రాజేంద్రనగర్ ప్రాంతంలో 12.5 ఎకరాలు కొనుగోలు చేసింది. ఈ భూమిని ఎంతకు కొన్నదీ కంపెనీ వెల్లడించలేదు. అయితే ఈ లావాదేవీ విలువ రూ.350 కోట్ల వరకు ఉంటుందని పరిశ్రమ వర్గాల అంచనా. ఈ వెంచర్ ద్వారా ప్రీమియం, లగ్జరీ నివాస గృహాలు నిర్మించాలని కంపెనీ భావిస్తోంది. గోద్రెజ్ ప్రాపర్టీస్ హైదరాబాద్ రియల్టీ మార్కెట్లోకి ప్రవేశించడం ఇదే తొలిసారి.

రూ.3,500 కోట్ల ఆదాయం: ఈ ప్రీమియం, లగ్జరీ నివాస గృహాల ప్రాజెక్టు ద్వారా రూ.3,500 కోట్ల వరకు ఆదాయం లభించే అవకాశం ఉందని గోద్రెజ్ ప్రాపర్టీస్ అంచనా. ఈ వెంచర్ ద్వారా 40 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రీమియం, లగ్జరీ అపార్ట్‌మెంట్లు నిర్మించాలని కంపెనీ యోచిస్తోంది. మున్ముందు కూడా హైదరాబాద్ తమకు కీలక మార్కెట్ కానుందని కంపెనీ తెలిపింది. దేశంలోని కీలక నగరాల్లో మా ఉనికిని బలోపేతం చేయాలనుకుంటున్నామని, ఆ వ్యూహంలో భాగంగానే హైదరాబాద్‌లో ఈ భూమి కొనుగోలు చేసినట్లు గోద్రెజ్ ప్రాపర్టీస్ ఎండీ, సీఈఓ గౌరవ్ పాండే తెలిపారు.

ఎన్ఎండీసీ లాభంలో 62% వృద్ధి

హైదరాబాద్ : ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.1,469.73 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.903.89 కోట్లు)తో పోల్చితే లాభం 62 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయాలు కూడా రూ.3,924.75 కోట్ల నుంచి రూ.5,746.47 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో మొత్తం వ్యయాలు కూడా రూ.2,693.01 కోట్ల నుంచి రూ.3,516.78 కోట్లకు పెరిగాయి. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.5.75 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ఆమోదించింది. డివిడెండ్ చెల్లింపునకు రికార్డు తేదీగా ఫిబ్రవరి 27ను ఖరారు చేసింది.

చెల్లింపులు నిలిపివేయండి

వీసా, మాస్టర్‌కార్డ్‌కు ఆర్‌బీఐ ఆదేశం

ముంబై: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు పగ్గాలు బిగించిన తరహాలోనే అంతర్జాతీయ పేమెంట్ దిగ్గజాలు వీసా, మాస్టర్‌కార్డ్‌పై కూడా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆంక్షలు విధించింది. కేవైసీ నిబంధనలు పాటించడంలేదన్న కారణంగా చిన్న, పెద్ద వ్యాపార సంస్థలు చేసే కార్డు ఆధారిత చెల్లింపులను నిలిపివేయాలని ఆ సంస్థలు రెండింటినీ ఆర్‌బీఐ ఆదేశించింది. ఆర్‌బీఐ ఫిబ్రవరి 8వ తేదీన జారీ చేసిన ఆ నోటీసు తమకు అందిందన్న విషయం వీసా ధ్రువీకరించగా మాస్టర్‌కార్డ్ ఇంకా స్పందించాల్సి ఉంది. కొద్ది రోజుల క్రితం పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై నియంత్రణాపరమైన చర్యలు తీసుకున్న నేపథ్యంలోనే ఈ పరిణామం కూడా చోటు చేసుకోవడం విశేషం. దీని వల్ల ఒక వ్యాపార సంస్థ వద్ద చేసిన లావాదేవీని మరో వ్యాపార సంస్థ వద్ద ఆథరైజ్ చేసే సదుపాయం తాత్కాలికంగా నిలిచిపోతుంది. అయితే వాణిజ్య, బిజినెస్ చెల్లింపుల విభాగంలో ఉన్న బిజినెస్ పేమెంట్ సొల్యూషన్ ప్రొవైడర్లందరినీ (బీపీఎస్‌పీ) వారి వ్యాపార కార్యకలాపాలకు సంబంధించిన వివరాలందించాలని ఆర్‌బీఐ కోరుతున్నట్టుగా కనబడుతున్నదని వీసా ప్రతినిధి ఒకరన్నారు. తాము ఈ అంశంపై ఆర్‌బీఐతో సంప్రదింపులు జరుపుతున్నామని, అలాగే తమ భాగస్వాములందరినీ నిబంధనలకు కట్టుబడాలని కోరుతున్నామని ఆయన చెప్పారు. దీనిపై బీపీఎస్‌పీలు మరింత స్పష్టత ఇవ్వాల్సిఉంటుందని వీసా కంపెనీ చెబుతోంది. ఇదిలా ఉండగా వ్యాపార చెల్లింపులు నిలిపివేయాల్సిందిగా కొన్ని ఫిన్‌టెక్ కంపెనీలకు కూడా నోటీసులు అందినట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దీని వల్ల అద్దె, ట్యూషన్ ఫీజు చెల్లింపులకు అంతరాయం కలగవచ్చన్న భయం వారు వ్యక్తం చేశారు. క్రెడ్, పేటీఎం, నోబ్రోకర్ వంటి ఫిన్‌టెక్‌లు కమర్షియల్, క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా రెంట్, ట్యూషన్ ఫీజుల చెల్లింపును అనుమతిస్తున్నాయి.

తగ్గిన గ్లాండ్ ఫార్మా లాభం

హైదరాబాద్: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో గ్లాండ్ ఫార్మా కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.192 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నికర లాభం రూ.232 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ రెవెన్యూ మాత్రం రూ.938 కోట్ల నుంచి రూ.1,545 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో సెనెక్సీ ఫలితాలను చేర్చటంతో లాభదాయకత పెరిగిందని, దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసిక ఫలితాలను సరిపోల్చలేమని కంపెనీ పేర్కొంది. 2022 నవంబరులో సెనెక్సీ గ్రూప్‌ను గ్లాండ్ ఫార్మా 12 కోట్ల యూరోలకు కొనుగోలు చేసింది.

నాట్కో లాభంలో మూడింతల వృద్ధి

క్యూ3లో రూ.213 కోట్లుగా నమోదు

హైదరాబాద్: నాట్కో ఫార్మా లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏకంగా మూడింతలు వృద్ధి చెంది రూ.212.70 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.62.3 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో రెవెన్యూలు గణనీయంగా పెరగటం ఎంతగానో కలిసివచ్చిందని నాట్కో వెల్లడించింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.492.5 కోట్ల నుంచి రూ.758.6 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు కూడా రూ.431.90 కోట్ల నుంచి రూ.539.30 కోట్లకు పెరిగినట్లు నాట్కో పేర్కొంది.

కాగా డిసెంబరు త్రైమాసికంలో ఫార్ములేషన్స్ ఎగుమతులు రూ.333.70 కోట్ల నుంచి రూ.605.60 కోట్లకు పెరగగా దేశీయ ఫార్ములేషన్స్ ఆదాయాలు మాత్రం రూ.101.10 కోట్ల నుంచి రూ.99.4 కోట్లకు తగ్గినట్లు నాట్కో తెలిపింది. త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.1.25 మధ్యంతర డివిడెండ్‌ను ఇచ్చేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

మదనపల్లెలో జోస్ అలుక్కాస్ షోరూమ్

» ఈ నెల 17న ప్రారంభం

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలో జోస్ అలుక్కాస్ సరికొత్త షోరూమ్‌ను ప్రారంభిస్తోంది. ఈ నెల 17న ఈ షోరూమ్‌ను జోస్ అలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ అలుక్కా, పాల్ జె అలుక్కా, జాన్ అలుక్కా ప్రారంభించనున్నారు. షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను జోస్ అలుక్కాస్ ప్రకటించింది. ఆఫర్‌లో భాగంగా కనిష్ఠంగా రూ.50,000 విలువైన బంగారు ఆభరణాల కొనుగోలుపై ఒక ప్రోత్సాహక బంగారు నాణేన్ని బహుమతిగా అందజేయనుంది. అలాగే వజ్రాలపై 20 శాతం, ప్లాటినం ఆభరణాలపై 7 శాతం తగ్గింపును అందించనున్నట్లు ప్రకటించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,180 ▼	57,000 ▼	75,500 ▼
ముంబై	61,590 ▼	56,416 ▼	69,150 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ		విజయవాడ	536
హైదరాబాద్	545	విశాఖపట్నం	555
15వ తేదీ		వరంగల్	547
చిత్తూరు	603	డజను గుడ్లు రూ.72	
గోదావరి	536		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	124	గోదావరి	129
వరంగల్	124	విజయవాడ	129
కరీంనగర్	124	గుంటూరు	129
మహబూబ్‌నగర్	124	ఒంగోలు	129
కర్నూలు	124	చిత్తూరు	125
విశాఖపట్నం	122		

లాభాల్లోనే స్టాక్ మార్కెట్లు

సెన్సెక్స్ 268 పాయింట్లు అప్

ముంబై: ద్రవ్యోల్బణ గణాంకాలు అందించిన ఊరటతో పాటు చివరి గంట కొనుగోళ్ల మద్దతుతో ఈక్విటీ మార్కెట్ వరుసగా రెండో రోజున కూడా లాభాల్లో ముగిసింది. వాస్తవానికి నష్టాల్లో ప్రారంభమై ఇంట్రాడేలో 71,822.83 వరకు దిగజారిన సెన్సెక్స్ ఆ నష్టాలను పూడ్చుకుని 267.64 పాయింట్ల లాభంతో 71,822.83 వద్ద ముగిసింది. నిఫ్టీ 96.80 పాయింట్లు లాభపడి 21,840.05 వద్ద ముగిసింది. సెన్సెక్స్ షేర్లలో ఎస్‌బీఐ 4.24 శాతం లాభంతో అగ్రగామిగా నిలిచింది.

రేపు ఎస్కోనెట్ ఇష్యూ ప్రారంభం: ఐటీ సిస్టమ్ ఇంటిగ్రేటర్ ఎస్కోనెట్ టెక్నాలజీస్ ఐపీఓ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఇష్యూలో షేరు ధర శ్రేణిని రూ.80-84గా కంపెనీ ప్రకటించింది. బుక్ బిల్డింగ్ విధానంలో రూ.10 ముఖ విలువ గల 33,60,000 షేర్లను జారీ చేయనుంది.

రూ.20 లక్షల కోట్ల శిఖరంపై రిలయన్స్

బుధవారం నాడు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) షేరు 1.15 శాతం లాభపడి రూ.2,962.60 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.20 లక్షల కోట్లకు పైన స్థిరపడింది. మంగళవారం ఆర్ఐఎల్ ఇంట్రాడేలో ఈ మైలురాయిని దాటినప్పటికీ ముగింపు సమయానికి అంతకన్నా దిగువనే క్లోజైంది. బుధవారం ఆ మైలురాయిని దాటడంతో ఆర్ఐఎల్ మార్కెట్ విలువపరంగా ప్రపంచంలోని టాప్ 50 కంపెనీల్లో 49వ స్థానంలో నిలిచింది. అలాగే మార్కెట్ విలువలో పెప్సికో, షెల్, పెట్రోచైనా వంటి సంస్థల కన్నా పైకి వెళ్లింది. డాలర్ విలువలో ఆర్ఐఎల్ మార్కెట్ క్యాప్ 23,900 కోట్ల డాలర్లకు చేరింది. ప్రస్తుతం ప్రపంచ కంపెనీల్లో మైక్రోసాఫ్ట్ 3.08 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ విలువతో అగ్రస్థానంలో ఉండగా యాపిల్ (2.89 లక్షల కోట్ల డాలర్లు), సౌదీ అరామ్కో (2.04 లక్షల కోట్ల డాలర్లు), గూగుల్ యాజమాన్యంలోని ఆల్ఫాబెట్ ఇంక్ (1.84 లక్షల కోట్ల డాలర్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

'బీమా సుగమ్' కోసం ఆన్‌లైన్ పోర్టల్

ఐఆర్‌డీఏఐ ప్రతిపాదన

న్యూఢిల్లీ: దేశంలో బీమా పాలసీల మార్కెటింగ్ మరింత సులభతరం కానుంది. ఇందుకోసం 'బీమా సుగమ్' పేరుతో ఒక ఆన్‌లైన్ మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని భారత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) ప్రతిపాదించింది. దీనికి సంబంధించి ఒక ముసాయిదా పత్రం విడుదల చేసింది. ఈ పత్రంపై బీమా కంపెనీలు, ఇతర స్టేక్‌హోల్డర్లు మార్చి 4వ తేదీలోగా తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని ఐఆర్‌డీఏఐ కోరింది. దేశ ప్రజల్లో బీమా కవరేజీ పెంచేందుకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుందని ఐఆర్‌డీఏఐ అంచనా. ఈ ప్రతిపాదన ఆచరణకు నోచుకుంటే బీమా కంపెనీలు, పాలసీదారులు, ఏజెంట్లకు ఒకే వేదికగా ఇది ఉపయోగపడుతుంది. ఈ పోర్టల్ ఈక్విటీలో సాధారణ, జీవిత, ఆరోగ్య బీమా కంపెనీలకు వాటా ఉంటుంది.

నెల రోజుల వరకు ఫ్రీ లుక్ పీరియడ్: బీమా సుగమ్‌తో పాటు మరో సంస్కరణకు ఐఆర్‌డీఏఐ యోచిస్తోంది. పాలసీదారులు తాము తీసుకున్న పాలసీని తిరస్కరించే గడువును, పాలసీ డాక్యుమెంట్స్ అందిన 15 రోజుల నుంచి 30 రోజులకు పెంచాలని ప్రతిపాదించింది. దీనికి తోడు బీమా పాలసీలు అన్నిటికి పాలసీ తీసుకునేటప్పుడే నామినేషన్ తప్పనిసరి చేయాలని ప్రతిపాదించింది. పాలసీదారులకు రిఫండ్, సెటిల్‌మెంట్ సొమ్ములు త్వరగా అందేందుకు వీలుగా పాలసీ ఇచ్చేటప్పుడే వారి బ్యాంకు ఖాతాల వివరాలు కూడా తీసుకోవాలని కోరింది.

స్పోర్ట్స్

దేవాన్షికి స్వర్ణం.. లక్షితకు రజతం



న్యూఢిల్లీ: పది మీటర్ల ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. స్పెయిన్‌లోని గ్రనడాలో బుధవారం జరిగిన మహిళల 10 మీ. ఎయిర్ పిస్టల్ జూనియర్ ఈవెంట్‌లో భారత షూటర్లు పోడియం ఫినిష్ చేశారు. దేవాన్షి ధమా (240) స్వర్ణం సాధించగా.. లక్షిత (238) రజతం దక్కించుకుంది. సీనియర్ విభాగం పోటీలు శుక్రవారం మొదలవుతాయి.

మూనీకి గుజరాత్ పగ్గాలు

డబ్ల్యూపీఎల్



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ జట్టుకు సారథిగా ఆస్ట్రేలియా స్టార్ బేత్ మూనీ వ్యవహరించనుంది. గత సీజన్‌లోనూ జట్టు పగ్గాలు మూనీకే అప్పగించినా.. తొలి మ్యాచ్ ఆడిన వెంటనే గాయంతో లీగ్‌కు దూరమైంది. దీంతో మూనీ స్థానంలో స్నేహ్ రాణా జట్టును నడిపించింది. జట్టుకు ప్రధాన కోచ్ మైకేల్ క్లింగర్ కాగా.. మిథాలీ రాజ్ మెంటార్ బాధ్యతలు నిర్వర్తించనుంది. బెంగళూరు, న్యూఢిల్లీ వేదికలుగా ఈనెల 23 నుంచి పోటీలు జరుగనున్నాయి.

దక్షిణాఫ్రికాకు ఆధిక్యం

కివీస్ 211 ఆలౌట్

హామిల్టన్: న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో దక్షిణాఫ్రికాకు 31 పరుగుల ఆధిక్యం దక్కింది. రెండో రోజు బుధవారం కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 211 పరుగులకే కుప్పకూలింది. కేన్ విలియమ్సన్ 43, లాథమ్ 40 రన్స్ చేశారు. డేన్ పీట్ 5 వికెట్లతో దెబ్బతీశాడు. ప్యాటర్సన్‌కు 3 వికెట్లు దక్కాయి. అంతకుముందు సౌతాఫ్రికా తమ ఓవర్‌నైట్ స్కోరు (220/6)కు 22 రన్స్ మాత్రమే జోడించి 242 వద్ద ఆలౌటైంది. ఒరోర్కెకు 4, రవీంద్రకు 3 వికెట్లు దక్కాయి.

'న్యూయార్క్' కెప్టెన్‌గా యువరాజ్

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ లెజెండ్స్ క్రికెట్ ట్రోఫీ (ఎల్‌సీటీ) సీజన్-2లో న్యూయార్క్ సూపర్‌స్టార్ స్ట్రయికర్స్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఆ జట్టులో బాబర్ ఆజమ్, రషీద్‌ఖాన్, పొలార్డ్ తదితరులు ఆడనున్నారు. 15 ఓవర్ల ఈ టోర్నీ మార్చి 7 నుంచి 18 వరకు శ్రీలంకలోని క్యాండీలో జరగనుంది. 6 జట్లు, 9 రోజులపాటు 18 మ్యాచ్‌ల్లో తలపడతాయి. ఢిల్లీ, న్యూయార్క్, పంజాబ్, రాజస్థాన్, కొలంబో, చత్తీస్‌గఢ్ జట్లు బరిలోకి దిగనున్నాయి. గతేడాది జరిగిన సీజన్-1లో ఇండోర్ నైట్స్, గువాహటి అవెంజర్స్ జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి.

రాజ్‌కోటలో పాగా ఎవరిదో?

నేటి నుంచి ఇంగ్లండ్‌తో మూడో టెస్టు

ఉ. 9.30 నుంచి జియో సినిమాలో..



100 ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్‌కిది వందో టెస్టు. ఆ జట్టు తరపున నూరు టెస్టులాడిన 16వ ప్లేయర్.

1 టెస్టుల్లో 500 వికెట్లు పూర్తి చేసేందుకు స్పిన్నర్ అశ్విన్‌కు మరో వికెట్ చాలు.

భారత్‌కు గాయాల బెడద | కొత్త ఆటగాళ్లకు చాన్స్

రాజ్‌కోట్: తొలి టెస్టులో ఇంగ్లండ్ ఇచ్చిన ఝలక్‌కు వైజాగ్ టెస్టులో టీమిండియా గట్టిగానే బదులిచ్చింది. తద్వారా ఐదు టెస్టుల సిరీస్‌లో 1-1తో నిలిచింది. యశస్వీ జైస్వాల్ సూపర్ బ్యాటింగ్, బుమ్రా మెరుపు బౌలింగ్.. వెరసి జట్టుకు అద్భుత విజయం దక్కింది. తాజాగా బుధవారం నుంచి ఇరు జట్ల మధ్య మూడో టెస్టు జరుగనుంది. అయితే భారత జట్టుకు గాయాల బెడద, ఆటగాళ్ల ఫామ్‌లేమి ఇబ్బందిగా మారింది. ఇప్పటికే విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ లేకపోవడంతో జట్టు విడిలార్డర్ బలహీనంగా మారింది. ఈ సమస్యను ఎలా అధిగమిస్తుందో వేచి చూడాల్సిందే. అటు ఇంగ్లండ్ జట్టు ఈ టెస్టులో నెగ్గి తిరిగి ఆధిపత్యం చూపాలన్న కసితో ఉంది. అలాగే కెప్టెన్ బెన్ స్టోక్స్‌కిది కెరీర్‌లో వందో టెస్టు. అందుకే తమ సారథికి చక్కటి విజయాన్ని బహుమతిగా అందించాలని సహచరులు భావిస్తున్నారు.

సర్ఫరాజ్, జురెల్‌కు చాన్స్?: భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో ఓపెనర్ జైస్వాల్ మాత్రమే ఊపు మీదున్నాడు. ఈ సిరీస్‌లో తను 321 పరుగులు సాధించగా, మిగతా వారంతా 170 లోపే ఉండడం గమనార్హం. వీరిలో శ్రేయాస్ అయ్యర్‌పై ఇప్పటికే వేటు పడగా, రాహుల్ గాయంతో టెస్టుకు దూరమయ్యాడు. దీంతో ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ ఎదురుచూపులు ఫలించే చాన్స్ ఉంది. అతడితోపాటు యువ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ వైపు టీమ్ మేనేజ్‌మెంట్ మొగ్గు చూపుతోంది. 15 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో జురెల్ 46.47 సగటుతో ఉండడం అతడికి కలిసివస్తోంది. ఎందుకంటే గత 12 ఇన్నింగ్స్‌లో కీపర్ కేఎస్ భరత్ బ్యాటింగ్‌లో విఫలమవుతూనే ఉన్నాడు. దీంతో తనపై వేటు వేసేందుకు సిద్ధమవుతున్నారు. శ్రేయాస్ లేకపోవడంతో రజత్ పటీదార్‌కు వచ్చిన ముప్పేమీ లేదు. అటు ఓపెనర్ గిల్ చాలాకాలం తర్వాత ఈ ఫార్మాట్‌లో ఓ సెంచరీ సాధించి జట్టులో చోటును పదిలం చేసుకున్నాడు. ఇక బౌలింగ్‌లో ఆల్‌రౌండర్ జడేజా జట్టులోకి రావడం సానుకూలాంశమే. స్థానిక ఆటగాడిగా అతడికి పిచ్‌పై అవగాహన ఉంటుంది. అయితే తొలి రెండు టెస్టుల్లో స్పిన్నర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. వీరిని ఇంగ్లండ్ బ్యాటర్లు సులువుగా ఆడేస్తుండడం ఆందోళనకరంగా మారింది. పేసర్లలో బుమ్రాను ఆడిస్తే అతడికి జతగా విశ్రాంతి ముగించుకున్న సిరాజ్ కొనసాగుతాడు. అయితే జట్టు ఇద్దరు పేసర్లతో వెళ్లాలనుకుంటే స్పిన్నర్ కుల్దీప్‌ను బెంచీకే పరిమితం చేసి ఆల్‌రౌండర్లు అక్షర్, జడేజా, అశ్విన్‌లతో వెళ్లవచ్చు.

ఎదురుదాడే లక్ష్యంగా..: వారం రోజులపాటు అబుధాబిలో విశ్రాంతి తీసుకున్న ఇంగ్లండ్ జట్టు మూడో టెస్టులోనూ తమ శైలిని మార్చుకోవాలనుకోవడం లేదట. భారత్‌పై దూకుడు కనబరిచి వారు పొరపాట్లు చేసేవరకు వేచిచూడాలనుకుంటోంది. ఇప్పటివరకు ఇదే వర్కవుట్ అయ్యింది కాబట్టి కెప్టెన్ స్టోక్స్ తన వందో టెస్టులోనూ వెనక్కి తగ్గేదే లేదని భావిస్తున్నాడు. 2016లో ఇక్కడే జరిగిన టెస్టులో తనతో పాటు రూట్ కూడా శతకం సాధించాడు. ఇప్పటికే ప్రకటించిన తుది జట్టులో ఒక మార్పు చేసి సిరీస్‌లో తొలిసారిగా రెండో సీమర్‌ను చేర్చారు. స్పిన్నర్ షోయబ్ బషీర్ స్థానంలో మార్క్ ఉడ్ ఆడనున్నాడు.క్రాలే.. పోప్ మరోసారి కీలకం కానున్నారు. జో రూట్ తన స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శించలేకపోతున్నాడు. స్పిన్నర్లు హార్ట్‌లీ, రెహాన్ ప్రత్యర్థిని ఇబ్బందిపెట్టగలుగుతున్నారు.

జట్లు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, గిల్, రజత్ పటీదార్, సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్, జడేజా, అశ్విన్, అక్షర్, బుమ్రా, సిరాజ్.

ఇంగ్లండ్: క్రాలే, డకెట్, ఒల్లీ పోప్, జో రూట్, బెయిర్‌స్టో, బెన్ స్టోక్స్ (కెప్టెన్), బెన్ ఫోక్స్, రెహాన్ అహ్మద్, హార్ట్‌లీ, మార్క్ ఉడ్, అండర్సన్.

పిచ్

రాజ్‌కోట్ పిచ్ సహజంగానే బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. ఇక్కడ జరిగిన రెండు టెస్టుల్లో భారీగా పరుగులు నమోదయ్యాయి. ఫ్లాట్ వికెట్ కావడంతోనే ఇంగ్లండ్ కూడా తమ తుది జట్టులో ఇద్దరు స్పిన్నర్లు చాలనుకుంది.

భారత్‌తో ఆడడం ఇష్టం

మైలురాళ్ల గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదు. అంతకన్నా ముందు భారత్‌లాంటి పటిష్ఠ జట్టుతో ఆడడాన్ని ఆస్వాదిస్తా. ఎందుకంటే ఈ జట్టుతో మాకెదురయ్యే పోటీతో పాటు అధిక స్థాయిలో ప్రేక్షకులు వస్తుంటారు. పిచ్ గురించి అతిగా ఆలోచించడం లేదు. బుమ్రా అద్భుత బౌలర్. అతడిని దీటుగా ఎదుర్కొని పరుగులు సాధించే వ్యూహంలో ఉన్నాం. విరాట్, రాహుల్ లేకపోవడం మాకు అనుకూలంగానో, భారత్‌ను దెబ్బతీసేదిగానో భావించడం లేదు.

- బెన్ స్టోక్స్ (ఇంగ్లండ్ కెప్టెన్)

వారిని ఓడించడం అసాధ్యం కాదు



భారత గడ్డపై గెలవడం పర్యాటక జట్లకు సులువేమీ కాదు. కానీ ఇంగ్లండ్ అటాకింగ్ గేమ్‌తో ఆడుతోంది. అలాగని ఆ జట్టును ఓడించడం అసాధ్యమని అనుకోవడం లేదు. మేం కూడా వారి శైలితోనే జవాబివ్వాల్సి ఉంది. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో చిన్న తప్పులను చేయకపోయుంటే ఫలితం మరోలా ఉండేది. నేనిక వంద శాతం ఫిట్‌గా ఉండేలా ప్రయత్నిస్తా. అవసరం లేని చోట డైవింగ్‌కు దూరంగా ఉంటా. ఇక అశ్విన్ ఇక్కడే 500 వికెట్లు పూర్తి చేసుకుంటాడు.

- స్పిన్నర్ జడేజా

'భారత రెజ్లింగ్'పై సస్పెన్షన్ ఎత్తివేతకు వక్రమార్గాలు!

సంజయ్‌పై సాక్షీ మాలిక్, పూనియా ఆరోపణలు

న్యూఢిల్లీ: యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) విధించిన సస్పెన్షన్‌ను తొలగించుకోవడానికి భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు సంజయ్ సింగ్ వక్రమార్గాలను అనుసరించాడని ఒలింపిక్ పతక విజేతలు బజ్‌రంగ్ పూనియా, సాక్షి మాలిక్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో మరోసారి నిరసనకు దిగుతామని హెచ్చరించారు. 'సంజయ్ ఏదో మతలబు చేసి నిషేధాన్ని ఎత్తేసేలా చేశాడని తెలిసింది. చట్టాలకు అతీతులమనే విధంగా వ్యవహరిస్తున్నారని నెట్‌లో పోస్టు చేసిన వీడియోలో మాలిక్ ఆగ్రహం వ్యక్తం చేసింది. డబ్ల్యూఎఫ్ఐ కార్యకలాపాల్లో మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ అనుయాయుల జోక్యాన్ని ఏమాత్రం సహించబోనని చెప్పింది. ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోకుంటే.. తమ నిరసనను మళ్లీ ఆరంభిస్తామని సాక్షి హెచ్చరించింది.

భారత్‌లోనే ఐపీఎల్

లీగ్ చైర్మన్ ధూమల్ భరోసా

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఐపీఎల్‌ను విదేశాలకు తరలిస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ మెగా లీగ్‌ను పూర్తిగా భారత్‌లోనే నిర్వహిస్తామని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధూమల్ భరోసా ఇచ్చాడు. ఎన్నికల షెడ్యూల్ కోసం ఎదురుచూస్తున్నట్టు చెప్పాడు. తదనుగుణంగా మ్యాచ్‌ల తేదీలను నిర్ణయిస్తామన్నాడు. కాగా, ఐపీఎల్‌ను వచ్చే నెల 22 నుంచి రెండు దశలుగా నిర్వహించనున్నారని సమాచారం.

చైనాకు షాకిచ్చారు

● భారత అమ్మాయిల విక్టరీ ● ఘనంగా సింధు రీఎంట్రీ ● నాకౌట్‌కు పురుషుల జట్టు ● ఆసియా టీమ్ బ్యాడ్మింటన్



షా ఆలమ్ (మలేసియా): రీఎంట్రీలో పీవీ సింధు అదరగొట్టడంతో.. బ్యాడ్మింటన్ ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌ను భారత మహిళల జట్టు ఘనంగా ఆరంభించింది. బుధవారం జరిగిన గ్రూప్-డబ్ల్యూ మ్యాచ్‌లో పటిష్ఠ చైనాపై భారత్ 3-2తో గెలిచి సంచలనం సృష్టించింది. ఈ గ్రూప్‌లో రెండే జట్లు ఉండడంతో ఈ మ్యాచ్‌కు ముందే టీమిండియాకు నాకౌట్ బెర్త్ ఖరారైంది. 11వ ర్యాంకర్ సింధు 21-17, 21-15తో తనకంటే మెరుగైన 8వ ర్యాంకర్ హన్ యుపై గెలిచి భారత్‌ను 1-0 ఆధిక్యంలో నిలిపింది. అయితే, అశ్విని పొన్నప్ప-తనీషా జంట 19-21, 16-21తో లి షంగ్-టాన్ నింగ్ చేతిలో, అస్మిత 13-21, 15-21తో వాంగ్ జి యి చేతిలో ఓడారు. కానీ, ట్రీసా జోలీ-గాయత్రి జోడీ 10-21, 21-18, 21-17తో లి యి జింగ్- లు జుపై గెలిచి 2-2తో సమం చేసింది. నిర్ణాయక మ్యాచ్‌లో అన్మోల్ కర్బ్ 22-20, 14-21, 21-18తో ఉ లు యుపై నెగ్గడంతో భారత్ 3-2 ఆధిక్యంతో ముందంజ వేసింది. ఇక, పురుషుల జట్టు కూడా నాకౌట్ బెర్త్‌ను ఖాయం చేసుకొంది. గ్రూప్-ఎలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 4-1తో హాంకాంగ్‌పై గెలిచింది. తొలి సింగిల్స్‌లో ప్రణయ్ 18-21, 14-21తో ఎన్‌జి కా లాంగ్ అంగస్ చేతిలో ఓడగా, డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట 21-16, 21-11తో లి వయ్-చేయ్‌పై నెగ్గి సమం చేసింది. లక్ష్య సేన్ 21-14, 21-9తో చాన్‌పై, అర్జున్-ధ్రువ్ జోడీ 21-12, 21-7తో లాంగ్-హంగ్‌పై, కిడాంబి శ్రీకాంత్ 21-14, 21-18తో గునవాన్‌పై గెలిచారు. గురువారం చైనాతో భారత్ తలపడనుంది.

తలైవాస్‌పై ఢిల్లీ గెలుపు



కోల్‌కతా: ప్రొ కబడ్డీ లీగ్‌లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 45-43తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 29-26తో బెంగాల్ వారియర్స్‌పై గెలిచింది. పుణె రైడర్ ఆకాష్ సూపర్-10 సాధించాడు.

జగన్ బీసీల ద్రోహి



సాలూరులో నిర్వహించిన ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న లోకేశ్

- బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు. బ్యాక్ బోన్. జగన్ బీసీల వెన్నెముక విరుస్తున్నారు. ఆయన్ను గద్దె దించేందుకు రాష్ట్రంలో బీసీలందరూ సిద్ధమవ్వాలి.
- యాత్ర-2 సినిమా తీసిన నిర్మాతకు నష్టం వచ్చిందని, రెండెకరాల హర్సిలీహిల్స్ భూమిని సదరు నిర్మాతకు అందివ్వడం దారుణం.

- లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రసంగించారు. బీసీ, ఎస్సీ ఎంపీ, ఎమ్మెల్యేలను వేరే సీట్లకు బదిలీ చేయడమేనా సామాజిక న్యాయం అని ప్రశ్నించారు. 'సొంత సామాజికవర్గ ప్రతినిధుల జోలికి పోకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీలపై పడ్డారు. యాదవ కులానికి చెందిన జంగా కృష్ణమూర్తి, కొలుసు పార్థసారథి, కర్నూలు ఎంపీ సంజీవ్ సహా అనేక మందిని వేరే ప్రాంతాలకు పంపారు. గత టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన 27సంక్షేమ పథకాలను అకారణంగా రద్దు చేశారు. స్థానికసంస్థల రిజర్వేషన్లలో 10 శాతం తగ్గించారు. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు స్థానిక కోటా పెంచుతాం. రద్దయిన సంక్షేమ పథకాలు అమలు చేస్తాం' అని వెల్లడించారు. మూడు రాజధానుల పేరుతో వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి, బొత్స సత్యనారాయణ ఉత్తరాంధ్రను దోచుకుంటున్నారని.. పందికొక్కుల్లా మేసిన మేతను కక్కిస్తామని హెచ్చరించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేయకుండా కాపాడతామన్నారు. భోగాపురం, తారకరామతీర్థసాగర్, నదుల అనుసంధానం,అభివృద్ధి పనులను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని.. వీటిని పూర్తిచేసే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. బీసీలపై 27వేల కేసులు పెట్టి వారి వెన్నుముక విరగ్గొట్టారని.. బీసీలు కలిసికట్టుగా పోరాడి జగన్ వెన్నుముక విరగ్గొట్టాలని పిలుపిచ్చారు. ఇంకా ఏమన్నారంటే..

ప్రత్యేక హోదా మరిచారు

అధికారంలోకి వచ్చే వరకు రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెచ్చి తీరుతామని జగన్ హామీ ఇచ్చారు. గద్దె నెక్కగానే 22 ఎంపీలు, 9 రాజ్యసభ సభ్యులు ఉన్నా ప్రత్యేక హోదా మరిచారు. కేంద్రం వద్ద రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారు. టీడీపీ-జనసేన సంకీర్ణ ప్రభుత్వం రాగానే రానున్న ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. డీఎస్సీని ప్రతి ఏటా ప్రకటిస్తాం. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు భృతి కల్పిస్తాం. ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున చెల్లిస్తాం. రైతులకు ప్రతి ఏటా రూ.20 వేల పెట్టుబడి అందిస్తాం. మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తాం. 18 నుంచి 59 ఏళ్ల మధ్య మహిళలకు నెలకు రూ.1,500 అందిస్తాం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తాం. సూపర్ సిక్స్‌ద్వారా పేదరికాన్ని నిర్మూలించేందుకు కృషి చేస్తాం.

ప్రత్యేక హోదా ఎక్కడ..?

25 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకొస్తానని చెప్పిన జగన్.. ఎందుకు తీసుకురాలేదు? వైసీపీకి మొత్తం 31 మంది ఎంపీలు ఉంటే ఏనాడైనా ప్రత్యేక హోదా అడిగారా? కేంద్రంలో ఏపీ పరువు తీశారు. ఒక ఎంపీ బాబాయిని లేపేసిన వ్యక్తి అయితే.. ఇంకో ఎంపీ టిక్‌టాక్, యూట్యూబ్ రీల్స్‌లో బిజీగా ఉంటారు. తన భార్యాబిడ్డలను కిడ్నాప్ చేశారన్న భయంతో మరో ఎంపీ పూర్తిగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఎంపీ విజయసాయిరెడ్డి జగన్ అవినీతి కేసుల్లో ఏ-2 గా ఉన్నారు. జగన్ అవినీతిని పుస్తకంలో రాస్తున్నాడు.

3 కుటుంబాలకు అవినీతి లైసెన్స్

రాష్ట్రంలో మూడు కుటుంబాలకు జగన్ అవినీతి లైసెన్స్ ఇచ్చాడు. బొత్స సత్యనారాయణ, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి కలిసి చెరువులు, భూములు కబ్జా చేస్తున్నారు. గిరిజనుల సంక్షేమం, ఉద్యోగావకాశాల కోసం టీడీపీ హయాంలో ఇచ్చిన జీవో నంబర్ 3ను వైసీపీకి వచ్చాక రద్దు చేసింది. మేమొచ్చాక దానిని పునరుద్ధరిస్తాం. గిరిజనులకు ఆగిపోయిన 17 సంక్షేమ పథకాలు కొనసాగిస్తాం. ఎస్టీ నియోజకవర్గాల్లో ఏడుకు ఏడు స్థానాలను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తాం.

చీమ కుట్టినట్లయినా లేదు..

సీఎం జగన్‌కు డయేరియా వచ్చింది. రోగ నిర్ధారణ కోసం తాడేపల్లి ప్యాలెస్ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిద్దాం. గుంటూరులో సురక్షిత నీరు ప్రజలకు అందించక పోవడంతో డయేరియా వచ్చి ఇద్దరు మరణించారు. ప్రజలు మృతి చెందుతున్నా దున్నపోతు ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు. జగన్‌కు సినిమా పిచ్చి ఎక్కువైంది. ఒక వైపు వ్యూహం, మరో వైపు యాత్ర సినిమా అంటూ సొంత పార్టీ ఎమ్మెల్యేలకు, కార్యకర్తలకు ఉచితంగా టికెట్లు ఇస్తున్నారు. అయినా సినిమా చూడడానికి ఎవరూ వెళ్లడం లేదు. అట్టర్ ఫ్లాప్ అయింది. వైసీపీకి అంతిమ యాత్రే. నిర్మాత.. జగన్‌రెడ్డి వద్దకు వెళ్లి ఆదుకోమని కోరితే పొమ్మన్నారు. డబ్బులు ఇవ్వకపోతే అంతిమ యాత్ర సినిమా తీస్తానని ప్రొడ్యూసర్ చెప్పడంతో అతడికి హార్సిలీహిల్స్ వద్ద ఖరీదైన రెండెకరాల ప్రభుత్వ భూమిని అప్పగించారు. ప్రభుత్వ భూమి ఇచ్చేందుకు జగన్ ఎవరు? తాడేపల్లిలోనో, ఇడుపులపాయలోనో, బెంగుళూరు ప్యాలెస్‌లోనో రెండెకరాలు ఇవ్వొచ్చు కదా!

కోడికత్తి వారియర్స్

జగన్‌ను చూస్తే పిట్టల దొర గుర్తుకు వస్తున్నాడు. కేంద్రం తెచ్చిన ఖేలో ఇండియాను ఆడుదాం ఆంధ్రా అని మార్చారు. అది విఫలమైంది. నియోజకవర్గానికో స్టేడియం నిర్మిస్తామని చెప్పిన జగన్ ఎక్కడైనా నిర్మించాడా? ఆయన ఐపీఎల్ టీంను పెడతామని చెబుతున్నాడు. దాని పేరు కోడికత్తి వారియర్స్. ఆ టీంలో బాబాయిని గొడ్డలితో చంపిన ఆల్‌రౌండర్ అవినాశ్‌రెడ్డి, బెట్టింగ్ స్టార్ అనిల్‌కుమార్ యాదవ్, అరగంట స్టార్ అంబటి రాంబాబు, గంట స్టార్ అవంతి శ్రీనివాస్, సీనియర్ బ్యాట్స్‌మన్ గోరంట్ల మాధవ్, రీల్ స్టార్ మార్గాని భరత్, బూతుల స్టార్ కొడాలి నాని, కమెడియన్ బియ్యపు మధుసూదనరెడ్డి ఆటగాళ్లు. నాకు కులం లేదు, మతం లేదు, పార్టీ లేదని చెప్పే జగన్.. ఇప్పుడు కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్నారు.

వేలికి ఇంకు పూసేందుకే!

(మొదటి పేజీ తరువాయి)

లేఖ రాసింది. ఈ మేరకు అర్హులైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ఎన్నికల విధుల్లో నియమించుకునేందుకు అభ్యంతరం లేదని పేర్కొంటూ జిల్లా కలెక్టర్లు, అధికారులకు మీనా బుధవారం సూచనలతో కూడిన మెమో జారీ చేశారు. రాబోయే ఎన్నికల్లో అర్హులైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు పోలింగ్ పార్టీలుగా విధులు అప్పగించవచ్చని సూచించారు. ప్రతి పోలింగ్ పార్టీలోనూ అర్హులైన ఒక ఉద్యోగిని నియమించుకోవచ్చన్నారు. బీఎల్‌వోలుగా వ్యవహరించిన గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని పోలింగ్ పార్టీలుగా తీసుకోవద్దని ఈసీ పేర్కొంది. పోలింగ్ రోజున వారికి ఎన్నికల విధులు కాకుండా ఇతర విధులు అప్పగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని సూచించింది. గ్రామ, వార్డు వాలంటీర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికలకు సంబంధించిన విధులు అప్పగించవద్దని కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి స్పష్టంచేసింది. అభ్యర్థులకు పోలింగ్ ఏజెంట్లుగా కూడా వలంటీర్లను అనుమతించవద్దని తేల్చిచెప్పింది.



పదేళ్ల తర్వాత ఉమ్మడి రాజధానా?

అది మా ప్రభుత్వ విధానం కాదు

- బకాయిలు చెల్లిస్తామన్నా ఉద్యోగుల ఆందోళన ఎందుకో?
- ఇకపై ఏటా డీఎస్సీ: బొత్స

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన జరిగిన పదేళ్ల తర్వాత ఉమ్మడి రాజధాని ఎలా సాధ్యమవుతుందని రాష్ట్ర విద్యా మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. అనుభవం ఉన్న నేత ఎవరైనా అలాంటి వ్యాఖ్యలు చేయరని, వైసీపీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యలను మీడియానే వక్రీకరించిందని అన్నారు. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలన్నది తమ ప్రభుత్వ విధానం కాదని చెప్పారు. ఆయన బుధవారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. 'హైదరాబాద్ విశ్వనగరం. అక్కడ ఎవరికైనా ఆస్తులు ఉండవచ్చు. అక్కడ నాకు కూడా ఇల్లు ఉంది. నేను ఏపీ మంత్రిని కాబట్టి ఆ ఇంటిని అక్కడి ప్రభుత్వం కబ్జా చేస్తుందా' అని ప్రశ్నించారు. విశాఖ పరిపాలనా రాజధాని గురించి విలేకరులు ప్రస్తావించగా.. తాము సిద్ధంగా ఉన్నా, కొంత మంది రాక్షసులు తమ యజ్ఞాన్ని భగ్నం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు ఢిల్లీ వెళ్లారని, వచ్చే ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా తమది మాత్రం ఒంటరి పోరేనని స్పష్టంచేశారు. 'రాష్ట్రంలో ఉద్యోగులు ఎందుకు ఆందోళన చేస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. వారి సమస్యలపై ఇప్పటికే పలు మార్లు చర్చలు జరిపాం. పీఎఫ్ సహా అన్ని బకాయిలను ఒకట్రెండు నెలల్లో తీర్చేస్తామని చెప్పినప్పటికీ ఆందోళన చేయడం ఆశ్చర్యంగా ఉంది. పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు లేకుండా ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం. టెట్‌ను వాయిదా వేయాలని ఇప్పుడు కోరడం సమంజసం కాదు. వారి డిమాండ్ మేరకే టెట్ నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేశాం' అని చెప్పారు.

ఉమ్మడి రాజధాని వెనుక వైసీపీ కుట్ర: దాడి

మహారాణిపేట (విశాఖపట్నం), ఫిబ్రవరి 14: హైదరాబాద్‌ను మరో రెండేళ్లు ఉమ్మడి రాజధానిగా ఉంచాలని వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి కోరడం వెనుక కుట్ర దాగి ఉందని టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ఆరోపించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రశాంతంగా ఉన్న ప్రజలను రెచ్చగొట్టడానికే ఇటువంటి ప్రకటనలు చేస్తున్నారని బుధవారమిక్కడ విమర్శించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టి రానున్న ఎన్నికల్లో పబ్బం గడుపుకోవాలని వైసీపీ నాయకులు చూస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటివరకూ మూడు రాజధానులని చెప్పి అమరావతితో సహా ఏ ప్రాంతాన్నీ జగన్ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదన్నారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని అదీ చేయలేదని విమర్శించారు. మరో 60 రోజుల్లో జగన్‌ను ప్రజలు ఇంటికి పంపిస్తారని, అంతవరకైనా వారిని ప్రశాంతంగా ఉండనిచ్చేటట్లు లేరని అన్నారు.

మంగళగిరిలోనే పవన్ భేటీలు

- హెలిప్యాడ్‌కు ఆటంకాలతో పర్యటన వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గోదావరి జిల్లాల పర్యటనను జనసేన అధినేత పవన్ నాలుగు రోజుల పాటు వాయిదా వేసుకున్నారు. ఆయన ప్రయాణించే హెలికాప్టర్ దింగేందుకు అనుమతుల విషయంలో ప్రభుత్వ అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నాయని పార్టీ కార్యాలయంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్అండ్‌బీ అధికారుల ద్వారా అనుమతులకు సాకులు చూపిస్తున్నారని పేర్కొంది. భీమవరంలో ఇదే తరహా ఇబ్బందులు తీసుకురావడంతో పర్యటన వాయిదా వేశారు. కాకినాడలో సమావేశానికి ఆ నగరంలో ఉన్న హెలిపాడ్ కోసం అనుమతి కోరితే ఇవ్వలేదు. అక్కడికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న గొల్లప్రోలులో దిగాల్సిన పరిస్థితి ఉంది. ఇలాంటి అవాంతరాలు కల్పిస్తుండటంతో పర్యటన వాయిదా వేయాలని పవన్ నిర్ణయించారు. అనుమతుల విషయంలో ప్రభుత్వం కలిగిస్తున్న ఆటంకాలపై న్యాయపరంగా ముందుకు వెళ్లాలని పార్టీ లీగల్ సెల్‌కు పవన్ సూచించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటనలు చేసే తేదీలను త్వరలో వెల్లడిస్తారు. మరోవైపు 14 నుంచి నాలుగు రోజుల పాటు భీమవరం, అమలాపురం, కాకినాడ, రాజమండ్రిలో చేపట్టాల్సిన సమావేశాలను మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్నారు.

బాబు సభకు అడ్డంకులు!

- ఇంకొల్లు సభకు అనుమతుల్లేవన్న పోలీసులు

బాపట్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు బాపట్ల జిల్లా ఇంకొల్లులో 17న నిర్వహించే బహిరంగ సభకు రైతులు ఇచ్చిన 25 ఎకరాల స్థలంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ స్థలంలో కొంత భాగం దేవదాయ శాఖకు చెందినదని, తమ అనుమతులు తీసుకోలేదని ఆ శాఖాధికారులు ఫిర్యాదు చేశారంటూ బుధవారం రాత్రి సభా ప్రాంగణానికి వచ్చిన పోలీసులు హడావిడి చేశారు. ఏర్పాట్లు ఆపాలని హుకుం జారీ చేయడంతో పాటు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న టీడీపీ నేతలను స్టేషన్‌కు రావాలని హెచ్చరించారు.

పంపకాలకు వేళాయే!

- ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తుల విభజనకు ముందడుగు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఆస్తుల విభజనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉమ్మడి(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)భవన్ విభజనకు మార్గం సుగమమైంది. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న ఉమ్మడి భవన్ ఆస్తులలో ఏపీకి 11.356 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించాలని టి-ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఏపీ సర్కారు సముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ స్పందనను కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌తో పాటు అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా ప్రతిపాదన చేశారు. అదే విధంగా శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదన చేసింది. అయితే తమకు ప్రతిపాదించిన అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణలు) ఉన్న ప్రాంతం(0.512 ఎకరాలు) విలువ దాదాపు రూ.250 కోట్లు అని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సరిసమానమైన భూమిని శబరి బ్లాక్ లేదా పటౌడీ హౌస్‌లోని భూమి నుంచి కేటాయించాలని ఏపీ షరతు విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరుతూ కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది. కాగా ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.505 కోట్ల(దాదాపు పది వేల కోట్లు) విలువైన ఆస్తులు ఉన్నాయి. గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్ అనే విభాగాల కింద ఉమ్మడి భవన్ ఆస్తులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రానికి బయట ఉన్న ఆస్తులను రెండు తెలుగు రాష్ట్రాలు 58:42 నిష్పత్తిలో పంచుకోవాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచారు.

పార్టీ మారే ఆలోచన లేదు: ఆదాల

నెల్లూరు, ఫిబ్రవరి 14 : వైసీపీతోనే తన ప్రయాణమని, పార్టీ మారే ఆలోచనే లేదని నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జిగా తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి.. తాను పార్టీ మారుతున్నట్లు అసత్య ప్రచారాలు చేయటం మొదలు పెట్టారని, దానిని ఖండిస్తూ ఉన్నానని తెలిపారు. 'ఇప్పుడు మళ్లీ చెబుతున్నా.. వైసీపీలోనే ఉంటా. సీఎం జగన్‌ను కలిసి ఆయన నిర్ణయం మేరకు ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ వైసీపీ అభ్యర్థిగానే పోటీ చేస్తానని ఇందులో ఎలాంటి అనుమానాలు, సందేహాలు అవసరం లేదని స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని తాను కలిసిన మాట వాస్తవమేనని, వారిని పార్టీ వీడొద్దని చెప్పిన మాట కూడా వాస్తవమేనని చెప్పారు.

రాజ్యసభ ఎన్నికలకు టీడీపీ దూరం

అవసరం ఉన్నచోటే చేరికలు: చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికలకు దూరంగా ఉండాలని టీడీపీ నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు బుధవారం ఈ విషయాన్ని ధ్రువీకరించారు. తన నివాసంలో కొందరు పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేస్తామని మనం ఎక్కడా చెప్పలేదు. పత్రికల్లో, టీవీల్లో వచ్చిన ఊహాగానాలతో మనకు సంబంధం లేదు. మనం పోటీ పెట్టడం లేదు' అని చంద్రబాబు తేల్చిచెప్పారు. ఎన్నికల ముందు వైసీపీ నుంచి పదుల సంఖ్యల్లో ఎమ్మెల్యేలను ఆకర్షించడం సరైనది కాదని, ఇప్పుడు అంత ప్రయాస అవసరం లేదని టీడీపీ నాయకత్వం భావించిందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయంతో వైసీపీకి మూడు రాజ్యసభ సీట్లు ఏకగ్రీవంగా దక్కనున్నాయి. ఇదిలా ఉండగా, రాబోయే ఎన్నికల్లో పార్టీకి అవసరమైనచోట మాత్రమే ఇతర పార్టీల నుంచి వచ్చేవారిని తీసుకొంటామని, వస్తామనే వారందరికీ గేట్లుతీసే ఆలోచనేదీ లేదని చంద్రబాబు తెలిపారు. 'పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కష్టపడి పనిచేసి అనేక సమస్యలకు గురైనవారికే పార్టీలో ప్రథమ స్థానం ఉంటుంది. వైసీపీకి చెందిన చాలామంది ముఖ్య నేతలు నాతో టచ్‌లో ఉన్నారు. పార్టీలో చేర్చుకోవాలని అడిగినవారి సంఖ్య చాలా పెద్దది. కానీ వారందరినీ తీసుకోవడం లేదు. ఎన్నికల రీత్యా మనకు ఎక్కడ అవసరం ఉందో అక్కడ మాత్రం తీసుకొంటున్నాం' అని ఆయన పేర్కొన్నారు. పొత్తుల వల్ల కూడా పార్టీలో మొదటి నుంచి పనిచేస్తున్న నేతలు నష్టపోకుండా కూడా జాగ్రత్తలు తీసుకొంటున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఎన్నికల సమయంలో యువనేత లోకేశ్ ప్రతి నియోజకవర్గంలో నిర్వహిస్తున్న శంఖారావం సమావేశాలు కార్యకర్తల్లో బాగా ఊపు తెస్తున్నాయని నేతలు వివరించారు. సమావేశంలో పార్టీ నేతలు యనమల రామకృష్ణుడు, నిమ్మల రామానాయుడు, అనగాని సత్య ప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, కంభంపాటి రామ్మోహనరావు పాల్గొన్నారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి...

శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు జడ్పీటీసీలు కె.వెంకట సుబ్బారెడ్డి, కె. తిరుమలయ్య, పి.అర్చనాదేవి, తొట్టంబేడు మాజీ జడ్పీటీసీ పి.వెంకటాచలం, శ్రీకాళహస్తి 32వ వార్డు కౌన్సిలర్ వి.హరినాయుడు టీడీపీలో చేరారు.



అక్షరాస్త్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు

ప్రజా చైతన్యానికి అక్షరమే ఆయుధం

'అక్షరాస్త్రం' పుస్తకావిష్కరణలో చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రజాచైతన్యానికి అక్షరమే ఆయుధంగా నిలవాలని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. సీనియర్ జర్నలిస్టు నీరుకొండ ప్రసాద్ రాసిన 'అక్షరాస్త్రం' పుస్తకాన్ని బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా ఏపీలో మీడియాపై ఆంక్షలు విధిస్తున్నారు. ప్రజాసమస్యలను వెలుగులోకి తెస్తున్న మీడియా సంస్థలు, జర్నలిస్టులపై అక్రమ కేసులతో వేధిస్తున్నారు. నీరుకొండ ప్రసాద్ రాసిన అక్షరాస్త్రం పుస్తకం ప్రజలను ఆలోచింపజేసేలా ఉంది' అని పేర్కొన్నారు.



నెల్లూరు లోక్‌సభకు మళ్లీ ఆదాల?

వేమిరెడ్డి స్థానంలో ఇన్‌చార్జిగా నియమించాలని జగన్ యోచన

4 రోజుల్లో కొత్త ఇన్‌చార్జిని పెడతామన్న సీఎం

మంగళగిరి అసెంబ్లీ ఇన్‌చార్జి మార్పు?..

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్థానంలో నెల్లూరు లోక్‌సభ స్థానానికి బలమైన అభ్యర్థిని దింపాలని ముఖ్యమంత్రి జగన్ భావిస్తున్నారు. అయితే అంగబలం.. అర్థబలం కలిగిన గట్టి నేత ఎవరూ దొరకడం లేదని.. దీంతో నెల్లూరు రూరల్ అసెంబ్లీ ఇన్‌చార్జిగా ఉన్న సిటింగ్ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డినే తిరిగి ఎంపీగా పోటీ చేయించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇందుకు ఆదాల అంగీకరించలేదని సమాచారం. కొన్నాళ్లుగా పార్టీ నాయకత్వానికి అందుబాటులో లేకుండా దూరంగా ఉండడం.. సోమవారం హైదరాబాద్‌లో టీడీపీ అధినేత చంద్రబాబుతో సమావేశం కావడం తదితర పరిణామాల నేపథ్యంలో.. నెల్లూరుకు కొత్త ఇన్‌చార్జిని నియమించాలని జగన్ నిర్ణయించుకున్నారు. ఆదాలనే మళ్లీ నెల్లూరు లోక్‌సభకు పంపితే బావుంటుందన్న అభిప్రాయానికి వచ్చారని.. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి ఆయన్ను పిలిపించారని వైసీపీ వర్గాలు తెలిపాయి. క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆయన్ను జగన్ ఆప్యాయంగా పలుకరించారు. చంద్రబాబుతో వేమిరెడ్డి సమావేశంపై చర్చించారు. వేమిరెడ్డి స్థానంలో కొత్త లోక్‌సభ అభ్యర్థి ఎంపిక ప్రక్రియ నాలుగు రోజుల్లో పూర్తిచేయాల్సి ఉందని ఆదాలతో జగన్ చెప్పారు. అయితే ఆయన అంతరంగాన్ని పసిగట్టిన ఎంపీ.. తాను నెల్లూరు రూరల్‌కే పోటీ చేస్తానని.. లోక్‌సభకు పోటీచేయనని స్పష్టం చేశారు. తాను చంద్రబాబును కలవలేదని.. పార్టీని వీడడం లేదని.. ఒకవేళ పార్టీ మారాల్సి వస్తే రాజకీయాల నుంచే రిటైరవుతానని తేల్చిచెప్పారు. జగన్‌తో భేటీ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారు.

మంగళగిరిలో 'గంజి' పాట్లు

మంగళగిరి అసెంబ్లీ ఇన్‌చార్జిగా చేనేత సామాజికవర్గానికి చెందిన గంజి చిరంజీవిని నియమించామని సీఎం జగన్ ఘనంగా చెప్పుకొన్నారు. అయితే ఆయన అభ్యర్థిత్వాన్ని మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల గట్టి వ్యతిరేకిస్తున్నారు. తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కూడా చిరంజీవి అభ్యర్థిత్వాన్ని అంగీకరించడంలేదు. కమల అభ్యర్థిత్వాన్ని ఆయన సమర్థిస్తున్నారు. దీంతో జగన్‌కు కొత్త చిక్కులు ఎదురయ్యాయి. ఈ సమస్యను పరిష్కరించే బాధ్యతను ఎంపీ విజయసాయిరెడ్డికి అప్పగించారు. కాగా, కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ పంచాయితీ మరోసారి సీఎంవోకు వచ్చింది. మరోవైపు సీఎంవో అధికారి ధనుంజయరెడ్డిని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ బుధవారం కలిశారు. చీరాల ఇన్‌చార్జిగా తననే నియమించాలని కోరారు. రేపల్లె సీటును ఆశిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు కూడా సీఎంవోకు వచ్చారు. మళ్లీ కనిగిరి టికెట్ ఇవ్వాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన కోరారు.

వైసీపీ జాబితాలకు బ్రేక్!

సిటింగ్‌ల్లో అలజడి, జంపింగ్‌ల వల్లే!!

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అభ్యర్థుల జాబితాలను ఇక విడుదల చేయకూడదని సీఎం జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించినట్లు తెలిసింది. సర్వేల సాకుతో చాలా మంది సిటింగ్‌లకు ఆయన టికెట్లు నిరాకరించడంతో వారిలో పెద్దఎత్తున అలజడి రేగడం.. కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర పార్టీల్లో చేరిపోతుండడం తదితర పరిణామాలతో వైసీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా లోక్‌సభ పరిధిలో కొందరు అభ్యర్థులను మార్చాలని.. ఇంకొందరిని కొనసాగించాలని ఎంపీలు అడుగుతున్నా జగన్ పట్టించుకోలేదు. దీంతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టీడీపీలో చేరిపోవాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటిదాకా ఆరు జాబితాలు విడుదల చేయగా.. వాటిలో 68 అసెంబ్లీ స్థానాలకు, 14 లోక్‌సభ సీట్లకు ఇన్‌చార్జులను నియమించారు. 42 మంది సిటింగ్‌లకు మొండిచేయి చూపారు. వారం రోజులుగా ఏడో జాబితా విడుదల చేస్తామంటున్నా ఇవ్వలేదు. ఈలోపు సీనియర్ నేతల జంపింగ్ వార్తలతో ఇక ఒకేసారి జాబితా ఇచ్చేయాలని.. జగన్ భావిస్తున్నారు.

మొహం చెల్లలేదా సీఎం సార్!

- పరిశ్రమల శంకుస్థాపనకు హాజరు కాని జగన్
- కంపెనీల యజమానులెవరూ రాకపోవడంతో బిజీ షెడ్యూల్ పేరిట ముఖ్యమంత్రి కూడా డుమ్మా
- మంత్రి అమర్‌నాథ్‌తో వర్చువల్‌గా కార్యక్రమం

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): "పారిశ్రామిక దిగ్గజాలైన ఆదిత్య బిర్లా, రిలయన్స్‌తోసహా పలు పారిశ్రామిక సంస్థలు కొత్తగా రూ.4,833 కోట్ల పెట్టుబడులతో రాష్ట్రంలో యూనిట్లు నెలకొల్పనున్నాయి. వాటికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బుధవారం క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు చేస్తారు..." అంటూ జగన్ సొంత, కూలి, నీలి మీడియాలో మంగళవారమంతా ఊదరగొట్టేశారు. తీరా చూస్తే.. బుధవారం నిర్వహించిన ఆయా యూనిట్ల వర్చువల్ శంకుస్థాపనల కార్యక్రమం తుస్సుమంది. ఆ దిగ్గజ కంపెనీల యజమానులు ఒక్కరు కూడా ఈ కార్యక్రమానికి హాజరు కాకుండా.. తమ ప్రతినిధులను పంపించారు. దీంతో సీఎం జగన్ కూడా ముఖం చాటేశారు. బిజీ షెడ్యూల్ వల్ల సీఎం రాలేకపోతున్నారని చెప్పినప్పటికీ.. ఈ కార్యక్రమానికి పేరున్న పారిశ్రామికవేత్తలెవరూ రాకపోవడంతో.. మొహం చెల్లకే ఆయన ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారనే విమర్శలు వినిపించాయి. సీఎం రావడం లేదని అప్పటికప్పుడు కార్యక్రమాన్ని వెలగపూడి సచివాలయంలోని పరిశ్రమల శాఖ కార్యాలయానికి మార్చారు. మొత్తానికి మధ్యాహ్నం 12 గంటలు దాటిన తర్వాత పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ వర్చువల్‌గా ఆయా యూనిట్లకు భూమిపూజ చేశారు. బిర్లా కార్బన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.1,700 కోట్లతో తిరుపతి జిల్లా నాయుడుపేటలో ఏర్పాటు చేయనున్న కార్బన్ బ్లాక్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు, అదే జిల్లాలో హెల్లా ఇన్‌ఫ్రా మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.260 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న పీవీసీ పైపులు, ఫిటింగ్స్ యూనిట్‌కు, రాష్ట్రంలో 8 ప్రాంతాల్లో రిలయన్స్ ఎనర్జీ ఆధ్వర్యంలో రూ.1,024 కోట్లతో ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లకు, వెసువియస్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పరవాడలో రూ.250 కోట్లతో ఏర్పాటు చేయనున్న యూనిట్‌లకు మంత్రి అమర్‌నాథ్ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.



అధికారులపై తిరగబడుతున్న టిడ్కో లబ్ధిదారులు

తిరగబడ్డ టిడ్కో లబ్ధిదారులు

- తాళాలు, పత్రాలు ఇస్తాం రమ్మని సభకు పిలిచి మొండిచేయి
- ఆగ్రహంతో పత్రాలు చించేసిన లబ్ధిదారులు

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 14: ఎన్నికల ముంగిట సొంత ఇళ్లు ఇచ్చినట్లు ప్రచారం చేసుకోవడానికి మంత్రులు, అధికారులు మాయమాటలు చెప్పి ప్రజలను మోసగిస్తున్నారు. ఇంటి పత్రాలిస్తాం రమ్మని పిలిచి.. తీరా వచ్చాక తర్వాత ఇస్తాం పొమ్మన్న సంఘటన నెల్లూరులో జరిగింది. 'ఇల్లు ఇవ్వలేనప్పుడు ఇస్తామని పిలిపించడం ఎందుకు? కూలి పనులు చేసుకునే మేం.. ఆశగా వచ్చాం. తీరా వస్తే ఇల్లు సిద్ధం కాలేదంటున్నారు. ఇంటి పత్రాలు, తాళాలు ఇస్తామని చెప్పి మీటింగ్‌కు పిలుచుకోవాలా? మాకీ ప్రభుత్వం వద్దు.. వాళ్లు ఇచ్చే ఇల్లూ వద్దు! ఎప్పట్నుంచో జగన్‌ను నమ్ముకుని ఉన్నాం. మాకే ఇల్లు రాలేదు. ఐదేళ్లుగా తిప్పించుకుంటున్నారు ఆయనేమో(చంద్రబాబు) చెడ్డోడన్నారు.. మరి ఈయన(జగన్) చేసిన మేలేందో చెప్పమనండి' అంటూ టిడ్కో గృహ లబ్ధిదారులు నిప్పులు చెరిగారు. నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో టిడ్కో గృహాలు పొందిన లబ్ధిదారులతో అల్లీపురం వద్ద బుధవారం భారీగా బహిరంగ సభను వైసీపీ నాయకులు, టిడ్కో అధికారులు ఏర్పాటు చేశారు. అక్కచెరువుపాడు, అల్లీపురం, వెంకటేశ్వరపురం, కల్లూరిపల్లి, ఇరగాలమ్మ సంఘం, కొండ్లపూడి ప్రాంతాలలో 15,502 మంది లబ్ధిదారులకు ఇంటి తాళాలు, పత్రాలు అందజేస్తామని, అల్లీపురం టిడ్కో సముదాయం వద్ద బుధవారం జరిగే సభకు హాజరుకావాలని వలంటీర్లతో కబురుపెట్టారు. సుమారు 10 వేల మంది లబ్ధిదారులు హాజరయ్యారు. సభలో రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేశ్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇద్దరు లబ్ధిదారులకు మాత్రమే జంబో తాళాలు, ఇంటి పత్రాలు అందించి వెళ్లిపోయారు. వారు వెళ్లాక పట్టాలు, తాళాలు ఇస్తామంటూ మభ్యపెడుతూ వచ్చిన అధికారులు.. ఆ తర్వాత తమ వద్ద తాళాలు, పత్రాలు లేవని, మరికొన్ని రోజులు ఆగితే సచివాలయాలకు పంపి అక్కడ అందజేస్తామని తీరిగ్గా చెప్పారు. దీనిపై లబ్ధిదారులు మండిపడ్డారు. పత్రాలను చించేశారు.

నగరంలో అవినీతి 'రాజా'



(మొదటి పేజీ తరువాయి)

అధికారులైనా సరే ఆగ్రహానికి గురవుతారు. ఆయన నియోజకవర్గంలో అధికారులంతా వణుకుతూ బతకాలి. ఇక అక్రమార్జన విషయానికొస్తే అంతూ పొంతూ లేదు. వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఎవరైనా ఏ పనిచేయాలన్నా ఆయన అనుమతి తీసుకోవాల్సిందే. మామూళ్లు ముట్ట చెప్పాల్సిందే. ఏ అధికారి అయినా తన కనుసన్నల్లో మసలుకుంటే జనాన్ని దోచుకుని బతికేయొచ్చు. ఆయన చల్లని చూపులో మసలే పోలీసులకు అడ్డూ అదుపూ ఉండదు. కొన్ని పోలీస్ స్టేషన్లు సెటిల్‌మెంట్లకు కేంద్రాలుగా మారాయి. ఆయన, ఆయన కుటుంబ సభ్యుల అండతో పోలీసులు, కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జగన్ చెప్పినట్టు ఆయన చేయడం వల్ల ఓ ఎత్తిపోతల పథకం కోర్టు కేసులో చిక్కుకుని మూతపడింది. రూ.వేల కోట్లతో నిర్మించిన ఈ పథకం వృథాగా పడి ఉంది. ఎమ్మెల్యే ఘనకార్యాల గురించి కథలుకథలుగా చెప్పుకోవచ్చు.

చెరువులు తవ్వేసి...

నియోజకవర్గంలో చాలా చెరువుల్లో మట్టి తవ్వేశారు. ఓ రజకుల చెరువు పరిస్థితి చూస్తే ఎవరికైనా గుండె చెరువైపోతుంది. అది సుమారు 24 ఎకరాల చెరువు. మొదట ఉపాధి హామీ పథకం కింద కొద్దిగా తవ్వి, చుట్టూ గట్టు పటిష్ఠం చేస్తామని అధికారులు చెప్పారు. పైగా బట్టలు ఉతుక్కోవడానికి రేవులు కూడా నిర్మిస్తామన్నారు. కొద్దిరోజులు ఉపాధి కూలీలతో పనిచేశాక యంత్రాలు, లారీలను పిలిపించి రాత్రీపగళ్లూ తవ్వేశారు. మట్టిని అదే నియోజకవర్గంలోని మరో ఎమ్మెల్యే బంధువులకు చెందిన పెద్ద చెరువులాంటి స్థలంలోకి తరలించారు. అక్కడ బ్రహ్మాండమైన లేఅవుట్ వేశారు. ఆ చెరువులో లోతుగా తవ్వినప్పుడు చట్రు మట్టి దొరికింది. ఇది ఇంకా విలువైనది కావడంతో ఎడాపెడా తవ్వేశారు. దీంతో చెరువు రెండు తాడిచెట్లంత లోతైంది. అధికారులు చెప్పినట్టుగా బట్టలు ఉతుక్కోవడానికి రేవులు కట్టలేదు. ఇటీవల ఓ వ్యక్తి చెరువులో మృతి చెందాడు. 'ఈ చెరువు చాలా లోతుగా ఉంది. జాగ్రత్త' అని అక్కడ ఓ స్తంభానికి అధికారులు బోర్డు తగిలించి చేతులు దులుపుకొన్నారు. ఉపాధి హామీ పేరిట కొంత డబ్బు నొక్కేయడంతో పాటు జగనన్న కాలనీలకు మట్టి తోలినట్టు లెక్కలు చూపించి రూ.కోట్లు వింగేశారు.

కొండలు మాయం

కొండల మీద సదరు నేత కన్నుపడితే అంతే సంగతి. పొలాల మధ్య, ఊర్ల మధ్య అందంగా ఊరికి ఆకర్షణగా ఉన్న ఎన్నో కొండలు మాయమైపోయాయి. జగనన్న కాలనీల మెరక పేరిట ఈ మట్టిని ప్రైవేట్ లేఅవుట్లకు తరలించి సొమ్ము చేసుకున్నారు. జగనన్న కాలనీలలో ఫిల్లింగ్ చేసినట్టు కూడా డబ్బు కొట్టేశారు. కొండలను చట్టవిరుద్ధంగా తవ్వేశారని ఓ వ్యక్తి గ్రీన్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించగా.. విచారణ చేయాలని కలెక్టర్, ఇతర అధికారులను ఆదేశించింది. అక్రమాలు జరిగాయని తేలడంతో రూ.3.50 కోట్ల వరకూ జరిమానా విధించింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నాటు సారా అమ్మకాలు పెరిగాయి. సదరు ప్రజాప్రతినిధి నియోజకవర్గంలో నాటు సారా కాసేవాళ్లు, అమ్మేవాళ్లు చాలా మంది ఉన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు కూడా ఆదాయం వస్తుంది. ఓ బట్టీ పెడితే లక్ష వరకూ లంచాలు వస్తాయి. ఎమ్మెల్యే అండదండలతో యథేచ్ఛగా నాటుసారా తయారు చేస్తున్నారు.

లేఅవుట్లలో వాటా

నియోజకవర్గ పరిధిలో ఏ లేఅవుట్ వేసినా ఎమ్మెల్యే అనుమతి అవసరం. పైగా 5 శాతం వాటా లేదా దానికి తగిన డబ్బు ఇవ్వాలి. దీంతో చాలామంది లేఅవుట్లు వేయడం మానేశారు. ప్రస్తుతం కనిపించే లేఅవుట్లన్నీ ఆయన కనుసన్నలలో ఉంటాయి. వాటి స్థలాల ఫిల్లింగ్, రోడ్ల నిర్మాణానికి ఆయా ప్రాంతాలలోని చెరువులు, కొండల్నే వాడతారు. జిల్లా కేంద్రానికి కొద్ది దూరంలో జాతీయ రహదారి పక్క ఎవరికో చెందిన కోట్ల విలువ చేసే పూర్వపు ఆస్తిని బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించడంతో ఆ ప్రజాప్రతినిధి, ఆయన బంధువు ప్రమేయం ఉందనే ప్రచారం ఉంది. జిల్లా కేంద్రంలో ఓ ప్రభుత్వ శాఖకు చెందిన విలువైన 2 ఎకరాల స్థలాన్ని వైసీపీ కార్యాలయ నిర్మాణానికి కట్టబెట్టడంలో ఆయన కీలక పాత్ర పోషించినట్టు తెలుస్తోంది. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని వైసీపీ వర్గీయులను అడ్డుకున్న ఓ దళిత యువకుడిని తీసుకెళ్లి ఏకంగా పోలీసు స్టేషన్‌లో పోలీసులే గుండు కొట్టారు. ఇంతవరకూ వైసీపీ నేతల మీద కానీ, పోలీసుల మీద కానీ చర్యలు లేవు. సాక్షాత్తూ రాష్ట్రపతి ఈ కేసులో జోక్యం చేసుకున్నా పురోగతి లేదు.

అధికారులు హడల్

సదరు ఎమ్మెల్యే దెబ్బకు నియోజకవర్గంలో అధికారులు హడలిపోతున్నారు. ఓ కాలువ పనులకు సంబంధించి సుమారు రూ.3 కోట్లు బిల్లులు చేయాలని సదరు నాయకుడు సంబంధిత అధికారిని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా తప్పుచేయడానికి ఆ అధికారి భయపడి కొద్దిరోజులు జాప్యం చేశారు. ఎమ్మెల్యేకు కోపం వచ్చి ఓ రోజున ఆ అధికారి చెంప పగలు కొట్టారు. దీంతో ఇంజనీర్లంతా ఆందోళన చేయడానికి పూనుకున్నారు. కానీ సార్ పైఅధికారుల నుంచి నరుక్కొచ్చి చీకట్లో సారీ చెప్పి చేతులు కడిగేసుకున్నారు. ఇటీవల సదరు నేత ఓ సామాజిక వర్గానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం ఇప్పించి, నిబంధనలకు విరుద్ధంగా కొందరి పేరు మీద ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించాలని సబ్ రిజిస్ట్రార్‌కు ఫోన్ చేసి చెప్పారు. దానికి అవసరమైన డబ్బంతా సబ్ రిజిస్ట్రారే పెట్టుకోవాలని ఆదేశించారు. దీంతో ఆ అధికారి 'ఇతర ఖర్చులన్నీ వదిలేస్తాం. కానీ ప్రభుత్వానికి కట్టాల్సిన స్టాంప్ డ్యూటీ నేను కట్టలేను' అని అన్నారు. అంతే... సార్‌కు కోపం వచ్చి 'నువ్వెంత లంచాలు తీసుకుంటున్నావో నాకు తెలియదా? నోర్మూసుకుని చెప్పింది చెయ్' అని ఆదేశించారు.

మూడు చోట్ల పెత్తనం

ఎమ్మెల్యే సోదరుడు.. బ్లేడ్ బ్యాచ్‌లు, పోరంబోకులకు మహానేత. వారంతా ఆయనను దేవుడిలా చూస్తారు. ఆయనకు వైసీపీ యూత్ వింగ్‌లో ఓ కీలక పదవి కూడా ఉంది. నియోజకవర్గంలోనే గాక పొరుగునే ఉన్న మరో రెండు నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యే కుటుంబం పెత్తనం చేస్తోంది.

అర్హతల్లేని వ్యక్తినెలా నియమించారు?

- గనులశాఖ డైరెక్టర్ నియామకంపై హైకోర్టు ప్రశ్న

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి నియామకంపై ప్రభుత్వాన్ని హైకోర్టు నిలదీసింది. ఎలాంటి అర్హతలు లేని వ్యక్తిని ఆ పోస్టులో ఎలా నియమించారని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ధర్మాసనం స్పందించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గనులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వ్యక్తిగత హోదాలో వెంకటరెడ్డికి నోటీసులు జారీ చేసింది. విచారణను మార్చి 27కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. చట్టంలో నిర్దేశించిన విధంగా అర్హతలు లేనప్పటికీ వీజీ వెంకటరెడ్డిని గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించారని, ఆయన నియామక జీవోను రద్దు చేయాలని కోరుతూ గుంటూరు జిల్లా కృష్ణాయపాలెం గ్రామానికి చెందిన టి.గంగాధర్ ప్రజా ప్రయోజన దాఖలు చేసిన వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చుక్కపల్లి భానుప్రసాద్ వాదనలు వినిపించారు. ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో సివిలియన్ స్టాఫ్ ట్రైనింగ్ ఆఫీసర్‌గా వెంకటరెడ్డి పని చేసేవారని తెలిపారు. డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చిన ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యా శాఖలో బాధ్యతలు అప్పగించిందని, ఆ తర్వాత అర్హత లేకపోయినా గనులశాఖ డైరెక్టర్‌గా నియమించారని వివరించారు. నిబంధనల ప్రకారం గనులశాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యే వ్యక్తి కనీసం రెండేళ్లు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి ఉండాలని, వెంకటరెడ్డి ఏడీగా పని చేయలేదని పేర్కొన్నారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. నోటీసులు జారీ చేసింది.

అంతా వివాదాస్పదమే

గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి అంతకుముందు ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో సివిలియన్ స్టాఫ్ ఆఫీసర్(ట్రైనింగ్)గా పనిచేసేవారు. జగన్ సర్కారు కొలువుదీరిన తర్వాత డిప్యుటేషన్‌పై వచ్చారు. తొలుత విద్యాశాఖలో ప్రత్యేక కార్యదర్శిగా నియమితులయ్యారు. కొద్దినెలలకే ఆయనకు గనులశాఖ డైరెక్టర్ పోస్టును కట్టబెట్టారు. వెంకటరెడ్డి చేసిన కోస్టుగార్డు సర్వీసుకు, గనుల శాఖకు సంబంధం ఏమిటనేది అర్థం కాని విషయం. కేవలం జగన్‌కు వీర విధేయుడన్న కారణంతో కీలక పోస్టులో కొనసాగుతున్నారు. గనుల వ్యాపారంలో ఉన్న టీడీపీ నేతలకు రూ.వందల కోట్ల జరిమానాలు విధించడం, అనుమతులు నిరాకరించడం, రద్దు చేయడం, వైసీపీ నేతలకు అక్రమంగా గనులు కట్టబెట్టడం వంటివి చేస్తున్నారు. అనుమతులు లేకుండా దోచేస్తున్న వైసీపీ నేతలకు అండగా ఉంటున్నారు. తానో ప్రభుత్వ అధికారిని అనే విషయం కూడా మర్చిపోయారు.

జగన్ మెప్పు కోసం యాత్ర-2లో అసత్యాలు

- దర్శక, నిర్మాతలకు కాంగ్రెస్ పార్టీ లీగల్ నోటీసులు

విజయవాడ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): యాత్ర2 చిత్ర దర్శకుడు మహి వి. రాఘవ్, నిర్మాణ సంస్థలు త్రీ ఆటమ్ లీవ్స్ వీ సెల్యూలాయిడ్‌లకు కాంగ్రెస్ పార్టీ లీగల్ నోటీసులు పంపింది. సీఎం జగన్ మెప్పు కోసం దర్శక, నిర్మాతలు అభూత కల్పనలు, అసత్యాలను చూపించారని నేతలు వివరించారు. కాంగ్రెస్ పార్టీ విజయవాడ నగర కమిటీ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు ఈ విషయాన్ని బుధవారం వెల్లడించారు. సోనియాగాంధీ పాత్రపై ఉన్న కల్పిత సన్నివేశాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. సోనియాను విలన్‌గా చూపించాలని జగన్ చేస్తున్న కుట్రలను కోర్టుల ద్వారా తిప్పికొడతామన్నారు. సెన్సార్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

షర్మిల, సునీతారెడ్డిలపై అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్టు

కడప(క్రైం), ఫిబ్రవరి14: ఫేస్‌బుక్‌లో ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసి వైఎస్ షర్మిలారెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డి, ఆయన కుమార్తె సునీతారెడ్డిలపై అసభ్యకరమైన పదజాలంతో పోస్టులు పెట్టిన విశాఖకు చెందిన ఉదయ్‌భూషణ్ అనే వ్యక్తిని అరెస్టు చేశామని కడప జిల్లా ఏఎస్పీ(పరిపాలన) లోసారి సుధాకర్ తెలిపారు. బుధవారం ఆయన నిందితుడి వివరాలను వెల్లడించారు. విశాఖ మహారాణిపేట సామ్రాట్ ఎన్‌క్లేవ్, నౌరోజీరోడ్డుకు చెందిన ఉదయభూషణ్ రియల్టర్. ఈ ఏడాది జనవరి 13న వి.రవీంద్రరెడ్డి అనే వ్యక్తి పేరిట ఫేస్‌బుక్‌లో ఫేక్ అకౌంటు క్రియేట్ చేసి వి.రవీంద్రరెడ్డి ఫొటోను ప్రొఫైల్ పిక్‌గా పెట్టి దాని నుంచి షర్మిల, వివేకా, సునీతారెడ్డిలపై అసభ్య పదజాలంతో పోస్టులు పెట్టాడు. దీనిపై వి.రవీంద్రరెడ్డి స్పందించి తన పేరుతో ఫేక్ ఫేస్‌బుక్ అకౌంటు ఓపెన్ చేసి ఎవరో పోస్టులు పెడుతున్నారని పులివెందుల అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు 45/24 క్రైం నంబరు కింద కేసు నమోదు చేశారు. ఫిర్యాదు చేసిన రవీంద్రరెడ్డి వైఎస్సార్ సోషల్ మీడియా మెంబరుగా ఉంటూ పార్టీకి సంబంధించిన మెసేజ్‌లు పోస్టులు చేస్తుంటాడు. కొన్ని సందర్భాల్లో చంద్రబాబు, లోకేశ్‌లను విమర్శిస్తూ పోస్టులు పెట్టాడు. వైసీపీ వారితోనే వారిని తిట్టించాలనే ఉద్దేశంతో ఉదయ్‌భూషణ్ ఫేక్ అకౌంట్‌లో పోస్టులు పెట్టాడని ఏఎస్పీ తెలిపారు. నిందితుడిని రిమాండుకు తరలించారు.

మేలో ఏపీ ఈఏపీసెట్

- మే 8న ఈసెట్, 6న ఐసెట్.. జూన్‌లో ఎడ్‌సెట్, లాసెట్

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు 2024లో నిర్వహించే 9 సెట్ల పరీక్షల తేదీలను ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ఆయా సెట్ల నిర్వహణకు కన్వీనర్లను ఎంపిక చేసింది. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీకోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈఏపీసెట్‌ను ఈసారి మేలో నిర్వహిస్తున్నట్లు తెలిపింది. మే 13 నుంచి 19 వరకు పరీక్షలు జరుగుతాయని వివరించింది. సెట్ నిర్వహణను జేఎన్‌టీయూ కాకినాడకు అప్పగించింది. డిప్లొమా నుంచి ఇంజనీరింగ్ ప్రవేశాలకు నిర్వహించే ఈసెట్‌ను మే 8న నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఈ బాధ్యత జేఎన్‌టీయూ అనంతపురానికి అప్పగించింది. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాలకు ఐసెట్‌ను మే 6, ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల ప్రవేశాలకు పీజీఈసెట్ పరీక్షలు మే 29 నుంచి 31 వరకు జరుగుతాయని వివరించింది. ఎడ్‌సెట్ జూన్ 8న, లాసెట్ జూన్ 9న, పీజీసెట్ జూన్ 3 నుంచి 7 వరకు, ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏడీసెట్) జూన్ 13న జరుగుతాయని తెలిపింది. ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులకు సంబంధించిన పీఈసెట్ పరీక్ష తేదీని తర్వాత ప్రకటిస్తారని తెలిపింది.

అల్లూరి కలెక్టరుగా విజయ సునీత

- మరికొందరు ఐఏఎస్‌ల బదిలీ

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరికొందరు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారి ఎం.విజయ సునీతను అల్లూరి సీతారామరాజు జిల్లాకు కలెక్టరుగా నియమించారు. అల్లూరి కలెక్టరు సుమిత్‌కుమార్‌ను పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరుగా బదిలీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరుగా పనిచేస్తున్న పి.ప్రశాంతికి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి రాహుల్ పాండేకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయనను జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి. వీరపాండియన్‌కు పౌరసరఫరాలశాఖ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఉద్యమ బాట

(మొదటి పేజీ తరువాయి)

వినతిపత్రాలు అందజేశారు. పీఆర్సీ, డీఏ బకాయిలు, ఇతర పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ.22 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. 12వ పీఆర్సీ కమిషన్ వేసినా ఇంతవరకు ఆ పీఆర్సీకి సంబంధించిన పని మొదలు పెట్టలేదని మండిపడ్డారు. నివేదిక ఆలస్యం అవుతున్నందున పెరిగిన ధరలకు అనుగుణంగా 30 శాతం ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏపీ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హృదయ రాజు కడప నీటి పారుదల శాఖ కార్యాలయం వద్ద ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు తమ సమస్యల సాధనకోసం అంతా సిద్ధమన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు విడుదల చేస్తామని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ప్రభుత్వం అమలు చేయకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఉద్యమ కార్యాచరణ విజయవంతమైందని ఏపీజేఏసీ చైర్మన్, సెక్రటరీ జనరల్ బండి శ్రీనివాసరావు, హృదయరాజు తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఏపీజేఏసీ నేతలు వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు తిరిగి అక్కడ నిర్వహించిన ఆందోళనలలో పాలు పంచుకున్నారు. తిరుపతి జిల్లా గూడూరులో ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాల వద్ద ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. సత్యవేడు, పుత్తూరు డిపోల్లో ఆర్టీసీ ఉద్యోగులూ నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. నంద్యాల కలెక్టరేట్ వద్ద ఏపీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27న చేపట్టబోయే చలో విజయవాడ కార్యక్రమంతో ప్రభుత్వానికి తమ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. విశాఖపట్నంలో ఏపీ జేఏసీ విశాఖ చైర్మన్ కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఫెడరేషన్ సభ్యులు ఎన్జీవో హోమ్ నుంచి ఊరేగింపు నిర్వహించారు. కాగా, గురు, శుక్రవారాలు కూడా మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు నేతలు వివరించారు.



ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

ప్రధాన డిమాండ్లు ఇవీ..

- ప్రస్తుత ద్రవ్యోల్బణానికి అనుగుణంగా 12వ పీఆర్సీ అమలు చేసే వరకు 1-7-2023 నుంచి 30 శాతం ఐఆర్ మంజూరు చేయాలి.
- కేంద్రం డీఏ ప్రకటించినట్టుగా రూపాయికి 0.91 పైసలు చొప్పున రాష్ట్రం కూడా 2023 జనవరి 1, 2023 జూలై 1లలో ఇవ్వాల్సిన రెండు డీఏలను వెంటనే మంజూరు చేయాలి.
- పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, సరెండర్ లీవులు, ఏపీజీఎల్ఐ, మెడికల్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి.
- 1-7-2018 నుంచి 1-7-2022 వరకు డీఏల బకాయిలను ఉద్యోగులకు, పదవీ విరమణ చేసిన వారికి వెంటనే చెల్లించాలి.
- 1-9-2004న లేదా అంతకుముందు నియామకం పొందినవారు లేదా నోటిఫికేషన్ ప్రకటించాక ఆ తదుపరి నియామకం పొందినవారికి సీపీఎస్‌కు బదులు ఓపీఎస్ అమలు చేయాలి.
- గత పీఆర్సీలలో ఉన్నవిధంగానే 70, 75 ఏళ్లు నిండిన పెన్షనర్లకు 7 శాతం-10%, 12-15% అదనపు పెన్షన్‌ను పునరుద్ధరించాలి.
- అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్సలు అమలు చేయాలి. ఈహెచ్ఎస్ కార్డులు జారీ చేయాలి.
- ఎన్ఎమ్ఆర్, పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్ కంటిజెంట్, ఎంటీఎస్ ఉద్యోగుల జీతాలు పెంచాలి. వారి సర్వీసును రెగ్యులర్ చేయాలి.
- సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి.
- ప్రతి నెలా 1వ తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లించాలి.
- ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి.



నామినేషన్ పత్రాలను అందిస్తున్న సోనియా; చిత్రంలో రాహుల్, ప్రియాంక

రాజ్యసభకు సోనియా నామినేషన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభ ఎన్నికల బరిలోకి దిగారు. బుధవారం రాజస్థాన్ అసెంబ్లీ భవనంలో ఆమె నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆమె పిల్లలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, మాజీ సీఎం అశోక్ గహ్లోత్ పాల్గొన్నారు. లోక్‌సభకు ఇవే తన చివరి ఎన్నికలని 2019 ఎన్నికల్లో సోనియా ప్రకటించారు. దీంతో ఇమె ఇప్పుడు రాజ్యసభ బరిలో తొలిసారిగా నిలిచారు. ఈ నేపథ్యంలో ఈసారి రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభకు ప్రియాంక గాంధీ వాద్రా పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇక తెలంగాణ నుంచి రేణుకా చౌదరి, యువజన కాంగ్రెస్ నేత అనిల్ కుమార్ యాదవ్, హిమాచల్‌ప్రదేశ్ నుంచి అభిషేక్ సింఘ్వీ రాజ్యసభకు పోటీ చేయనున్నారు. అలాగే, అజయ్ మాకెన్‌తోపాటు డాక్టర్ సయ్యద్ నసీర్ హుసేన్, జీసీ చంద్రశేఖర్ కర్ణాటక నుంచి రాజ్యసభకు పోటీ చేయనున్నారు. ఇక బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గుజరాత్ నుంచి రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరిన మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ రాజ్యసభకు పోటీ చేయనున్నారు. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఒడిసా నుంచి రాజ్యసభ బరిలో నిలువనున్నారు. 56 రాజ్యసభ స్థానాలకు ఈనెల 27న ఎన్నికలు జరుగనున్నాయి.

చేతిలో చేయి వేసి.. ఒకర్నొకరు చూసుకుంటూ..

- డచ్ మాజీ ప్రధాని దంపతుల కారుణ్య మరణం
- 93 ఏళ్ల వయసులో 70 ఏళ్ల ప్రేమకు ముగింపు

అమ్‌స్టర్‌డ్యామ్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: వాలంటైన్స్ డేకి కొద్ది రోజుల ముందు నెదర్లాండ్స్‌లో విషాదం చోటు చేసుకుంది. ఆ దేశ మాజీ ప్రధాని డ్రైస్ వాన్ ఆగ్ట్, ఆయన సతీమణి యూజీనీ ఇద్దరూ ఒకేసారి మృత్యుఒడిలోకి చేరారు. 93 ఏళ్ల వయసున్న వీరు అక్కడి చట్టం ప్రకారం కారుణ్య మరణాన్ని ఎంచుకొని, చివరి క్షణాల్లో ఒకరి చేతిలో మరొకరు చేతులు వేసుకుని, ఒకరినొకరు చూసుకుంటూ ఈ నెల 5న కన్నుమూశారు. దీంతో వీరి మధ్య 70 ఏళ్ల ప్రేమ బంధానికి తెరపడింది. '1977 నుంచి 1982 వరకూ ప్రధానిగా సేవలందించిన వాన్ ఆగ్ట్ 93వ పుట్టినరోజు జరుపుకొన్న మూడు రోజుల తర్వాత స్వగ్రామమైన నిజ్‌మెగెన్‌లో తన ప్రియమైన భార్య యూజీనీ చేతిలో చేయి వేసి, ఆమెతో పాటే మరణించారు' అని ఆయన స్థాపించిన హక్కుల సంస్థ 'వాన్ ఆగ్ట్స్ క్లబ్' ప్రకటించింది. 2019లో బ్రెయిన్ హేమరేజ్ బారిన పడిన వాన్ ఆగ్ట్ ఆ తర్వాత పూర్తిగా కోలుకోలేకపోయారు. ఒకరిని విడిచి మరొకరు జీవించలేమని నిర్ణయించుకున్న తర్వాత వారు కారుణ్య మరణాన్ని ఎంచుకున్నారు. కాగా, 2002లో నెదర్లాండ్స్‌లో కారుణ్య మరణాన్ని చట్టబద్ధం చేసిన తర్వాత అక్కడ ఇలాంటి కేసులు నాలుగు రెట్లు పెరిగాయి. 2022లోనే 8,720 మంది దీన్ని ఎంపిక చేసుకున్నారు. ఆ ఏడాది 26 జంటలు కోరుకుంటే 2023లో ఇది 58 జంటలకు పెరిగింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

పచ్చని పచ్చికపై చక్కని పిచ్చుక..!



ఒకప్పుడు మన పూర్వీకులు పిచ్చుకల కోసం, వాటి మనుగడ కోసం ఎంతో తపించేవారు. ముఖ్యంగా రైతులు తమ ఇంటి ముంగిట, వరండాలో వరికంకులు, మొక్కజొన్న కంకులు వంటివి వేలాడదీసేవారు. అవి వాటిపై వాలి తమ ఆహారాన్ని సంపాదించుకుని రివ్వున ఎగురుతూ తమ కిచుకిచులతో రైతల వనాన్ని ఆనందమయం చేసేవి. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో సెల్ టవర్లు విపరీతంగా పెరగటంతో రేడియేషన్, గాలి కాలుష్యం వల్ల అవి తమ సంతానోత్పత్తి సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. పల్లెలు పోయి పట్టణాలు, అపార్ట్‌మెంట్ సంస్కృతి పెరగటంతో అవి తమ నివాసాన్ని కోల్పోతున్నాయి. కృత్రిమ ఎరువులు వాడకంతో వాటి మనుగడ పూర్తిగా క్షీణించి పోయింది. ఎక్కడో ఒకచోట మనసున్న రైతులు తమ పొలాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తుండటం వల్ల పిచ్చుకలు తమ మనుగడను, ఉనికిని కాపాడుకుంటూ వస్తున్నాయి. బుధవారం సాయంత్రం నగర శివార్లలోని పంటపొలాల్లో వందలాదిగా పిచ్చుకలు ఎగురుతూ కనువిందు చేశాయి.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మాస్టర్స్ బ్యాడ్మింటన్ ప్లేయర్స్

మాస్టర్స్ బ్యాడ్మింటన్‌కు జిల్లా క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్సు, ఫిబ్రవరి 14: రాజమహేంద్రవరంలో ఈ నెల 16 నుంచి 18 వరకు మాస్టర్స్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పలువురు ఉమ్మడి కృష్ణా ప్లేయర్స్ బరిలో దిగుతున్నారని కేడీబీఏ అధ్యక్ష,కార్యదర్శులు పోలినేని అంకమ్మచౌదరి, పర్సా శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో తెలిపారు. పురుషుల సింగిల్స్ 35 ప్లస్‌లో సతీష్, ఎస్‌కే షఫీ, 40 ప్లస్‌లో సిలార్, ఎస్‌కే.బాజీ, 45 ప్లస్‌లో కె.శ్యామ్, ఎన్.వేణుమాధవ్, 50 ప్లస్‌లో వీఎన్‌డీఎస్ఎస్.మూర్తి, టి.కిరణ్‌కుమార్, 55 ప్లస్‌లో కేవీడీ.ప్రసాద్, ఎం.శ్రీను, 60 ప్లస్‌లో బి.శ్రీనివాస గాంధీ, జి.శ్రీనివాస రావు, 65 ప్లస్‌లో పీఎస్.శాస్త్రి, ఈ.బుచ్చిబాబు, 70 ప్లస్‌లో కె.గంగాధర రావు, జి.విజయ్‌కుమార్, 75 ప్లస్‌లో డి.సాయి ప్రసాదరావు, మహిళల 40 ప్లస్ సింగిల్స్‌లో తనూజ, ఎస్.దేవి, 45 ప్లస్‌లో లలిత, లతతో పాటు డబుల్స్ మిక్స్‌డ్ డబుల్స్‌లోను క్రీడాకారులు తలపడనున్నారు.



మహిళా క్రికెట్ టీమ్‌ను అభినందిస్తున్న కలెక్టర్ దిల్లీరావు

మరింత ఉన్నత శిఖరాలకు ఎదగండి

- జిల్లా మహిళల క్రికెట్ టీమ్‌కు కలెక్టర్ ప్రశంస

వన్‌టౌన్, ఫిబ్రవరి 14: ఆడుదాం-ఆంధ్రాలో ప్రతిభను చాటి షీల్డ్‌ను గెలుచుకున్న జిల్లా క్రికెట్ టీమ్ మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని కలెక్టర్ ఎస్.దిల్లీరావు ఆకాంక్షించారు. మంగళవారం విశాఖపట్నంలో జరిగిన ఆడుదాం-ఆంధ్రా ఫైనల్ మ్యాచ్‌లో నెగ్గిన విజయవాడ అర్బన్ సిద్ధార్థనగర్ వార్డు సచివాలయం మహిళా క్రికెట్ టీమ్ రూ.5లక్షల నగదు బహుమతి, ట్రోఫీ అందుకుంది. బుధవారం తమకొచ్చిన ట్రోఫీని కలెక్టరేట్‌లో కలెక్టర్ దిల్లీరావుకు ట్రోఫీని అందించి తమకు సహకారమిచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన జట్టు సభ్యులను, జిల్లా క్రీడల అభివృద్ధి, కోచ్, మేనేజర్, నోడల్ అధికారులను అభినందించారు. ఇదే సమయంలో చెన్నై సూపర్‌కింగ్స్ దత్తత తీసుకున్న కేవైఎం విష్ణువర్ధన్‌కు కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, జట్టు కోచ్ ఎస్.మాధవిదేవి, మేనేజర్ ఎస్.పురుషోత్తం, డీఎస్‌డీవో కార్యాలయ అధికారి ముంతాజ్ బేగం, జట్టు సభ్యులు కెప్టెన్ ఎం.భావన, ఏవై రాణి, ఎం.గీతాంజలి, కేవైఎం విష్ణువర్ధిని, ఎం.లేఖన, సయ్యద్ మెహనూర్, ఎం.పూజిత, ఎంఏ ముస్కాన్, వి.గాయత్రీదేవి, వివి.మాధవి, కె.కీర్తి, ఐ.చందన,జి.నోషిని, లాక్షణ్య, శృతినాయుడు, ఎన్.కీర్తి పాల్గొన్నారు. నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ జట్టుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వ్యాయామానికి బంధనాలు!

- ఐసీఎంఎస్ స్టోర్ గదిలో పరికరాలు ఐదేళ్లుగా నిరుపయోగం
- ఉన్నట్టుండి గదిని ఖాళీ చేయించిన శాప్ అధికారి
- నోరు విప్పని క్రీడాసంఘాలు

ఆంధ్రజ్యోతి - విజయవాడ: ఆరోగ్యవంతంగా ఉండాల్సిన 'వ్యాయామం' అపరిశుభ్రమైంది. పనికొచ్చే పరికరాలు మూలనపడ్డాయి. కొన్ని పనికొస్తున్నా ఉపయోగించుకోలేని పరిస్థితిలో అధికారులున్నారు. నిత్యం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియానికి వ్యాయామం కోసం వస్తున్నవారు చూసినా అధికారులను ప్రశ్నించలేని పరిస్థితి. లక్షలాది రూపాయలు విలువైన పరికరాలు స్టేడియంలో గ్యాలరీ కింద ఉన్న స్టోర్ రూంలో బందీగా పడి ఉన్నాయి. వాటిపై దుమ్ము, ధూళి పడి అపరిశుభ్రంగా మారాయి. స్టేడియం మొదటి అంతస్తులో ఒక గదిలో జిమ్ చేసుకోవడానికి లక్షలాది రూపాయలతో పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. వాటిని వ్యాయామం చేసుకోవడానికి వీలుగా మార్చే ప్రయత్నం అధికారులు చేయడం లేదు.

ఐదేళ్లుగా స్టోర్ రూమ్‌లోనే..

స్టేడియం మొదటి అంతస్తులో వ్యాయామం చేసుకోవడానికి వీలుగా జిమ్ ఉండేది. ఇక్కడికి నిత్యం వాకింగ్, రన్నింగ్ చేయడానికి నగర వాసులు, ఆడుకోవడానికి క్రీడాకారులు వస్తుంటారు. ఇలా వచ్చిన వారు కొంతసేపు వ్యాయామం చేసుకునేవారు. దేహ దారుఢ్యంపై ఆసక్తి ఉన్న యువకులు జిమ్‌లో వ్యాయామం చేసేవారు. ఇందుకోసం బెంచ్ ప్రెస్ విషన్, లెగ్ ప్రెస్ మిషన్, పులప్ బార్స్, డంబెల్స్, ట్రైసెప్స్ ప్రెస్ మిషన్, షోల్డర్ ప్రెస్ మిషన్, చెస్ట్ ఫ్లై మిషన్, ఇన్‌క్లైన్ బెంచ్ ప్రెస్ వంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయి. 2019 వరకు మొదటి అంతస్తులో ఓ గదిలో ఉన్న ఈ పరికరాలు ఎన్నికల సమయంలో గ్యాలరీకి దిగువన ఉన్న స్టోర్ రూంలోకి వెళ్లాయని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులు చెబుతున్నారు. నాడు ఎన్నికల సామగ్రి ఇక్కడ భద్రపరచడం, అధికారులతో సమావేశాలు నిర్వహించడంతో జిమ్ పరికరాలను గ్యాలరీ కిందనున్న స్టోర్ రూంలోకి మార్పు చేశామని చెబుతున్నారు. ఎన్నికల తతంగం ముగిసి ఐదేళ్లయినా ఈ పరికరాలను తిరిగి జిమ్ హాలులోకి ఎందుకు చేర్చలేదన్న దానికి మాత్రం అధికారులు సమాధానం చెప్పడం లేదు. దీనిపై ఏ క్రీడాసంఘ ప్రతినిధులు నోరు మెదపడం లేదు. స్టేడియంలో గ్యాలరీలకు దిగువన ఉన్న గదుల్లో ఒక్కోదాంట్లో ఒక్కో క్రీడాసంఘ కార్యాలయం ఉంది. ఇక్కడికి నిత్యం కోచ్‌లు, క్రీడాకారులు వస్తుంటారు. సంఘాల్లో పదవుల కోసం కొట్లాడే ప్రతినిధులకు జిమ్ పరికరాల గురించి పట్టకపోవడం గమనార్హం.





స్టోర్ రూంలో నిరుపయోగంగా పడి ఉన్న జిమ్ పరికరాలు

టీటీగా మారిన జిమ్ రూం

ఐజీఎంఎస్ మొదటి అంతస్తులో జిమ్ కోసం కేటాయించిన గది ఇప్పుడు టేబుల్ టెన్నిస్ కోర్టుగా మారింది. శాప్‌లో పనిచేసిన ఓ ఉన్నతాధికారి కోసం ఇలా చేశారని తెలుస్తోంది. మొదట్లో టీటీ కోర్టు క్రికెట్ నెట్ ప్రాక్టీస్ జరిగే ప్రదేశంలో ఉండేది. అక్కడి నుంచి జిమ్ గదిలోకి వచ్చింది. ఆ ఉన్నతాధికారికి సమీపంగా ఉండేలా టీటీ కోర్టును మార్పు చేయించినట్టు సమాచారం. గదిలో నుంచి జిమ్ పరికరాలు గ్యాలరీ కింద స్టోర్ రూంలోకి చేరి ఐదేళ్లు పూర్తవుతోంది. ఇప్పటికైనా వాటిని శుభ్రం చేసి ఏదైనా గదిలోకి మార్పుతారా లేక త్వరలో ఎలాగూ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది కాబట్టి స్టోర్ రూంలోనే వదలేస్తారా అన్నది అధికారుల స్పందనపై ఆధారపడి ఉంది.

జేఈఈ మెయిన్స్‌లో శారద విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం: జేఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడం అభినందనీయమని శారద విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు, ఎండీ వై.శారదా దేవి అన్నారు. బుధవారం మొగల్రాజపురం క్యాంపస్‌లో విద్యార్థుల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 650 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 350 మంది పర్సంటేజ్ సాధించారన్నారు. ఒత్తిడి లేని విద్యావిధానం, ప్రణాళిక బద్ధమైన బోధన, ప్రశాంత వాతావరణం, ఆన్‌లైన్ పరీక్షా ప్రణాళిక విద్యార్థులు మంచి ఫలితాల సాధనకు ఉపకరించాయన్నారు. అడ్వైజర్ ఈఎస్ఆర్‌కే ప్రసాద్, జీఎం జీవీ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాయితీకి నిదర్శనం దామోదరం

వన్‌టౌన్: ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం దామోదరం సంజీవయ్య నిరాడంబరత, నిజాయితీకి నిదర్శనమని, ఈ తరానికి ఆదర్శనీయుడని కలెక్టర్ ఎస్.దిల్లీరావు పేర్కొన్నారు. సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తన 38 ఏళ్ల వయస్సులోనే సంజీవయ్య సీఎంగా బాధ్యతలు చేపట్టి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. డీఆర్వో వల్లభనేని శ్రీనివాసరావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి వీవీ విజయభారతి, జీఎం డీఐసీ ఏ సుధాకర్, కలెక్టరేట్ ఏవో నాగలక్ష్మి పాల్గొన్నారు.


బ్రిటీష్ కౌన్సిల్ ఆఫ్ లైబ్రరీస్ డైరెక్టర్ గ్రంథాలయ సందర్శన

గవర్నర్‌పేట: గ్రంథాలయాలు ఎంతోమంది పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నాయని చెన్నైలోని బ్రిటీష్ కౌన్సిల్‌కు చెందిన లైబ్రరీస్ డైరెక్టర్ టీ.వి జయలక్ష్మీ, విభాగాధిపతి మేహా కక్కర్ అన్నారు. వీరిరువురూ బుధవారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయాన్ని సందర్శించారు. అందులోని పత్రికల విభాగం, పాత పత్రికల విభాగం, రిఫరెన్స్ విభాగం, ఇంటర్‌నెట్ విభాగం, స్టడీ లాబ్‌ను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. పౌర గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయడంతో పాటు ఉచిత సాఫ్ట్‌వేర్ పాలసీపై గ్రంథాలయ సంచాలకులు ప్రసన్నకుమార్ కౌన్సిల్‌కు చెందిన అధికారులతో చర్చించారు. పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఎంఆర్ ప్రసన్నకుమార్, డిప్యూటీ డైరెక్టర్ పీర్ అహ్మద్, ఏపీ గ్రంథాలయ పరిషత్ సభ్యుడు మహేష్, ఉమ్మడి గ్రంథాలయ సంస్థ చైర్మన్ టి.జమలపూర్ణమ్మ, కార్యదర్శి ఎంవీడీటీ నగేష్, గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

విజిలెన్స్ పెట్టాల్సిందే..!

ఆకాశమే హద్దుగా.. అక్రమ మైనింగ్!!

- పని మానేసిన వ్యవస్థలు
- చేవహీనమైన రెవెన్యూ, మైనింగ్, ఫారెస్ట్ శాఖలు
- ఎన్‌జీటీ ఆదేశాలు బేఖాతర్
- లోకాయుక్త ఆదేశాలకూ లెక్కలేదు
- మైనింగ్ అక్రమార్కులపై విజిలెన్స్‌కు ఫిర్యాదు



పోలవరం కాలువ వెంబడి లారీల వరస



అక్రమంగా తవ్వకాలు జరిపి లారీల్లో తీసుకెళుతున్న మాఫియా

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఆకాశమే హద్దుగా అక్రమ మైనింగ్ సాగిపోతోంది! వ్యవస్థలన్నీ పనిచేయటం మానేశాయి! అవినీతి రుచి మరిగి అడ్డూ అదుపు లేకుండా అక్రమార్కులకు సహకరించేంత బరి తెగింపుకు పాల్పడుతున్నారు. రెవెన్యూ, మైనింగ్, ఫారెస్ట్ శాఖల్లో చేవ చచ్చింది! ఎన్‌జీటీ, లోకాయుక్త ఆదేశాలనూ లెక్కచేయనంత ధైర్యం చేస్తున్నాయి. తప్పులు జరుగుతున్నాయని విజిలెన్స్ క్షేత్ర స్థాయి సిబ్బంది గుర్తించారు. అందరినీ ఆశ్రయించాం.. ఇక మీరే ఉన్నారు. అక్రమ మైనింగ్ అక్రమార్కులపై విజిలెన్స్ దృష్టి సారించి.. ముగింపు పలకాలి' అంటూ కొత్తూరు తాడేపల్లి గ్రామస్థులు రాష్ట్ర విజిలెన్స్ ఐజీకి బుధవారం ఫిర్యాదు చేశారు. విజయవాడ రూరల్ మండలంలో సాగుతున్న వ్యవహారంపై బుధవారం విజిలెన్స్ ఐజీకి గ్రామస్థుల నుంచి ఫిర్యాదు అందింది. కొత్తూరు తాడేపల్లి, పాతపాడు ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో జరిపిన అక్రమ మైనింగ్‌తో పాటు, తాడేపల్లిలో సాగిన అక్రమ మైనింగ్, పోలవరం మట్టి తవ్వకాలు ఇలా ప్రతి ఒక్క అక్రమాన్ని కోట్ చేస్తూ విజిలెన్స్ అధికారులకు కొత్తూరు తాడేపల్లి గ్రామస్థుడు మెండెం జమలయ్య ఐజీకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇటీవల కొత్తూరు తాడేపల్లిలో ప్రభుత్వ భూముల్లో జరిగిన అక్రమ మైనింగ్ కార్యకలాపాలు మొదలుకొని గత ఏడాదిన్నరగా సాగిస్తున్న అనేక అక్రమ మైనింగ్ వ్యవహారాలపై పూసగుచ్చినట్టు పేర్కొన్నారు. కొత్తూరు, తాడేపల్లి అభయారణ్యంలో అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయని తాము సాక్ష్యాధారాలతో సహా అభయారణ్యంలో లోకాయుక్తకు గతంలో ఫిర్యాదు చేసిన అంశాన్ని విజిలెన్స్ ఫిర్యాదులో ప్రధానంగా ప్రస్తావించారు. పాతపాడు, చిలకలపాడు కొండ పరిధిలో 310, 311 సరిహద్దు రాళ్లను పీకేసి అక్రమంగా మట్టిని మైనింగ్ మాఫియా తవ్వుకుపోయిందన్నారు. కొత్తూరు రిజర్వు ఫారెస్ట్‌లో హిల్‌లాక్ ఏరియాలోనూ దారుణంగా మైనింగ్ జరిపారన్నారు. పాతపాడు డంపింగ్ యార్డును మైనింగ్ చేశారన్నారు. పంటచెరువులోని చెట్లను నరికి తరలించారన్నారు. ఫిర్యాదు చేసినా, అటవీశాఖ కేసు నమోదు చేసినప్పటికీ జరిగిన దానికి, కేసులో పొందుపరిచిన అంశాలకు ఎంతో తేడా ఉందన్నారు. జక్కంపూడి అటవీ ప్రాంతంలో 10 కిలోమీటర్ల కాలువ మట్టిని తవ్వేశారని, విజిలెన్స్ బృందం కూడా గుర్తించిందన్నారు వెలగలేరు రిజర్వు ఫారెస్ట్, ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలించినా చర్యలు లేవన్నారు. అటవీ ప్రాంతాల్లో జరిగిన అక్రమాలకు సంబంధించి అక్టోబరు 20, 2023న లోకాయుక్త ఇచ్చిన ఆదేశాల ప్రకారం అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా రాజమండ్రిలోని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. అయినా చర్యలు లేవన్నారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) సైతం అక్రమ మైనింగ్ చేస్తున్నవారిపై తక్షణం చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించినా ఎలాంటి చర్యలు లేదన్నారు. కోట్లాది రూపాయల విలువైన పోలవరం కాలువ మట్టిని తవ్వుకుపోతున్నా చర్యలు తీసుకోలేదన్నారు. రూరల్ మండల పరిధిలో జరుగుతున్న అక్రమ మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారితో పాటు, వారికి సహకారం అందించే శాఖల అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌సీఆర్ ఏజీఎం ఆర్.ధనుంజయులు, అధికారులు

అభివృద్ధి పనులు వేగవంతం

- నర్సాపూర్, భీమవరం టౌన్, గుడివాడ, మచిలీపట్నం బ్రాంచ్ లైన్ సెక్షన్‌లో ఏజీఎం తనిఖీలు

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 14: అమృత్‌భారత్ స్టేషన్ల పరిధిలో ఎంపికైన స్టేషన్లలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ఆర్.ధనుంజయులు అధికారులను ఆదేశించారు. నర్సాపూర్-భీమవరం టౌన్-గుడివాడ- మచిలీపట్నం బ్రాంచ్ లైన్ సెక్షన్‌ను బుధవారం ఆయన తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ఆయన భీమవరం జంక్షన్ స్టేషన్లను తనిఖీ చేసి అక్కడి హెల్త్ యూనిట్‌లో మొక్కలు నాటారు. అనంతరం ఫుట్ ఓవర్ బ్రిడ్జి, బుకింగ్ ఆఫీస్, గూడ్స్ షెడ్‌ను పరిశీలించారు. కొత్తగా తూర్పు వైపు ఏర్పాటు చేసిన ప్రవేశద్వారాన్ని పశ్చిమ సర్క్యులేటింగ్ ఏరియాను పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలిచ్చారు. అనంతరం ఆకువీడు, మండవల్లి, గుడివాడ స్టేషన్లలో వివిధ విభాగాలను పరిశీలించారు. గూడ్స్‌షెడ్ సౌకర్యాలు, రన్నింగ్ రూమ్, కోచింగ్ డిపో, ప్యాసెంజర్ సౌకర్యాలను పరిశీలించారు. తొలుత నర్సాపురంలో రన్నింగ్ రూమ్‌లో ప్లాంటేషన్ డ్రైవ్‌లో ఆయన పాల్గొన్నారు. తరువాత పాలకొల్లు స్టేషన్‌కు వెళ్లి ప్లాట్‌ఫారాలు, ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతా అంశాలను పరిశీలించారు. అక్కడ ట్రేడ్ యూనియన్ నేతలు ఆయనకు స్వాగతం పలికారు. ఏడీఎల్ ఎం.శ్రీకాంత్, సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, సీనియర్ డీవోఎం డి.నరేంద్ర వర్మ, సీనియర్ డీఈఈ డి.శ్రీనివాసరావు, సీనియర్ డీఈఈ పి.సురేష్, విజయవాడ తూర్పు డీఈఎన్ కె.శ్రీధర్ పాల్గొన్నారు.

సోనియాగాంధీపై అసత్య కథనాలు

- ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే యాత్ర-2
- గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం

: కాంగ్రెస్ పార్టీ నేతలు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 14: అభూత, అసత్య కథనాలతో సీఎం జగన్ మెప్పుకోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని యాత్ర-2 దర్శక, నిర్మాతలపై కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. ఈ సినిమాపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. వైఎస్సార్ వ్యతిరేకించే భావాల పునాదులపై వైసీపీ పుట్టిందన్నారు. ఇందిరాగాంధీ, సోనియాగాంధీని ఎప్పుడూ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విమర్శించలేదని గుర్తుచేశారు. రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలని ఆయన పనిచేశారన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రధాని పదవిని త్యజించిన సోనియాగాంధీ గురించి, దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన కుటుంబంపై ఎందుకంత ద్వేషమని ప్రశ్నించారు. అధికార దాహంతో సొంత చెల్లి షర్మిలను కూడా లక్ష్యంగా చేసుకోవడం దుర్మార్గమన్నారు. యాత్ర-2లో సోనియా గాంధీపై ఉన్న అసత్య కథనాలను తొలగించాలని సెన్సార్ బోర్డుకు ఫిర్యాదు చేశామన్నారు. దర్శక, నిర్మాతలకు నోటీసులు పంపామన్నారు. కాంగ్రెస్ పార్టీ నగరాధ్యక్షుడు ఎన్.నరసింహారావు, ఏపీసీసీ ఉపాధ్యక్షుడు మీసాల రాజేశ్వరరావు, ప్రధానకార్యదర్శులు షేక్ నాగూర్, బైపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.





హైకోర్టు న్యాయమూర్తి హరినాథ్ దంపతులు, మాజీ న్యాయమూర్తి గంగారాం, తెలంగాణ లోకాయుక్త చైర్మన్ రాములుకు దుర్గమ్మ చిత్రపటం బహుకరణ

దుర్గమ్మ సన్నిధిలో ప్రముఖులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 14: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి గంగారాం, తెలంగాణ లోకాయుక్త చైర్మన్ సీవీ రాములు దుర్గమ్మను దర్శించుకున్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎన్.హరినాథ్, కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి అధికారులు ఆలయ మర్యాదలను అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం ఇన్‌చార్జి ఈవో కోటేశ్వరరావు, ఏఈవో రమేష్‌బాబు వారికి ప్రసాదం, శేషవస్త్రం అందచేశారు. పండితులు వారికి వేదాశీర్వచనం చేశారు.

బయోగ్యాస్ ప్లాంట్‌కు శంకుస్థాపన

గోల్డ్ క్లస్టర్‌కు వర్చువల్ విధానంలో మంత్రి అమర్నాథ్ ప్రారంభం

వన్‌టౌన్, ఫిబ్రవరి 14: మంత్రి గుడివాడ అమర్నాథ్ బుధవారం వర్చువల్ విధానంలో వివిధ పరిశ్రమలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ క్రమంలో కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో ఏర్పాటు చేయనున్న రిలయన్స్ బయో ఎనర్జీ-సీబీజీ ప్లాంట్‌కు శంకుస్థాపన, జగ్గయ్యపేటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పెషల్ పర్పస్ వెహికల్ నిధులతో ఏర్పాటైన గోల్డ్ క్లస్టర్‌కు ప్రారంభోత్సవం కలెక్టరేట్‌లో నిర్వహించారు. పారిశ్రామిక అభివృద్ధి చైర్‌పర్సన్ బండి శివశక్తి పుణ్యశీల, డీఐసీ జీఎం ఎ.సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ బి.సాంబయ్యతో పాటు రిలయన్స్ ఇండస్ట్రీ లిమిటెడ్, విశ్వరూప గోల్డ్ స్మిత్ ఫౌండేషన్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీబీజీ ద్వారా జరిగే ఎరువుల ఉత్పత్తి వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. గోల్డ్ క్లస్టర్ ద్వారా బంగారు ఆభరణాల పనిచేసేవారికి మెరుగైన ఆదాయం వస్తుందన్నారు. రిలయన్స్ ఇండస్ట్రియల్ మేనేజర్ వి.శ్రీచరణ్, అసిస్టెంట్ మేనేజర్లు సీహెచ్ వెంకటేష్, చిట్టిబాబు, విశ్వరూప గోల్డ్ స్మిత్ ఫౌండేషన్ ఎం.రామకృష్ణ, పి.నాగరాజు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ హోదాలో కలెక్టర్ ఎస్.దిల్లీరావు అధికారులకు సూచించారు. క్యాంప్ కార్యాలయంలో బుధవారం డాక్టర్ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, డాక్టర్ ఆచంట లక్ష్మీపతి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రుల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి, కళాశాలలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు రెండున్నర ఎకరాల స్థలాన్ని సేకరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిసుధాకర్, వైద్య విద్య అదనపు సంచాలకుడు జి.రఘునందన్, వెంకటసత్యనారాయణ, జే.భాస్కర్, డాక్టర్ పీ.వీఎస్ విజయభాస్కర్, డాక్టర్ కే.శాంతి, డి.నాగేశ్వరరావు, వైద్యారోగ్య శాఖ మౌలిక సదుపాయాల కల్పన ఈఈ కె.నాగార్జునరావు, సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

రాజధాని పేరుతో జగన్‌రెడ్డి డ్రామాలు

▸ ప్రశ్నిస్తే విలేకరులపై దాడులా?: అచ్చెన్న



అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ ప్రాంతాన్నీ అభివృద్ధి చేయని ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయే జగన్‌రెడ్డి.. ఉమ్మడి రాజధాని పేరుతో కొత్త డ్రామా ఆడుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. బుధవారం ఆయన ఓ ప్రకటన చేస్తూ, విశాఖలో జగన్‌రెడ్డి కుటుంబం రూ.40వేల కోట్ల విలువైన బినామీ ఆస్తుల్ని కూడగట్టుకుంది. అందుకే విశాఖే రాజధాని అన్నారు. మూడు రాజధానులకు కోర్టులు బ్రేకులు వేయడంతో జగన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి బినామీ ఆస్తులు కాపాడుకోవటానికి ఇప్పుడు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధాని చేయాలంటున్నారు. ఆ మాట కూడా జగన్‌రెడ్డిదే. అధికారంలోకి వచ్చాక అమరావతిని నాశనం చేశాడు' అని పేర్కొన్నారు. మరో రెండు నెలల్లో అధికారంలోకి వస్తాం.. అమరావతి పూర్తి చేస్తాం అని పేర్కొన్నారు. 'జగన్‌రెడ్డీ.. నువ్వు, నీ ముఠా దోపిడీలు, దుర్మార్గాలు చేస్తుంటే ఎవ్వరూ ప్రశ్నించకూడదా?' అచ్చెన్న మరో ప్రకటనలో నిలదీశారు. అమరావతిలో వైసీపీ నేతల ఇసుక దోపిడీని వెలుగులోకి తెచ్చిన విలేకరి పరమేశ్వరరావుపై దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. విలేకరులు ఉంది ఎందుకు? మీ దారుణాలను కళ్లప్పగించి చూడటానికా? అని ప్రశ్నించారు.

●విలేకరులపై దాడులు నిత్యకృత్యం: ఆనందబాబు

జగన్‌రెడ్డి పాలనలో విలేకరులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనంద్‌బాబు అన్నారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 'వైసీపీ నేతల అక్రమ ఇసుక తవ్వకాలపై ఫోటోలు తీస్తే, వార్తలు రాస్తే వారిపైనే దాడులు చేస్తారా? అక్రమ మైనింగ్‌పై కేంద్ర పర్యావరణ శాఖ ఇచ్చిన నివేదికపై ముఖ్యమంత్రి ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.

సజ్జలకు జైలు శిక్ష వేయాలి: ధూళిపాళ్ల

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పొన్నూరు, మంగళగిరి నియోజకవర్గాల్లో తనకు, తన కుటుంబ సభ్యులకు ఓట్లు కావాలని దరఖాస్తులు పెట్టినట్లు ఒప్పుకున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఎన్నికల సంఘ నియమావళి ప్రకారం ఏడాది జైలు శిక్ష, లేదా జరిమానా విధించాలని టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 'ఫాం6 ప్రకారం ఓటర్ల నమోదు అధికారులకు సజ్జల తప్పుడు సమాచారం ఇచ్చారు. దీనికి ఏడాది జైలు/జరిమానా లేదా రెండూ విధించవచ్చు. అలాగే రెండు చోట్లా ఓటు హక్కు కల్పించిన ఈఆర్వోలు, ఇతర సిబ్బందిపైనా చర్యలు తీసుకోవాలి' అని కోరారు.

సీటు ఇవ్వలేదని.. సీఎం సీట్లో కూర్చున్నాడు!

మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం రాష్ట్ర సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ముఖ్యమంత్రి స్థానంలో కూర్చుని వర్చువల్‌గా వివిధ పరిశ్రమలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించి, ప్రసంగించారు. దీనిపై టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రతిస్పందించారు. 'పాపం ఆయన మాత్రం ఏం చేస్తాడు.. పోటీకి సీటు ఇవ్వలేదని.. సెక్రటేరియట్‌కు వెళ్లి ఏకంగా సీఎం సీట్లో కూర్చున్నాడు. ముఖ్యమంత్రి కుర్చీ అంటే కేవలం చైర్ కాదు.. అదొక హోదా! వీళ్లకు అర్థం కాదు.. వీళ్ల పోకడలకు అర్థం లేదు' అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

అవకతవకలపై చర్యలు తీసుకోవాలి: షరీఫ్

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల తుది జాబితాలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఆయన 10 లేఖలు రాశారు. 'గత నెల 22న ఓటర్ల తుది జాబితా ప్రకటించిన తర్వాత ఫామ్ 6,7,8/8ఏలకు సంబంధించి టీడీపీ అనేక ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదులపై ఎలాంటి సమాచారం ఎలెక్షన్ కమిషన్ వెబ్‌పోర్టల్‌లో కనిపించడం లేదు. పేర్లు సరిదిద్దడం, ఓట్ల తొలగింపు, చేర్పులు వంటి ఫిర్యాదుల వివరాలు అప్‌డేట్ చేసేలా నియోజకవర్గ ఎన్నికల అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు.

నేడు 'విధ్వంసం' పుస్తకావిష్కరణ

▸ చంద్రబాబు నుంచి తొలిప్రతి అందుకోనున్న పవన్

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్ట్ ఆలపాటి సురేష్‌కుమార్ రచించిన 'విధ్వంసం' పుస్తకాన్ని గురువారం సాయంత్రం టీడీపీ అధినేత చంద్రబాబు ఆవిష్కరించనున్నారు. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్‌లో జరిగే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పాల్గొని తొలి ప్రతిని అందుకోనున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో జరిగిన విధ్వంసం తీరును జర్నలిస్ట్ ఆలపాటి సురేష్‌కుమార్ తన ఈ పుస్తకంలో పొందుపర్చారు.

చిరుద్యోగులకు భరోసా కల్పిస్తాం: వీఆర్‌ఏలతో పవన్

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ శాఖల్లో నామమాత్రపు వేతనంతో పనిచేస్తున్న చిరుద్యోగుల సమస్యలను అధ్యయనం చేసి, ఉమ్మడి మేనిఫెస్టోలో హామీ చేర్చడంపై పరిశీలిస్తామని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. బుధవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏపీ స్టేట్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్‌ఏల అసోసియేషన్ ప్రతినిధులు పవన్‌కల్యాణ్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. వీఆర్‌ఏలు, వెటర్నరీ అసిస్టెంట్లు, ఇతర చిరుద్యోగుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పవన్ మాట్లాడుతూ చిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని, వారికి తగిన భరోసా కల్పించే బాధ్యతను రాబోయే ఉమ్మడి ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

ఏజెన్సీ గజగజ.. పడిపోయిన ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మధ్యభారతం మీదుగా గాలులు వీయడంతో బుధవారం ఉత్తర కోస్తాలో చలి పెరిగింది. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని ఏజెన్సీలో చలిగాలులకు ప్రజలు గజగజలాడారు. ఉదయం పది గంటల వరకు బయటకు రావడానికి ఇబ్బందిపడ్డారు. మంచు దట్టంగా కురవడంతో ఒక్కసారిగా రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఈ సీజన్‌లో రెండోసారి ఏజెన్సీలో అతితక్కువ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 5.8, అరకులోయలో 7, జీకే వీధిలో 7.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

5 లక్షలిచ్చినా వైసీపీకి ఓటేయను!

▸ టెలీకాలర్‌కు ఓటరు దిమ్మతిరిగే సమాధానం.. రాప్తాడు నేతలకు షాక్

రాప్తాడు, ఫిబ్రవరి 14: ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా... అంటూ ఫోన్ చేసి.. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థికే ఓటేయండి అని అడిగిన టెలికాలర్‌కు.. 'ఐదు లక్షలిచ్చినా వేయను' అంటూ ఓ వ్యక్తి దిమ్మతిరిగే సమాధానమిచ్చారు. అనంతపురం జిల్లా రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి వచ్చిన ఓ ఫోన్‌కాల్‌కు సంబంధించిన కాల్ రికార్డింగ్ ఆడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఆసరా లబ్ధిదారు నాగేంద్రమ్మకు టెలికాలర్ ఫోన్ చేయగా.. ఆమె భర్త లిఫ్ట్ చేశారు. 'నాగేంద్రమ్మకు ఆసరా డబ్బు అందుతోందా? ఇతర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా...?' అని మొదట టెలికాలర్ ప్రశ్నించారు. అందుతున్నాయని ఆయన సమాధానమిచ్చారు. దీంతో వచ్చే ఎన్నికల్లో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఓటు వేయాలని టెలికాలర్ కోరారు. దీంతో నాగేంద్రమ్మ భర్త సమస్యలు ఏకరవు పెడుతూ.. 'ఎంబీఏ చదివిన నా కొడుకు ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నాడు. ఉచిత పథకాల ద్వారా తిని కూర్చుని సోమరిపోతులవుతున్నాం. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే రాజధాని, పరిశ్రమలు ఉండాలి. ఉద్యోగాలు కల్పించాలి. కానీ, చదువుకున్న వారికి ఉద్యోగాల్లేవు. ఉద్యోగాలు కల్పించకుండా ఎన్ని సంక్షేమ పథకాలు ఇచ్చినా ఏం లాభం?' అని నిలదీశారు. తమ పిల్లల భవిష్యత్తు తమకు చాలా ముఖ్యమని, ఈ సారి వైసీపీ వాళ్లు ఎన్ని డబ్బులిచ్చినా ఓటు వేయబోమని స్పష్టం చేశారు.

ఆఫీసులన్నీ ఇచ్చేశాక ఉమ్మడి రాజధాని ఏమిటి?

▸ తెలంగాణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ప్రశ్న

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన జరిగి పదేళ్లవుతున్నా ఏపీకి రాజధాని లేక పోవడానికి ఆ రాష్ట్ర సీఎం వైఎస్ జగన్ పిచ్చి తుగ్లక్ వ్యవహారమే కారణమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని ఏపీ ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ 2019లోనే ఆ ప్రభుత్వం తెలంగాణకు అప్పగించేసిందని అలాంటప్పుడు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ మరో పదేళ్లు కొనసాగాలంటూ వైసీసీ నేత వైవీ సుబ్బారెడ్డి అనడంలో ఔచిత్యమేమిటని ప్రశ్నించారు.



▸ ఈవో ప్రొసీడింగ్స్, ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల లేఖలు పరిగణనలోకి తీసుకోండి

▸ శ్రీశైలంలో కుంభాభిషేకం, ఇతర కార్యక్రమాలపై దేవదాయశాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం

ఆ సర్క్యులర్ ప్రకారమే మహాకుంభాభిషేకం

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో ఈ నెల 16 నుంచి 21 వరకు నిర్వహించనున్న మహాకుంభాభిషేకం, ఇతర కార్యక్రమాలను 2013లో దేవదాయశాఖ కమిషనర్ జారీచేసిన సర్క్యులర్ ప్రకారమే నిర్వహించాలని హైకోర్టు దేవదాయశాఖ అధికారులను బుధవారం ఆదేశించింది. రాష్ట్రంలోని దేవస్థానాల్లో నిర్వహించే దైవసంబంధ కార్యక్రమాల్లో ఎలాంటి ఆగమ సంకరణ లేకుండా నిర్వహించాలని అందులో పేర్కొన్నారని గుర్తు చేసింది. మహా కుంభాభిషేకం నిర్వహణ నిమిత్తం గతేడాది మే 8, 10వ తేదీల్లో శ్రీశైలం దేవస్థానం ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను పరిగణలోకి తీసుకోవాలంది. కుంభాభిషేకం ఇతర కార్యక్రమాలు ఏవిధంగా నిర్వహించాలనే విషయంపై దేవదాయశాఖ కమిషనర్‌కు ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు రాసిన లేఖలో పేర్కొన్న వివరాలను పరిగణలోకి తీసుకోవాలని పేర్కొంది. విచారణను మార్చి 13కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. శ్రీశైలంలో మహా కుంభాభిషేకం, ఉపాలయాల్లో లింగ, యంత్ర ప్రతిష్ఠ, శివాజీ గోపురంపై కలశ స్థాపన కార్యక్రమాలను వైదిక స్మార్త ఆగమం ప్రకారం నిర్వహించేలా దేవదాయశాఖ అధికారులను ఆదేశించాలని కోరుతూ గుంటూరుకు చెందిన పి.వెంకట బుచ్చిరామశాస్త్రి మరో ముగ్గురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ... గతంలో శ్రీశైల దేవస్థానంలో సంప్రోక్షణ కార్యక్రమాలను శైవాగమ, వైదిక పద్ధతుల్లో నిర్వహించారన్నారు. ప్రస్తుతం కూడా అవే పద్ధతులు అనుసరించేలా ఆదేశాలివ్వాలని కోరారు. దేవదాయశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది రజనీరెడ్డి వాదనలు వినిపిస్తూ... కలశస్థాపన, లింగ, యంత్ర ప్రతిష్ఠలను వీరశైవాగమ రిత్వికులు నిర్వహిస్తారన్నారు. అమ్మవారి దేవస్థానంలో నిర్వహించే మహాకుంభాభిషేకాన్ని స్మార్త ఆగమ పద్ధతిలో చేపడతామన్నారు. అఖిలభారత వీరశైవ ఆగమ పరిషత్ తరఫున న్యాయవాది వీవీ సతీష్ వాదనలు వినిపిస్తూ... శ్రీశైలం దేవస్థానంలో వీరశైవ ఆగమ పద్ధతుల్లోనే పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

పెంచి.. తగ్గించి!

▸ స్మార్ట్ మీటర్ల ధరలపై స్పష్టత లేని డిస్కమ్‌లు

▸ ధరలు పెంచేసి.. బిడ్‌లు

▸ అదానీ, షిర్డీసాయికి సొంతం

▸ విమర్శలు రావడంతో తగ్గింపు

▸ వాస్తవ ధరలపై ఇంధనశాఖ గోప్యం

▸ మోసం జరిగిందంటున్న నిపుణులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

స్మార్ట్ మీటర్ల ధరల విషయంలో విద్యుత్తు పంపిణీ సంస్థ(డిస్కమ్)లు ఇప్పటికీ ఒక స్పష్టతకు రాలేదు. బిడ్ విధానం పారదర్శకంగా ఉందని, రివర్స్ టెండర్లను, ఆ తర్వాత సంప్రదింపుల ప్రక్రియను చేపట్టామని చెబుతున్న డిస్కమ్‌లు వివరాలను మాత్రం గోప్యంగా ఉంచుతున్నాయి. తాజాగా విద్యుత్తు నియంత్రణ సంస్థ(ఏపీఈఆర్‌సీ) చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో కొన్ని గణాంకాలు వెల్లడించినా వాటిలోనూ స్పష్టత లేదని విద్యుత్తురంగ నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లను రెండు దశల్లో బిగించాల్సి ఉంది. వీటిలో 38,63,537 గృహ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్ల ధరలు రూ.12,047 నుంచి రూ.12,713 దాకా ఉంటే.. రాష్ట్రంలో మాత్రం.. రూ.13,578 నుంచి రూ.14,319 వరకు ఉందని డిస్కమ్‌లు ఇటీవల ఏపీఈఆర్‌సీకి అందించిన సమాచారంలో పేర్కొన్నాయి. స్మార్ట్ మీటర్ల ధరలను సమీక్షిస్తున్నామంటున్న డిస్కమ్‌లు.. ఏయే సంస్థలతో ఎంతెంత ధరలకు ఒప్పందం చేసుకున్నారో మాత్రం చెప్పడం లేదు. దీనిపై ఇంధన శాఖ కూడా నోరు మెదపకపోవడం గమనార్హం. మరోవైపు, స్మార్ట్ మీటర్ల బిడ్‌లలో అదానీ, షిర్డీసాయి సంస్థలు పాల్గొన్నాయి. 2022, మే 22న స్మార్ట్ మీటర్ల టెండర్ల ప్రక్రియ మొదలైంది. ఆనాటి నుంచి ఇప్పటి వరకు వ్యవసాయ మీటర్ల ధరలెంతో.. గృహ, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలకు స్మార్ట్ మీటర్లను బిగించినందుకు ఎంత వసూలు చేస్తారో అనే విషయాలను కూడా డిస్కమ్‌లు గాని.. ఇంధన శాఖగానీ అధికారికంగా ప్రకటించలేదు. 2024-25 వార్షిక ఆదాయ వ్యయ నివేదికపై ఏపీఈఆర్‌సీ చేపడుతున్న అభిప్రాయ సేకరణలో ఇస్తున్న సమాచారం కూడా గజిబిజిగానే ఉందని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల బిగింపు అంశంపై విద్యుత్తు రంగ నిపుణుడు ఎం. వేణుగోపాలరావు లేవనెత్తిన పలు ప్రశ్నలకు ఏపీఎస్పీడీసీఎల్ ఇచ్చిన సమాధానం వింతగా ఉంది. దీంతో అధికారులు అసలేం చెప్పదలచుకున్నారో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొంది. 2022, డిసెంబరు 5న 11 లక్షల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం ఎస్పీడీసీఎల్ పిలిచిన టెండర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3,369 కోట్లకు పరిపాలనా ఆమోదం తెలిపింది. టెండర్లను పిలిచాక.. 2022, డిసెంబరు 22న అవే టెండర్లను రూ.4,068.08 కోట్లకు పెంచుతూ ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపింది. ఇలా ఒక్కసారిగా ప్రభుత్వం పెద్దమొత్తంలో పెంచడానికి గల కారణాలను డిస్కమ్‌లు వివరించలేదు. ప్రభుత్వం కూడా వివరణ ఇవ్వలేదు. స్మార్ట్ మీటర్ల వ్యయాన్ని వినియోగదారుల నుంచి 93 నెలల్లో వాయిదాల రూపంలో వసూలు చేయాలని మాత్రమే డిస్కమ్‌లను ప్రభుత్వం ఆదేశించింది.



వ్యవసాయానికీ అంతే

ఏపీసీపీడీసీఎల్ 5 లక్షల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు 2022, డిసెంబరు 5న రూ.1531 కోట్లకు టెండర్లను పిలిచింది. దానిని 2023, జూన్ 21వ తేదీనాటికి ఏకంగా రూ.333.18 కోట్లను పెంచుతూ రూ.1864.54 కోట్లకు చేశారు. మరో 2.58 లక్షల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు మీటర్లను బిగించేందుకు 2022, డిసెంబరు 5న పరిపాలనా ఆమోదం పొందింది. దీనికి రూ.956.41 కోట్లకు పరిపాలనా ఆమోదం ఇచ్చిన ప్రభుత్వం.. ఆ వెంటనే రూ.699.08 కోట్లకు కుదించింది. అదేవిధంగా ఎస్పీడీసీఎల్ పిలిచిన టెండర్లకు అదానీ సంస్థ రూ.2288.25 కోట్లకు బిడ్ వేసింది. రివర్స్ టెండర్‌లో రూ.1990.78 కోట్లకు మీటర్లను బిగించేందుకు అదానీ సంస్థ అంగీకరించిందని ఎస్పీడీసీఎల్ పేర్కొంది. సంప్రదింపులు జరిపాక.. రూ.1386.93 కోట్లకు స్మార్ట్ మీటర్లను అమర్చేందుకు అంగీకరించినట్లుగా వెల్లడించింది. ఈ ధరలు అమాంతం 45.27 శాతం మేర(రూ.901.32 కోట్లను) తగ్గించేందుకు అంగీకరించడంలో అర్థమేమిటని నిపుణలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అంటే స్మార్ట్ మీటర్ల ధరలను అమాతం రెట్టింపు చేసి బిడ్‌లను వేసినట్లుగా స్పష్టమవుతోందని చెబుతున్నారు. రెట్టింపు ధరలకు బిడ్‌లను వేసినప్పుడు వాటిని ఎందుకు రద్దు చేయలేదని నిలదీస్తున్నారు. ఏపీసీపీడీసీఎల్ అదానీ నుంచి 7,23,131 సింగిల్ ఫేజ్ కనెక్షన్లకు మీటర్లను బిగించేందుకు అదానీతో ఒప్పందం చేసుకుంది. ఈ మీటర్లను బిగించేందుకు నెలకు రూ.95.99 చొప్పున 93 నెలల పాటు.. అంటే రూ.8927.07 ఒక్కో సింగిల్ ఫేజ్ మీటరును అప్పగిస్తామని అదానితో సీపీడీసీఎల్ ఒప్పందం చేసుకుంది. అదేవిధంగా 1,09,220 త్రీఫేజ్ మీటర్లు సరఫరా చేసేందుకు నెలకు రూ.185.87 చొప్పున 93 నెలల వాయిదాల చొప్పున రూ.17,285.91కు సరఫరా చేసేలా అదానీతో సీపీడీసీఎల్ ఒప్పందం చేసుకుంది. మరో 1,13,650 డీటీ మీటర్లకు నెలకు రూ.265.62 చొప్పున 93 నెలల పాటు వసూలు చేసేలా రూ.24702.66కు అదానీతో సీపీడీసీఎల్ అంగీకారం కుదుర్చుకుంది.

అస్మదీయులు కాబట్టే!

విద్యుత్తు మీటర్ల ధరలను నిశితంగా పరిశీలిస్తే.. అస్మదీయులమన్న ధీమాతో భారీగా రేట్లు పెంచేసి.. ఆ తర్వాత.. నిపుణులు, ప్రజా సంఘాల ఆందోళనలతో రివర్స్ టెండర్‌తో కొంత తగ్గించి.. ఆ తర్వాత సంప్రదింపుల సందర్భంగా మరింత తగ్గించడం వెనుక పెద్ద మోసమే దాగుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ.2288.35 కోట్లకు వేసిన టెండరు ఏకంగా రూ.1386.93 కోట్లకు చేరుకోవడంలోనే.. భారీ మతలబు ఉన్నాయని విద్యుత్తు రంగ నిపుణులు అంటున్నారు.

సిఫారసులకే 'నైటింగేల్'..?

▸ నిజాయితీగా సేవ చేసిన నర్సులకు మొండిచేయి

▸ ప్రతిష్ఠాత్మక అవార్డుకు పదుల సంఖ్యలో దరఖాస్తులు

▸ కానీ.. మూడు విభాగాల్లో కలిపి ఒకరి పేరే ప్రతిపాదన

▸ స్క్రూటినీ పారదర్శకంగా లేదని నర్సుల అభ్యంతరం

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రోగులకు అందించే విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రతి ఏటా నర్సులకు ప్రదానం చేసే 'ఫ్లోరెన్స్ నైటింగేల్' అవార్డుల విషయంలో సిఫారసు ఉంటేనే పని అవుతోంది. ఈ అవార్డు కోసం ప్రతి ఏటా రాష్ట్రాలు కొంతమంది నర్సుల పేర్లను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తాయి. ఆ జాబితా ఆధారంగా కేంద్రం ప్రతి సంవత్సరం మే 12న రాష్ట్రపతి చేతుల మీదగా 'ఫ్లోరెన్స్ నైటింగేల్' అవార్డులు ప్రదానం చేస్తుంది. నర్సు అడ్మినిస్ట్రేటర్, నర్సు ఎడ్యుకేటర్, హాస్పిటల్ సర్వీసెస్(మూడు విభాగాల్లో అవార్డులు అందిస్తారు. ఈ ప్రక్రియ కోసం ఈ ఏడాది కూడా దరఖాస్తులు ఆహ్వానించగా.. ఏపీ నుంచి మూడు విభాగాల్లో పదుల సంఖ్యలో నర్సులు కొంత మంది మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసుల లేఖలను జతచేసి దరఖాస్తు చేసుకున్నారు. అయితే.. ఈ సారి మూడు విభాగాల్లో కలిపి అనేక దరఖాస్తులు వచ్చినప్పటికీ డీఎంఈ అధికారులు మాత్రం నర్సు అడ్మినిస్ట్రేటర్ విభాగంలో ఒకే ఒక పేరు పంపించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. నర్సింగ్ ఎడ్యుకేషన్, హాస్పిటల్ సర్వీసెస్ విభాగాల్లో మరికొంత మంది పేర్లు పంపించే అవకాశం ఉన్నా.. వారందరినీ లిస్టు నుంచి తొలగించి.. నర్సు అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఒకరి పేరు మాత్రమే పంపించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డీఎంఈ సిఫారసు చేస్తున్న ఆ మహిళా ఉద్యోగినిపై డీఎంఈ విజిలెన్స్‌లో అనేక ఫిర్యాదులున్నాయి. ప్రతిష్ఠాత్మక నైటింగేల్ అవార్డు కోసం పంపించే లిస్ట్‌లో అలాంటి వ్యక్తి పేరు ఎందుకు అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు నర్సుల పేర్లను స్క్రూటినీ చేసిన కమిటీ కూడా పారదర్శకంగా లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం రాత్రి 8 గంటల వరకూ స్క్రూటినీ నిర్వహించి, అందులో సిఫారసులున్న వారి పేర్లను మాత్రమే డీఎంఈకి ప్రతిపాదించినట్లు తెలిసింది. ఏదీ ఏమైనా అధికారులు రాష్ట్రం పరువు తీయకుండా, నిజాయతీగా సేవలందించిన వారికి ఈ అవార్డు దక్కేలా చూడాలని సూచనలు వినిపిస్తున్నాయి.

సామాజిక సేవలో ఎన్టీఆర్ ట్రస్టు విశేష కృషి

▸ విద్య, వైద్య రంగాల్లో పలు సేవలు

▸ ప్రకృతి వైపరీత్యాల్లో బాధితులకు బాసట

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్న ఎన్టీఆర్ ట్రస్టు 27 వసంతాలు పూర్తిచేసుకుంది. సమాజాభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. 1997లో ఏర్పాటయిన ఈ ట్రస్టు రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్య, వైద్య రంగాల్లో పేదలకు అండగా నిలుస్తోంది. 1998 నుంచీ ప్రతీ సంవత్సరం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా జనవరి 18న మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ వస్తోంది. రెండు రాష్ట్రాల్లో రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. కోవిడ్ సమయంలో మూడు కేంద్రాల్లో ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు చేసి వేలాది మందికి ఆసరాగా నిలిచింది. 2005లో గండిపేటలో ప్రారంభించిన ఎన్టీఆర్ హైస్కూలు ఏటా వందలాది మంది పేద పిల్లలకు నాణ్యమైన విద్యనందిస్తోంది. ట్రస్టు ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం 2019లో ఎక్సెల్ సివిల్స్ అకాడమీని ఏర్పాటు చేశారు. నిరుద్యోగ యువతకు జాబ్ మేళాలు నిర్వహించారు. మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భాల్లో ట్రస్టు బాధితులకు బాసటగా నిలుస్తోంది. తెలుగు రాష్ట్రాలే కాకుండా దేశవ్యాప్తంగా ఎక్కడ ప్రకృతి విపత్తులు సంభవించినా తనవంతు సాయంగా స్పందిస్తోంది. 2009లో వరదల సందర్భంగా కర్నూలులో 5 లక్షల మంది బాధితులకు సాయం అందించింది. 2013లో ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకున్న తెలుగువారిని ప్రత్యేక విమానాల్లో వారి సొంత ప్రాంతాలకు చేర్చింది. సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు అనే ఎన్టీఆర్ నినాదం స్ఫూర్తితో ట్రస్టు ఏర్పాటు చేసి 27 వసంతాలు పూర్తయిన సందర్భంగా గురువారం ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ట్రస్టు సీఈవో కె.రాజేందర్‌కుమార్, సీవోవో అడుసుమిల్లి గోపి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింలు తదితరులు బ్రోచర్ ఆవిష్కరించనున్నారు.

వర్సిటీల ఉద్యోగులకూ 62 ఏళ్లు

▸ బోధనేతర సిబ్బందికీ వర్తింపు.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉత్తర్వులు

▸ ఇప్పటి నుంచే అమల్లోకి .. ఇటీవలే రిటైరైన 300 మందికి నష్టం

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ యూనివర్సిటీల్లోని బోధనేతర సిబ్బందిని ఆకర్షించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వారి పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఉన్నత విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఉత్తర్వులు జారీఅయిన రోజు నుంచే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. దీనివల్ల సుమారు 11,500 మంది ఉద్యోగులకు పదవీ విరమణ వయసు పెరుగుతుంది. దాదాపు మూడేళ్లుగా తమకూ రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లు చేయాలని ఉన్నత విద్యాశాఖ పరిధిలోని బోధనేతర ఉద్యోగులు ప్రభుత్వాన్ని అడుగుతూ వస్తున్నారు. గతంలో 62 ఏళ్లు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఉత్తర్వులు మాత్రం ఇవ్వలేదు. ఈలోపు వర్సిటీల్లోని బోధనా సిబ్బంది పదవీవిరమణ వయసును 65 ఏళ్లకు పెంచారు. కానీ బోధనేతర సిబ్బందిని మాత్రం పట్టించుకోలేదు. ఈలోగా అనేక మంది ఉద్యోగులు 60 ఏళ్లు నిండటంతో రిటైర్ అయిపోయారు. ఈ ఉత్తర్వులు ఆలస్యం కావడం వలన సుమారు 300 మంది ఉద్యోగులు నష్టపోయారు. ఉత్తర్వులు జారీచేసిన రోజు నుంచే 62 ఏళ్ల నిబంధన అమల్లోకి అని స్పష్టం చేయడంతో జనవరిలో రిటైర్ అయిన వారికీ ఇది వర్తించకుండా పోయింది. కాగా.. బోధనేతర సిబ్బందికి 62 ఏళ్లు చేయడం పట్ల యూనివర్సిటీల బోధనేతర ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటప్పారెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్నత విద్యా మండలికి లేదు

యూనివర్సిటీల పరిపాలనా వ్యవహారాలకు కేంద్ర బిందువైన ఉన్నత విద్యామండలికి తాజా ఆదేశాలు వర్తించవని అధికారులు స్పష్టం చేశారు. పదో షెడ్యూలులో ఉన్నప్పటికీ మండలి విభజన జరగలేదు. దీంతో ప్రస్తుతం ఏపీ ఉన్నత విద్యామండలిలో ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులున్నారు. వారికి 62 ఏళ్లు వర్తింపజేయడం ఇష్టంలేకే మండలి అధికారులు ఈ మేరకు ప్రతిపాదనలు పంపారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తెలుగు అకాడమీకి కూడా తాజా ఆదేశాలు వర్తించవని అధికారులు తెలిపారు.

కామోద్దీపన మాత్రలు వేసుకుని శృంగారం

▸ తొలి రాత్రి భార్యపై భర్త ఆటవిక చర్య

▸ గాయాలు, ఇన్ఫెక్షన్‌తో నవ వధువు మృతి

హమీర్‌పూర్, ఫిబ్రవరి 14: మిడిమిడి జ్ఞానం, అత్యంత బాధ్యతారాహిత్యంతో ఓ వ్యక్తి చేసిన పని నవ వధువు ప్రాణాలను బలిగొంది. తొలి రాత్రే ఆటవికంగా శృంగారం చేయడంతో వివాహిత చనిపోయింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌లో జరిగిన ఈ పాశవిక ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శోభనం రోజు కామోద్దీపన పెంచే మాత్రలు వేసుకున్న వరుడు.. బాధితురాలిపై రాక్షసంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె జననాంగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఆపై ఇన్ఫెక్షన్ కావడంతో వివాహిత తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో ఈ నెల 7న ఆమెను కాన్పూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి 10న ఆమె చనిపోయింది. గ్యాంగ్ రేప్ చేసినంత దారుణంగా బాధితురాలిపై అత్యాచారం జరిగిందని ఆమెకు చికిత్స అందించిన డాక్టర్ తెలిపారు. వివాహితకు తల్లిదండ్రులు లేరు. ప్రభుత్వ ఉద్యోగి అయిన ఆమె సోదరుడు.. ఫిబ్రవరి 3న సోదరి వివాహాన్ని ఘనంగా జరిపించారు. 4న ఆమెను అత్తగారింటికి పంపించారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి బంధువులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న వరుడు ఇంటికి తాళం వేసి పరారయ్యాడు.

అమెరికాలో ప్రవాస కుటుంబం అనుమానాస్పద మృతి

▸ మృతుల్లో దంపతులు, వారి ఇద్దరు కవల చిన్నారులు..

▸ 'హత్య-ఆత్మహత్య' కింద కేసు నమోదు చేసిన పోలీసులు

న్యూయార్క్, ఫిబ్రవరి 14: అమెరికాలోని కాలిఫోర్నియా శాన్‌మాటియోలో సొంతింటిలోనే ఓ భారత సంతతి కుటుంబం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఇంట్లో ఎవరూ ఫోన్ ఎత్తకపోవడంతో వారి బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.. కేరళకు చెందిన ఆనంద్ సుజిత్ హెన్రీ (42), భార్య అలిస్ ప్రియాంక (40), పిల్లలు (కవల సోదరులు) నోహ్, నీథన్ (4)తో కలసి అలమెడ లాస్ పులగాస్‌లో నివసిస్తున్నారు. అయితే వీరి బంధువు ఒకరు సుజిత్ ఇంటికి పలుమార్లు ఫోన్ చేయగా వారు ఎంతకు స్పందించలేదు. ఈ క్రమంలోనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. వారి ఆ ఇంటిని తనిఖీ చేసేందుకు వెళ్లారు. తలుపులన్నీ మూసి ఉండటంతో కొంచెం తెరిచి ఉన్న ఓ కిటికీ ద్వారా లోపలికి ప్రవేశించారు. బాత్రూం వద్ద దంపతుల మృతదేహాలు రక్తపు మడుగులో కనిపించగా.. వారి శరీరంపై తుపాకీతో కాల్చిన గాయాలున్నాయి. పక్కనే ఓ తుపాకీ, తూటాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇటు బెడ్రూంలో ఇద్దరు చిన్నారుల మృతదేహాలు కనిపించాయి. అయితే వీరి శరీరాలపై ఎలాంటి గాయాలు లేవు. పోస్టుమార్టం తర్వాత చిన్నారుల మరణాలకు కారణమేంటనేది తేలుతుందని పోలీసులు చెప్పారు. ఇంట్లోకి ఎవరూ ప్రవేశించిన ఆనవాళ్లు లేవని.. మరణాలకు ఇంట్లోని వ్యక్తే కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. కుటుంబ కలహాలే ఈ మరణాలకు కారణమని భావిస్తున్నారు. 'హత్య-ఆత్మహత్య' కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా, సుజిత్ దంపతులు కొన్నేళ్ల నుంచి అమెరికాలో ఉంటున్నారు. 2016లోనే వారు విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ప్రొసీడింగ్స్ పూర్తి కాలేదు. 2020లో రూ.17 కోట్లకు పైగా విలువ చేసే ఇంటిని కొని.. రెండేళ్ల కిందే అక్కడికి మారారు.

మణిపూర్‌లో పోలీసు ట్రైనింగ్ క్యాంపుపై దాడి

▸ పోలీసుల కాల్పుల్లో ఒకరి మృతి, పలువురికి గాయాలు

ఇంఫాల్, ఫిబ్రవరి 14: మణిపూర్ ఇంఫాల్ జిల్లాలోని పంగై పోలీసు ట్రైనింగ్ క్యాంపుపై సమీప గ్రామానికి చెందిన కొందరు యువకులు దాడికి యత్నించారు. వారిని నిలువరించేందుకు పోలీసులు కాల్పులు జరపగా ఓ 24ఏళ్ల యువకుడు మృతి చెందాడు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసు ట్రైనింగ్ క్యాంపులో ఉన్న ఆయుధాల కోసమే యువకులు దానిపై దాడి చేసి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ముందుగా యువకులను నియంత్రించేందుకు పోలీసులు బాష్ప వాయువును ప్రయోగించారని, అయినప్పటికీ వారు లొంగకపోవడంతో కాల్పులు జరపాల్సి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్లు తెలిపారు.

డిజిటల్ లావాదేవీలు మరింత భద్రం

▸ ఓటీపీకి ప్రత్యామ్నాయ అథెంటికేషన్ విధానాలపై ఆర్బీఐ దృష్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: దేశవ్యాప్తంగా డిజిటల్ లావాదేవీలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో ఈ లావాదేవీల భద్రతను మరింత పెంచడంతోపాటు వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండేలా అత్యాధునిక అథెంటికేషన్ సదుపాయాల అమలుకు బ్యాంకులను ప్రోత్సహించాలని ఆర్బీఐ యోచిస్తోంది. ప్రస్తుతం వినియోగదారులు డిజిటల్ లావాదేవీలను పూర్తి చేయడానికి ఎస్ఎంఎస్ ఆధారిత వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ)ను ఆర్థిక సంస్థలు వినియోగిస్తున్నాయి. నమోదైన మొబైల్ నంబరుకు బ్యాంకులు పంపిన ఓటీపీని నిర్దేశిత సమయంలో ఎంటర్ చేయడం ద్వారా ఆన్‌లైన్ లావాదేవీ పూర్తవుతున్న విషయం తెలిసిందే. అయితే ఇది పూర్తి సురక్షితంగా ఉండటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. యూపీఐ లావాదేవీల్లో మోసాలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో డిజిటల్ లావాదేవీలకు మరింత భద్రత కల్పించాలని, ఇందులో భాగంగా యాప్ ఆధారిత అనుమతి, బయోమెట్రిక్ అథెంటికేషన్ వంటి ప్రత్యామ్నాయ విధానాలను అనుసరించేలా ప్రోత్సహించాలని ఆర్బీఐ యోచిస్తోంది. ఈ నేపథ్యంలో నూతన విధాన ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. టెక్నాలజీ పురోగతితో ఇటీవలి కాలంలో ప్రత్యామ్నాయ అథెంటికేషన్ విధానాలు వృద్ధి చెందాయి. దీంతో డిజిటల్ లావాదేవీల భద్రతను పెంచేలా ఈ విధానాలను అనుసరించేందుకు ఓ ఫ్రేమ్‌వర్క్‌ను ఆర్బీఐ ఇటీవల ద్రవ్య విధాన కమిటీ నిర్ణయాల్లో ప్రకటనలో భాగంగా ప్రతిపాదించింది. దీనికి సంబంధించిన వివరణాత్మక సూచనలు విడుదల చేయాల్సి ఉంది.

వైసీపీ ఎమ్మెల్యే ప్రత్యేకం గురూ!

▸ కుటుంబ సభ్యులకు రెండేసి ఓట్లు

▸ గుంటూరు జిల్లా పెదకూరపాడులో వెలుగు చూసిన ఓట్ల అక్రమాలు

పెదకూరపాడు, ఫిబ్రవరి 14: ఓటర్ల తుది జాబితాలో గుంటూరు జిల్లా పెదకూరపాడు వైసీపీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కుటుంబ సభ్యులకు రెండు నియోజకవర్గాల్లో ఓట్లు ఉండటం స్థానికంగా వివాదానికి దారి తీసింది. అదేసమయంలో ఓట్ల అక్రమాల అనుమానాలను మరింత పెంచింది. పోలింగ్ కేంద్రాల వారీగా మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించి పలుమార్లు బీఎల్‌వోల ద్వారా వినతులు స్వీకరించినా క్షేత్రస్థాయిలో మార్పు కనిపించలేదు. అధికార పార్టీకి చెందిన వారికి అవసరమైన చోట్ల ఓటు చేర్చడం, రెండు ఓట్లున్నా తొలగించకపోవడం, ప్రతిపక్ష పార్టీల వారి ఓట్లను గ్రామంలో లేరనే సాకుతో ఉన్న ఒక్క ఓటును తొలగించడం పరిపాటిగా మారింది. పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు గ్రామంలోని 194వ పోలింగ్ బూత్ పరిధిలో ఎమ్మెల్యే సోదరుడు నంబూరు రఘునాథరావుకు ఓటు ఉంది. అదేవిధంగా తాడికొండ నియోజకవర్గం తుళ్లూరు మండలం పెదపరిమిలో 435 నెంబరులోనూ ఓటు ఉంది. ఎమ్మెల్యే సోదరి భాష్యం పద్మావతికి త్యాళ్లూరులో 578, పెదపరిమిలో 417 నెంబరులో ఓట్లు ఉన్నాయి. ఎమ్మెల్యే బావ భాష్యం వీరాంజనేయులుకు త్యాళ్లూరులో 579, పెదపరిమిలో 414 నెంబర్‌లలో, అన్నకోడలు నంబూరు కల్పనకు త్యాళ్లూరులో 585, పెదపరిమిలో 439 బూత్‌లోనూ ఓట్లు ఉన్నాయి. ఎమ్మెల్యే మరోసోదరి పోతుగుంట్ల విజయలక్ష్మికి త్యాళ్లూరులో 583, పెదపరిమిలో 171, బావ పోతుగుంట్ల ఉమామహేశ్వరరావుకు త్యాళ్లూరులో 584, పెదపరిమిలో 170 నెంబర్లలో ఓట్లు ఉన్నాయి. వీరితో పాటు త్యాళ్లూరు గ్రామానికి సంబంధంలేని భాష్యం దివ్య, నంబూరు శ్రీదేవి, ఘట్టమనేని సూర్యప్రకాశ్, తదితరులకు కూడా ఓట్లు ఉన్నాయి. బూత్ స్థాయి అధికారులు అధికార పార్టీ నాయకులతో మిలాఖత్ అయి దొంగ ఓట్లపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. నియోజకవర్గంలోని బెల్లంకొండ మండలంలో బడిపిల్లలకు కూడా ఓటు నమోదు చేయడం, పెదకూరపాడు మండలంలో కుటుంబ సభ్యులకు దొంగ ఓట్లు చేర్పించడం చర్చనీయాంశమైంది. గతంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దిగువ స్థాయి నాయకునితో మాట్లాడుతూ ఇతర పార్టీల వారు గ్రామంలో లేకపోతే ఓట్లు తీయించమని, మన పార్టీ వారైతే ఇతర ప్రాంతాలలో ఉన్నా ఓటు నమోదు చేయమనడం అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. ఎన్నికల అధికారులు దృష్టి పెట్టాలని ప్రతిపక్ష నేతలు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● గురువారం 15 ఫిబ్రవరి 2024



హైదరాబాద్ ఐఐఐటీలో
డిగ్రీ, డ్యూయెల్ డిగ్రీ

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)- బీటెక్, డ్యూయెల్ డిగ్రీ (బీటెక్+ఎంఎస్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన ప్రత్యేక అడ్మిషన్ మోడ్‌ల(ఎస్‌పీఈసీ, యూజీఈఈ) ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

బీటెక్

ఈ ప్రోగ్రామ్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 15 సీట్లు ఉన్నాయి. స్పెషల్ ఛానెల్ ఆఫ్ అడ్మిషన్స్(ఎస్‌పీఈసీ) మోడ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా పన్నెండోతరగతి/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు సీబీఎస్ఈ-ఉడాన్ స్కీంలో అర్హత పొందిన బాలికలు; జవహర్ నవోదయ విద్యాలయాల్లో పన్నెండో తరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొంది ప్రస్తుతం నాలుగో సెమిస్టర్ చదువుతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎంపిక: ఎస్‌పీఈసీ మోడ్ ప్రకారం అభ్యర్థులు సంస్థ నిర్వహించే కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ రాయాల్సి ఉంటుంది. ఇది సబ్జెక్ట్ ప్రొఫిషియెన్సీ టెస్ట్. ఇందులో మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల నుంచి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. సీబీఎస్ఈ, స్టేట్ బోర్డుల సిలబస్ ప్రకారం ఇంటర్; పదకొండు, పన్నెండు తరగతుల స్థాయుల్లో ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంట. ఈ టెస్ట్‌లో అర్హత సాధించినవారిని ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

బీటెక్+ఎంఎస్

ఈ ప్రోగ్రామ్‌లో బీటెక్, ఎంఎస్(రీసెర్చ్) కోర్సులు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విభాగాలు ఎంచుకోవచ్చు. ఈసీఈలో 25 సీట్లు, సీఎస్ఈలో 35 సీట్లు ఉన్నాయి. కంప్యూటర్ సైన్స్‌లో 45 సీట్లు ఉన్నాయి. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ తీసుకొన్న అభ్యర్థులు ఎంఎస్‌లో కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్, కంప్యూటింగ్ అండ్ హ్యూమన్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. ఒక్కో స్పెషలైజేషన్‌కు 15 సీట్లు ప్రత్యేకించారు. అండర్‌గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(యూజీఈఈ) మోడ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: 2024 జూన్ నాటికి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: అభ్యర్థులు సంస్థ నిర్వహించే యూజీఈఈ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. ఇందులో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటిది సబ్జెక్ట్ ప్రొఫిషియెన్సీ టెస్ట్. దీనికి పరీక్ష సమయం గంట. ఇందులో సీబీఎస్ఈ, స్టేట్ బోర్డుల సిలబస్ ప్రకారం మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల నుంచి ఇంటర్, పన్నెండోతరగతి స్థాయుల్లో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. రెండోది రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్. దీనికి పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో అభ్యర్థి క్రిటికల్ అండ్ క్రియేటివ్ థింకింగ్ సామర్థ్యాన్ని పరీక్షించేలా ఆప్టిట్యూడ్ ప్రశ్నలు ఇస్తారు. యూజీఈఈలో అర్హత పొందినవారిని షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

- **బీటెక్ డిగ్రీకి దరఖాస్తు ఫీజు:** రూ.600
- **డ్యూయెల్ డిగ్రీకి దరఖాస్తు ఫీజు:** పురుషులకు రూ.2,500; మహిళలకు రూ.1250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 1
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, గుంటూరు, రాజమండ్రి, నెల్లూరు.
- **కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, యూజీఈఈల తేదీ:** మే 4
- **బీటెక్‌లో చేరే అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** మే 24, 25
- **డ్యూయెల్ డిగ్రీలో చేరే అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** జూన్ 11 నుంచి 13 వరకు
- **వెబ్‌సైట్:** iiit.ac.in

జాబ్ కార్నర్

సివిల్ సర్వీసెస్ / ఐఎఫ్‌ఎస్ ఎగ్జామ్ 2024

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీఎస్ఈ), ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామ్ 2024 నోటిఫికేషన్లను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) విడుదల చేసింది. సీఎస్ఈ ద్వారా 1056, ఐఎఫ్ఎస్ సర్వీస్‌లో 150 పోస్టులు భర్తీ చేస్తారు.

అర్హతలు: ఏదైనా గుర్తింపు పొందిన విద్యా సంస్థల నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: అభ్యర్థుల వయసు 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపులు ఉంటాయి.

దరఖాస్తు ఫీజు: ఓబీసీ, ఇతర అభ్యర్థులకు రూ.100. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక: ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 5

ప్రిలిమినరీ పరీక్ష: మే 26

మెయిన్స్ పరీక్ష: అక్టోబరు 19 నుంచి

వెబ్‌సైట్: https://upsconline.nic.in/upsc/OTRP/index.php

UPSC

కేంద్రీయ విద్యాలయలో టీచింగ్ స్టాఫ్

నల్లగొండ, మిర్యాలగూడలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ... కింద పేర్కొన్న టీచింగ్ స్టాఫ్ భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీల వివరాలు

1. **పీజీటీ:** హిందీ, ఇంగ్లీష్, మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సీఎస్, బయాలజీ
2. **టీజీటీ:** హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం, మేథ్స్, సైన్స్, సోషల్ సైన్స్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్.
3. ప్రీ ప్రైమరీ టీచర్స్, ప్రైమరీ టీచర్స్, కౌన్సెలర్, స్పెషల్ ఎడ్యుకేటర్, స్టాఫ్ నర్స్, యోగా ఇన్‌స్ట్రక్టర్, డ్యాన్స్ కోచ్, మ్యూజిక్ టీచర్, స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ కోచెస్.

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, డిప్లొమా/ పీజీ డిప్లొమా ఉత్తీర్ణత.

వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీ: ఫిబ్రవరి 17

సమయం: ఉదయం 9 గంటల నుంచి

వేదిక: పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ, నల్లగొండ

వెబ్‌సైట్: https://nalgonda.kvs.ac.in/



ఐఐపీలో ఎంఎస్, పీజీ డిప్లొమా

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. కోర్సుకు నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐఐపీ సెట్) 2024, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ: హైద్రాబాద్ క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌నకు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ) గుర్తింపు ఉంది. ఇందులో ప్యాకేజింగ్ మెటీరియల్స్, ప్యాకేజ్ డెవలప్‌మెంట్, ప్యాకేజ్ ప్రింటింగ్ టెక్నాలజీ, మెటీరియల్ టెస్టింగ్, ప్యాకేజ్ డిజైన్, ప్యాకేజింగ్ ఎకనామిక్స్, ప్యాకేజ్ ఫినిషింగ్ ఆపరేషన్స్, ప్యాకేజింగ్ లాస్ అండ్ రెగ్యులేషన్స్, ప్యాకేజింగ్ డిజైన్ తదితర అంశాలు ఉంటాయి. ప్రోగ్రామ్ చివరలో అయిదు నెలలు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటుంది. ప్రోగ్రామ్ మొత్తానికి 98 క్రెడిట్లు నిర్దేశించారు.

పీజీ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్: ముంబై క్యాంపస్‌లో 280 సీట్లు, కోల్‌కతా క్యాంపస్‌లో 80 సీట్లు ఉన్నాయి. ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎలక్ట్రికల్ టెక్నాలజీ, అప్లయిడ్ మెకానిక్స్, మెకానికల్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మెకానిజం, ఇంట్రడక్షన్ టు ప్యాకేజింగ్, పేపర్ అండ్ పేపర్ బోర్డ్, గ్లాస్ టెక్నాలజీ, ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్, ఎకనామిక్స్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్ అండ్ మెషినరీ, ప్లాస్టిక్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ప్యాకేజింగ్ మెషినరీ, ప్యాకేజింగ్ లాస్, టూలింగ్ అండ్ డిజైన్, అప్లికేషన్ ఆఫ్ కంప్యూటర్స్ తదితర సబ్జెక్టుల్లో తరగతులు ఉంటాయి. చివరి సెమిస్టర్‌లో ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇండస్ట్రియల్/ఫీల్డ్ విజిట్లు, ప్రాక్టికల్స్ ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 1672 క్రెడిట్స్ నిర్దేశించారు. కోర్సు పూర్తయ్యే నాటికి క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తారు.

అర్హత: ఎంఎస్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/సైన్స్ విభాగాల్లో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పీజీ డిప్లొమాలో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/మైక్రోబయాలజీ/బయో కెమిస్ట్రీ/లైఫ్ సైన్సెస్/మెటీరియల్ సైన్స్/బయో టెక్నాలజీ/జువాలజీ/బోటనీ/అగ్రికల్చరల్ సైన్సెస్/హార్టికల్చరల్ సైన్సెస్/వెటర్నరీ సైన్సెస్/డెయిరీ సైన్స్/ఫుడ్ సైన్స్ అండ్ అప్లయిడ్ న్యూట్రిషన్/ఎలక్ట్రానిక్స్/ఎన్విరాన్‌మెంట్ సైన్స్/పాలిమర్ కెమిస్ట్రీ/ఫిషరీ సైన్స్/నానో సైన్స్/ఫార్మాస్యూటికల్ సైన్స్ ఒక సబ్జెక్టుగా బీఎస్సీ పూర్తిచేసినవారు; బీఈ/బీటెక్/బీఫార్మసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కరస్పాండెన్స్, పార్ట్ టైమ్ డిగ్రీలు చేసిన వారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 మే 31 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

ఐఐపీ సెట్ 2024 వివరాలు: దీనిని ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంజనీరింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. అభ్యర్థులు నిర్దేశిత సంఖ్య మేరకు ప్రశ్నలు ఎంచుకొని సమాధానాలు గుర్తించాలి.

ఎంపిక: ఐఐపీ సెట్ 2024లో సంస్థ నిర్ణయించిన ప్రకారం కటాఫ్ మార్కులు సాధించిన వారిని షార్ట్‌లిస్ట్ చేసి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పదోతరగతి మార్కులకు 10 శాతం, ఇంటర్/పన్నెండో తరగతి మార్కులకు 10 శాతం, డిగ్రీ మార్కులకు 30 శాతం, ఐఐపీ సెట్ 2024 స్కోర్‌కు 30 శాతం, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- ★ **దరఖాస్తు ఫీజు:** రూ.500
- ★ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 8
- ★ **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్
- ★ **ఐఐపీ సెట్ 2024 తేదీ:** జూన్ 16
- ★ **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్ లిస్ట్ విడుదల:** జూన్ 21
- ★ **పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 28, 29
- ★ **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 5
- ★ **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- ★ **వెబ్‌సైట్:** www.iip-in.com

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

రాజ్యాంగ పరిషత్



స్వాతంత్ర్యానంతరం మౌంట్ బాటన్ 1948 జూన్ 21 వరకు గవర్నర్ జనరల్‌గా కొనసాగారు. తరవాత సి.రాజగోపాలచారి 1950 జనవరి 24 వరకు గవర్నర్ జనరల్‌గా పనిచేశారు. పాకిస్థాన్‌కు మహమ్మదాలి జిన్నాను గవర్నర్ జనరల్‌గా నియమించారు.

నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వం: స్వాతంత్ర్యానంతరం నెహ్రూ నాయకత్వంలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంతో మౌంట్ బాటన్ ప్రమాణ స్వీకారం చేయించారు.

1. జవహర్‌లాల్ నెహ్రూ - ప్రధాని, విదేశీ వ్యవహారాలు
2. సర్దార్ వల్లభభాయ్ పటేల్ - ఉప ప్రధాని, హోంశాఖ
3. బాబూ రాజేంద్రప్రసాద్ - వ్యవసాయం, ఆహారం
4. మౌలానా అబుల్ కలామ్ అజాద్ - విద్యాశాఖ
5. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ - న్యాయశాఖ
6. సర్దార్ బలదేవ్‌సింగ్ - రక్షణశాఖ
7. షణ్ముగం శెట్టి - ఆర్థికశాఖ
8. జాన్ ముత్తాయ్ - రైల్వేలు, ఉపరితల రవాణా
9. బాబూ జగజ్జీవన్‌రామ్ - కార్మికశాఖ
10. రఫి అహ్మద్ కిద్వాయ్ - కమ్యూనికేషన్లు, పౌర విమానయానం
11. సిహెచ్.బాబా - వాణిజ్యం
12. ఎన్.వి.గాడ్గిల్ - గనులు, విద్యుత్
13. రాజ్‌కుమారి అమృత్‌కౌర్ - ఆరోగ్యం, వైద్యశాఖ
14. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ - పరిశ్రమలు

- భారత జాతి భవిష్యత్తు కోసం రాజ్యాంగం కావాలని, అందుకు రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు కావాలని మొదటిసారి సుప్రసిద్ధ రాడికల్ మానవతావాది ఎం.ఎన్.రాయ్ అభిప్రాయపడ్డారు. అయితే అంతకుముందే రాజ్యాంగానికి సంబంధించిన కొన్ని డిమాండ్లు ఉన్నాయి. 1918లో ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ సమావేశం 'స్వయం నిర్ణయాధికారం' అనే భావనతో ఒక తీర్మానాన్ని ప్రకటించింది. ఇదే విషయాన్ని గాంధీ 'యంగ్ ఇండియా' పత్రికలో ప్రస్తావిస్తూ 1922 జనవరి 5న 'భారతదేశానికి స్వాతంత్ర్యమనేది బ్రిటిష్‌వారు ఇచ్చే భిక్ష కాదని, భారతీయులు రాజకీయ భిక్షాటకులు కాదని, ప్రజలు తమను తాము అభివ్యక్తీకరించుకోడానికి గల స్వేచ్ఛ మాత్రమేనని' రాశారు. 1928 మే 19న మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన రాజ్యాంగ రచనకు అఖిలపక్ష కమిటీ ఏర్పాటైంది. ఇది భారతీయులకే సొంత రాజ్యాంగ రచన కోసం జరిగిన నిర్మాణాత్మక కృషిగా పేర్కొంటారు. ఈ నెహ్రూ నివేదికలో భారతీయుల హక్కులు, ప్రభుత్వ పాలన, భిన్నవర్గాల ప్రయోజనాలను చర్చించారు.
- 1935 చట్టాన్ని ఏకపక్షంగా అమలుపరిచే ప్రయత్నం చేయడంతో 1936 ఫైజ్‌పూర్ కాంగ్రెస్ సమావేశంలో దానిని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ప్రత్యేక రాజ్యాంగ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. 1936లో జవహర్‌లాల్ నెహ్రూ 'హెరాల్డ్' పత్రికలో భారతీయులు తమను తాము పాలించుకోడానికి అవసరమైన చట్టాన్ని తయారుచేసుకొనే స్వేచ్ఛ కల్పించాలని రాశారు. ఈ అంశాన్ని 1935 నాటి హరిపుర కాంగ్రెస్ సమావేశం ఒక తీర్మానం రూపంలో ఆమోదించింది. భారతీయులతో రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేస్తే కుల, మత, వర్గాల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని మహాత్మాగాంధీ 1939 నవంబరు 12న 'హరిజన' పత్రికలో రాశారు. ఈ డిమాండ్లను దృష్టిలో ఉంచుకొని బ్రిటిష్ ప్రభుత్వం 1942 క్రిప్స్ ప్రతిపాదనల ద్వారా తొలిసారిగా రాజ్యాంగ పరిషత్ అవసరాన్ని గుర్తించారు. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఇంగ్లాండ్‌లో అధికారంలోకి వచ్చిన లేబర్ పార్టీ ప్రధాని అట్లీ, భారతీయులపై బల ప్రయోగం ద్వారా అధికారాన్ని చెలాయించలేమని నిర్ణయానికి వచ్చారు. 1945 సెప్టెంబరులో భారతీయులకు రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేయాలని బ్రిటన్ ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు 1945 సెప్టెంబరు 19న నాటి వైస్రాయ్ వేవెల్, ఢిల్లీ రేడియో కేంద్రం ద్వారా ప్రసంగిస్తూ 'అతి త్వరలో రాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు జరుగుతాయి. వాటికి ఎన్నికైన ప్రతినిధులు రాజ్యాంగ సభ సభ్యులను ఎన్నుకుంటారు' అని పేర్కొన్నారు. 1946 నాటికి మంత్రిత్రయ రాయభారాన్ని అనుసరించి రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికలు జరిగాయి.

రాజ్యాంగ సభ నిర్మాణం: 1946 జూన్, జూలై నెలల్లో సభకు ఎన్నికలు జరిగాయి. నాటి గవర్నర్ జనరల్ ఈ ఎన్నికలు నిర్వహించారు. ఒక మిలియన్ జనాభాకు ఒక సభ్యుని చొప్పున 389 మంది సభ్యులకు ప్రాతినిధ్యం, మూడు భిన్నమైన వర్గాల నుంచి ప్రతినిధుల ఎంపిక జరిగింది. ఈ ఎన్నికలు నైసర్గిక ప్రాతినిధ్య పద్ధతి ఆధారంగా జరిగాయి.

1. బ్రిటిష్ పాలిత ప్రాంతాల నుంచి పరోక్షంగా ఎన్నుకున్నవారు 292
2. స్వదేశీ సంస్థానాల నుంచి నియమించినవారు 93
3. చీఫ్ కమిషనర్ ప్రాంతాల్లో ఎన్నుకున్నవారు
4. మొత్తం 389 మంది.

నోట్: చీఫ్ కమిషనర్ ప్రాంతాలు నాలుగు అవి- 1) అజ్మీర్-మేర్వార్ 2) బెలూచిస్థాన్ 3) కూర్గ్ 4) ఢిల్లీ. - ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 208, ముస్లింలీగ్‌కు 73, ఇతరులు 15 మొత్తం 296. స్వదేశీ సంస్థానాలు 93తో కలిపి మొత్తం 389.

- ముస్లింలీగ్ పాకిస్థాన్ డిమాండ్‌తో రాజ్యాంగ పరిషత్ నుంచి వైదొలిగింది. దేశ విభజన తరవాత రాజ్యాంగసభ సభ్యుల సంఖ్య 299కి పడిపోయింది. ఇందులో బ్రిటిష్ పాలిత ప్రాంతాల ప్రతినిధులు 229, స్వదేశీ సంస్థానాల ప్రాతినిధ్యం 70 కలిపి మొత్తం 299.
- గాంధీ, జిన్నా రాజ్యాంగ సభకు ఎన్నిక కాలేదు.
- ముస్లింలకు, సిక్కులకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేశారు.
- రాజ్యాంగ పరిషత్‌కు 15 మంది ప్రముఖులను నామినేట్ చేశారు.
- రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికైన మహిళలు: విజయలక్ష్మీ పండిట్, సరోజిని నాయుడు, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, హంసా మెహతా, రాజ్‌కుమారి అమృత్‌కౌర్.
- ఆంధ్ర ప్రాంతం నుంచి ఎన్నికైనవారు: టంగుటూరి ప్రకాశం, పట్టాభి సీతారామయ్య, నీలం సంజీవరెడ్డి, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, కల్లూరి సుబ్బారావు, కళా వెంకట్రావ్, ఆచార్య ఎన్.జి. రంగా, రామకృష్ణ రంగారావు, ఎం.సత్యనారాయణ.



వి.చైతన్యదేవ్
సీనియర్ ఫ్యాకల్టీ

లిటిల్స్

మీకు తెలుసా?


కొందరు ఎడం చేతికి ఎక్కువగా వాడుతారు. అలాంటి ఎడం చేతివాటం వారికి సంబంధించిన కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు

- గ్రీకు సామ్రాజ్యంలో ఎడం చేతి వాటం వారిని కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయని నమ్మేవారు. అందువల్ల వారికి సమాజంలో ప్రత్యేక స్థానం ఉండేది.
- ఎడం చేతి వాటం వారిలో ప్రముఖ స్విమ్మర్ మైఖల్ ఫిలిప్స్, ప్రముఖ గాయనీగాయకులు డెవిడ్ బోయ్, కర్ట్ కొబియాన్, జస్టిన్ బీబర్, అమీ వైన్‌హౌస్ మొదలైన వారు ఉన్నారు.
- ఎడం చేత్తో బేస్‌బాల్ వాడేవారిని సౌత్‌పా అని పిలుస్తారు.
- ఎడం చేతిని ఎక్కువగా ఉపయోగించేవారి కోసం ప్రత్యేకమైన కత్తెరలు, పెన్నులు మొదలైనవి అందుబాటులో ఉన్నాయి.
- కొన్ని కుక్కలు, పిల్లుల్లు ఎడం కాలిని ఎక్కువగా వాడతాయి. వీటిపై కొన్ని అధ్యయనాలు కూడా జరిగాయి.
- ఎడం చేతితో రాసేవారి చేతి రాత మిగిలిన వారి కన్నా భిన్నంగా ఉంటుంది.



సింహాలు ఎన్ని ఉన్నాయి?


సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



6 తేడాలను గుర్తించండి



డైలీ సుడోకు - 230

		8				6		2
	5	6		1				
			7		8			5
							2	1
2			4		5			3
3	8							
9			1		7			
				3		1	4	
6		1				9		

సుడోకు - 229 సమాధానం

8	1	5	4	9	2	7	3	6
2	6	4	7	3	5	1	9	8
9	7	3	6	1	8	5	4	2
4	8	6	3	5	1	9	2	7
1	3	9	8	2	7	4	6	5
5	2	7	9	4	6	3	8	1
3	5	2	1	8	4	6	7	9
6	4	1	2	7	9	8	5	3
7	9	8	5	6	3	2	1	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.